సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4+20 వెల: ₹5.00
సంపుటి: 10
సంచిక: 346
గురువారం 8-3-2018
'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



లలితా జ్యువెల్లరిలో వజ్రాభరణాల సంబరాలు!

ఉగాది శుభాకాంక్షలు



క్యారెట్ రూ.46000 నుంచి!

V.A గ్రాముకు రూ.975 మాత్రమే



100% Quality. E-F Colour Grade & VVS Clarity.

మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం.

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.

(Certified by Internationally Recognized Gemmology Bodies.)

వజ్రపు వ్యాసం (సెంట్లలో)	సాధారణంగా మార్కెట్‌లో వజ్రాల ధర (ఒక క్యారెట్‌కు)	వజ్రాల న్యాయమైన ధర (ఒక క్యారెట్‌కు)
0 నుంచి 0.0749	రూ.67000 నుంచి 76000	రూ.46000
0.0750 నుంచి 0.1349	రూ.76000 నుంచి 85000	రూ.66500
0.1350 నుంచి 0.1749	రూ.98500 నుంచి 105000	రూ.83000
0.1750 నుంచి 0.2249	రూ.108500 నుంచి 112000	రూ.94000

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్లు నిర్ణయించబడతాయి.

మరెవరికీ సాధ్యంకాని సదుపాయమిది!



ఇదివరకు ఉన్న తరుగు ~~8%~~ | ఉగాది కానుక తరుగు 7%



ఇదివరకు ఉన్న తరుగు ~~8%~~ | ఉగాది కానుక తరుగు 7%



ఇదివరకు ఉన్న తరుగు ~~9%~~ | ఉగాది కానుక తరుగు 8%



ఇదివరకు ఉన్న తరుగు ~~9%~~ | ఉగాది కానుక తరుగు 8%

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్

మీరు మునుపెన్నడూ చూడని ఆకట్టుకునే లక్షలాది డిజైన్లతో లెక్కలేనన్ని కౌంటర్లు.

ఆదా చేయాలంటే.. పోల్చి చూడండి!

మీరు చేయాల్సిన నాలుగు విషయాలు

1. మనసుకు నచ్చిన నగను మొబైల్‌లో క్లిక్ చేసి, దానికి 'ఎస్టిమేట్ స్లిప్' మా వద్ద తీసుకోండి.
2. నగ ఫొటో, ఎస్టిమేట్‌స్లిప్‌ను పెట్టుకుని కనీసం నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చిచూడండి.
3. BIS 916 హాల్‌మార్క్ ముద్ర ఉందా అని సరిచూసుకోండి.
4. ఏ షోరూంలో అయితే మీకు నచ్చిన నగ తక్కువ ధరకు లభిస్తోందో అక్కడే కొని లబ్ధి పొందండి.

ఓ షోరూంలో డిజైన్ నచ్చి, అక్కడ తరుగు అధికంగా ఉంటే.. ఆ నగను మొబైల్‌లో క్లిక్ చేసి, ఎక్కడ తరుగు తక్కువగా ఉంటుందో అక్కడే చూపించి, ఆర్డర్ చేసి కొనుక్కోండి.



కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.

మార్కెట్‌లోనే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!



Lalithaa®

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891 - 6600001.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్ రోడ్డు. (V.V. మహల్ రోడ్డు).

ఫోన్: 0877 - 666 0505 / 0606 / 7888.

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.

చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ www.lalithaajewellery.com



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 346

గురువారం 8-3-2018



మనీ ఫండిస్తున్నారు

పెరుగుతున్న మహిళా ఫండ్ మేనేజర్లు.. దేశీ పరిశ్రమలో 24 మంది - బిజినెస్‌లో



అతి(వ)లోక విజయం...

అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటుతోన్న భారత మహిళా క్రీడాకారిణులు -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మంత్రుల ఉపసంహరణ

కేంద్రంలో తన ఇద్దరు మంత్రుల చేత రాజీనామా చేయిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటన



ఎన్డీయే నుంచి వైదొలగడంపై మాట దాటవేత

దశలవారీగా పోరాడతామని వెల్లడి



సుజనాచౌదరి



అశోక్‌గజపతిరాజు

ఐదు కోట్ల మంది ఆంధ్రులకు అపర సంజీవని వంటి ప్రత్యేక హోదా కోసం ప్రజలలో వెల్లువెత్తుతున్న చైతన్యం ఒకవైపు..

హోదా కోసం కేంద్రంపై అవిశ్వాస తీర్మానం, ఎంపీ పదవులకు రాజీనామాల వంటి కీలక నిర్ణయాలతో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పోరాట పటిమ మరోవైపు..

నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో ఉండి రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎలాంటి ప్రయత్నాలూ చేయని తెలుగుదేశం పార్టీని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

కేంద్ర ప్రభుత్వం నుంచి తమ ఇద్దరు మంత్రులు సుజనా చౌదరి, అశోక గజపతిరాజు వైదొలగుతారని ముఖ్యమంత్రి చంద్రబాబు 'బలవంతంగా'నైనా ప్రకటన చేయాల్సి వచ్చింది.

రోజంతా మీడియాకు రకరకాల వార్తలు లీక్ అవుతూనే ఉన్నాయి. చివరకు అర్ధరాత్రి చంద్రబాబు విలేకరుల సమావేశం నిర్వహించి తన నిర్ణయాన్ని ప్రకటించారు.

హోదా ఆకాంక్షను పట్టించుకోకుండా ప్యాకేజీలు.. నిధులు.. కమీషన్లు.. అసెంబ్లీ సీట్లు.. అంటూ కేంద్రం చుట్టూ తిరగడంపై ప్రజల్లో వ్యతిరేకత వెల్లువెత్తుతోందని గ్రహించిన సీఎం చివరకు తన మంత్రులను ఉపసంహరిస్తున్నట్లు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రకటించారు. ఆయన ప్రెస్‌మీట్ పూర్తి కాగానే రాష్ట్ర ప్రభుత్వం నుంచి తాము కూడా వైదొలగనున్నట్లు బీజేపీ మంత్రులు సంకేతాలు పంపించారు. గురువారం ఉదయం తమ మంత్రులు రాజీనామా చేస్తారని బీజేపీ నేతలు చెబుతున్నారు.. మరోవైపు ఎన్డీయేలో కొనసాగడంపై చంద్రబాబు సమాధానం దాటవేశారు. తమ పోరాటం దశలవారీగా ఉంటుందని చెప్పారు. 2లో

రాజీనామాకు రాష్ట్ర బీజేపీ మంత్రులూ సిద్ధం

నేటి ఉదయం చంద్రబాబుకు ఫోన్‌లో సమాచారం

కేబినెట్ సమావేశానికీ దూరం

ఎమ్మెల్యేలుగా మాత్రమే సభకు హాజరు

2లో

టీడీపీ మంత్రుల రాజీనామా డ్రామా

ఇప్పటికీ ఎన్డీఏ నుంచి వైదొలుగుతామని అనడం లేదు

వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మండిపాటు

సోనియా విందుకు టీడీపీ!

జాతీయ ఆంగ్ల దినపత్రిక కథనం

- కొద్ది కాలంగా కాంగ్రెస్ – టీడీపీ మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యం
- నాలుగు నెలల కిందటే రంగం సిద్ధం
- బీజేపీ నుంచి దూరం జరిగేందుకు బాబు అడుగులు అప్పుడే.. తన వైఫల్యాలను కేంద్రంపై మోపడం అందులో భాగమే..
- ఆ ఆలోచనతోనే అడుగులేస్తున్న అనుంగు మీడియా
- పార్లమెంటులో సోనియాతో మాట్లాడిన దేశం ఎంపీలు
- హోదా ఆందోళనల సందర్భంగానూ కనిపించిన సాన్నిహిత్యం

7లో



పాత పాటే పాడిన జైట్లీ

హోదాకు సమానమైన ప్యాకేజీ ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడి

- ప్రత్యేక హోదా వద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పింది
- ఆ 11 రాష్ట్రాలకు హోదా లేదు
- కేంద్ర పథకాల్లో ఆ రాష్ట్రాలకు 90 శాతం నిధులు
- ఈఏపీ, నాబార్డు.. నిధులు ఎలా కావాలో ఏపీ తేల్చుకోవాలి
- రాజకీయ అంశాలు, సెంటిమెంట్ నిధులను పెంచలేవు
- రాయితీలు ఇస్తే బిహార్, జార్ఖండ్ కూడా అడుగుతాయి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి పాతపాటే పాడారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేమని, హోదాకు సమానమైన ప్యాకేజీ ఇస్తామని వెల్లడించారు. ఆయన బుధవారం సాయంత్రం ఢిల్లీలో తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీ అంశాలపై మిగతా 2వ పేజీలో ▶



కాటేసిన కలుషిత నీరు

- గుంటూరులో గత నాలుగు రోజుల్లో 9 మంది మృత్యువాత
- మురుగునీటిలో మంచినీటి పైప్‌లైన్ లీక్
- రాష్ట్రంలో డయేరియా బాధితులతో ఆస్పత్రులు కిటకిట

7లో

ఇచ్చిన నిధులకు లెక్కలు అడుగుతారా?

కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విసుర్లు

29 సార్లు ఢిల్లీ వెళ్లినా కేంద్ర ప్రభుత్వం కనికరించలేదు

ప్రత్యేక ప్యాకేజీని స్వాగతించాం.. ఆ నిధులూ రాలేదు

11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కింద సాయం చేస్తున్నారు

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో సీఎం సుదీర్ఘ ప్రసంగం

సాక్షి, అమరావతి

రాష్ట్రానికి విడుదల చేసిన నిధుల వినియోగానికి సంబంధించిన లెక్కలను కేంద్రం అడగటం సరికాదని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. బుధవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ఆయన సుదీర్ఘంగా సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా, రెవెన్యూ లోటు, పారిశ్రామిక రంగానికి పన్ను రాయితీలు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీ హామీలు బీజేపీ మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తుచేశారు. తాను 29 సార్లు ఢిల్లీ వెళ్లినా కేంద్రం కనికరించడం లేదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సెప్టెంబర్ 7, 2016న అర్ధరాత్రి ప్యాకేజీ ప్రకటన చేస్తే స్వాగతించామన్నారు. కానీ ప్రత్యేక సహాయం కింద కేంద్రం నిధులు ఇవ్వడం లేదని వివరించారు.

పోలవరంపై భిన్నమైన మాటలు

పోలవరం ప్రాజెక్టును రాష్ట్రానికి ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసిందని తొలుత ప్రకటించిన సీఎం చంద్రబాబు.. కొంచెం సేపటికే భిన్నంగా మాట్లాడారు. ప్యాకేజీపై అరుణ్ జైట్లీ ప్రకటనను చదివేటప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకే పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రం అప్పగించిందని సీఎం చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.13,054 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. కేంద్రం నుంచి రూ.5,349.70 కోట్లు వచ్చాయని.. మరో రూ.2,568 కోట్లు రావాల్సి ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా రూ.4,932 కోట్లకు కేంద్రానికి మిగతా 2వ పేజీలో ▶

ఈసారైనా హామీలు నెరవేరేనా?



నేడు ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు

- రూ.1,96,800 కోట్లతో రాష్ట్ర సర్కారు ఐదో బడ్జెట్
- కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తాయని అంచనా
- రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం రూ.70 వేల కోట్లు
- పన్నేతర ఆదాయం రూ.5,500 కోట్లు
- ప్రజా సంక్షేమానికి అరకొర కేటాయింపులేనా?

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గత నాలుగు బడ్జెట్లు ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక వాటి ఊసే మర్చిపోయారు. హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపారు. వచ్చేది ఎన్నికల సంవత్సరం కావడంతో ఈసారి బడ్జెట్‌లోనైనా న్యాయం జరుగుతుందా లేదా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 2018–19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ స్వరూపం ఎలా ఉంటుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారీ రెవెన్యూ వ్యయంతో కూడిన బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం ఉదయం 11.30 గంటలకు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. మొత్తం రూ.1,96,800 కోట్ల వ్యయంతో 2018–19 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.1,63,660 కోట్లు, కేపిటల్ వ్యయం కింద రూ.33,160 కోట్లను ప్రతిపాదించనున్నారు. 14వ ఆర్థిక సంఘం అంచనా మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.8,70,330 కోట్లుగా పేర్కొన్నారు. దాదాపు రూ.30,000 కోట్ల మేర అప్పులు మిగతా 7వ పేజీలో ▶



వైఎస్ జగన్ కోసం సైనికుడిలా పనిచేస్తా

- ఆయనకున్న నాయకత్వ లక్షణాలు ఏ నాయకుడికీ లేవు
- ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజల కోసం అలుపెరగకుండా పనిచేస్తున్నారు
- రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికి ఉంటే నేనే గెలుస్తా
- వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

- వివరాలు 7లో

ఇదం జగత్



ఇవాళ నీకు ఫుల్ ఫ్రీడం! నీకు నచ్చిన కూర, పులుసు, వేపుడు, చారు, పచ్చడి, పొడి ఏదైనా చేసుకో... తింటా!!

అసెంబ్లీలో గ్రెనేడ్.. లోకాయుక్తకు కత్తిపోట్లు

కేరళ, కర్ణాటకలో ఒకేరోజు ఘటనలు

■ ఒకటి కేరళ అసెంబ్లీ.. మరొకటి కర్ణాటక విధాన సౌధకు పక్కనే ఉన్న కార్యాలయం.. ఈ రెండు కీలక అధికార కేంద్రాల్లో భద్రతాపరమైన డొల్లతనాన్ని బట్టబయలు చేసే ఘటనలు బుధవారం చోటుచేసుకున్నాయి. కేరళలో ఓ ఎమ్మెల్యే (మాజీ హోంమంత్రి కూడా) కాలం చెల్లిన గ్రెనేడ్‌తో ఏకంగా అసెంబ్లీలోకి వచ్చి కలకలం సృష్టించగా.. కర్ణాటక విధాన సౌధ భవనం పక్కనే ఉన్న లోకాయుక్త కార్యాలయంలోకి కత్తితో వచ్చిన ఓ దుండగుడు చాంబర్‌లోకి వెళ్లి లోకాయుక్తను విచక్షణ రహితంగా పొడిచాడు. - 2లో

ఇలాగైతే ఎలా బతకాలన్నా..?

దారిపొడవునా ప్రతిపక్ష నేత ఎదుట గోడు వెళ్లబోసుకున్న రైతులు

పొగాకు, మిర్చి, శనగ పంటలకు గిట్టుబాటు ధర లేదని ఆవేదన

జననేతతో తన కష్టాలు చెప్పుకున్న అంతర్జాతీయ క్రీడాకారుడు

ఉన్నతాధికారులకు లేఖ రాస్తానని, అన్ని విధాలా సహకరిస్తానని జగన్ భరోసా

తమ ప్రభుత్వం రాగానే గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తామని వెల్లడి

6లో



ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లు శివారులో బుధవారం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు తమ కష్టాలు వివరిస్తున్న రైతులు



'నేను శక్తి' ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న నటి అమల. చిత్రంలో 'సాక్షి' చైర్‌పర్సన్ వైఎస్ భారతీరెడ్డి, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రాణిరెడ్డి

నేను శక్తి స్వరూపం

'సాక్షి' అక్షర ఉద్యమానికి గొంతు కలిపిన నారీలోకం

- ఘనంగా 'నేను శక్తి' ముగింపు ఉత్సవం
- తరలివచ్చిన మహిళా ఉద్యమకారులు, రచయితలు, విద్యార్థినులు.. విద్య, ఆర్థిక స్థిరత్వంతోనే సాధికారత: సినీ నటి అమల

7లో

మంత్రుల ఉపసంహరణ

కేంద్రం నుంచి వైదొలగుతున్నాం

- మీడియా సమావేశంలో చంద్రబాబు
- లక్ష్యం నెరవేరలేదు.. పనులు జరగడం లేదు
- హామీలు నెరవేర్చాలని కోరితే జైట్లీ అవమానించారు..
- ఫోన్‌లో ప్రధాని అందుబాటులోకి రాలేదు
- ఇది తొలి అడుగు.. కేంద్ర స్పందనను బట్టి అడుగేస్తాం..

సాక్షి, అమరావతి: కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పుకోవాలని టీడీపీ నిర్ణయించింది. ప్రస్తుతానికి ఎన్డీఏలోనే కొనసాగుతుంది. "కేంద్ర ప్రభుత్వం నుంచి మా పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలు వైదొలగాలని నిర్ణయించాం. ఏ ఉద్దేశంతోనైతే కేంద్ర కేబినెట్‌లో చేరామో ఆ లక్ష్యం నెరవేరనప్పుడు కేంద్ర మంత్రివర్గంలో కొనసాగడంలో అర్థం లేదు. అందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నాం. మా మంత్రులు ఇక ప్రభుత్వంలో ఉండరు. ప్రత్యేక హోదా అనేది రాష్ట్ర హక్కు. విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని కోరితే జైట్లీ అవమానించారు.'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. బుధవారం రాత్రి చంద్రబాబు సెక్రటేరియట్‌లో విలేకరులతో మాట్లాడారు. "గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో బుధవారం నేను మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలు, విభజన సందర్భంగా రాజ్యసభలో ఇచ్చిన హామీల మేరకు 18 అంశాలు నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ఈ బాధ్యతను నెరవేర్చడం ద్వారా రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరా. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెంటనే ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. సెంటిమెంట్స్ పని చేయవని, హోదా ఇవ్వలేమని జైట్లీ చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల మాదిరిగా ప్రత్యేక హోదా ఏపీకి ఇవ్వడం సాధ్యం కాదని తేల్చేశారు. ఆర్థిక లోటు భర్తీ రూపంలో రాష్ట్రానికి ఇక రూ. 138 కోట్లే వస్తాయని చెప్పారు. మరో లెక్క ప్రకారం 1600 కోట్లు వస్తాయని, తీసుకున్నా, లేకున్నా వారి (ఏపీ) ఇష్టమని జైట్లీ మాట్లాడారు.

పనులవుతాయనే పదవులు తీసుకున్నాం..

విదేశీసంస్థల ఆర్థిక సాయంతో చేపట్టే పథకాలు (ఈఏపీ) ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ గురించి మాట్లాడకుండా సింపుల్‌గా కేంద్ర ప్రాయోజిత పథకాలు (సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్) గురించే జైట్లీ మాట్లాడి తేల్చేశారు. దీంతో రాష్ట్రానికి సహాయం చేసే ఉద్దేశం కేంద్రానికి ఏమాత్రం ఉన్నట్టు కనిపించలేదు. దీంతో మా పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలతో చర్చించాం. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేశాం. అన్యాయమైన, అసంబద్ధమైన విభజన ద్వారా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందనే కోపంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను భూస్థాపితం చేశారు. ఈ విషయాలన్నీ వివరించినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎంపీలు, కేంద్ర మంత్రులు, అందుబాటులో ఉన్న మంత్రులతో మాట్లాడాం. పనులవుతాయనే మంత్రి పదవులు తీసుకున్నాం. కానీ జరగకపోవడం వల్ల వైదొలగాలని నిర్ణయించాం. అదే విషయాన్ని ప్రధానికి కూడా చెప్పాలని ప్రయత్నించాం. మంత్రిపదవుల నుంచి మా పార్టీ తప్పుకుంటోందని మర్యాదపూర్వకంగా తెలియజేయడం కోసం ప్రధానమంత్రికి ఫోన్ చేస్తే ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో ఇదే విషయాన్ని ఆయన ఓఎస్డీకి తెలియజేశాం. గురువారం రాజీనామాలు చేయాలని పార్టీ తరఫున నిర్ణయించాం. ఇక కేంద్ర ప్రభుత్వంలో మా మంత్రులు ఉండరు.

ఇది తొలి అడుగే..

ఎన్డీయేతో పొత్తు కొనసాగుతుందా? లేదా అనేది ఇంకా నిర్ణయించలేదు. తొలి అడుగుగా ప్రభుత్వం నుంచి వైదొలగాలన్నదే ప్రస్తుతం నిర్ణయించాం. ఏపీ ప్రజలు చాలా కోపంగా ఉన్నారు. విభజన చట్టంలోని అంశాల గురించి, 18 అంశాల గురించి స్పష్టంగా వివరించా. వీటిలో న్యాయం చేయాలని మాత్రమే కోరా. రాష్ట్ర మంత్రివర్గంలో ఉంటారా? లేదా? అనే నిర్ణయాన్ని బీజేపీకే వదిలిపెడుతున్నాం. అన్ని ప్రయత్నాలు చేసిన తర్వాత విధి లేని పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రానికి మేలు చేయడం కోసం 29 సార్లు ఢిల్లీ వెళ్లా. కేంద్ర రాష్ట్ర సంబంధాలను కూడా పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదు .

కేంద్ర ప్రభుత్వ స్పందనను చూసి..

రాజీనామాల తర్వాత కేంద్ర ప్రభుత్వ స్పందన ఎలా ఉంటుందో పరిశీలిస్తాం. ఇప్పటికీ రాష్ట్రానికి కేంద్రం న్యాయం చేస్తుందనే ఆశిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు, రాష్ట్ర సమస్యల విషయంలో కేంద్రం ఎలా వ్యవహరిస్తుందో చూడాలి. నేను దేశంలో అందరికన్నా సీనియర్ రాజకీయ నాయకుడిని. ప్రపంచమంతా తిరిగా. తెలుగువాళ్లు దేనినైనా ఎదుర్కొని నిలబడతారనేది మరోసారి చూపిద్దాం. ఏదీ చేయనప్పుడు గౌరవంగా బయటకు రావాలనే నిర్ణయం తీసుకున్నాం.

అది అవమానించడమే..

సెంటిమెంట్ తో ఫండ్స్ రావు అంటూ అంటూ జైట్లీ మాట్లాడం బాధేసింది. దేశ రక్షణ అవసరం లేదా? అన్నట్లు మాట్లాడటం బాధేసింది. అంటే మనం దేశ రక్షణ నిధులు మాకివ్వాలని అడిగామా? రాష్ట్రానికి ఉన్న హక్కులే అడిగాం. వెనుకబడిన జిల్లాలకు 350 కోట్లు చొప్పున ఇవ్వాలి ఇచ్చిన నిధులన్నింటికీ యూసీలు (వినియోగ పత్రాలు) ఇచ్చాం. ఇంకా రూ. 104 కోట్లకు యూసీలు ఇవ్వాలి. రాజధానికి ఇచ్చిన నిధులకూ యూసీ ఇచ్చాం. పోలవరానికి యూసీలు అవసరం లేదు మనం ఖర్చు పెట్టింది రూ. 13,053 కోట్లు. కేంద్రం ఇచ్చింది రూ. 5,349 కోట్లు . ఇంకా కేంద్రం రూ. 2,568 కోట్లు ఇవ్వాలి. కొత్త డీపీఆర్ ప్రకారం 760 కోట్లు ఇవ్వాలి. రెవెన్యూ లోటు మొత్తం రూ. 16,078 కోట్లని ఏజీ లెక్క తేల్చింది. 14వ ఆర్థిక సంఘం ప్రకారం 2015 – 16 ఆర్థిక సంవత్సరం రూ. 6,660 కోట్ల లోటు ఉంది. కానీ కేంద్రం 4 వేల కోట్లే ఇస్తామంది. ప్రతి ఏటా లోటు పెరిగి గతేడాదికి 23 వేల కోట్లకు చేరింది. కానీ కేంద్రం ఇచ్చింది రూ. 4 వేల కోట్లే. ఇంత లోటుపై డబ్బులివ్వాలంటే వచ్చేదింతే అని చెప్పడం ఎంత వరకు సబబు?

కేంద్ర స్పందనను బట్టి ముందుకు పోతాం..

ఇప్పటికైనా కేంద్రం ముందుకొచ్చి మన సమస్యలు పరిష్కరించాలి. కేంద్రం, రాష్ట్రం కలిసి పని చేయాలి కేంద్రం ఏ విధంగా స్పందిస్తుందనే అంశంమీద మనం ఏ విధంగా ముందుకు పోవాలో ఆధారపడి ఉంటుంది. మన హక్కులు కాపాడుకోవడానికి ఆలోచించి అడుగులేయాలి జపాన్ తరహాలో అభివృద్ధి చెందేలా పని చేయాలి. నామీద చాలా మంది విమర్శలు చేశారు, వాటిని నేను పట్టించుకోను. ప్రధాని కార్యాలయం చుట్టూ 24 గంటలూ తిరగడానికి ప్రతిపక్షానికి ఏం పని?. మేం భాగస్వాములం కాబట్టి మాకు పనులుంటాయి. ఏ ఉద్దేశంతో రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు పలికింది. ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వడం లేదని ఆనాడు చెప్పారు. ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలకు హోదా ఇచ్చి, ఏపీకి ఇవ్వడం కుదరదనడం ఎంత న్యాయం. హోదాతో పాటు 18 డిమాండ్లు కేంద్రం ముందు పెట్టాం చివరి వరకు ప్రయత్నించినా కనీసం మా వినతిని పరిగణనలోకి కూడా తీసుకోకుండా కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదు. ఎన్డీయే నేతలను నేను వ్యతిరేకించానంటే అది రాష్ట్ర ప్రయోజనాల కోసమే. అన్ని రాష్ట్రాలకూ సహాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. కేంద్రం సహకరించకపోయినా వృద్ధి రేటులో మొదటి స్థానం సాధించాం. రాజకీయాల్లో ఊహాగానాలు కరెక్ట్ కాదు ఈ రోజు జరిగిందే వాస్తవం భావితరాల భవిష్యత్తు గురించే ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాం. అన్ని హామీలను అమలు చేస్తానంటే కాంగ్రెస్‌తో కలుస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

రాజీనామాకు బీజేపీ మంత్రులూ సిద్ధం

సాక్షి, అమరావతి: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం నుంచి తెలుగుదేశం పార్టీ మంత్రులు వైదొలగాలన్న నిర్ణయానికి ప్రతిగా రాష్ట్రంలో చంద్రబాబు కేబినెట్‌లోని బీజేపీ మంత్రులు కూడా రాజీనామాకు సిద్ధపడ్డారు. బుధవారం రాత్రి చంద్రబాబు ప్రకటన తర్వాత బీజేపీ ప్రజాప్రతినిధులు విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అత్యవసరంగా సమావేశమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌లు విలేకరులతో మాట్లాడారు. ఇద్దరు బీజేపీ మంత్రులు కామినేని శ్రీనివాసరావు, పి.మాణిక్యాలరావు గురువారం వారి పదవులకు రాజీనామా చేస్తారని చెప్పారు. టీడీపీతో పూర్తిగా విడిపోతున్నారా? లేక మంత్రుల రాజీనామాకు మాత్రమే పరిమితమా? అని ప్రశ్నించగా... ప్రభుత్వం నుంచే వైదొలుగుతున్నామని బదులిచ్చారు.

రాష్ట్ర వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం గురువారం ఉదయం 7.30 గంటలకు మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఇద్దరు బీజేపీ మంత్రులు తెల్లవారుజామున ఫోనులోనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమాచారమిచ్చి, మంత్రివర్గ సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. కేవలం సాధారణ ఎమ్మెల్యేలుగా మాత్రమే వారు అసెంబ్లీకి హాజరవుతారు. ఉదయం ఇద్దరు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాత పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి విలేకరులతో మాట్లాడతారు. మంత్రులిద్దరూ రాజీనామా చేస్తున్నట్టు బుధవారం రాత్రే ప్రకటించాలని తొలుత భావించినప్పటికీ.. బీజేపీ నేతల సమావేశానికి హజరు కాలేకపోయిన కామినేని శ్రీనివాసరావు గురువారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పినట్టు సమాచారం.

అసెంబ్లీలో గ్రెనేడ్.. లోకాయుక్తకు కత్తిపోట్లు

- కేరళ, కర్ణాటకలో ఘటనలు
- పోలీసు అకృత్యాలకు నిరసనగానే గ్రెనేడ్ తెచ్చానన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే


లోకాయుక్త విశ్వనాథ్ శెట్టి (ఫైల్)


పోలీసులు అదుపులో దుండగుడు

తిరువనంతపురం/బెంగళూరు: తిరువాంచూర్ రాధాకృష్ణన్.. కేరళలో కాంగ్రెస్ ఎమ్మెల్యే.. మాజీ హోంమంత్రి కూడా.. బుధవారం ఆయన అసెంబ్లీకి ఓ కవర్‌లో గ్రెనేడ్‌ను తెచ్చారు.. సభలోకి వచ్చి ఒక్కసారిగా కవర్ నుంచి దాన్ని బయటికి తీసి చూపడంతో సభ్యులంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. రాష్ట్రంలో పోలీసుల అకృత్యాలకు నిరసనగానే ఇలా చేసినట్టు ఆయన వివరణ ఇచ్చారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు సుహైబ్ హత్యను నిరసిస్తూ ఆందోళనకు దిగిన తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులు ప్రయోగించిన గ్రెనేడ్‌లలో ఒకదానిన్ని అసెంబ్లీకి తెచ్చానని వెల్లడించారు. తర్వాత గ్రెనేడ్‌ను రాధాకృష్ణన్ తానే భద్రతా సిబ్బందికి అప్పగించారు. కేరళ అసెంబ్లీలోకి బాంబులు తేవడం ఇది తొలిసారి కాదు. 2012లోనూ ఇలాగే పోలీసుల దాష్టీకాలను వ్యతిరేకిస్తూ అప్పటి ప్రతిపక్ష సీపీఎం సభ్యుడొకరు రెండు టియర్ గ్యాస్ షెల్‌ను సభలోకి తెచ్చారు. అప్పుడు రాధాకృష్ణన్ హోంమంత్రిగా ఉండటం గమనార్హం.

లోకాయుక్తపై దాడి

కర్ణాటక లోకాయుక్త జస్టిస్ పి.విశ్వనాథ షెట్టిపై ఆయన కార్యాలయంలోనే దాడి జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బెంగళూరులోని విధాన సౌధ భవనం పక్కనే ఉన్న ఎంఎస్ బిల్డింగ్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే లోకాయుక్త కార్యాలయం ఉంది. బుధవారం ఉదయం టుంకూర్‌కు చెందిన తేజరాజ్ శర్మ(36) అనే కాంట్రాక్టర్ కార్యాలయానికి వచ్చాడు. దాదాపు 15 మంది ప్రభుత్వ అధికారులపై అవినీతి ఆరోపణలున్న ఫిర్యాదును అక్కడి అధికారులకు అందజేశాడు. అయితే దర్యాప్తు పూర్తయినందున ఆ కేసు మూసివేశారని అధికారులు బదులిచ్చారు. దీంతో లోకాయుక్త చాంబర్‌లోకి వెళ్లిన శర్మ వెంట తెచ్చుకున్న కత్తితో ఒక్కసారిగా జస్టిస్ విశ్వనాథ షెట్టిపై దాడి చేశాడు. నాలుగైదు చోట్ల పొడిచాడు. ఆయన గట్టిగా కేకలు వేయటంతో సిబ్బంది వచ్చి వెంటనే ఆస్పత్రికి తరలించారు. నిందితుడు శర్మను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విశ్వనాథ షెట్టిని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయనకు ప్రాణహాని లేదని వైద్యులు తెలిపినట్లు చెప్పారు.

'హోదా' గళాలపై ఉక్కుపాదం

ఢిల్లీలో వామపక్షాలు, ప్రజాసంఘాల నేతలపై లాఠీచార్జ్..



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనపై ఢిల్లీ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రెండోరోజు బుధవారం ఢిల్లీలో ధర్నా సందర్భంగా నేతలు పార్లమెంట్ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిపై లాఠీలతో విరుచుకుపడ్డారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి.

ఏపీ ప్రజల వెంటే ఉంటాం..: ఏపీకి ప్రత్యేక హోదా సాధించే వరకు ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. ఆత్మగౌరవ దీక్ష పేరుతో ఢిల్లీలో కాంగ్రెస్ రాష్ట్ర నేతలు చేస్తున్న ధర్నాలో బుధవారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. డీఎంకే ఎంపీ కనిమొళి ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

టీడీపీ మంత్రుల రాజీనామా డ్రామా

- ఇప్పటికీ ఎన్డీఏ నుంచి వైదొలుగుతామని అనడం లేదు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మండిపాటు



సాక్షి, అమరావతి/ న్యూఢిల్లీ: టీడీపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేయనుండడం పెద్ద డ్రామా అని వైఎస్సార్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలో 'సాక్షి' టీవీతో మాట్లాడారు. ఏడాదిలో ఎన్నికలొస్తున్నాయని, ప్రజావ్యతిరేకత తీవ్రంగా ఉన్నందునే రాజీనామా డ్రామాలకు తెరతీసారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని పదే పదే చెప్పే చంద్రబాబునాయుడు ఈ నాలుగేళ్లలో ఏం చేశారో ఒక్కటైనా చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఇన్ని రోజులు సరిగా స్పందించకుండా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రెస్‌మీట్ పెట్టిన తర్వాత హడావిడిగా రాజీనామాలు చేయడం డ్రామా కాక మరేంటని ప్రశ్నించారు. ఇప్పటికి కూడా కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తున్నారు అని చెప్పారే తప్ప ఎన్డీఏ నుంచి వైదొలుగుతున్నామని చెప్పకపోవడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. వారు ఎన్డీఏతో ఇంకా కొనసాగుతారా లేదా అనేది చూసి మా పద్ధతి ప్రకారం మేం వెళతామన్నారు. మేము బీజేపీతో మద్దతు పెట్టుకుంటాం అని అంటున్నారు, కానీ ఎలక్షన్లకు ముందు మాకు ఏ పార్టీతో పొత్తు ఉండదు, ఉండబోదు కూడా అని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో వస్తున్న మార్పులపై ఎలా ముందుకు వెళ్లాలో తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి చర్చించుకుని ఆయన ఆదేశాల మేరకు ముందుకు వెళతామన్నారు.

ఇంకా మభ్యపెట్టాలని చూస్తున్నారు

చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నేత బొత్స ధ్వజం



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు మూడున్నరేళ్లుగా రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసింది చాలదన్నట్లు ఇంకా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. చంద్రబాబులో ఏమాత్రం పరివర్తన, పశ్చాత్తాపం కనిపించడం లేదని దుయ్యబట్టారు. ఏపీ విషయంలో కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఆయన భాషలో ఢిల్లీ పీఠం అహంకారం కనిపిస్తోందన్నారు. 2016 సెప్టెంబరు 7వ తేదీన చెప్పిన మాటనే నేడు మళ్లీ చెప్పారని గుర్తుచేశారు. అదేరోజు చంద్రబాబు వాస్తవాలను గుర్తించి, కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ఉంటే రాష్ట్రానికి ఇంత నష్టం జరిగి ఉండేది కాదన్నారు. హోదా కోసం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాటం చేస్తుంటే చంద్రబాబు కోటరీ ఎద్దేవా చేయడానికే పరిమితమైందన్నారు. ప్రత్యేక హోదా విషయంలో ఎంతవరకైనా వెళతామని తేల్చిచెప్పారు.

కేవలం ప్రజల మూడ్‌ను గమనించే: రాజ్‌దీప్



'చంద్రబాబు రాజకీయాల్లో బాగా ఆరితేరిన వారు. ఒక్కొక్క అడుగు ఆచితూచి వేస్తారు. కేవలం ప్రజల మూడ్‌ను గమనించే.. కేంద్ర ప్రభుత్వం నుంచి తన మంత్రులను ఉపసంహరించి ప్రత్యేక హోదాపై స్వరం పెంచారు. ఇప్పుడే ఎన్డీయే నుంచి బయటికి రాకపోవచ్చు. అన్ని ప్రాంతీయ పార్టీల్లాగే తమ రాజకీయ అవకాశాలను చివరిదాకా సజీవంగా ఉంచుకుంటారు. మంత్రుల ఉపసంహరణ విషయంలోనూ కేంద్రానికి ఫోన్ చేశానని చెప్పడం ద్వారా వారితో సయోధ్య కొనసాగేలా చూసుకున్నారు. ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లిపోయిన ప్రత్యేక హోదా ఉద్యమం మైలేజీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరలకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు' – ట్విట్టర్, టీవీ చర్చల్లో సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్

ఇచ్చిన నిధులకు లెక్కలు అడుగుతారా?

▶ మొదటి పేజీ తరువాయి

యూసీలు పంపామని వివరించారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రపతి పాలనలో రెవెన్యూ లోటును రూ.16,072 కోట్లుగా లెక్కగట్టి గవర్నర్ కేంద్రానికి లేఖ రాశారని చంద్రబాబు చెప్పారు. ఇప్పటివరకూ రెవెన్యూ లోటు కింద కేంద్రం రూ. 3,997 కోట్లు విడుదల చేసిందన్నారు. మరో రూ.138 కోట్లను మాత్రమే రెవెన్యూలోటు కింద ఇస్తామని కేంద్రం చెప్పడం దారుణమన్నారు. నిధులు అడిగితే.. ఖర్చుల లెక్కలు చెప్పాలని కేంద్రం అడగడం సరి కాదన్నారు.

14వ ఆర్థిక సంఘం చెప్పలేదు

దేశంలో కొత్తగా ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకూడదని 14వ ఆర్థిక సంఘం ఎక్కడా సిఫార్సు చేయలేదని సీఎం చంద్రబాబు చెప్పారు. 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కింద సహాయం చేస్తున్నారని, హోదా పేరుతో కాకున్నా అదే స్థాయిలో పన్ను రాయితీలను 2027 వరకూ కల్పించేలా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అదే రీతిలో సహాయం చేయాలని సీఎం కోరారు. ప్రత్యేక హోదా కల్పించాలని ఎంపీలు ఉద్యమం చేస్తుంటే.. తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి కూడా ఇదే విధమైన డిమాండ్లు వస్తాయని కేంద్రంలో కొందరు లీకులు ఇస్తుండటం బాధేస్తోందన్నారు.

పాత పాటే పాడిన జైట్లీ

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టత ఇస్తున్నానంటూ మొదలుపెట్టి దాదాపు 22 నిమిషాలపాటు తనదైన శైలిలో మళ్లీ పాత పాటే పాడారు. ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని, అందుకే హోదాకు పరిహారంగా ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నామని అన్నారు. అరుణ్ జైట్లీ ఇంకా ఏం మాట్లాడారంటే...

''నేను ఈ అంశంపై గతంలోనూ మాట్లాడాను. కొన్ని అంశాలపై స్పష్టత ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశాను. ప్రధాన అంశం ప్రత్యేక హోదా అమలుతో వచ్చే ప్రయోజనం. తొలుత ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారు. ఎందుకంటే ఆయా రాష్ట్రాల సొంత వనరులు(ఆదాయం) వాటికి సరిపోవు. కేంద్ర పన్నుల వాటా నుంచి రాష్ట్రాలకు ఎంత ఇవ్వాలన్నది ప్రతి ఐదేళ్లకోసారి ఆర్థిక సంఘం నిర్దేశిస్తుంది. ఇలాపోను కేంద్రం వద్ద ఉండే ఆదాయం నుంచి కేంద్ర ప్రభుత్వం కొన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్వహిస్తుంది. ఈ పథకాలన్నింటికీ కేంద్రం నిధులు ఇస్తుంది. కొంత శాతం రాష్ట్రాలు భరిస్తాయి. ప్రస్తుతం దాదాపు అన్ని పథకాల్లో 60 శాతం నిధులను కేంద్రం భరిస్తుంది. 40 శాతం నిధులను రాష్ట్రం భరిస్తుంది. ప్రస్తుతం దేశంలో ప్రత్యేక హోదా కేటగిరీ రాష్ట్రాలు లేవు. ఈ హోదా ఉంటే కేంద్రం 90 శాతం నిధులు ఇస్తుంది. రాష్ట్రాలు 10 శాతం భరించాలి. హోదా ఇప్పుడు ఏ రాష్ట్రానికీ లేదు. కానీ, 8 ఈశాన్య రాష్ట్రాలు, 3 హిమాలయ ప్రాంత రాష్ట్రాలకు ఈ పథకాల్లో 90 శాతం వాటాను కేంద్రం భరిస్తోంది. 10 శాతం ఆయా రాష్ట్రాలు భరిస్తున్నాయి. అంటే ఆయా రాష్ట్రాలకు 30 శాతం అదనంగా ప్రయోజనం కలుగుతోంది.

14వ ఆర్థిక సంఘం ఇవ్వొద్దని చెప్పింది

విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని వనరులను సమకూర్చాలి. ఈ దిశగా ఇచ్చిన హామీల్లో ప్రత్యేక హోదా ఒకటి. ఆ సమయంలో ప్రత్యేక హోదా అనే కాన్సెప్ట్ ఉండేది. కానీ, రాజ్యాంగబద్ధమైన 14వ ఆర్థిక సంఘం నివేదిక రాష్ట్రాలకు ఇకపై ప్రత్యేక హోదా ఇవ్వరాదని చెప్పింది. రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రాలకు పరిహారాన్ని 14వ ఆర్థిక సంఘమే నిర్దేశించింది. కేంద్ర పన్నుల్లో అప్పటివరకు రాష్ట్రాల వాటా 32 శాతం ఉండగా, 14వ ఆర్థిక సంఘం దాన్ని మరో 10 శాతం పెంచింది. అలాగే కొంతకాలం వరకు రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రాలకు పరిహారాన్ని నిర్దేశించింది. ఆంధ్రప్రదేశ్‌కు కూడా కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపి.. ఒకవేళ హోదా ఉండి ఐదేళ్లపాటు 90:10 నిష్పత్తి వాటా ఏపీకి వచ్చి ఉంటే కలిగే ప్రయోజనాన్ని లెక్కించి ఆ మేరకు నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. అంటే 30 శాతం అంతరాన్ని పరిహారంగా ఇవ్వాలని తేల్చింది. ఈ ప్రతిపాదన 2016లోనే నిర్ణయమైంది.

నాబార్డుకు 90 శాతం నిధులిస్తామన్నాం..

ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ సంస్థలైన ఏడీబీ, జైకా తదితర సంస్థలు ఏపీలో అమలయ్యే పథకాలకు ఆర్థిక సాయం చేస్తే వాటిని కేంద్రం తన వాటాగా 90 శాతం తిరిగి చెల్లించాలి. అలా ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుల(ఈఏపీ) ద్వారా నిధులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. ఏపీ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో కేంద్రానికి కొత్త ప్రతిపాదన చేసింది. ఈఏపీ ద్వారా కాకుండా నాబార్డు ద్వారా నిధులు ఇవ్వాలని కోరింది. నాబార్డు నేరుగా నిధులు ఇస్తే అది రాష్ట్రం అప్పు తెచ్చుకునే పరిమితిపై ప్రభావం చూపుతుంది. మీ ద్రవ్యలోటుపై ప్రభావం చూపని మార్గాన్ని కనుక్కోవాలని రాష్ట్రాన్ని కోరాం. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో కేంద్ర వ్యయ విభాగం కార్యదర్శితో సమావేశమయ్యారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా నాబార్డు నుంచి ఆ సంస్థకు నేరుగా నిధులు ఇవ్వొచ్చని, మేం నాబార్డుకు 90 శాతం నిధులు చెల్లిస్తామని చెప్పాం.

నిధులు ఎలా కావాలో రాష్ట్రమే చెప్పాలి

ఈఏపీ ద్వారా గానీ, నాబార్డు ద్వారా గానీ ప్రత్యేక హోదాకు పరిహారంగా నిధులు ఇచ్చేందుకు కేంద్రం కట్టుబడి ఉంది. ఏ పద్ధతిలో నిధులు కావాలో అంతిమంగా రాష్ట్రమే చెప్పాలి. మేం ఏ దశలోనూ నిధులు ఇవ్వబోమని చెప్పలేదు. హోదా రాకపోవడం వల్ల ఏర్పడే 30 శాతం అంతరాన్ని భర్తీ చేస్తామని చెబుతున్నాం. ఏపీపై సానుకూల దృక్పథంతో ఉన్నాను'' అని అరుణ్ జైట్లీ వివరించారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

రెవెన్యూ లోటు ఎలా భర్తీ చేస్తారు?

జైట్లీ: ఇది 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేవలం 10 నెలల కోసమే ఇవ్వాల్సి ఉంది. 2013–14 ఆర్థిక సంవత్సర రెవెన్యూ లోటును ప్రాతిపదికగా తీసుకుని లక్షిత 10 నెలలకు లెక్కిస్తే రూ.4,000 కోట్లుగా లెక్క తేలింది. దీన్ని మేం ఇప్పటికే చెల్లించాం. ఇంకా రూ.138 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇంకో ప్రత్యామ్నాయ సూత్రం కూడా ఉంది. 14వ ఆర్థిక సంఘం 2015–16 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటును గణించింది. ఆ 12 నెలల గణన నుంచి 10 నెలలకు ఉండే రెవెన్యూ లోటును లెక్కిస్తే రాష్ట్రానికి రూ.1,600 కోట్లు అదనంగా వస్తుంది. 2015–16ను ప్రాతిపదికగా తీసుకుంటే ఏపీకి ప్రయోజనం కలుగుతుంది. మేం దీనికి కూడా అంగీకరించాం.

కేంద్రం ఇచ్చే రాయితీలు హోదా ద్వారా వచ్చే రాయితీలతో సమానం కాదు కదా?

జైట్లీ: రాయితీలను మేం ఇదివరకే ప్రకటించాం. ఏపీ కంటే చాలా తక్కువగా ఆర్జించే రాష్ట్రాలు వచ్చి మాకెందుకు పన్ను రాయితీలు ఇవ్వరు అని ప్రశ్నిస్తాయి. బిహార్ కూడా విభజనకు గురైంది.

ఇప్పుడు హోదా, రాయితీలు రాజకీయ అంశంగా, సెంటిమెంట్ అంశంగా మారాయి కదా?

జైట్లీ: రాజకీయ అంశాలు ఎన్నటికీ నిధుల పరిమాణాన్ని పెంచవు. కేంద్రం వద్ద మిగులు నిధులేమీ లేవు. ప్రతి రాష్ట్రానికి కేంద్ర నిధులపై అంతే హక్కు ఉంటుంది. సెంటిమెంట్ అనేది నిధుల కేటాయింపులను నిర్దేశించలేదు.

14వ ఆర్థిక సంఘం సభ్యులు తాము ప్రత్యేక హోదా ఇవ్వకూడదని చెప్పలేదంటున్నారు.

జైట్లీ: మీరు ఆ నివేదిక చదవండి. 14వ ఆర్థిక సంఘం చెప్పిన ప్రకారం 8 ఈశాన్య రాష్ట్రాలకు, 3 హిమాలయ రాష్ట్రాలకు విభిన్న విధానం అనుసరిస్తున్నాం.

అంటే అది ప్రత్యేక హోదా కాదా?

జైట్లీ: ఆ రాష్ట్రాలు 90 శాతం వాటా పొందేందుకు అర్హత కలిగి ఉన్నాయని 14వ ఆర్థిక సంఘం చెప్పింది.

ప్రస్తుతం హోదా లేకపోయినప్పటికీ ఆ 11 రాష్ట్రాలకు ఇస్తున్నట్టుగా 90 శాతం నిధులను ఏపీకి ఎందుకు ఇవ్వలేరు?

జైట్లీ: గతంలో హోదా ఉన్న రాష్ట్రాలకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పుడు ఏపీకి ఇస్తే బిహార్‌కు ఎందుకు ఇవ్వకూడదు? జార్ఖండ్‌కు ఎందుకు కాదు? ఈ ప్రశ్నలు వస్తాయి. 29 రాష్ట్రాలను కేంద్రం చూడాలి.

ఢిల్లీ కంటే మెరుగైన రాజధానిని నిర్మిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు కదా?

జైట్లీ: రాజధాని నిర్మాణానికి ఇదివరకే రూ.2,500 కోట్లు ఇచ్చాం.

నాలుగేళ్లలో కేంద్రం ఏమీ చేయలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈరోజు అన్నారు.

జైట్లీ: ఇప్పుడే మీకు చెప్పాను. పోలవరం ప్రాజెక్టుకు రూ.5,000 కోట్లు ఇచ్చాం. అభివృద్ధి పనులు జరిగాయనే అనుకుంటున్నాను.

సాయానికి ఏదైనా డెడ్‌లైన్ ఉందా?

జైట్లీ: రాష్ట్రంలో రాజకీయ ఉద్యమం ఉందని కేంద్రం చేసే ఖర్చులను మొత్తం ఆపేసి రాష్ట్రాలకు ఇవ్వలేం.

అభివృద్ధి నిధులు జిల్లాకు కేవలం రూ.50 కోట్లు ఎలా సరిపోతాయి?

జైట్లీ: రాష్ట్రం ఇంకా ఎక్కువ ఖర్చు చేయొచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీలమైన రాష్ట్రం.

హోదా సాధించి తీరుతాం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీల స్పష్టీకరణ

- నాలుగేళ్ల మా పోరాటం వృథాగా పోదు
- కేంద్రం దిగొచ్చేదాకా ఉద్యమం కొనసాగిస్తాం
- చంద్రబాబు గద్దె దిగితేనే ఏపీ ప్రజలకు న్యాయం
- పార్లమెంట్ లోపల, వెలుపలా ఎంపీల నిరసన



పార్లమెంటు వెలుపల ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, మేకపాటి, వరప్రసాదరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యేక హోదా సాధన కోసం నాలుగేళ్లుగా తాము సాగిస్తున్న పోరాటం వృథా కాబోదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు స్పష్టం చేశారు. ప్రజల్లో చైతన్యం వచ్చిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించి తీరుతామని తేల్చిచెప్పారు. హోదా వద్దంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను వంచించేందుకు ప్రయత్నించారని వారు ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఎస్సార్ సీపీ ఎంపీలు బుధవారం పార్లమెంట్ వెలుపల, లోపలా ఆందోళన కొనసాగించారు. దీంతో సభా కార్యకలాపాలు మూడోరోజూ స్తంభించాయి. ఉదయం 10.30 గంటలకు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, పీవీ మిథున్‌రెడ్డి ధర్నా నిర్వహించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎంపీలు మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబుకు త్వరలోనే గుణపాఠం

''ఏపీకి కేంద్రం ఎన్నో హామీలిచ్చింది. అవన్నీ ఇప్పుడేమయ్యాయి? చంద్రబాబు ఇప్పుడు బీజేపీకి దూరంగా ఉండాలనుకుంటున్నారు. ఆయనకు రాజకీయ ప్రయోజనాలే తప్ప ప్రజల ప్రయోజనాలు ఏనాడూ పట్టవు. రాష్ట్రాన్ని వంచించిన చంద్రబాబుకు ప్రజలు త్వరగానే గుణపాఠం చెబుతారు. చంద్రబాబును, బీజేపీని ప్రజలు హర్షించరు'' అని మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ... ''ప్రత్యేక హోదా ఉన్న 11 రాష్ట్రాలకు రీఫండ్ చేస్తున్నట్లు కేంద్రం సమాధానం ఇచ్చింది. హోదాపై రోజుకో మాట చెబుతూ వంచిస్తున్న చంద్రబాబు గద్దె దిగితేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. చంద్రబాబు తన స్వప్రయోజనాల కోసమే పాకులాడుతున్నారని బీజేపీ భావిస్తోంది'' అని చెప్పారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ''హోదా సాధించి తీరుతాం. కేంద్రం దిగివచ్చే వరకూ మా పోరాటం ఆగదు'' అని స్పష్టం చేశారు. వెలగపల్లి వరప్రసాదరావు మాట్లాడుతూ... ''ప్రజలంతా ప్రత్యేక హోదా కోరుకుంటున్నారు. అధికార టీడీపీపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. అందుకే మళ్లీ ఏదో ఒకరీతిలో జనాన్ని మభ్యపెట్టి అధికారంలోకి రావాలని ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారు. అలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండకూడదు'' అని పేర్కొన్నారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ''ఏపీకి ప్రత్యేక హోదా రాదని బీజేపీ, టీడీపీ నేతలు చెబుతూ వచ్చారు. మా పోరాటం వల్ల ఒత్తిడి పెరగడంతో ఇప్పుడు టీడీపీ తన పంథా మార్చుకుంది. హోదా కావాలని చంద్రబాబే స్వయంగా అడిగే పరిస్థితి తెచ్చాం. బీజేపీ కూడా ప్రత్యేక హోదా ఇస్తామనే పరిస్థితి తీసుకొస్తామని నమ్ముతున్నాం'' అని అన్నారు.

సభలో సమరం

ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే వైఎస్సార్‌సీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ప్రత్యేక హోదా కోసం నినదించారు. ఇదే సమయంలో టీడీపీ ఎంపీలు విభజన హామీలు నెరవేర్చాలంటూ వెల్‌లోకి దూసుకొచ్చారు. టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే, శివసేన, కాంగ్రెస్ సభ్యులు విభిన్న అంశాలపై తమ నిరసన తెలపడంతో లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ ప్రారంభం కాగా ఇదే పరిస్థితి పునరావృతం కావడంతో తిరిగి గురువారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో నిరసన

ఎగువ సభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ప్రత్యేక హోదా కావాలంటూ ప్లకార్డు ప్రదర్శిస్తూ పోడియం వద్ద నిరసన తెలిపారు. టీడీపీ ఎంపీలు, కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ తదితరులు తమ నిరసనను కొనసాగించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభం కాగా, ఇదే పరిస్థితి ఉండడంతో ఉపసభాపతి సభను గురువారానికి వాయిదా వేశారు.

హామీల అమల్లో పురోగతి లేకే ఆందోళన

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన విషయంలో తాము వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని మేకపాటి రాజమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభ సమావేశాలు ప్రతిరోజూ స్తంభించిపోతుండడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ బుధవారం పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమయ్యారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు ఫ్లోర్ లీడర్లు సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మేకపాటి మాట్లాడుతూ... హామీల అమల్లో ఇప్పటి వరకు పురోగతి లేనందువల్లే ఆందోళన కొనసాగించాల్సి వస్తోందన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని కూడా స్పీకర్ దృష్టికి మేకపాటి తీసుకెళ్లారు. అలాగే ప్రకాశం జిల్లా కందుకూరు, నెల్లూరు జిల్లా కావలిలో కేంద్రీయ విద్యాలయాలను త్వరితగతిన మంజూరు చేయాలని మేకపాటి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు విన్నవించారు. ఈ మేరకు ఒక వినతిపత్రం ఇచ్చారు.

నా వ్యాఖ్యలను చంద్రబాబు వక్రీకరించారు

తాము బీజేపీతో వెళతామని అన్నట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్యాలను ప్రచారం చేయడంపై మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ''మాకు ఏపీలో 8 మంది ఎంపీలను ఇచ్చారు. అందులో ముగ్గురిని టీడీపీ తీసుకుంది. టీడీపీకి, బీజేపీకి కలిపి 17 సీట్లు ఇచ్చారు. ఈ మొత్తం 20 సీట్లలో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే రేపు కేంద్రంలో ఏ ప్రభుత్వం రావాలన్న మా అవసరం ఉంటున్నందు వల్ల తప్పకుండా ఏపీకి ప్రత్యేక హోదా సాధిస్తామని, విభజన హామీలు సాధిస్తామని చెప్పాను. కానీ, చంద్రబాబు దీన్ని వక్రీకరించారు. నేను 20 సీట్లు వస్తే బీజేపీకి మద్దతు ఇచ్చి హోదా సాధించుకుంటామని చెప్పినట్టుగా ఓ సమావేశంలో ఆయన వ్యాఖ్యానించారని ఓ పత్రికలో వచ్చింది. నేను అనని మాటలను అన్నట్టుగా చిత్రించడం గర్హనీయం'' అని మేకపాటి పేర్కొన్నారు.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో రజనీ అకౌంట్లు

తమిళసినిమా (చెన్నై): నటుడు రజనీకాంత్ తాజాగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అకౌంట్లను ప్రారంభించారు. రాజకీయ రంగప్రవేశానికి సిద్ధ మైన రజనీకాంత్ సామాజిక మాధ్యమాలను వాడుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ మధ్య ట్విట్టర్ అకౌంట్ ప్రారంభించిన ఈయన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అకౌంట్ ప్రారంభించారు. ఇప్పటికే తన అభిమాన సంఘాలను ప్రజాసంఘాలుగా మార్చి జిల్లాల వారిగా సభ్యుత్వ నమోదు చురుగ్గా నిర్వహిస్తున్నారు. జిల్లాల వారిగా చర్చలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ బాధ్యలతను రజనీ ప్రజా సంఘం రాష్ట్ర నిర్వాహకుడు సుధాకర్, కార్యదర్శి రాజుమహాలింగం నిర్వహిస్తున్నారు.



విశాఖలో ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రతిపాదన రద్దు

- విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి జవాబు
- జర్నలిస్టులపై దాడుల్లో ఏపీది రెండో స్థానం



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: విశాఖపట్నంలోని గంగవరం వద్ద నిర్మించతలపెట్టిన ఆర్ఎల్ఎన్‌జీ (రీగ్యాసిఫైడ్ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) టెర్మినల్ ప్రతిపాదన రద్దయినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బుధవారం రాజ్యసభకు తెలిపారు. విశాఖపట్నంలోని గంగవరం వద్ద ఎల్ఎన్‌జీ టెర్మినల్ ఏర్పాటుకు 2012లో పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ లిమిటెడ్ సంస్థతో గంగవరం పోర్టు కుదుర్చుకున్న ఒప్పందంపై ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ఎందుకు ముందుకు పడలేదంటూ వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యుడు వి. విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వకంగా జవాబిచ్చారు. గంగవరం పోర్టు వద్ద ఆర్ఎల్ఎన్‌జీ టెర్మినల్ ఏర్పాటుకు పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ లిమిటెడ్-గంగవరం పోర్టు లిమిటెడ్ మధ్య 2012లో ఒప్పందం కుదిరిందన్నారు. అయితే, ఏటా ఈ టెర్మినల్ ద్వారా లభించే ఆర్ఎల్ఎన్‌జీ కొనుగోలుకు, కెపాసిటీ బుకింగ్‌కు వినియోగదారుల నుంచి కచ్చితమైన హామీ లభించకపోవడం.. పైప్‌లైన్ కనెక్టివిటీకి ప్రభుత్వ భరోసా రాకపోవడంతో ప్రాజెక్ట్ పనులు స్తంభించిపోయాయన్నారు. 2015, మే 2 నాటికి ఎంవోయూ గడువు కూడా ముగియడంతో ఆర్ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్ట్ ప్రతిపాదన రద్దయిందని మంత్రి తెలిపారు. ఇదిలా ఉంటే.. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల విషయంలో 2016 లెక్కల ప్రకారం మధ్యప్రదేశ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ రాజ్యసభలో తెలిపారు. రెండు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల కేసుల వివరాల గురించి బుధవారం విజయసాయిరెడ్డి ప్రశ్నించగా ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు.

దక్షిణ మధ్య రైల్వేలో 15,806 ఖాళీలు

దక్షిణ మధ్య రైల్వేలో ప్రస్తుతం గ్రూప్-ఏ, గ్రూప్-బీ, గ్రూప్-సీ, డీ కేటగిరీల్లో మొత్తం 15,806 ఖాళీలు ఉన్నట్టు వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రాజన్ గోహెన్ బుధవారం లోక్‌సభలో సమాధానమిచ్చారు. ఇటీవల దేశవ్యాప్తంగా 89,409 నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని, అందులో దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి 9,743 పోస్టులు లోకో పైలట్, టెక్నీషియన్స్, లెవల్-1 పోస్టులు ఉన్నట్టు తెలిపారు. రైల్వే భద్రతకు సంబంధించి గ్రూప్-ఏలో 39, గ్రూప్-బీలో 21, గ్రూప్-సీ కేటగిరీలో 10,371 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు.

ఉష్ణతాపం నుంచి తాత్కాలిక ఉపశమనం

రాష్ట్రంలో తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం : కొద్ది రోజులుగా ఉష్ణతాపంతో ఇబ్బంది పడుతున్న రాష్ట్ర ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలుగుతోంది. వాతావరణంలో చోటుచేసుకున్న పరిణామాల ఫలితంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రంలో మార్చి నెల ఆరంభం నుంచే ఎండ వేడి సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. దీంతో గరిష్ట ఉష్ణోగ్రతలు పలుచోట్ల 40 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. ఏప్రిల్ మూడో వారంలో ఉండాల్సిన ఎండ తీవ్రత మార్చి మొదటి వారంలోనే ఉండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పశ్చిమ గాలులు వీయడంవల్లే వేడి గాలులతో పాటు ఎండ ప్రభావం ఎక్కువైనట్లు విశాఖ వాతావరణ నిపుణులు తెలిపారు. కాగా, మంగళవారం వరకు దక్షిణ కోస్తా, రాయలసీమల కంటే ఉత్తర కోస్తాలో ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఈ నేపథ్యంలో అనూహ్యంగా కోస్తాంధ్రకు ఆనుకుని అధిక పీడనం (యాంటీ సైక్లోన్) ఏర్పడింది. దీనికి తోడు సముద్రం నుంచి తేమ గాలులు వీస్తున్నాయి. ఫలితంగా గరిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఇదిలా ఉంటే.. కాగా, బుధవారం రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా కర్నూలులో 38 డిగ్రీలు, అత్యల్పంగా కళింగపట్నంలో 31.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది.

జైట్లీ పాత పాట: సీపీఎం మధు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యపడదంటూ మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి ప్రకటించడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాజకీయ ఆందోళనలు, ప్రజల సెంటిమెంట్ ఆధారంగా నిధులు కేటాయించలేమని జైట్లీ ప్రకటించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనన్నారు.

తప్పుడు ప్రచారం చేసుకున్నా ఇబ్బంది లేదు

బీజేపీ ఎంపీ కంభంపాటి హరిబాబు వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు, సంస్థల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసినా తమకు వచ్చే ఇబ్బందేమీ లేదని, ఈ ప్రచారాన్ని తిప్పకొట్టేందుకు తమకు ప్రత్యేక వ్యూహాలు ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ కంభంపాటి హరిబాబు అన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను 10 ఏళ్లలో అమలు చేయాల్సి ఉన్నా.. 85 శాతం సంస్థలను మూడున్నరేళ్లలోనే కేంద్రం మంజూరు చేసిందని బుధవారం చెప్పారు. 14వ ఆర్థిక సంఘం ప్రతిపాదలనతో ప్రత్యేక హోదా ఇవ్వలేని పరిస్థితులు ఉన్న నేపథ్యంలో హోదాకు సమానంగా గ్రాంట్స్ ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందన్నారు. ఈఏపీల కింద నిధులు రావడానికి ఆలస్యం అవుతుందని కనుక.. దేశీయ సంస్థల ద్వారా రుణాలు ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కూడా కేంద్రం అంగీకరించిందని చెప్పారు.





సాక్షి

గురువారం, మార్చి, 8

విగ్రహాలపై ఆగ్రహం!

వదంతుల వల్లనో, అనుమానాల వల్లనో మనుషుల్ని కొట్టి చంపుతున్న సంస్కృతి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారవ్యాప్తమై బలపడుతున్న తరుణంలో విగ్రహ విధ్వంసాలు అతి సాధారణమనిపించవచ్చు. కానీ మనమొక ప్రజాస్వామిక వ్యవస్థలో ఉన్నామని... ఈ హత్యలు, విగ్రహ విధ్వంసాలు నాగరిక విలువలకే విరుద్ధమైనవని, అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తాయని గ్రహించినప్పుడు ఆందోళన, ఆవేదనా కలుగుతాయి. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెల్లడైన తర్వాత ఆ రాష్ట్రంలో రెండు మూడురోజుల్లో బీజేపీ కార్యకర్తలు విజయోత్సాహంతో రష్యా విప్లవ నేత లెనిన్ విగ్రహాలను కూల్చారు. కొన్నిచోట్ల సీపీఎం కార్యాలయాలను ధ్వంసం చేశారు. దీనిని చూసి ఉత్సాహపడిన తమిళనాడు బీజేపీ నేత హెచ్. రాజా 'కులోన్మాది పెరియార్ ఇ.వి. రామస్వామి విగ్రహానికి కూడా ఇదే గతి పడుతుంద'ని ఫేస్‌బుక్‌లో హెచ్చరించడం, కొద్దిసేపటికే కొందరు దుండగులు వెల్లూరులో పెరియార్ విగ్రహాన్ని కూల్చడం జరిగిపోయాయి. ఆవేశం తలకెక్కి, విచక్షణ కోల్పోయిన గుంపు ఏదో చేసిందనుకోవడానికి లేకుండా త్రిపుర గవర్నర్ తథాగతరాయ్, పలువురు బీజేపీ నేతలు ఆ ఉదంతాలను సమర్థిస్తూ మాట్లాడిన తీరు విస్మయం కలిగిస్తుంది. ఈ వరస విధ్వంసాలపై ప్రధాని నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. కారకులైనవారిపై కఠిన చర్యలు తీసుకోమని ఆదేశించారు. కానీ ఆ పని మొట్టమొదటి ఉదంతం సమయంలోనే చేసి ఉంటే ఇవి జరిగేవి కాదు. పైగా అలా చేయడం ఘనకార్యమన్నట్టు సీనియర్ నేతలే మాట్లాడటం ఆ ధోరణికి వాయువు తోడైనట్టయింది.

ఈ విధ్వంసానికంతటికీ లక్ష్యంగా మారినవారు వ్యక్తిమాత్రులు కారు. తమ జీవితకాలంలో అందరిపైనా బలమైన ముద్రవేసిన నాయకులు. మార్పు కోసం తపించినవారు. మెరుగైన సమాజానికి పాటుబడినవారు. వారి భావాలతో ఏకీభావం లేకపోవచ్చు. వారెంచుకున్న మార్గాలు సరైనవి కావన్న అభిప్రాయం ఉండొచ్చు. వారి సిద్ధాంతాలు నచ్చకపోవచ్చు. విగ్రహాలను కూల్చివేసినంతమాత్రాన ఆ భావాలు, సిద్ధాంతాలు మటుమాయమవుతాయని మతిమాలిన గుంపు అనుకుంటే అనుకుని ఉండొచ్చు... కానీ బాధ్యతగల పదవుల్లో ఉన్నవారు, నాయకులైన వారు అదే తరహాలో ఆలోచించడం దిగ్భ్రాంతికరం. వీరిలో కొందరైతే లెనిన్ ఈ దేశానికి చేసిందేమిటని ప్రశ్నించారు. ఉగ్రవాది అన్నారు. విదేశీయుడన్నారు. లెనిన్ అయినా, అంతకు చాలాకాలం ముందు మార్క్స్ అయినా మన దేశంపై బ్రిటిష్ వలసవాదుల పెత్తనాన్ని గట్టిగా వ్యతిరేకించారు. వివిధ రూపాల్లో ఇక్కడ జరుగుతున్న పోరాటాలను సమర్థించారు. ప్రసార సాధనాలు అంతగాలేని 1850 సమయంలో కూడా మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో వెల్లువెత్తుతున్న పోరాటాలను అధ్యయనం చేసి వాటిని విశ్లేషించినవాడు మార్క్స్. 1857నాటి సిపాయిల తిరుగుబాటుపై వచ్చిన వార్తల ఆధారంగా అమెరికాకు చెందిన న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్‌లో మార్క్స్, ఏంగెల్స్ పలు వ్యాసాలు రాశారు. 'పూర్ణ స్వరాజ్' కోసం పోరాడాలని 1929 డిసెంబర్ 19న లాహోర్‌లో కాంగ్రెస్ తీర్మానించడానికి పదేళ్లముందే భారతదేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి సాధించాలని అభిలషించినవాడు లెనిన్. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటులో ఎంఎన్ రాయ్‌లాంటి వారికి తోడ్పాటునందించాడు. సమాజానికి వ్యాధిగా పరిణమించిన కులాన్ని నిర్మూలించడానికి, మహిళలకు సమాన హక్కులు సాధించడానికి, హేతువాద దృక్పథాన్ని పెంపొందించడానికి పెరియార్ ఇ.వి. రామస్వామి చేసిన కృషి అసాధారణమైనది. తమిళనాట ఆయన నాయకత్వంలో సాగిన 'ఆత్మగౌరవ పోరాటం' దక్షిణాదినంతటినీ ప్రభావితం చేసింది. నవ భారతం ఏర్పడేనాటికల్లా దేశంలో అసమానతలు పోవాలని ఆయన కలలుకన్నాడు. ఇలాంటివారి విగ్రహాలను ధ్వంసం చేయడం వల్ల ఏం సాధించవచ్చునుకుంటున్నారో అనూహ్యం. ఇదే తరహాలో అడపా దడపా మహాత్మాగాంధీ విగ్రహాలనూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలనూ ధ్వంసం చేసిన వారున్నారు. వాటిని అవమానించిన వారున్నారు. నిరుడు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒక గ్రామంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించడాన్ని నిరోధించడానికి గ్రామ పెద్దలు ప్రయత్నించారు. అందుకోసం అనేక నెలలపాటు దళిత సంఘాలు, పార్టీలు పోరాడ వలసివచ్చింది.

ఇంతకూ త్రిపురలో ఏం జరిగిందని అంత ఉత్సాహం? ఇరవైయ్యేళ్ల సీపీఎం పాలన అంతమై బీజేపీ అధికారంలోకొచ్చింది. పైగా గెలిచిన బీజేపీకి, ఓడిన సీపీఎంకూ మధ్య ఓట్ల వ్యత్యాసం అరశాతం కూడా లేదు. బీజేపీకి 43 శాతం ఓట్లొస్తే... సీపీఎంకు 42.7 శాతం వచ్చాయి. ఆ రాష్ట్రంలో అంతక్రితం కూడా సీపీఎం ఒకసారి ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చుంది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మెజారిటీ సాధించడమే కాక వరసగా ఇరవైయ్యేళ్లు పాలించింది. జనం మెచ్చే రీతిలో పాలన అందించలేనప్పుడు ఓడిపోవడంలో వింతేమీ లేదు. ఆ ఓటమికి మూల కారణాలేమిటో ఓడిన పక్షం విశ్లేషించుకుంటుంది. కొత్తగా అధికారంలో వచ్చిన పార్టీ తానిచ్చిన వాగ్దానాలేమిటో, వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలేమిటో పరిశీలించుకోవాలి. ప్రజల సంక్షేమానికి ఇంకేమి కార్యక్రమాలు చేపట్టాలో నిర్ణయించుకోవాలి. 2014 నాటి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని రీతిలో మెజారిటీ సాధించినప్పుడు ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలనూ గెలుచుకుంది. కానీ మరికొన్ని నెలల్లో ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఊహించని రీతిలో తుడిచిపెట్టుకుపోయింది.

ఎన్నికల్లో గెలవడమే సర్వస్వం అనుకోవడం, విలువలకు తిలోదకాలొదిలి వీరంగం వేయడం ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుంది. గెలిచిన పక్షం ఓడిన పార్టీ కార్యాలయాలనూ, ఆ పార్టీ స్ఫూర్తిదాయకమని భావించేవారి విగ్రహాలనూ ధ్వంసం చేయడం లాంటి పనులకు పాల్పడితే అది అంతిమంగా అరాచకానికి దారి తీస్తుంది. ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతుంది. గెలుపులోనూ హుందాగా ఉండటం ఏ పార్టీ అయినా అలవర్చుకోవాల్సిన మంచి లక్షణం.



మనుషులు చనిపోవచ్చు, జాతులు అంతరించిపోవచ్చు, దేశాలు కూలిపోవచ్చు. కానీ సజీవంగా వెలుగొందేవి భావాలు మాత్రమే.

– జాన్ ఎఫ్ కెన్నడీ
అమెరికా పూర్వ అధ్యక్షుడు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.సప్తమి తె.5.22 వరకు (తెల్లవారితే శుక్రవారం), నక్షత్రం అనూరాధ రా.2.30 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం ఉ.5.02 నుంచి 6.44 వరకు దుర్ముహూర్తం ఉ.10.12 నుంచి 11.01 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.44 వరకు, అమృతఘడియలు ప.3.17 నుంచి 5.00 వరకు.

సూర్యోదయం : 6.20
సూర్యాస్తమయం : 6.04
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.18	మగ్రిబ్	6.24
జొహర్	12.27	ఇషా	7.36
అసర్	4.45		

న్యాయం ఇంకెంత దూరం!



అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేడు



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

'యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రా వైదేవాః' అని మనుసూక్తి. ఎక్కడైతే స్త్రీలను పూజిస్తారో, గౌరవిస్తారో అక్కడ దేవతలుంటారని అర్థం. ఏ దేశం స్త్రీల హక్కులను కాపాడలేదో అది నాగరికతలో ముందుకు పోలేదని అంటారు గాంధీజీ. మహిళ అంటేనే మహితమైనది అని అర్థం. కానీ వాస్తవంలో అలా లేదు. ఇందుకు నిత్యం చూస్తున్న దుర్ఘటనలే తార్కాణం. ప్రతి ఐదు నిమిషాలకు ఒక అత్యాచారం. ప్రతి ఇరవై నిమిషాలకు ఒక గృహహింస ఉదంతం. గంటకొకటి వంతున హత్యాయత్నం. ఇదీ మహిళల దుస్థితి. ఇందులో చిన్నారులు, వృద్ధులు అన్న తేడా లేదు. ఇలాంటి అఘాయిత్యపు సమాజంలోని ఎందరు కీచకులకు శిక్షలు పడుతున్నాయి? ఇదీ సమాధానం దొరకని ప్రశ్నే. 'ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు ఎన్నో మార్పులు వచ్చాయి. అయినా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలలో మాత్రం మార్పులేదు' అని తేల్చింది రామచంద్ర గుహ కమిటీ.

ఏటా జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్త్రీలు చేసిన ఎన్నో త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ఫలితమే. 15,000 మంది శ్రామికవర్గ మహిళలు ఓటు హక్కు కోసం, వేతనాల పెంపు కోసం నినదిస్తూ మార్చి 8, 1908న న్యూయార్క్ నగరంలో కదం తొక్కారు. హక్కుల సాధనలో మైలురాయిగా కనిపించే ఆరోజునే ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గుర్తించింది. మార్చి 25, 1911న న్యూయార్క్ నగరంలోనే మరో దుర్ఘటన జరిగింది. ఒక కర్మాగారంలో అగ్ని ప్రమాదం జరిగి 145 మంది మహిళలు దుర్మరణం పాలయ్యారు. దీనితో అంతర్జాతీయ దినోత్సవాన్ని జరపాలన్న నిర్ణయం మరింత బలపడింది. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, సాంకేతిక, విద్య, వైజ్ఞానిక రంగాలలో స్త్రీలు నిర్వహిస్తున్న పాత్రకు ఈ విధమైన గుర్తింపు సముచితమేనని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం చైర్మన్ రూజ్వెల్ట్ (అమెరికా అధ్యక్షుడు కాదు) వ్యాఖ్యానించారు. ఇక లింగ భేదం లేకుండా అన్ని రంగాలలో సమాన హక్కులు ఉండాలని మానవహక్కుల అంతర్జాతీయ ప్రకటన పేర్కొంటున్నది. అయినా స్త్రీలకు ఏదీ సునాయాసంగా రాలేదు. పోరాటాలతోనే హక్కులు దక్కాయి. ఉదాహరణకు ఓటుహక్కు.

స్వీడన్‌లో 1771–81 మధ్య పన్ను చెల్లించే సంపన్న వర్గాల స్త్రీలకే ఓటు హక్కు ఉండేది. కానీ పోటీ చేసే హక్కు మాత్రం లేదు. ఫ్రాన్స్‌లో మొదటిసారిగా మహిళలకు 1871లో హక్కులు లభించాయి. 1944 వరకు ఓటు హక్కు లేదు. ఎంత వివక్ష! ఆ హక్కు కోసం వారు చేసిన పోరాటం చరిత్రాత్మకం.

లోక్‌సభలో బీజేపీకి తగినంత ఆధిక్యం ఉంది. ఆ పార్టీ ప్రభుత్వం తలుచుకుంటే వస్తుసేవల బిల్లు వలెనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు కూడా సభ చేత ఆమోదముద్ర వేయించగలదు.

న్యూజిలాండ్‌లో 1893లో స్త్రీలకు ఓటు హక్కు ఇచ్చారు. దాని పొరుగునే ఉన్న బ్రిటిష్ వలసదేశం ఆస్ట్రేలియాలో 1902 వరకు ఆ హక్కు లేదు. అమెరికా (1902), నార్వే (1913), డెన్మార్క్ (1915), ఆస్ట్రియా (1919), అర్మేనియా (1921), భారతదేశం (1930–1947), బ్రెజిల్ (1931), చిలీ (1935), జపాన్ (1945), ఇటలీ (1946), అల్జీరియా (1947), చైనా (1947), ఇజ్రాయెల్ (1948), బహమాస్ (1960), అఫ్గానిస్తాన్ (1963), ఇరాక్ (1980) దేశాల మహిళలు ఎన్నో మార్పుల తరువాత ఓటు హక్కు సాధించుకున్నారు. ఇక మిగిలిన హక్కుల విషయంలో చెప్పుకోలేని దుస్థితి.

కానీ ఇలాంటి వాతావరణంలో కూడా ఆశాజనకమైన పరిణామాలు లేక పోలేదు. ఉదాహరణకు రువాండా. ఆ దేశాన్ని మహిళా రాజ్యమని చెప్పవచ్చు. అక్కడి పార్లమెంట్‌లో స్త్రీలకు 56.3 శాతం ప్రాధాన్యం దక్కింది (భారత పార్లమెంట్‌లో అది 9 శాతమే). అక్కడ ప్రధానమంత్రి, స్పీకర్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, పోలీసు విభాగం అధిపతి–అంతా మహిళలే. రువాండా 1962లోనే స్వాతంత్య్రం తెచ్చుకుంది. అయినా మహిళలకు అగ్రస్థానం ఇచ్చి, ఈ విషయంలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

మన దేశంలో మహిళల కోసం ఎన్నో చట్టాలు చేశారు. వాటి అమలులో మాత్రం కనీస శ్రద్ధ కనిపించదు. మహిళలకు పార్లమెంట్‌లో 33 శాతం స్థానాలు కేటాయించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇప్పటికీ పురుషాహంకారం అడ్డుపడుతూనే ఉంది. ఈ బిల్లు కోసం 108వ రాజ్యాంగ సవరణ జరగాలని మా పార్టీ అభిప్రాయం. ప్రస్తుత లోక్‌సభలో బీజేపీకి తగినంత ఆధిక్యం ఉంది. ఆ పార్టీ ప్రభుత్వం తలుచుకుంటే వస్తుసేవల బిల్లును ఆమోదింపజేసినట్టే మహిళా రిజర్వేషన్ బిల్లుకు కూడా సభ చేత ఆమోదముద్ర వేయించగలదు.

మహిళల మీద పెరిగిపోతున్న దాడులను నివారించేందుకు చట్టాలను మరింత పదును పెట్టాలి. రాష్ట్ర మహిళా కమిషన్ చట్ట ప్రకారం నేరాలకు పాల్పడ్డ వారి మీద చర్యలు తీసుకోవడానికి సంస్థకు హక్కు ఉంది. కానీ కొందరు నేతల ప్రమేయం, పోలీసు శాఖ సరిగా స్పందించలేకపోవడం వంటి కారణాలతో ఆ హక్కు ఆచరణలో కనిపించడం లేదు. అందుకే స్వతంత్ర బహుళ సభ్య దర్యాప్తు సంఘం, ప్రాసిక్యూషన్ కమిషన్ ఏర్పాటు చేయాలి. లోకాయుక్త, ఉప లోకాయుక్త చట్టం–1983 ప్రకారం లోకాయుక్త పదవికి కల్పించిన భద్రతను మహిళా కమిషన్‌కు కూడా కల్పించాలి. మహిళలపై జరిగే అఘాయిత్యాలే కాకుండా, హత్య కేసులను కూడా ఈ కమిషన్ పరిధిలోకి తీసుకువస్తే నిర్వహణా భారం తగ్గించవచ్చు. ఇది ఎంత సత్వరం జరిగితే అంత సత్వరం మహిళలకు న్యాయం అందుతుంది. అలాగే ఫాస్ట్ ట్రాక్ కోర్టుల సంఖ్యను పెంచాలి. మహిళలకు పెనుముప్పుగా ఉన్న మద్యపానాన్ని అదుపు చేయడానికి సమగ్ర ఎక్సైజ్ విధానం రావాలి. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన మద్యం పాలసీ అమలులోకి వస్తే చాలా నేరాలకు స్వస్తి చెప్పవచ్చు.

వ్యాసకర్త సాహితీవేత్త, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

యోధులారా! సలామ్..!!





దేవి

స్త్రీలు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లోనూ తమ ఉనికిని నిర్ద్వంద్వంగా చాటుతున్నారు. దీనికి వారు భారీగా మూల్యం చెల్లించవలసి వస్తోంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం... శతాబ్దాల పోరాట గాథల నీరాజనం.

ఆకలితో రగిలి రగిలి హక్కులకై ఎలుగెత్తిన మహిళా గళాల సమ్మేళనం మార్చి 8. కనీస వేతనం, 8 గంటల పని, ఉపాధి హామీ మొదటగా స్త్రీల గొంతుల్లో ఒక్కటిగా చెలరేగిన నినాదాలు. చదువుకునే హక్కు, ఓటు హక్కు డిమాండ్లు వాటి ప్రతిధ్వనులు. 'టైమ్ ఈజ్ నౌ' ఇదే సమయం– గ్రామాల్లో, పట్టణాల్లో మార్పును తీవ్రతరం చేస్తూ సమానత్వం కోసం బాటలు వేస్తున్న మహిళా కార్యకర్తల కృషిని ప్రశంసిస్తూ ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం పిలుపు– ప్రభుత్వాలను ముల్లుగర్రతో పొడిచి కదిలించడం. క్లారాజెట్కిన్‌తో మొదలయ్యి ఐలమ్మ దాకా.. జీవితాల్ని తృణప్రాయంగా అర్పించిన పోరాట యోధులు రాలిపోయేవారు రాలిపోతున్నా రాలేనివారు పక్కకుపోతున్నా ప్రతి మజిలీ కొత్త రక్తాన్ని పొందుతూనే ఉంది. మనదేశంలో ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ రంగంలో స్త్రీల ప్రాధాన్యం బాగా పెరిగింది. వ్యవసాయం ద్వారా ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న మహిళల శాతం 68కి చేరింది. కానీ గ్రామీణ స్త్రీల ఉపాధి 23 శాతానికి పడిపోయింది. వ్యవసాయం వదిలేయక తప్పని స్థితి ఏర్పడుతున్నా స్త్రీలు వేరే దారి లేక సేద్యాన్నే నమ్ముకుంటున్నారు. కౌలుదార్లు గాకుండా స్త్రీలు భూమి సాగు చేస్తున్నారు. కానీ నేటికీ 10–15 శాతం భూమి మాత్రమే స్త్రీల పేరిట ఉంది. కనుక వారికి ప్రభుత్వ రాయితీలు లభించవు. సాగుదార్లుగా ఎటువంటి గుర్తింపు లేనందువల్ల మహిళా రైతుల ఆత్మహత్యలు రైతు ఆత్మహత్యల జాబితాలోకి చేరవు.

అమ్మాయిలు పుట్టడం అనవసరం అనుకునే దేశంలో వారి ఆహారం, ఆరోగ్యం కుటుంబ ప్రాధాన్యతల్లో చివరనే ఉంటాయి. రేషన్ కార్డులుండి చౌకగా ఆహారధాన్యాలు లభించకపోతే దానికి బలయ్యేది మొదటగా బాలికలూ, స్త్రీలే. రేషన్ అందనీయని 'ఎక్స్‌క్లూజన్ ఎర్రర్' 40 శాతం దాకా ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. కనీసం కడుపు నింపడానికి హామీ ఇస్తుందనుకున్న ఆహార భద్రతా చట్టం పేదల ఆకలితో ఆడుకుంటున్నది. 2015–16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ప్రాథమిక స్థాయిలో అసలు బడికి పోని బాలికలు 23 శాతం ఉండగా, మాధ్యమిక స్థాయిలో మానేస్తున్నవారు 46.2 శాతం. కానీ తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు డ్రాపవుట్స్ లేనట్టే వ్యవహరిస్తున్నాయి. ఉన్నత విద్యకు 30 శాతం కూడా చేరడం లేదు. దేశంలో చదువు రాని వారికంటే చదువుకున్న నిరుద్యోగులు అందునా చదువుకున్న మహిళా నిరుద్యోగులు అత్యధికంగా ఉన్నారు.

ఇన్ని ప్రతికూలతలకు తోడు మరొక మిత్తి వచ్చిపడింది. అది ఆదాయ అసమానతలు. అభివృద్ధి చెందిన దేశాల్లో మొత్తంగా ఆదాయ అసమానతలు పెరిగినా స్త్రీపురుషుల వేతన వ్యత్యాసాలు బాగా తగ్గాయని ప్రపంచ అసమానత నివేదిక 2018 పేర్కొంది. కానీ మన దేశం లాంటి దేశాల్లో మాత్రం అవి పెరుగుతూనే ఉన్నాయి. ఐటీ రంగంలో కూడా 22 శాతం వేతన వ్యత్యాసం ఉండటం దీనికి నిదర్శనం.

ఈ అశక్తతల పరిణామాలు స్త్రీలను అన్ని రంగాల్లో బలహీనపరుస్తున్నాయి. మహిళలపై పురుషాధిక్యపు ప్రతికూలత తగ్గకపోగా పెరుగుతున్నదని, ఇది పోవాలంటే ఇంకో 200 ఏళ్లు పడుతుందని ప్రపంచ ఆర్థిక సంస్థ పేర్కొంది. అయినా స్త్రీలు వ్యక్తిగత జీవితాల్లోనూ సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లోనూ తమ ఉనికిని నిర్ద్వంద్వంగా చాటుతున్నారు. ఈ విధంగా చూడటానికి వారు భారీగా మూల్యం చెల్లించవలసి వస్తోంది.

'మీ టూ'అనే ఉద్యమం పనిప్రదేశాల్లో ప్రత్యేకించి హాలీవుడ్ లోని లైంగిక హింసపై గొంతు విప్పే అవకాశం కల్పించింది. దాన్ని అందిపుచ్చుకుని అనేక దేశాల్లో లైంగిక చర్చ ప్రధాన చర్చగా మారింది. పేరు ప్రఖ్యాతులు, బిరుదులు ఉన్న అనేకమంది రాజీనామాలకు దారితీసింది. దాని కొనసాగింపుగా 'టైమ్ ఈజ్ అప్'– సమయం అయిపోయిందనే హెచ్చరిక కూడా ఊపందుకుంది. మన దేశంలో శానిటరీ ప్యాడ్‌ల నుంచి లైంగిక అత్యాచారాల దాకా విభిన్నమైన అంశాలపై ప్రచార కార్యక్రమాలు సామాజిక మాధ్యమాల్లో ఆదరణ పొందుతున్నాయి. ప్రచార ప్రసార మాధ్యమాల్లో ప్రాధాన్యత పెంచుకుంటున్న భావజాల ఉద్యమాలు వాస్తవ జీవితాలను మార్పు చేసే దిశగా ప్రయాణించాలంటే భావాలను ఆచరణలోకి తెచ్చేందుకు సామాన్య మహిళలకు అవగాహన కలిగించే కార్యకర్తలు కీలకం. మాధ్యమాల్లో జరిగే చర్చ అవగాహనకు దోహదపడినా అంతిమంగా మార్పు తేవాల్సింది సామాన్య మహిళలే.

వేతనాలు, ఉపాధి, ఆహార భద్రతలే కాదు.. గృహహింస, పని ప్రదేశాల్లో లైంగిక హింస, ఇంటా బయటా వయసుతో నిమిత్తం లేకుండా జరుగుతున్న లైంగిక దాడులు, పెట్రేగిపోతున్న సెక్స్ అక్రమ రవాణా వంటివి స్త్రీల శారీరక ఆరోగ్యానికే కాక మానసిక ఆరోగ్యానికి హానికరంగా మారాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్నది. రానున్న కాలంలో అతిపెద్ద ఆరోగ్య సమస్యలు హింస కారణంగా ఏర్పడేవి మొదటి స్థానంలో ఉంటే, బండచాకిరి వలన 'అలసట' రెండో ప్రధాన ఆరోగ్య సమస్యగా మహిళలు ఎదుర్కోవలసి వస్తోంది. ఏదయినా ఆ మహిళల హక్కులను కాపాడాలని వారికి అండగా నిలబడటం వలన వారి పని తీరు మంచి ఫలితాల్నిస్తుందని తేలింది. కానీ మన దేశంలో పదే పదే వినిపించే ప్రశ్న ఏదంటే.. ప్రైవేట్ సంస్థలు అటుంచితే ఎన్ని ప్రభుత్వ సంస్థల్లో నిజంగా పనిచేసే లైంగిక వేధింపుల కమిటీలు ఉన్నాయి? తన చట్టాలను తాను పాటిస్తూ ప్రైవేట్ సంస్థలతో కచ్చితంగా వాటిని పాటించేలా చేయడం ప్రభుత్వాల బాధ్యత. అంతర్జాతీయ మహిళా దినోత్సవం గత ఏడాది సాధించిన దాన్ని బేరీజు వేసుకుని రానున్న కాలానికి ప్రాధమ్యాలు నిర్దేశించుకునే రోజు. ఏడాది పొడవునా తీవ్రతరం చేయాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేసుకునే రోజు అంటే మార్చి 8 స్ఫూర్తి ఏడాదంతా కొనసాగుతూనే ఉంటుంది.

వ్యాసకర్త సాంస్కృతిక కార్యకర్త | ఈ–మెయిల్ : pa_devi@rediffmail.com

ఆకాశంలో సగం అవమానాలు ఘనం

1991 నుంచి అమలవుతున్న ప్రపంచీకరణ మూలంగా పాశ్చాత్య సంస్కృతి పెచ్చరిల్లి స్త్రీ శరీరం సరకుగా, అంగడి బొమ్మగా, విలాస వస్తువుగా మారిన కారణంగా లైంగిక హింస పెరిగింది. దీంతో మన దేశంలో ప్రతి గంటకు నలుగురిపై అత్యాచారం జరుగుతోంది.

ఉదయాన్నే లేచి పేపరు చదవగానే చెత్త కుప్పలో ఆడశిశువులు.. మైనర్ బాలికలపై స్వయాన తండ్రి, అన్న వరుస అయ్యే మగ మృగాల అత్యాచారాలు.. వరకట్న హత్యలు, ప్రేమను నిరాకరించినందుకు యాసిడ్ దాడులు, కత్తిపోటు దాడులు నిత్యకృత్యమై స్త్రీలపై హింస రకరకాల రూపంలో పెరిగిపోతూ ఉంది. ఇవి ఎందుకు జరుగుతున్నాయి. ముందుతరాల వారికి హింస లేని సమాజాన్ని అందించలేమా? ఆకాశంలో సగమైన స్త్రీలు, శ్రమ ఉత్పత్తిలో సగానికి తక్కువేమీ కాదు. కానీ కడుపులోని బిడ్డను కనాలన్నా, తాను ఎంత వరకు చదువుకోవాలన్నా, ఎలా జీవించాలన్నా నిర్ణయించుకునే స్వేచ్ఛ మాత్రం స్త్రీకి లేదు. స్త్రీ నడకపై, నడతపై, నవ్వుపై ఆంక్షలు. స్త్రీలంటేనే చిన్నచూపు. వివక్షత, తను ఎప్పుడూ మగవాడి కనుసన్నల్లోనే జీవించాలి. ఇలా మహిళను జీవితకాల బందీని చేయడం ఈ సమాజం మొదటినేరం. చివరకు మన చరిత్ర, సంస్కృతిలో కూడా కార్యేషు దాసి అంటూ స్త్రీని పురుషునికి సొంత ఆస్తిగా చూపిస్తూ పితృస్వామ్యాన్ని వ్యవస్థీకృతం చేశారు. ఈ పరిస్థితి మారాలి. స్త్రీని కనీసం మనిషిగా చూసే మనుషులున్న సమాజాన్ని ఆవిష్కరించే కృషి అందరూ చేయాలి.

అమలుకు నోచుకోని చట్టాల కారణంగా స్త్రీలపై కుటుంబ హింస, లైంగిక హింస, రాజ్యహింస రోజురోజుకు పెరుగుతున్నాయి. హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆడ, మగ తేడా లేకుండా ఆస్తిలో సమాన హక్కు ఇచ్చారు. కానీ ఏ కుటుంబంలోనూ మహిళలకు ఆస్తిలో వాటా ఇవ్వడం లేదు. అయిదు దశాబ్దాలక్రితమే వరకట్న నిషేధ చట్టం వచ్చినప్పటికీ, ఈ దురాచారం నేటికీ గౌరవంగా అమలవుతూ పెళ్లి తంతు పేరిట వ్యాపారంగా మారి మహిళల పట్ల శాపంగా పరిణమించింది. వరకట్న దురాచారం వల్లే భ్రూణ హత్యలు పెరుగుతున్నాయి. గర్భస్త శిశు పరీక్ష నియంత్రణ చట్టం వచ్చినా దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తల్లిదండ్రులకు కానీ, డాక్టర్లకు కూడా ఒక్క సందర్భంలో కూడా శిక్ష పడిన ఘటన లేదు. కనీసం కేసులు కూడా నమోదు కావడం లేదు. ఆడ పిల్లలు లేకుండా కొత్త సహస్రాబ్దిలోకి మానవజాతి అడుగుపెట్ట బోతున్నట్లు ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఇది ప్రమాదకరమే కాదు.. ప్రకృతి సహజ న్యాయ సూత్రాలకు కూడా విరుద్ధం. తక్కిన ప్రపంచంలో మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎక్కువమంది బతుకుతుంటే, మనదేశంలో పురుషులతో పోలిస్తే స్త్రీల సంఖ్య తక్కువగా ఉంటోంది. చట్టాల్లోని లొసుగుల కారణంగా ఆడపిండాలను గుర్తించి మొగ్గలోనే తుంచివేస్తున్నారు. డయాగ్నొస్టిక్ పరీక్షా కేంద్రాలు ఆడపిల్లల పట్ల మృత్యు పంజాలుగా మారాయి

1991 నుంచి అమలవుతున్న ప్రపంచీకరణ మూలంగా పాశ్చాత్య విష సంస్కృతి పెచ్చరిల్లి స్త్రీ శరీరం సరుకుగా, అంగడిబొమ్మగా, విలాస వస్తువుగా మారిన కారణంగా లైంగిక హింస పెరిగిపోయింది. దీంతో మన దేశంలో ప్రతి గంటకు నలుగురిపై అత్యాచారం జరుగుతోందని జాతీయ నేర గణాంకాల నివేదికలు చెబుతున్నాయి. అభివృద్ధి చెందిన నగరాలు, పట్టణాల్లోనే ఇవి ఎక్కువగా జరగటం విశేషం. ఢిల్లీలో నిర్భయ, విజయవాడలో ఆయేషా మీరా అత్యాచార ఘటనలు దీనికి ఉదాహరణలు. కన్నబిడ్డల్ని చిన్న పిల్లలను, గర్భిణీ స్త్రీలను, మతిస్థిమితం లేనివారినీ, చివరకు ముసలివారిని కూడా వదిలిపెట్టడం లేదు. బుల్లితెరలో సీరియల్స్‌లో మహిళలనే విలన్లుగా చూపుతున్నారు.

సినిమాల్లో హీరోయిన్లను అర్ధనగ్నంగా, ఆత్మగౌరవం లేనివారిగానూ, హీరోలను జులాయిలుగా, అమ్మాయిలని వేధించడమే వారికి తెలిసిన ప్రేమగా చూపుతున్నారు. మానవ సంబంధాలు మొత్తంగా మార్కెట్ సంబంధాలుగా మారి మానవ విలువలు పడిపోతున్న పరిస్థితిని నిలువరించాల్సిన పాలకులు దానికి భిన్నంగా బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్ శక్తులకు అమ్ముడుపోయి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. ఇక చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందలేక దుమ్ముకొట్టుకు పోతోంది. ఎక్కడైనా మహిళలు చట్టసభలకు ఎన్నికైతే మనదేశంలో పంచాయతీ రాజ్ అనుభవమే పునరావృతమవుతుంది. రాజకీయ, చట్ట వ్యవస్థలలోనూ స్త్రీలు డమ్మీలుగా మిగిలిపోగలరు.

ప్రజా ఉద్యమాల ఫలితంగా యూపీఏ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన నిర్భయ చట్టం 2013లో అమల్లోకి వచ్చినా స్త్రీలపై హింసాత్మక చర్యలు ఆగడం లేదు. అత్యాచారాలు పెరిగిపోతున్నాయే కానీ తగ్గటం లేదు. నేటి వివాహ వ్యవస్థ ద్వారా ఏర్పడే కుటుంబం స్త్రీలపై తీవ్రమైన అణచివేతను ప్రయోగిస్తోంది. భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాధాన్యతగల వివాహం, కుటుంబ వ్యవస్థ మార్కెట్ సరుకుగా మారిపోవటంతో జీవితాలు సామాజిక సంబంధాలు విచ్ఛిన్నమౌతున్నాయి. ఈ స్థితి సమాజంపై తీవ్ర ప్రభావాన్నీ చూపుతుంది. పురుషుల దృక్పథం మార్చివేసే మంచి విద్యా విధానం నైతిక విద్య నేడు అవసరం. తద్వారా మంచి మానవ సంబంధాలకు ఉన్న అడ్డంకులను తొలగించుకోవచ్చు. సంపూర్ణ సమానత్వం, ప్రేమ పంచుకోవటం ప్రాతిపదికగా మంచి కుటుంబాన్ని నిర్మించుకోవచ్చు.

స్త్రీని విముక్తి చేసి పురుషుడిని ఉన్నతీకరించాలి. పితృస్వామ్యానికి మూలం ఆర్థిక అసమానతలు. ఆర్థిక అసమానతలకు మూలం పెట్టుబడిదారీ మార్కెట్ ఉత్పత్తి విధానం. దీనిని మార్చటానికి సమసమాజ నిర్మాణం జరగాలి. సామాజిక ఉత్పత్తితో శ్రమ విముక్తి జరిగి స్త్రీల భాగస్వామ్యం పెరిగి వారి విముక్తికి దారి తీస్తుంది. ఆ దిశగా సామాజిక నిర్మాణం జరగాలి. ఇదే స్త్రీ విముక్తికి, అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం.

లింగంగుంట్ల గజేంద్రమ్మ, ఉపాధ్యాయురాలు, కారంపూడి

పోరాటాలే హక్కులకు స్ఫూర్తి

మహిళా పార్లమెంటనీ, 'షీ టీమ్స్' అనీ ఆర్భాట ప్రచారహోరు తప్ప మహిళలకు ఒరిగిందేమీ లేదు. అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగాయి. విశాఖలో పట్టపగలే రోడ్డుమీదే అత్యాచారాలు జరిగే స్థాయికి దిగజారింది.



రాధ

మార్చి8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా పాటించడం ఆరంభించి శతాబ్ద కాలం పూర్తయినా నేటికీ ఇంటిపని, వంటపని పిల్లల చాకిరీ మహిళలదే. ప్రైవేటు, అసంఘటిత రంగాలలో ఎక్కువ పని, ఏదోస్థాయిలో గృహహింసకు లోనుకాని మహిళ లేదంటే అతిశయోక్తికాదు.

అంతంతమాత్రం అమలవుతున్న గృహహింస వ్యతిరేకచట్టం 498Aను నీరుకార్చే ప్రయత్నం చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు. ఇటీవల 2017 జులైలో భార్యలపై కూడా 498A చట్టాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. వరకట్న నిషేధ చట్టం, బాల్య వివాహాల చట్టం, నిర్భయ చట్టం.. మహిళా చట్టాలు ఎన్నివున్నా ఆచరణలో శూన్యం.

మన పాలకులు ఎన్నికలముందు ఎన్నో వాగ్దానాలు, హామీలు గుప్పిస్తారు. మన బతుకులు మారిపోయినట్టు కలగనమంటారు. మనరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను పరిశీలిస్తే మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తానని, బెల్టుషాపులను రద్దుచేస్తానని ప్రమాణస్వీకారం నాడు సంతకంచేసి, ప్రతియేటా మద్యం అమ్మకాల టార్గెట్లు పెంచుతూ మహిళల కన్నీళ్ళను సొమ్ము చేసుకుంటున్నాడు. ఆడబిడ్డల కోసం బ్యాంకు తాకట్టులో వున్న బంగారం బయటకి తెస్తానన్నాడు, డ్వాక్రా రుణాలన్నీ పూర్తిగా మాఫీ చేస్తానన్నాడు. అది నమ్మి ఓటువేస్తే అధిక వడ్డీలతో వాళ్ళ నడ్డి విరిచారు.

అంగన్‌వాడీ టీచర్ల, ఆశావర్కర్ల, మున్సిపల్, విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదు. మహిళా పార్లమెంటనీ, 'షీ టీమ్స్' అనీ ఆర్భాట ప్రచారహోరు తప్ప మహిళలకు ఒరిగిందేమిలేదు. అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగాయి. విశాఖలో పట్టపగలే రోడ్డుమీదే అత్యాచారాలు జరిగే స్థాయికి దిగజారింది. విశాఖదగ్గర దళిత మహిళలను బట్టలూడదీసి కొట్టారు. చంద్ర బాబు హయాంలోనే గరగపర్రు, పెదగొట్టిపాడు, ఆగిరిపల్లి దళితులపై దాడులు పెరిగాయి.



ప్రధాని నరేంద్ర మోదీ జనాన్ని ఒక ప్రక్క మతం మత్తులో ముంచి, ఇంకోవైపు మద్యం, పబ్, రిసార్ట్, స్టార్ కల్చర్‌ను పెంచి, నెట్ ద్వారా అశ్లీలతను విచ్చలవిడిగా అందుబాటులోకి తెచ్చి యువత మెదళ్ళను మారుస్తున్నాడు. ''బేటీబచావో–బేటీపడావో'' అంటూనే రక్షణ అడిగిన బెనారస్ యూనివర్సిటీ అమ్మాయిలపై లాఠీఛార్జీ చేయించారు. మనుధర్మశాస్త్రం, స్త్రీలు చదువుకోగూడదనీ, కులమతాలను పాటించాలని బోధిస్తుంది. దీని ప్రకారమే మోదీ పాలన నడుస్తున్నది. దేశాన్ని ప్రేమించడమంటే దేశ అభివృద్ధి కోసం, సమ సమాజం కోసం కృషి చేయడమే. మార్చి 8 శ్రామిక మహిళల స్ఫూర్తితో హక్కులకై నిలదీద్దాం, సంఘటిత పోరాటాలను చేద్దాం. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందాం.

వ్యాసకర్త చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోశాధికారి

నేడే మహిళల పండుగ



న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల ప్రజలు ప్రపంచ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకోనున్నారు. ఈ ఏడాదికి మహిళా దినోత్సవం ఇతివృత్తంగా 'ప్రెస్ ఫర్ ప్రోగ్రెస్' (ప్రగతి కోసం పట్టుబట్టండి) నినాదాన్ని ఐక్యరాజ్య సమితి ఖరారు చేసింది. గత కొన్నేళ్లుగా స్త్రీలు అనేక రంగాల్లో పరుషులతో సమానంగా రాణిస్తున్నప్పటికీ ఇంకా ఆడ–మగ తారతమ్యాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా ప్రస్తావించి పురుషులతో సమానంగా హక్కులు సాధించే లక్ష్యంతో ఈ నినాదాన్ని ఎంపిక చేశారు. 1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8ని మహిళా దినోత్సవంగా ప్రకటించింది. అయితే దీనికి ఎన్నో ఏళ్ల ముందు నుంచి కూడా అనేక దేశాల్లో మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. తొలిసారిగా అమెరికాలో 1909లో ఫిబ్రవరి 28ని మహిళా దినోత్సవంగా పాటించారు.

బుధవారం ఢిల్లీలో పార్లమెంటు ప్రాంగణంలో రక్షణ విధులు నిర్వర్తిస్తున్న ఢిల్లీ పోలీసు మహిళా కమెండో

- ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లోనే అమలవుతున్న 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకం విస్తరణకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం రాజస్తాన్‌లో ప్రధాని మోదీ శ్రీకారం చుట్టనున్నారు.



థానేలో నిర్వహించిన ఫ్యాషన్ షోలో ర్యాంప్‌పై నడిచిన 'యాసిడ్ దాడి' బాధితులు. 'యాసిడ్ అమ్మకాలు నిలిపేయాలి' అనే ఉద్యమంలో భాగంగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఫస్ట్ కంబాట్ ఆఫీసర్‌గా ప్రకృతి



న్యూఢిల్లీ: ఈ యువతి పేరు ప్రకృతి. ఐటీబీపీ చరిత్రలోనే తొలిసారిగా నేరుగా కంబాట్ అధికారిణిగా ఎంపికయ్యారు. బిహార్‌లోని సమస్తీపూర్ జిల్లా ఈమె స్వస్థలం. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్) కోసం 2016లో యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో పాతికేళ్ల ప్రకృతి మాత్రమే కంబాట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. పరీక్ష రాసిన తొలి ప్రయత్నంలోనే విజయం సాధించి తన కల నిజం చేసుకున్నారు. 'యూనిఫామ్ ధరించి దేశ సేవ చేయాలనేది నా కోరిక. మా నాన్న భారత వైమానిక దళంలో పనిచేస్తున్నారు. ఆయనే నాకు స్ఫూర్తి. ఐటీబీపీ యుద్ధక్షేత్రంలో అధికారులుగా మహిళలను ఎంపికచేయబోతున్నట్లు 2016 మార్చిలో ఓ పత్రికలో చదివా. యూపీఎస్సీ పరీక్షలో నెగ్గితే ఐటీబీపీలో చేరాలని అప్పుడు నిర్ణయించుకున్నా' అని ప్రకృతి మీడియాతో చెప్పారు. ప్రకృతి బీటెక్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. ప్రస్తుతం పితోర్‌గఢ్‌లోని ఐటీబీపీ యూనిట్‌లో సేవలందిస్తున్నారు. ఐటీబీపీలో మహిళలున్నప్పటికీ వారంతా కానిస్టేబుల్ హోదావాళ్లే.

వేడెక్కుతున్న 'విగ్రహ' రాజకీయం

- యూపీలో అంబేడ్కర్, తమిళనాడులో పెరియార్, కోల్‌కతాలో శ్యామా ప్రసాద్ విగ్రహాల ధ్వంసం
- ఖండించిన ప్రధాని మోదీ, అమిత్ షా
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- బెంగాల్, తమిళనాడుల్లో నిరసనలు



కోల్‌కతాలో దెబ్బతిన్న ముఖర్జీ విగ్రహంపై నల్లరంగును తొలగిస్తున్న దృశ్యం.



వెల్లూర్‌లో ధ్వంసమైన పెరియార్ విగ్రహం

కోల్‌కతా/లక్నో/చెన్నై: దేశవ్యాప్తంగా విగ్రహాల ధ్వంసం ఘటనలు సంచలనం సృష్టిస్తున్నాయి. మంగళవారం త్రిపురలో లెనిన్ విగ్రహం ధ్వంసం.. తర్వాత తమిళనాడులో పెరియార్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటనలపై చర్చ జరుగుతుండగానే.. యూపీలోని మీరట్ జిల్లాలో అంబేడ్కర్, కోల్‌కతాలో శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహాలు ధ్వంసమయ్యాయి. దీంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ విగ్రహాల ధ్వంసం ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ చీఫ్ అమిత్ షా తీవ్రంగా ఖండించారు. బాధ్యులు ఏ పార్టీ వారైనా కఠినంగా వ్యవహరించాలన్నారు.

శ్యామాప్రసాద్.. అంబేడ్కర్

త్రిపురలో లెనిన్ విగ్రహ ధ్వంసానికి ప్రతీకారంగా కోల్‌కతాలో వామపక్ష పార్టీ కార్యకర్తలు కొందరు భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం ఏడుగురు యువకులు నల్లరంగు పులిమారు. అనంతరం విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న స్థానికులు ఈ విషయాన్ని గమనించి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అరెస్టు చేసిన ఏడుగురిలో ఓ మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 'ఈ ఘటనకు పాల్పడిన వారంతా 'రాడికల్' పేరుతో పనిచేసే వామపక్ష భావజాల సంస్థకు చెందినవారు. దీన్ని చాలా తీవ్రమైన ఘటనగా పరిగణిస్తున్నాం' అని కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఈ ఘటనలపై కోల్‌కతాలో బీజేపీ ఆందోళనలు నిర్వహించింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లా ఖుర్ద్ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు భారత రత్న అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

ఏ పార్టీవారైనా శిక్షించండి: మోదీ

దేశవ్యాప్తంగా జరుగుతున్న విగ్రహధ్వంసం ఘటనలపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడిన మోదీ.. విధ్వంసానికి పాల్పడినవారు ఏ పార్టీ వారైనా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. అటు, విగ్రహ ధ్వంసాన్ని సీరియస్‌గా తీసుకోవాలని.. ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచించింది. బీజేపీ చీఫ్ అమిత్ షా కూడా లెనిన్, పెరియార్ విగ్రహాల ధ్వంసాన్ని దురదృష్టకర ఘటనగా పేర్కొన్నారు. 'విగ్రహాలను పడగొట్టడం దురదృష్టకరం. మా పార్టీ వీటికి ఎప్పుడూ మద్దతు పలకదు. తమిళనాడు, త్రిపురల్లో పార్టీ నేతలతో మాట్లాడాను. ఈ విగ్రహాల ధ్వంసంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నట్లు తెలిస్తే కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించాను' అని షా స్పష్టం చేశారు. పెరియార్ విగ్రహ ధ్వంసాన్ని ప్రేరేపించినట్లుగా భావిస్తున్న తమిళనాడు బీజేపీ నేత, బీజేపీ జాతీయ కార్యదర్శి హెచ్ రాజా ఫేస్‌బుక్ కామెంట్లపై అమిత్ షా స్పందిస్తూ.. 'రాజాపై ఎలాంటి చర్యలు ఉండవు' అని వెల్లడించారు. పెరియార్ విగ్రహానికి సంబంధించి బీజేపీ కార్యకర్త ఆర్ ముత్తురామన్‌ను పార్టీనుంచి బీజేపీ తొలగించింది.

తమిళనాట నిరసనలు

రాజా క్షమాపణలు చెప్పినా తమిళనాడు రాజకీయ పార్టీలు, పెరియార్ అభిమాన సంఘాలు బీజేపీకి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించాయి. ప్రతిపక్ష డీఎంకే, పలు తమిళ సంఘాలు ఈ ఆందోళనల్లో పాల్గొన్నాయి. చెన్నై, కడలూర్, సేలం తదితర ప్రాంతాల్లో రాజా విగ్రహాలను నిరసనకారులు ధ్వంసం చేశారు. చెన్నైలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించిన పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. అటు కోయంబత్తూరులో బీజేపీ కార్యాలయంపై బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. కావేరీ వివాదాన్ని పక్కదారి పట్టించేందుకే విగ్రహ రాజకీయాలను తెరపైకి తెచ్చి ఉంటారని కమల్ హాసన్ అభిప్రాయపడ్డారు.

ఇదీ విగ్రహ ధ్వంస చరిత్ర!

రాజకీయ నాయకులు, సిద్ధాంతకర్తలు, సంఘ సంస్కర్తల విగ్రహాల విధ్వంసం ఈనాటిది కాదు. మతపరమైన విగ్రహాలు, పూజా స్థలాలను ధ్వంసం చేయడం వేల ఏళ్ల క్రితమే క్రితమే జరిగిందని చరిత్ర చెబుతోంది. కొత్త పాలకులు అధికారంలోకి వచ్చినప్పుడు ఓడిపోయిన నేతల చిత్రాలు, విగ్రహాలు, వారి అధికారం, సిద్ధాంతాల చిహ్నాలను పగలగొట్టడం ఫ్రెంచి విప్లవంలో విస్తృతంగా జరిగింది. 1960వ దశకం చివర్లో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమకాలంలో పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యంగా కోల్‌కతాలో రాజారామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి సంఘసంస్కర్తలు, గాంధీ, నెహ్రూ, బోస్ వంటి స్వాతంత్ర్యసమరయోధుల విగ్రహాలను ధ్వంసం చేయడం సంచలనం సృష్టించింది. గాంధీ, అంబేడ్కర్, నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలపై దాడుల వార్తలు అప్పుడప్పుడు చూస్తూనే ఉన్నాం.

కూలిన లెనిన్, స్టాలిన్ విగ్రహాలు

1991 జూన్–డిసెంబర్ మధ్య జరిగిన పరిణామాలతో సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమై కమ్యూనిస్ట్ పాలన ముగిసినప్పుడు రాజధాని మాస్కో, పోలండ్, బల్గేరియా వంటి తూర్పు ఐరోపా దేశాల్లోనూ లెనిన్, స్టాలిన్‌ల భారీ విగ్రహాలను కూల్చివేశారు.

జంధ్యాలు తెంచేశారు


చెన్నైలోని మైలాపూర్ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్న 8 మంది వ్యక్తులను డీవీకే (ద్రవిడార్ విదుత్తలై కళగం) కార్యకర్తలు అటకాయించారు. వీరిని బెదిరించి.. మెడలో వేసుకున జంధ్యాలను బలవంతంగా తెంచేశారు. అనంతరం పెరియార్ అనుకూల నినాదాలు చేస్తూ ద్విచక్రవాహనాలపై వెళ్లిపోయారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయనప్పటికీ.. ప్రత్యక్ష సాక్షుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు డీవీకే కార్యకర్తలు రాయపేట పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు.

'నీట్'కు ఆధార్ తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: నీట్–2018, ఇతర ఆలిండియా పరీక్షలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఆధార్ నంబర్ తప్పనిసరి చేయొద్దని సీబీఎస్ఈకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సీబీఎస్ఈ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాతో కూడిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. నీట్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ నంబర్ తప్పనిసరిగా సమర్పించాలన్న సీబీఎస్ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను గతంలో గుజరాత్ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన అప్పీల్ పిటిషన్‌పై బుధవారం వాదనలు జరిగాయి. వాదనల సందర్భంగా నీట్–2018కి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల నుంచి ఆధార్ వివరాలు సేకరించే అధికారం సీబీఎస్ఈకి లేదని యూఐడీఏఐ కోర్టుకి తెలిపింది. దీంతో నీట్ దరఖాస్తుదారులకు ఆధార్ తప్పనిసరి చేయొద్దని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

బ్యాలెట్ పేపర్లే ముద్దు: ట్రంప్



వాషింగ్టన్: ఎన్నికల్లో వివాదాలు తలెత్తకుండా ఉండాలంటే బ్యాలెట్ విధానమే సరైందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం ఉందన్న ఆరోపణలకు బ్యాలెట్ పేపర్లే సమాధానం చెబుతాయని వ్యాఖ్యానించారు. ఇది పాత విధానమే అయినప్పటికీ పెద్దపెద్ద కంప్యూటర్లతో పరిష్కారం కాని సమస్య, కేవలం బ్యాలెట్ పేపర్లను వాడితే తీరుతుందన్నారు. ఈ విధానం ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో అమల్లో ఉందనీ, అధ్యక్ష ఎన్నికల్లోనూ తీసుకువచ్చేందుకు హోంలాండ్ సెక్యూరిటీ తదితర భద్రతా సంస్థలు తీవ్రంగా ఆలోచన చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ పద్ధతి అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

యూపీ నుంచి రాజ్యసభకు జైట్లీ



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈసారి ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీచేయనున్నారు. పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మధ్యప్రదేశ్ నుంచి బరిలో నిలవనున్నట్లు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం జైట్లీ గుజరాత్‌కు, ప్రధాన్ బిహార్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో పోటీచేయనున్న పలువురు కేంద్ర మంత్రులు, ఒక పార్టీ ప్రధాన కార్యదర్శి జాబితాను కమిటీ విడుదలచేసింది. జైట్లీ, ప్రధాన్ కాకుండా మిగిలినవారు (కేంద్ర మంత్రులు థావర్‌చంద్ గెహ్లాట్ – మధ్యప్రదేశ్, రవిశంకర్ ప్రసాద్ – బిహార్, జేపీ నడ్డా – హిమాచల్ ప్రదేశ్, పురుషోత్తం రూపాలా, మనసుఖ్ మాండవీయా – గుజరాత్) గతంలో పోటీచేసిన రాష్ట్రాలనుంచే బరిలో ఉంటారు. మహారాష్ట్ర నుంచి కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ పోటీచేయనున్నారు.

కూచిభొట్ల కేసులో నిందితుడి నేరాంగీకారం



వాషింగ్టన్: భారతీయ ఇంజనీర్ శ్రీనివాస్ కూచిభొట్ల హత్య కేసు విచారణ త్వరలో ముగియనుంది. ఈ నేరానికి పాల్పడినట్లు మాజీ నేవీ ఉద్యోగి ప్యూరింటన్ అంగీకరించటంతో అతనికి యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశాలున్నాయి. గత ఏడాది ఫిబ్రవరి 22న శ్రీనివాస్ తన స్నేహితుడు అలోక్ మాడసానితో కలిసి బార్‌లో ఉండగా ప్యూరింటన్(52) జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ తుపాకీతో వారిపైకి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో గాయపడిన శ్రీనివాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన సంగతి తెలిసిందే. దర్యాప్తు అధికారులు పూర్తి ఆధారాలు సమర్పించటంతో తాజాగా జరిగిన విచారణలో తానే ఈ నేరానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీనిపై జడ్జి చార్లెస్ డ్రోగ్ మాట్లాడుతూ..ప్యూరింటన్‌కు హత్యా నేరం కింద జీవిత కాల జైలు శిక్ష, హత్యాయత్నానికి 12 నుంచి 54 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముందని చెప్పారు. అయితే, విద్వేషపూరిత నేరం రుజువైతే అదనంగా మరో శిక్ష ఉంటుందని తెలిపారు. తాజా పరిణామాన్ని శ్రీనివాస్ భార్య సునయన స్వాగతించారు. 'ఈ తీర్పుతో శ్రీనివాస్‌ను తిరిగి పొందలేను. కానీ, విద్వేషపూరిత నేరాలకు పాల్పడే వారికి ఇది ఒక హెచ్చరిక' అని పేర్కొన్నారు. మే 4వ తేదీన కోర్టు శిక్ష ఖరారు చేయనుంది.

సిరంజీపై 1000% లాభం

జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సిరంజీలు, సూదులు వంటి వైద్య పరికరాలను వేయి శాతానికి పైగా లాభంతో విక్రయిస్తున్నారు. పంపిణీదారుడి మార్జిన్లు మినహాయిస్తే అంతిమంగా భారం మోస్తున్నది వినియోగదారుడే. తయారీదారులు, ఎగుమతిదారుల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, సిరంజీలు, సూదుల లాభాల మార్జిన్లపై జాతీయ ఔషధ ధరల నిర్ధారణ సంస్థ(ఎన్‌పీపీఏ) ఈ విషయాలను వెలుగులోకి తెచ్చింది. సూదితో కూడిన 5 ఎంఎల్ హైపోడెర్మిక్ డిస్పోజబుల్ సిరంజీ తయారీ ధర రూ. 2.31. కానీ పంపిణీదారుడికి చేరే సరికి దాని ధర రూ. 13.08 (1251శాతం అధికం) అవుతోంది. సూదిలేని 50 ఎంఎల్ హైపోడెర్మిక్ డిస్పోజిబుల్ సిరంజీ ధర పంపిణీదారుడి వద్దకు వచ్చే సరికి రూ.16.96 కాగా, వినియోగదారుడికి అమ్మే గరిష్ట చిల్లర ధర రూ.97గా(సుమారు 1249 శాతం లాభం) ఉంటోంది. సూదితో కలిపి 1 ఎంఎల్ ఇన్సులిన్ సిరంజీని తయారీ ధరకంటే 400 శాతం అధిక ధరకు అమ్ముతున్నారు. అలాగే సూది లేని 1 ఎంఎల్ ఇన్సులిన్ సిరంజీని తయారీ ధర కన్నా 287 శాతం అధిక ధరకు విక్రయిస్తున్నారు. డిస్పోజబుల్ సూదిపై గరిష్ట మార్జిన్ 789 శాతంగా ఉంది. సూదుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రాజీవ్‌నాథ్ స్పందిస్తూ.. 'అధిక మార్జిన్లు నిజమే. ఆయా కంపెనీల మధ్య అనారోగ్య పోటీయే దీనికి కారణం' అని అన్నారు.

7 శాతానికి పెరిగిన డీఏ

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రయోజనం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కరువు భత్యం (డీఏ), కరువు సాయం (డీఆర్)ను 2 శాతం పెంచుతూ మంత్రివర్గం బుధవారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 5 శాతం ఉన్న డీఏ, డీఆర్‌లను 7 శాతానికి పెంచి ఈ ఏడాది జనవరి నుంచే ఆ ప్రయోజనాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. దీంతో 1.1 కోట్లమంది కేంద్ర ఉద్యోగులు, పింఛనుదారులకు లబ్ధి కలగనుంది. 'ధరల పెరుగుదలను తట్టుకునేందుకు డీఏ, డీఆర్‌లను మూలవేతనం/పింఛనుపై 7 శాతానికి పెంచాలని ప్రధాని మోదీ నేతృత్వంలోని కేబినెట్ నిర్ణయించింది' అని ప్రభుత్వం తెలిపింది. దీంతో ఖజానాపై ఏడాదికి రూ.6,077 కోట్ల అధిక భారం పడనుంది.

మూడో రోజూ నిరసనలే..

పార్లమెంట్‌లో కొనసాగుతున్న వివిధ పార్టీల ఆందోళనలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగే సూచనలు కనిపించడం లేదు. వరుసగా మూడోరోజూ ఉభయ సభలు ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదా పడ్డాయి. ప్రతిపక్షాలతో పాటు ఎన్‌డీఏలోని మిత్రపక్షాలైన శివసేన, టీడీపీ, అన్నాడీఎంకే వివిధ అంశాలపై లోక్‌సభ, రాజ్యసభల్లో ఆందోళనకు దిగాయి.

అట్టుడికిన లోక్‌సభ..

బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, శివ సేన, టీఆర్‌ఎస్, అన్నాడీఎంకే, తృణ మూల్ కాంగ్రెస్ తదితర పార్టీలన్నీ వివిధ అంశాలపై నినాదాలతో హోరెత్తించాయి. విగ్రహాల ధ్వంసం, బ్యాంకింగ్ కుంభకోణం, ఏపీకి ప్రత్యేక హోదా, రిజర్వేషన్లు తదితర అంశాలపై నిరసనకు దిగాయి. రూ. 13 వేల కోట్ల బ్యాంకింగ్ కుంభకోణంపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అన్నాడీఎంకే, ఆప్ పార్టీలు వెల్‌లోకి దూసుకొచ్చి పెరియార్ విగ్రహం ధ్వంసానికి నిరసన తెలిపింది. తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంచాలనే డిమాండ్‌తో టీఆర్‌ఎస్ ఎంపీలు, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ, టీడీపీ, మరాఠీకి ప్రాచీన భాష హోదా కల్పించాలని శివసేన ఆందోళనకు దిగాయి. ఏపీ విభజన చట్టాలన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో వైఎస్సార్ సీపీ నిరసన తెలిపింది. దీంతో సభ ప్రారంభమైన కొద్దిసేపటికే స్పీకర్ వాయిదా వేశారు. సభా కార్యకలాపాలకు సభ్యులు అంతరాయం కలిగించడంపై స్పీకర్ సుమిత్రా మహాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు. రాజ్య సభలోనూ ఇదే అంశాలపై సభ్యులు నిరస నకు దిగారు. ప్రతిపక్షాలు ఆందోళన చేయ డంపై చైర్మన్ వెంకయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది సరైన చర్య కాదని, ప్రజాస్వామ్యానికి విఘాతమని హితవు పలి కారు. అయినా సభ్యులు వినిపించు కోకపోవ డంతో సభను వాయిదా వేశారు.



జినేంద్ర కుమార్ మృతికి సంతాపం తెలుపుతున్న రాజ్యసభ సభ్యులు

అఖిలపక్ష భేటీతోనూ కానరాని పరిష్కారం

లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ బుధవారం సాయంత్రం అఖిలపక్షాల నేతలతో భేటీ అయి, సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు.అయితే, బ్యాంకింగ్ స్కాంపై చర్చ ఏ నిబంధన కింద జరపాలన్న విషయం తేలలేదని కొందరు ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు.అయితే, ఎటువంటి అంగీకారానికి రాకుండానే సమావేశం ముగిసింది.

ఇలాగైతే ఎలా బతకాలన్నా?

దారిపొడవునా ప్రతిపక్ష నేత ఎదుట గోడు వెళ్లబోసుకున్న రైతులు





హనుమోజిపాలెం శివారులో తాను తయారు చేసిన చెర్నాకోలును జగన్‌కు బహూకరించి ఆయనతో కలిసి నడుస్తున్న రైతు మువ్వా కృష్ణమూర్తి.. కృష్ణమూర్తి కాలి చెప్ప ఊడిపోవడంతో సరిచేస్తున్న జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే గిట్టుబాటు ధర లేక నష్టపోయానన్నా.. అంటూ ఓ పొగాకు రైతు, అప్పు తెచ్చి.. పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే తుదకు పెట్టుబడి ఖర్చులు కూడా చేతికం దలేదని మిర్చి రైతు, శనగ రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నా అని మరో రైతు.. బుధవారం ఇలా దారిపొడవునా అన్నదాతలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎదుట వారి కష్టాలు ఏకరువుపెట్టారు. ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గంలో 106వ రోజు ప్రజా సంకల్ప యాత్ర సాగింది. ఇంకొల్లు శివారు నుంచి ప్రారంభమై హనుమోజిపాలెం, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, రంగప్పనాయుడుపాలెం క్రాస్‌రోడ్స్ మీదుగా సంతరావూరు వరకు కొనసాగింది. ఓ వైపు వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలను జగన్‌కు విన్నవించగా, మరో వైపు తమ కష్టాలు వినే నాయకుడు వచ్చాడంటూ ఊరూరా జనం స్వాగతం పలికారు.

కృష్ణా కాలువను పర్చూరు వరకు పొడిగించండి

కృష్ణా నీటిని సాగర్ కాలువ ద్వారా పర్చూరు వరకు తీసుకు వస్తే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 50 గ్రామాలకు తాగు, సాగు నీటి సౌకర్యం ఏర్పడుతుందని పలువురు రైతులు జగన్‌కు విన్నవించారు. ఆ ప్రాజెక్టు సర్వే కోసం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో రూ.75 లక్షలు మంజూరు చేశారని రైతులు గుర్తు చేశారు. ఆ తర్వాత దానిని ఎవ్వరూ పట్టించుకోలేదని, ఇది మీ వల్లనే సాధ్యమవుతుందని జగన్‌తో అన్నారు. హనుమోజిపాలేనికి చెందిన బర్లీ పొగాకు రైతు మొగిలి వెంకటేశ్వర్లు పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేదని జగన్ వద్ద వాపోయాడు. అడుగాకు కోసి ఇచ్చినా క్వింటాకు రూ.4,000 నుంచి రూ.4,200 కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. క్వింటాకు కనీసం రూ.9,000 ఇస్తేనే గిట్టుబాటవుతుందని చెప్పారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. పలువురు మిర్చి, వేరుశనగ రైతులు జగన్ వద్ద తమ బాధను వ్యక్తం చేశారు. ఇంకొల్లు మండలంలో పదివేల ఎకరాల్లో మిర్చి, 30 వేల ఎకరాల్లో వేరుశనగ సాగుచేయగా, సాగర్ నుంచి నీరు రాక దిగుబడి సగానికి తగ్గిపోయిందని వివరించారు. ఇలాగైతే ఎలా బతకాలన్నా అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. మిర్చి క్వింటాలుకు రూ.10 వేలు, వేరుశనగకు రూ.8 వేలు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని కోరారు. నిరుద్యోగ భృతి ఇస్తానన్న చంద్రబాబు ఆ మాట నిలుపుకోకుండా తమకు అన్యాయం చేశాడని నాగరాజు అనే నిరుద్యోగి జగన్‌తో వాపోయాడు. క్వాలిఫికేషన్, మార్కుల ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలన్నాడు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

మధ్యాహ్నం భోజన విరామ సమయంలో క్యాంపు వద్ద పర్చూరు అభివృద్ధి కమిటీ సభ్యులు ఒ.గోవిందరాజులు, ఎం. రవీంద్రనాథరెడ్డి, కళ్లం హరనాథరెడ్డిలు కలిసి తాగు, సాగునీటి సమస్య గురించి జగన్‌కు వివరించారు. వృత్తిపరమైన పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికంగా ఆసుపత్రి ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. 108లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు జగన్‌ను కలిసి సమస్యలు వివరించారు. డీజిల్ లేక వాహనాలు ఆగిపోతున్నాయన్నారు. ఇంకొల్లులో రెండు రోజులుగా డీజిల్ సమస్యతో వాహనం ఆగిపోయినట్లు ఫిర్యాదు చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు.

వేలిముద్రలు పడలేదని బియ్యం ఇవ్వలేదు

నాలుగు నెలలుగా వేలిముద్రలు పడటం లేదని రేషన్ బియ్యం ఇవ్వకుండా ఆపేశారని నందిగుంటపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు కందుల సుగుణమ్మ(90) తన బాధను జగన్‌తో చెప్పుకుంది. తాను ఎన్నో ఏళ్లుగా రేషన్ బియ్యం తీసుకుంటున్నానని, ఇప్పుడే ఈ సాకు చూపుతూ బియ్యం ఆపేయడం దారుణం అని వాపోయింది. చంద్రబాబు పాలన అంతా డాబుసరితోనే ఉంది తప్ప తమ లాంటి వారికి న్యాయం జరగటం లేదంది. సంతరావూరులో ఎంపీటీసీ సభ్యురాలు పల్లె పద్మావతి జగన్‌కు నాగలిని బహూకరించారు. ఇదే గ్రామం శివారులో పలువురు యువకులు ప్రత్యేక హోదా పోరుకు మద్దతుగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. రెండు నెలల బాబుకు పేగు ఆపరేషన్‌కు లక్ష రూపాయలు ఖర్చుకాగా ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదని, తమకు రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు లేవని వెంకటేశ్వరావు, ఝాన్సీ దంపతులు జగన్ వద్ద తమ బాధను చెప్పుకున్నారు. అందరి కష్టాలు ఓపికగా విన్న జననేత.. మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాలతో అన్ని వర్గాల వారినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి సర్కారు ఇచ్చే గౌరవం ఇదేనా?



జగన్‌తో తన సమస్యను చెప్పకుంటున్న సురేష్

అతనో అంతర్జాతీయ క్రీడాకారుడు. పేరు సురేష్‌రెడ్డి. ఊరు ప్రకాశం జిల్లా చినగంజాం. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఇతను దేశానికి, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు ఆర్జించిపెట్టాడు. ఇలాంటి క్రీడాకారుడిని ఈ ప్రభుత్వం విస్మరించింది. తాను కష్టాల్లో ఉన్నానని, ఆదుకోవాలని మొరపెట్టుకున్నా స్పందించలేదని కొడవలివారి పాలెం వద్ద జగన్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నాడు. చినగంజాం గ్రామానికి చెందిన భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆదిలక్ష్మిల మూడో కుమారుడు సురేష్ రెడ్డి. తల్లిదండ్రులు ఉప్పు కొటార్లలో పని చేస్తుంటారు. క్రీడలపై ఆసక్తితో కబడ్డీ నేర్చుకున్నాడు. సత్తెనపల్లిలోని బీజేబీ కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. 2011, 2014, 2016, 2018లో జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించాడు. ఇటీవల బాపట్లలో జరిగిన నేషనల్ పోటీల్లో రాష్ట్రానికి విజయం సాధించి పెట్టాడు. 2016లో వియత్నాంలో జరిగిన అంతర్జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఆరుగురు సభ్యులుండే టీమ్‌కు ఎంపికైన ముగ్గురు ఆంధ్రుల్లో సురేష్‌రెడ్డి ఒకరు. ఆ పోటీల్లో అద్భుత ప్రదర్శనతో ఇండియా టీమ్ రన్నరప్‌గా నిలిచింది. ఆ టీమ్‌కు కెప్టెన్‌గా ఉన్న సందీప్ నర్వాను హరియాణా ప్రభుత్వం ఘనంగా సత్కరించి ఆదాయపన్ను శాఖలో ఉద్యోగం కూడా ఇచ్చింది. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సురేష్‌రెడ్డిని పట్టించుకోలేదు. ఈ ఏడాది గోవాలో జరిగే అంతర్జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ప్రస్తుతం సమాయత్తం అవుతున్నాడు. తమది పేద కుటుంబం అని, ప్రభుత్వం తరపున సహాయం అందించాలని కోరుతున్నాడు. క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, చెస్ క్రీడాకారులను గుర్తించినట్టే కబడ్డీ క్రీడాకారులను కూడా గుర్తించి ఆదుకోవాలని విన్నవిస్తున్నాడు. తన గురువులు వీరలెంకయ్య, రాంబాబులు కబడ్డీ పరంగా సహకారం అందిస్తున్నా, ఆర్థికంగా ఇక్కట్లు పడుతున్నట్టు వాపోయాడు. జిల్లా కలెక్టర్‌ను కలవడానికే అష్టకష్టాలు పడాల్సి వచ్చిందన్నాడు. సురేష్‌రెడ్డి ఆవేదనను విన్న జగన్‌మోహన్‌రెడ్డి.. ఉన్నతాధికారులకు లేఖ రాసి విషయం తెలుసుకుంటానని, అన్ని విధాలా సహకరిస్తానని భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వం రాగానే గ్రామీణ క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.





కొడవలివారిపాలెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్.. (ఇన్‌సెట్‌లో) అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న జననేత

అడుగో జగనన్న..



సంతరావూరు సమీపంలో రాళ్లుదేలిన రోడ్డుపై నడుస్తున్న జగన్



సంతరావూరులో చిన్నారులకు జగన్‌ను చూపిస్తున్న తల్లిదండ్రులు





జగన్‌ను చూసేందుకు పరుగులు తీస్తున్న అక్కచెల్లెమ్మలు

ప్రజాసంకల్ప యాత్ర 106వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,444.7** కిలోమీటర్లు

106వ రోజు నడిచిన దూరం **15.3** కిలోమీటర్లు

ప్రారంభం: ఉ.7.30 గంటలకు ఇంకొల్లు శివారు

ముగింపు: సా.5 గంటలకు సంతరావూరు

ముఖ్యాంశాలు

- ఇంకొల్లు శివారు, హనుమోజిపాలెం, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, రంగనప్పనాయుడుపాలెం క్రాస్, నందిగుంట పాలెం, సంతరావూరులో జనంతో మమేకం
- కేశవరప్పాడులో పార్టీ జెండా ఆవిష్కరణ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం

ఉ.7.30 గంటలకు సంతరావూరు

ముఖ్యాంశాలు

- సంతరావూరు, రాధాకృష్ణ నగర్, అంబేడ్కర్ కాలనీ, వేటపాలెంలో జనంతో మమేకం







జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, ఇంకొల్లు శివారులో ప్రతిపక్ష నేత జగన్‌కు తమ సమస్యలు చెప్పకుంటున్న అవ్వ, ఓ సోదరి, దివ్యాంగురాలు

106వ రోజు

07–03–2018, బుధవారం

సంతరావూరు, ప్రకాశం జిల్లా



ఈ పాలకులకు కనీస మానవత్వం లేకపోవడం దౌర్భాగ్యం

స్వశక్తితో ఎదిగి అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పతకం సాధించి, ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూసి.. నిరాశ చెందిన గ్రామీణ నిరుపేద కుటుంబానికి చెందిన సురేష్ అనే సోదరుడు కలిశాడు. తాను సాధించిన పతకాలు చూపించాడు. దేశం తరపున ప్రాతినిధ్యం వహించి 2016లో వియత్నాంలో జరిగిన ఏసియన్ బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాడట. వారి టీం రజత పతకం సాధించిందట. ప్రభుత్వం ఏదైనా సాయం చేస్తుందేమోనని గంపెడాశతో ఎదురు చూశాడట. ఇతర రాష్ట్రాలకు చెందిన తమ టీం సభ్యులకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగావకాశాలు, ఇతర ప్రోత్సాహకాలు ఇచ్చాయట. తనకు మాత్రం నిరాశే మిగిలిందని, తన తండ్రితో పాటు కూలికి వెళ్లడమే శరణ్యమని వాపోయాడు. ఈ ప్రభుత్వానికి గ్రామీణ క్రీడాకారులంటే ఎంత చిన్నచూపు! పబ్లిసిటీకి పనికొచ్చే విషయాల్లో ఉరుకులు పరుగుల మీద స్పందించే బాబుగారు.. ఇలాంటి మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహించడం వల్ల నాకేం వస్తుంది.. అని అనుకున్నాడో ఏమో!

నందిగుంటపాలెం గ్రామంలో 90 ఏళ్లు పైబడిన కందుల సుగుణమ్మ అనే అవ్వ తన మనవడితో మాట్లాడినట్టు నా చేతిలో చెయ్యేసి బాధలు చెప్పుకొంది. 40 ఏళ్ల నుంచి చౌక డిపోకు పోయి కోటా బియ్యం తెచ్చుకునేదట. కానీ ఇప్పుడు నాలుగు నెలల నుంచి బియ్యం ఇవ్వడం లేదని బావురుమంది. ఇదేం అన్యాయమయ్యా అని అడిగితే.. నీ వేలిముద్రలు పడటంలేదు పొమ్మంటున్నారని చెప్పింది. పక్క ఊర్లో ఉన్న రేషన్ షాపునకు నెలకు ఐదారు సార్లు తిరిగినా కనికరించడంలేదట. ఈ వయసులో నాకు ఎన్ని తిప్పలయ్యా.. వేలి ముద్రలు లేవని బియ్యం ఆపేస్తే బువ్వ ఎలా తినాలయ్యా.. అంటూ దీనంగా ప్రశ్నించింది. ఆ అవ్వ బాధ చూసి జాలేసింది. ఈ ప్రభుత్వం పేదలు, వృద్ధుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అరచేతిలో చూపించే చంద్రబాబు సర్కారు.. వేలిముద్రలు పడకపోతే సరిచేయలేదా? నిజంగా ఇచ్చే ఉద్దేశమే ఉంటే వీడియో రికార్డింగ్ ద్వారా ఇవ్వొచ్చు. లేదా భౌతికంగా వేలిముద్రలు తీసుకోవచ్చు. రేషన్ బియ్యానికి కోత పెట్టాలన్న చంద్రబాబు కుయుక్తుల ఫలితమే.. ఆ అవ్వకు ఈ రోజు వచ్చిన కష్టం.

ఆదిపూడికి చెందిన దళిత బిడ్డ నాగరాజు ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తిచేశాడట. 'అన్నా.. చదువు పూర్తయి నాలుగేళ్లయింది. ఉద్యోగావకాశాల్లేవు, నిరుద్యోగ భృతీ లేదు. కుటుంబ పోషణ భారమై గత్యంతరం లేక భవన నిర్మాణ పనులకు కూలీగా పోతున్నాను. ఆ కూలి డబ్బులతో అమ్మను, తాతను, అవ్వను పోషించుకుంటున్నాను' అని బాధపడ్డాడు. 'అన్నా.. వేలకు వేలు అప్పుచేసి ఏపీపీఎస్సీ కోసం కోచింగ్ తీసుకుంటే.. ఆ పరీక్షలే పెట్టడం లేదు. అప్పులే మిగిలాయి. ఈ ప్రభుత్వం ఏపీపీఎస్సీ ఇయర్ క్యాలెండర్ రిలీజ్ చేసింది. అదంతా ఒట్టి బూటకమన్నా.. అది మాలాంటి నిరుద్యోగులను మోసం చేయడానికే తప్ప.. ఆ క్యాలెండర్‌లో పేర్కొన్న విధంగా ఒక్క నోటిఫికేషనూ ఇవ్వలేదు. ఒక్క పరీక్షా పెట్టలేదు' అంటూ వాపోయాడు. పోనీ, ఎస్సీ కార్పొరేషన్‌లో లోన్ తీసుకుని ఏదైనా ఉపాధి చూసుకుందామనుకుంటే.. జన్మభూమి కమిటీలు సైంధవుల్లా అడ్డుపడుతున్నాయట. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌ల ఇయర్ క్యాలెండర్ విడుదల చేసి, దానిని అమలు చేయకపోవడం మరింత దారుణం. నిరుద్యోగ యువత ఆ క్యాలెండర్‌ను నమ్ముకుని నోటిఫికేషన్‌లు వస్తాయని ఆశగా ఎదురుచూస్తూ, ఆ పరీక్షలకు కోచింగ్‌లు తీసుకుని ప్రిపేర్ అవుతూ.. సమయానికి పరీక్షలు జరపకపోవడం వల్ల అన్ని రకాలుగా నష్టపోతోంది. నిరుద్యోగ యువతను అన్ని విధాలుగా వంచిస్తున్న ఈ పాలకులకు కనీస మానవత్వం లేకపోవడం దౌర్భాగ్యం.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. సాంకేతిక పరిజ్ఞానం అనేది ప్రజలకు ఉపయుక్తంగా ఉండాలే తప్ప.. సాంకేతికత సాకుతో పేదలకు చెందాల్సిన సంక్షేమ పథకాల్లో కోత పెట్టడం ఎంతవరకు సమంజసం?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

జగన్ కోసం సైనికుడిలా పనిచేస్తా

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ఒక క్రమశిక్షణ కలిగిన సైనికుడిలా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ప్రజాసేవ చేసేందుకు జగన్ ద్వారా తనకు అవకాశం లభించిందని.. దానిని సద్వినియోగం చేసుకుంటానన్నారు. బుధవారం ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. వెలగపూడిలోని తాత్కాలిక అసెంబ్లీలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు మూడు సెట్ల నామినేషన్ల పత్రాలను ఆయన అందించారు. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, ఆళ్ల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం అసెంబ్లీ బయట వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తాను వ్యాపారవేత్తగా నిలదొక్కుకొని.. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. పేదలకు విద్య అందించడమే తన లక్ష్యమని, ఆ దిశగా పనిచేస్తానన్నారు. వైఎస్ కుటుంబంతో తనకు 40 ఏళ్ల నుంచి అనుబంధం ఉందని.. మొదటి నుంచీ వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానినని చెప్పారు. వైఎస్సార్ ప్రజా సంక్షేమ పాలన అందించారని, ఆయన పాలన ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తున్న వైఎస్ జగన్‌కే మళ్లీ అలాంటి పాలన అందించే సత్తా ఉందన్నారు. జగన్‌కున్న నాయకత్వ లక్షణాలు దేశంలో మరే నాయకుడికీ లేవన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజల కోసం ధృఢంగా నిలబడ్డారని చెప్పారు. వైఎస్ జగన్ తనకు అత్యంత గౌరవం ఇచ్చారని.. గెలుపోటములతో సంబంధం లేకుండా ఆయన్ని ముఖ్యమంత్రి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. టీడీపీ మూడో అభ్యర్థిని నిలబెట్టడానికి ప్రయత్నిస్తోందనే ప్రచారంపై స్పందిస్తూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికి ఉంటే తాను గెలుస్తానని చెప్పారు.

దుర్గమ్మను దర్శించుకున్న వేమిరెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): నామినేషన్ దాఖలు చేయడానికి ముందు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అడపా శేషు తదితరులున్నారు.

ఇంటర్ ప్రశ్నపత్రాల్లో తప్పులు

సత్తెనపల్లి: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు బుధవారం నిర్వహించిన పరీక్షల్లో పలు ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లాయి. అయితే పరీక్ష ప్రారంభమైన గంట తర్వాత వాటిని సవరించారు. మ్యాథ్స్ ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రంలోని 23వ ప్రశ్నలో ప్లేయింగ్ కార్డ్స్ అని ముద్రించాల్సి ఉండగా ముద్రించలేదు. అలాగే తెలుగు మీడియం ప్రశ్నపత్రంలోని 9వ ప్రశ్నలో 'దత్తాంశం'కి బదులుగా దాత్తంశం అని, 22వ ప్రశ్నలో 'దత్తాంశానికి' బదులుగా 'దత్తాంశాన్ని' అని ముద్రించారు. బోటనీ తెలుగు మీడియం ప్రశ్నపత్రంలోని ఆరో ప్రశ్నలో న్యూక్లియోటైడ్‌కు బదులుగా న్యూక్లియోడైడ్ అని తప్పుగా దొర్లింది. అలాగే 16వ ప్రశ్నలో 'సంకరణ'కు బదులుగా 'సంకర' అని, 17వ ప్రశ్నలో పునఃసంయోజక బదులుగా పునసంయోజక అని ముంద్రించారు. సివిక్స్ పేపర్‌లో 13వ ప్రశ్నలో 'మూల్యాంకనం'కి బదులుగా మూల్యంకనం అని, 19వ ప్రశ్నలో కో వారంటోకు బదులుగా కో వారంట్ అని ముంద్రించారు. పరీక్ష ప్రారంభమైన గంట తర్వాత తప్పులను సవరిస్తూ ఇంటర్ బోర్డు చీఫ్ సూపరింటెండ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు సందేశాలు పంపారు. విద్యార్థులకు సవరించిన ప్రశ్నలను తెలిపినట్లు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి జెడ్‌ఎస్ రామచంద్రరావు తెలిపారు.

ముగ్గురు అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లపై పీడీయాక్ట్

నెల్లూరు(క్రైమ్): అరెస్ట్‌చేసి జైలుకు పంపినా ప్రవర్తనలో మార్పురాని ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లపై నెల్లూరు జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ నమోదు చేశారు. అంతర్‌రాష్ట్ర స్మగ్లర్‌లైన రాపూరు మండలం పంగిలికి చెందిన సంగటి సుబ్బయ్య, దాదినేని సుబ్బయ్య, ఉదయగిరి మండలం క్రిష్ణంపల్లికి చెందిన బైనబోయిన శ్రీనివాసులు అలియాస్ క్రిష్ణంపల్లి శ్రీనుపై పీడీ యాక్ట్ నమోదుకు జిల్లా కలెక్టర్‌కు పోలీసులు నివేదిక సమర్పించారు. దానిని పరిశీలించిన ఆయన వారిపై పీడీయాక్ట్ నమోదుకు ఉత్తర్వులు జారీచేశారు.

నీట్ పీజీ ఎంట్రన్స్‌లో ఏపీ ర్యాంకుల విడుదల

- గిద్దలూరుకు చెందిన సాయి విరించి యాదవ్‌కు ఫస్ట్ ర్యాంకు
- దర్శికి చెందిన ఉమామహేశ్వరికి రెండో ర్యాంకు



ఫస్ట్ ర్యాంకర్ విరంచి



సెకండ్ ర్యాంకర్ మహేశ్వరి



4వ ర్యాంకర్ శ్రీరామమూర్తి



5వ ర్యాంకర్ పురుషోత్తం రెడ్డి

విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): నీట్ పీజీ–2018 ప్రవేశ పరీక్ష ఫలితాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ర్యాంకులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసరావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నగరంలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మంచి ర్యాంకులు పొందిన విద్యార్థులు జాతీయస్థాయిలో కూడా మంచి ర్యాంకులు సాధించారని వివరించారు. దేశవ్యాప్తంగా 1,24,605 మంది నీట్ పీజీ ప్రవేశ పరీక్ష రాయగా, రాష్ట్రం నుంచి 10,207 మంది విద్యార్థులు హాజరయ్యారని.. ఇందులో 6,078 మంది అర్హత సాధించారని ఆయన వివరించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన బీవీఆర్ఎస్ సాయి విరించి యాదవ్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, జాతీయ స్థాయిలో 9వ ర్యాంకు కైవసం చేసుకున్నారన్నారు. అదే విధంగా ద్వితీయ ర్యాంకర్‌గా నిలిచిన ప్రకాశం జిల్లా దర్శికి చెందిన నుసుం ఉమామహేశ్వరి జాతీయ స్థాయిలో 16వ ర్యాంకు, తృతీయ ర్యాంకర్‌గా నిలిచిన శ్రీధరాల వీఆర్ సృజన జాతీయ స్థాయిలో 23వ ర్యాంకు సాధించారు. ఇక రాష్ట్రస్థాయిలో కోమట్లమల్లి శ్రీరామమూర్తి నాలుగో ర్యాంకు, రామిరెడ్డిగారి పురుషోత్తంరెడ్డి ఐదవ ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన మొదటి పది మందిలో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు.

'జూడా'ల సమస్యలను పరిష్కరిస్తున్నాం..

కాగా, రాష్ట్రంలో జూనియర్ డాక్టర్ల సమస్యలను పరిష్కరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం రోగుల తరువాత జూనియర్ డాక్టర్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే సీనియర్ రెసిడెంట్లకు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు 40 శాతం పారితోషికాలు పెంచామన్నారు. పీజీల ఏరియర్స్ విడుదలకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని.. సీఎం సంతకం కాగానే బకాయిలు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. పీజీ వైద్యుల మెడికల్ రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. గత ఏడాది సుమారు 176 పీజీ సీట్లు రాష్ట్రానికి వస్తే, ఈ ఏడాది ఒక్కటే రావడంపై తాను కేంద్రం, ఎంసీఐతో మాట్లాడతానని కామినేని అన్నారు.

కాటేసిన కలుషిత నీరు..

- దయేరియాతో గుంటూరు జిల్లాలో తొమ్మిది మంది మృత్యువాత..
- మురుగునీటిలో మంచినీటి పైప్‌లైన్ లీక్
- దయేరియా బాధితులతో రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రులు కిటకిట

సాక్షి, గుంటూరు/అమరావతి/పట్నం బజారు/నగరం పాలెం (గుంటూరు): తాగునీరు గరళంగా మారటంతో నిరు పేద కుటుంబాలు మృత్యువాత పడ్డాయి. గుంటూరులో కలుషిత నీరు తాగి తొమ్మిది మంది మృత్యువాత పడగా వెయ్యి మంది డయేరియాతో ఆస్పత్రుల పాలయ్యారు. బాధితులు అంతకంతకూ పెరుగుతుండడంతో గుంటూరు జీజీహెచ్‌లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు రోగులకు వైద్యం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత వారం రోజుల్లో సుమారు 60 వేల డయేరియా కేసులు నమోదైనట్టు వైద్యులు చెబుతున్నారు. వీరిలో చిన్నపిల్లలు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

తొమ్మిదికి చేరిన మృతులు

గత నాలుగురోజులుగా నగరంలో పాత గుంటూరు, ఆనందపేట, సంగడిగుంట, వినోభానగర్, బాలాజీనగర్ వంటి ప్రాంతాల్లో డయేరియాతో మరణించిన వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. మృతిచెందిన వారిలో.. సయ్యద్ సహీనా (35), చల్లా శ్రీనివాసరావు (35), షేక్ బీబీజాన్ (70), షేక్ ఫాతిమూన్ (55), కాళంగి పద్మావతి (45), అడపాల వెంకట్రావు (61), షేక్ గౌస్ (54), సామి కొమ్ము కోటిరెడ్డి (65), చిల్లి సామ్రాజ్యం (57) ఉన్నారు. వీరిలో కొందరు జీజీహెచ్‌లో, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు. రోజుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున మృత్యువాత పడుతుండటంతో నగర ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. డయేరియా అధికంగా ఉన్న ప్రాంతాల్లో పది వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నర్సింగ్ విద్యార్థులతో డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తున్నారు. మెడికల్ క్యాంపులు 24 గంటలూ పనిచేసేలా చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా అధికారులు డయేరియాకు కలుషిత నీరు కారణం కాదంటూ సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేశారు. నీటి నమూనాలను పరీక్షించిన రీజనల్ ల్యాబ్ అధికారులు కలుషితమైనట్టు నిర్ధారించినట్లు తెలిసింది.



దయేరియా బాధితులతో కిటకిటలాడుతున్న గుంటూరు జీజీహెచ్

మురుగునీటిలోనే మంచినీటి పైపులైనులు

గుంటూరు ఈస్ట్ పరిధిలోని ఆనందపేట, సంగడిగుంట, పాత గుంటూరు ప్రాంతాల్లో మురుగునీటిలో వేసిన మంచి నీటి పైపులైనులు లీకై మంచినీరు కలుషితమవుతోందని ఇంజనీరింగ్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదంటూ బాధితులు వాపోతున్నారు. లెట్రిన్ పైపులైనులు సైతం ఇదే మురుగు కాలువల్లోకి వదులుతుండడం, అక్కడే మంచినీటి పైపులైనులు ఉండటాన్ని బుధవారం అక్కడ పర్యటించి గుర్తించిన ఉన్నతాధికారులు ఖంగుతిన్నారు.

కలుషిత నీటితో ప్రజలు చనిపోవడం విచారకరమని మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం మాట్లాడుతూ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదిమంది పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారని, వారిని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి ప్రభుత్వ ఖర్చులతో వైద్యం అందిస్తామని చెప్పారు. చనిపోయిన వారిలో పదేళ్ల వయసు దాటిన వారికి రూ.5 లక్షలు, చిన్నపిల్లలకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో పది వార్డుల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని కలెక్టర్ కోన శశిధర్ చెప్పారు. పైపులైను ద్వారా నీటి సరఫరా నిలిపేసి ట్యాంకర్ల ద్వారా 24 గంటలూ నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ అధికారులు స్పందించిన తీరు సక్రమంగా లేదని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారులకు ఎక్కడ పైపు ఉందో, ఎక్కడ పంపు ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు.



ఒకే బెడ్‌పై ముగ్గురు రోగులకు చికిత్స



స్టాండ్ లేకపోవడంతో సెలైన్ చేతితో పట్టుకున్న రోగి బంధువు

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు రావి వెంకటరమణ, పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి రోశయ్య బుధవారం పరామర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించడంతోపాటు, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాల అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఇటువంటి దారుణం జరిగిందని నేతలు ధ్వజమెత్తారు. ఇవన్నీ సర్కారీ హత్యలేనని గుంటూరు నగర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి దుయ్యబట్టారు. కలుషిత నీటితో ప్రజలు మృత్యువాత పడుతున్నా అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద అప్పిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు, తీవ్ర అస్వస్థతకు గురైనవారికి రూ.5 లక్షల సహాయం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ధర్నా తర్వాత కమిషనర్ చల్లా అనూరాధను కలవడానికి అప్పిరెడ్డి తదితరులు కార్యాలయంలోకి వెళ్లగా అప్పటికే కమిషనర్ వెనుక వైపు నుంచి వెళ్లిపోయారని సిబ్బంది సమాచారం అందించారు. దీంతో ఆగ్రహించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించాయి.

తూర్పు గోదావరిలో అతిసారతో వివాహిత మృతి

జగ్గంపేట: తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం రామవరంలో అతిసారతో ఓ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన 32 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నల్లా వెంకట దుర్గాభవాని (18) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కాకినాడ ట్రస్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మేడపోతుల నందీశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆదేశాల మేరకు అతిసార వ్యాధి ప్రబలడానికి కారణమైన కొండపల్లి నాగమణికి చెందిన హోటల్‌ను పెద్దాపురం ఆర్డీవో విశ్వేశ్వరరావు సీజ్ చేశారు.

ఈసారైనా హామీలు నెరవేరేనా?

▶ మొదటి పేజీ తరువాయి

చేయనున్నారు. సొంత పన్నుల ద్వారా రూ.70 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రతిపాదించారు. పన్నేతర ఆదాయం రూ.5,500 కోట్ల మేర వస్తుందని అంచనా.

ఆరోగ్యశ్రీకి వెయ్యి కోట్లే

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, డ్వాక్రా సంఘాల రుణమాఫీకి బడ్జెట్‌లో కేవలం రూ.3,900 కోట్లను ప్రతిపాదించారు. ఇవి ఏ మూలకూ చాలని పరిస్థితి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం కోసం అంటూ రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ పైసా కూడా వ్యయం చేయలేదు. విధి విధానాలు రూపొందించాలంటూ ఆర్థిక సంవత్సరం ముగిసే వరకూ కాలయాపన చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018–19) బడ్జెట్‌లోను నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం పేరుతో రూ.1,000 కోట్లు మాత్రమే కేటాయింపులు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలుకు సరిపడా బడ్జెట్‌ను కేటాయించడం లేదు. కేవలం వెయ్యి కోట్లతో సరిపుచ్చుతున్నారు. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో అత్యధికంగా నిధులు వస్తాయనే ఊహాజనిత అంచనాలతో భారీ బడ్జెట్‌ను రూపొందించారు. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఏకంగా రూ.50,000 కోట్లు వస్తాయని అంచనా వేయడం గమనార్హం. కేంద్ర పన్నుల వాటా రూపంలో రూ.33,930 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇది కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న మేరకే పొందుపరిచినప్పటికీ గ్రాంట్ల రూపంలో వచ్చే నిధులపై ఊహాజనితంగా లెక్కలు వేశారు. మరోవైపు ఈసారి రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను రూపొందించడం గమనార్హం. దాదాపు రూ.2,000 కోట్లకు పైగా రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను రూపొందించారు. నాలుగేళ్లుగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వని ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికల ముందు పేదలకు ఇళ్ల స్థలాల సేకరణ పేరుతో బడ్జెట్‌లో రూ.500 కోట్లను ప్రతిపాదించింది. పేదల గృహ నిర్మాణానికి బడ్జెట్‌లో కేవలం రూ.3,180 కోట్లే కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పది విద్యార్థులకు ఉదయం టిఫిన్, 8వ తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందజేసే అంశాలను పొందుపరిచినట్లు తెలిసింది.

బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)

రంగం	కేటాయింపులు
సాగునీటి పారుదల	18,000
వ్యవసాయం	10,350
వైద్య ఆరోగ్యం	8,760
గృహ నిర్మాణం	3,180
సాంఘిక సంక్షేమం	6,180
మున్సిపల్–పట్టణాభివృద్ధి	8,960
బీసీ సంక్షేమం	6,300
సెకండరీ విద్య	21,300
మైనారిటీ సంక్షేమం	1,000
పశు సంవర్థక శాఖ	1,600

నేను శక్తి స్వరూపం

'సాక్షి' అక్షర ఉద్యమానికి గొంతు కలిపిన నారీలోకం

సాక్షి, హైదరాబాద్: నేను శక్తి.. అంటూ నారీలోకం గళమెత్తింది. స్త్రీ శక్తిని నలుచెరుగులా చాటి చెప్పింది. లింగ వివక్ష, గృహహింస, వేధింపులకు వ్యతిరేకంగా కదం తొక్కింది. మహిళా సాధికారత కోసం నినదించింది. మహిళాభ్యున్నతికి గత నెలరోజులుగా 'సాక్షి'నిర్వహించిన 'నేను శక్తి'అక్షర ఉద్యమ ముగింపు ఉత్సవం బుధవారం హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లోని సమావేశ మందిరంలో అంగరంగ వైభవంగా జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఒకరోజు ముందు మహిళల కోసం, మహిళల చేత, మహిళలే ముందుండి నిర్వహించిన ఈ కార్యక్రమం.. వారిలో నూతనోత్సాహం, ఉత్తేజాన్ని నింపింది. మహిళా హక్కుల ఉద్యమకారులు, కార్యకర్తలు, రచయిత్రులు, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రదర్శించిన అమ్మ, అద్దిల్లు, లివింగ్ ఐడల్, చిట్టితల్లి లఘు చిత్రాల్లోని పలు కీలక సన్నివేశాలు సమాజంలో నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దంపట్టాయి.

ఆడపిల్ల పుట్టిందని వివక్ష చూపకుండా కూతుళ్లను ప్రయోజకురాళ్లుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులతో పాటు మహిళల సమస్యలపై లఘు చిత్రాలు రూపొందించిన వారికి 'సాక్షి'గ్రూప్ చైర్‌పర్సన్ వైఎస్ భారతీరెడ్డి, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రాణిరెడ్డి, అమల అక్కినేని నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. మహిళల కోసం 'సాక్షి'అక్షర యజ్ఞం కొనసాగుతుందన్నారు.

సెలబ్రిటీలూ బాధితులే..

విద్యా, ఆర్థిక స్థిరత్వంతోనే మహిళలు సాధికారత సాధించగలుగుతారని ప్రముఖ సినీ నటి, బ్లూ క్రాస్ సంస్థ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని చేసిన కీలకోపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. సెలబ్రిటీలైన తాము సైతం సమాజంలో భౌతిక, మానసిక వేధింపులకు గురికాక తప్పట్లేదని తన స్వీయ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. మహిళల హక్కులు, లింగ సమానత్వంపై సాంస్కృతిక, మహిళా హక్కుల కార్యకర్తలు దేవి, కాకర్ల సజయల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. మహిళల కోసం 'నేను శక్తి'పేరుతో అక్షర ఉద్యమాన్ని ప్రారంభిస్తామని 'సాక్షి'ప్రతినిధులు తనను సంప్రదించినప్పుడు.. అందరూ చేసే కార్యక్రమేగా అని భావించానని, అయితే ఈ కార్యక్రమం తన అంచనాలకు మించి విజయవంతమైందని దేవి ప్రశంసించారు. తెలుగు సినీ రంగంలో తనకు ఎదురైన వేధింపులు, వివక్షపై పాటల రచయిత్రి శ్రేష్ట నిర్భయంగా మాట్లాడారు. వృత్తి జీవితంలో తన ఎదుగుదలలో 'సాక్షి' కీలక పాత్ర పోషించిందని ప్రముఖ ఫ్యామిలీ కౌన్సిలర్, న్యాయవాది నిశ్చలరెడ్డి కృతజ్ఞత తెలిపారు.

ఆ 681 మంది రిటర్నులు దాఖలు చేయాల్సిందే

- పెద్ద నోట్ల రద్దు సమయంలో రూ.కోటికి పైగా డిపాజిట్
- దాఖలు చేయకపోతే తీవ్ర పరిణామాలు: ఆదాయపు పన్ను శాఖ

సాక్షి, హైదరాబాద్: పెద్ద నోట్ల రద్దు సమయంలో రూ.కోటి కన్నా ఎక్కువ మొత్తాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన వారిపై ఆదాయపు పన్ను శాఖ నిఘా పెట్టింది. ఇప్పటివరకు సేకరించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 10,238 మంది తేలగా, అందులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 681 మంది ఉన్నట్టు ఆ శాఖ గుర్తించింది. హైదరాబాద్‌కు చెందిన 448 మంది, విజయవాడకు చెందిన 153 మంది, విశాఖపట్నానికి చెందిన 80 మంది రూ.కోటికి పైగా డిపాజిట్లు చేశారు. వారు ఇంత వరకు రిటర్నులు దాఖలు చేయలేదు. ఈ 681 మంది వ్యాపార కార్యకలాపాలు, ప్రస్తుత లావాదేవీలు నిరంతర నిఘాలో ఉంటాయని ఐటీ అధికారులు చెబుతున్నారు. వారి డిపాజిట్లకు సంబంధించి సరైన ఆదాయాన్ని బహిర్గతం చేస్తూ రిటర్నులు దాఖలు చేయాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ బుధవారం వెల్లడించారు. ఈ నెల 31లోగా రిటర్నులు దాఖలు చేయకపోతే 79 కంపెనీలు, 177 భాగస్వామ్య సంస్థలు, 425 మంది వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సోనియా విందుకు టీడీపీ

ఆంగ్ల దినపత్రిక కథనం



సాక్షి ప్రత్యేక ప్రతినిధి: కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ ఈనెల 13న యూపీఏ మిత్ర పక్షాలకు విందు ఇవ్వబోతున్నారు. ఈ విందుకు భాగస్వామ్య పక్షాలతో పాటు తెలుగుదేశం వంటి ఎన్డీయే భాగస్వాములకు కూడా ఆహ్వానం అందినట్లు జాతీయ పత్రికలలో ప్రముఖంగా వార్తలు ప్రచురితమయ్యాయి. అందులో టైమ్స్ ఆఫ్ ఇండియా మొదటిపేజీలో ప్రముఖంగా ఇచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం నేపథ్యంలో బ్యాంకింగ్ సంక్షోభం వంటి అంశాలపై ఈ విందు సమావేశంలో చర్చిస్తారని వినిపిస్తున్నాయి. థర్డ్ ఫ్రంట్, ఫెడరల్ ఫ్రంట్ గురించి వార్తలు వస్తున్న నేపథ్యంలో యూపీఏని పటిష్టపరుచుకోవడంలో భాగంగానే ఈ విందు జరుగుతోందని కూడా వినిపిస్తోంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన బీజేపీ – తెలుగుదేశం పార్టీల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వినిపిస్తున్నా ఇంకా తెగతెంపులు కాకుండానే యూపీఏ విందుకు తెలుగుదేశం పార్టీని కూడా ఆహ్వానించడం చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల ఏడాది నేపథ్యంలో..

అయితే కొద్ది కాలంగా హస్తినలో పరిణామాలను గమనిస్తున్న వారికి మాత్రం ఈ పరిణామం అంతగా ఆశ్చర్యం కలిగించలేదు. కాంగ్రెస్‌కు తెలుగుదేశం పార్టీకి మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్న మాట నిజమేనని వారు పేర్కొంటున్నారు. నాలుగేళ్లుగా ఎన్డీయేలో భాగస్వామిగా కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తున్న తెలుగుదేశం పార్టీ రకరకాల కారణాల రీత్యా బీజేపీకి దూరం జరిగేందుకు ప్రయత్నిస్తుండడం తెలిసిందే. ఎన్నికల ఏడాది నేపథ్యంలో తన వైఫల్యాల నెపాన్ని కేంద్రంపై వేసి కన్వీనియెంట్‌గా తప్పుకోవడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నది కూడా అందరూ చర్చించుకుంటున్న అంశమే.

కాంగ్రెస్‌తో టీడీపీ సాన్నిహిత్యం..

టీడీపీ ఎంపీలు, నాయకులు కాంగ్రెస్ నాయకులకు సన్నిహితంగా వ్యవహరిస్తుండడం గత కొంత కాలంగా కనిపి స్తున్నదేనని విశ్లేషకులంటున్నారు. ప్రస్తుత పార్లమెంటు బడ్జెట్ తొలివిడత సమావేశాల సందర్భంగా టీడీపీ ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన తెలిపే సమయంలో సోనియా గాంధీతో మాట్లాడడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. మంగళవారం పార్లమెంటు వెలుపల తెలుగుదేశం ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న సమయంలో ఏపీ కాంగ్రెస్ సీనియర్ ఎంపీ ఒకరు టీడీపీ ఎంపీలకు దగ్గరగా ప్లకార్డు పట్టుకుని నిరసన తెలపడం గమనార్హం.

నాలుగునెలల కిందటే రంగం సిద్ధం..

కాంగ్రెస్ – టీడీపీ సాన్నిహిత్యానికి మూడునాలుగు నెలల కిందటే రంగం సిద్ధమైందని ఈ పరిణామాలన్నిటినీ గమనిస్తున్న వారు వ్యాఖ్యానిస్తున్నారు. మూడునాలుగు నెలల క్రితమే టీడీపీ అనుకూల 'తోక పత్రిక'లో బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రారం భమయ్యాయి. మరో ప్రధాన పత్రిక కూడా ఇటీవలి కాలంలో ఇదే వైఖరితో కథనాలు ప్రముఖంగా ప్రచురిం చడాన్ని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. ఈ పద్ధతిలో జరగదని తెలిసి కూడా చంద్రబాబు కాపు రిజర్వేషన్‌కు సంబంధించి, బోయలను ఎస్టీలలో కలపడానికి సంబంధించి అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించడం, తన పార్టనర్ పవన్ కల్యాణ్ చేత నిజనిర్ధారణ కమిటీ వేయించి కేంద్రం నిధు లివ్వకపోవడం నిజమేనన్నట్లు గణాంకాలు చెప్పించడం, ఆ నిజనిర్ధారణ కమిటీలో కాంగ్రెస్‌కు సన్నిహితంగా ఉండే కొందరు నాయకులుండడం వంటివన్నీ కూడా బీజేపీతో దూరం జరగడానికి తగిన భూమికను సిద్ధం చేసుకోవడంలో భాగమేనని విశ్లేషకులంటున్నారు. ఇవన్నీ గమనిస్తే బీజేపీతో తెగతెంపులు చేసుకోకుండానే టీడీపీకి కాంగ్రెస్ నుంచి విందుకు ఆహ్వానం రావడం ఆశ్చర్యం కలిగించట్లేదని విశ్లేషకులంటున్నారు.

పోలవరం పరిహారం గోల్‌మాల్‌పై విచారణ

- హైకోర్టులో స్వచ్ఛంద సంస్థ శక్తి పిల్
- స్పందించిన న్యాయస్థానం.. విచారణకు ఆదేశం
- డీఆర్‌డీఏ డైరెక్టర్ శ్రీనివాసులుకు బాధ్యతలు



పోలవరం ప్రాజెక్ట్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన గిరిజనులకు దక్కాల్సిన పరిహారాన్ని కొందరు గిరిజనేతరులు దక్కించుకోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ శ్రీనివాసులును విచారణాధికారిగా నియమించింది. పరిహారం విషయంలో గిరిజనులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి ఏప్రిల్ 24 నాటికి ఓ మధ్యంతర నివేదికను తమకు సమర్పించాలని శ్రీనివాసులును హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మీలతో కూడిన ధర్మాసనం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూర్, వెలైర్‌పాడు మండలాల్లో కొందరు బలవంతులైన గిరిజనేతరులు రికార్డులను తారుమారు చేసి గిరిజనులకు దక్కాల్సిన పరిహారాన్ని కాజేశారని స్వచ్ఛంద సంస్థ శక్తి డైరెక్టర్ డాక్టర్ పి.శివరామకృష్ణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై బాధిత గిరిజనులు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ అందులో తెలిపారు. ఈ వ్యాజ్యంపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్స్ (ఎల్‌టీఆర్) కింద అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తారుమారు చేసిన కొందరు గిరిజనేతరులు వాటిని అడ్డంపెట్టుకుని పరిహారం పొందారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు గిరిజనుల నుంచి భూములు తీసుకున్నారని, అయినా వారికి ఇప్పటివరకు పరిహారం చెల్లించలేదన్నారు. అధికారుల తీరు వల్ల గిరిజనులు తమ జీవనోపాధిని కోల్పోయారన్నారు. కాగా, ఈ వ్యవహారంపై హైకోర్టు ప్రభుత్వ స్పందనను కోరగా, ఆరోపణలు తీవ్రమైనవేనని తెలిపింది. విచారణకు కమిటీని ఏర్పాటుచేస్తే అభ్యంతరం లేదని పేర్కొంది. దీంతో హైకోర్టు పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ శ్రీనివాసులును విచారణాధికారిగా నియమించింది.

పేదలు అల్లాడుతున్నారు

- పెన్షన్లు మంజూరైనా ఇప్పటికీ ఇవ్వలేదు
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు

సాక్షి, అమరావతి: రేషన్‌కార్డుల్లో పేర్లు తప్పులతడకల్లా ఉండటం వల్ల పేదలు అల్లాడుతున్నారని, ప్రతి చిన్న సమస్యకూ ఆఫీసుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు సభ్యులు నిలదీశారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. డెబ్బై ఏళ్ల పైబడిన వారిని కూడా రేషన్ కార్డుల్లో 50 ఏళ్లుగా చూపించారని మండిపడ్డారు. దీని వల్ల పింఛన్ అందక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జన్మభూమిలో మంజూరైన పెన్షన్లు, రేషన్‌కార్డులు ఎప్పటిలోగా ఇస్తారో చెప్పాలని పల్లె రఘునాథరెడ్డి తదితరులు ప్రశ్నించారు. ఆర్థిక మంత్రి యనమల స్పందిస్తూ.. త్వరలో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంటే సీఎం చంద్రబాబు ఫొటో ఒక్కటే పెట్టడం ఎంతవరకు సమంజసమని బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించారు. ప్రధాని మోదీ బొమ్మ కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి కామినేని సమాధానమిస్తూ.. కేంద్రం ఒక్కటే డబ్బులివ్వడం లేదని, రాష్ట్రం కూడా 40 శాతం నిధులిస్తోందని చెప్పారు.

మృతి చెందిన సభ్యులకు నివాళి

ఇటీవల మృతి చెందిన మాజీ, ప్రస్తుత సభ్యులకు శాసనసభ నివాళి అర్పించింది. ఈ సందర్భంగా ఆయా సభ్యుల పేర్లు చదివి, వారు చేసిన సేవలను స్పీకర్ కోడెల శివప్రసాదరావు చదివి వినిపించారు.

ప్రభుత్వ శాఖల్లో 24,209 ఖాళీలు

శాసనమండలిలో మంత్రి యనమల ప్రకటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 2018 ఫిబ్రవరి నాటికి ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్య 24,209 మాత్రమేనని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ.. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైలు సర్క్యులేషన్‌లో ఉందన్నారు. కాగా, ఖాళీ పోస్టులను ప్రభుత్వం చాలా తక్కువగా చూపిస్తోందంటూ పలువురు ఎమ్మెల్సీలు మండిపడ్డారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ, 2014లోనే 1.42 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారని, ఆ సంఖ్య ఇప్పుడు 1.85 లక్షల దాకా చేరి ఉండొచ్చన్నారు.

విశాఖ మెట్రోకు ఐదు బిడ్లు

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో విశాఖ మెట్రో రైలు నిర్మాణానికి టెండర్లు పిలవగా ఐదు సంస్థలు బిడ్లు దాఖలు చేశాయని మంత్రి పి.నారాయణ శాసనమండలిలో చెప్పారు.

టీడీపీ అంగీకారంతోనే ప్రత్యేక ప్యాకేజీ

బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు



సాక్షి, అమరావతి: 'తెలుగుదేశం పార్టీ అంగీకరించిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. ప్రత్యేక ప్యాకేజీపై 2016లో బీజేపీ, టీడీపీ మధ్య పరస్పర అంగీకారం కుదిరింది. రాష్ట్రానికి కేంద్రం ప్రకటించిన రూ.16,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అప్పుడు మీరు (టీడీపీ) అంగీకరించింది' అని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. దుగరాజపట్నంలో సాంకేతిక సమస్య ఉన్నందున ప్రత్యామ్నాయ ప్రాంతం చూపితే పోర్టు మంజూరుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఆంధ్రులకు అన్యాయం జరుగుతుంటే ఎట్టి పరిస్థితుల్లో బీజేపీ రాష్ట్ర శాఖ చూస్తూ ఊరుకోదన్నారు.

ప్రతిపక్షం లేకుండా సభ జరపడం పార్లమెంటరీ వ్యవస్థకు నష్టం

ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రమణ్యం

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యులేకుండా సభ జరగడం పార్లమెంటరీ వ్యవస్థకు తీవ్ర నష్టమని ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రమణ్యం అన్నారు. గవర్నర్ ప్రసంగంపై శాసనమండలిలో బుధవారం చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే అధికారం ప్రజలకు ఉందని, చిన్న ఆందోళనలు చేసినా 144 సెక్షన్ విధిస్తున్నారని విమర్శించారు.

పీవీఎన్ మాధవ్‌ను అడ్డుకున్న టీడీపీ సభ్యులు

రాష్ట్రానికి కేంద్రం చేసిన సాయం గురించి బీజేపీ సభ్యుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతున్న సమయంలో టీడీపీ సభ్యులు అడ్డుకున్నారు. శాసనమండలిలో బుధవారం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల కోసం రూ.1.18 లక్షల కోట్లు మంజూరు చేసిన విషయమై రెండు రోజుల్లో లెక్కలతో సహా చెబుతామన్నారు. ఇంద్రభవనం మాదిరిగా అమరావతిని నిర్మించాలనుకున్న ప్రభుత్వం వాటికి సంబంధించి ఇప్పటి వరకు డీపీఆర్ ఎందుకు తయారు చేయలేదని ప్రశ్నించారు. ఇలా కేంద్రం చేసిన సాయంపై ఆయన మాట్లాడుతుండగా టీడీపీ సభ్యులు మాధవ్‌ను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారు.

నాలుగేళ్లుగా నిద్ర!



టీడీపీ మేనిఫెస్టోలో వందల కొద్దీ వాగ్దానాలు

- ఏ ఒక్కటీ నెరవేర్చని రాష్ట్ర సర్కారు
- బడ్జెట్లు గడిచిపోతున్నా నిధులివ్వకుండా హామీలకు మంగళం


సాక్షి, అమరావతి: నాలుగు బడ్జెట్లు గడిచిపోయినా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తి కాలేదు. 2014 టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు 600కిపైగా హామీలను ఇచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చాక ఐదు సంతకాలంటూ మరో అంకానికి తెరతీశారు. అనంతరం వీటిని ఒక్కొక్కటిగా అటకెక్కించారు.

మాఫీపై మెలికలు: రూ. 87,616 కోట్ల వ్యవసాయ రుణాలు బేషరతుగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక రూ.24,500 కోట్లకు కుదించారు. చివరకు అది కూడా ఇవ్వకుండా కోటయ్య కమిటీ పేరుతో పలు ఆంక్షలు విధించారు. అరకొర మాఫీ డబ్బులు వడ్డీలకే సరిపోక రైతులు రుణ ఊబిలో చిక్కుకున్నారు. బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి తెచ్చిన రుణాలను చెల్లించి ఆ బంగారాన్ని తిరిగి వారి ఇంటికి తెప్పిస్తామని హామీ ఇచ్చారు. బంగారం తెప్పించడం సంగతి అటుంచితే వాటిపై వడ్డీలు తడిచి మోపెడై బ్యాంకులు వేలం వేయటంతో రైతన్నలు నిలువునా మోసపోయారు. మేనిఫెస్టోలో చెప్పిన మాటలకు, చేతలకు పొంతన లేకుండా వ్యవహరించారు.

అక్కచెల్లెమ్మల్లకు మోసం: డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ హామీ ఇచ్చింది. అయితే మాఫీ చేయలేదు సరికదా అంతకు ముందు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన జీరో వడ్డీ రుణాలకు మంగళం పాడింది. ప్రతిపక్షం నుంచి నిలదీయటంతో అరకొర కేటాయింపులతో చేతులు దులుపుకొంటోంది. 2016 నుంచి డ్వాక్రా సంఘాలకు జీరో వడ్డీ కింద రూ.2,400 కోట్ల మేరకు బకాయి పడింది. డ్వాక్రా రుణాలపై చేతులెత్తేసిన ప్రభుత్వం పెట్టుబడి నిధి పేరుతో రూ.8,291 కోట్లు ఇస్తామని చెప్పి మాటలకే పరిమితమైంది. 2016కి సంబంధించి రూ. 3,316 కోట్లు బకాయి పడింది.

వీధి వీధినా బెల్టుషాపులు: బెల్టు షాపులు రద్దు చేస్తామని చెప్పిన టీడీపీ అధికారంలోకి రాగానే విచ్చలవిడిగా వీధివీధినా నిర్వహిస్తున్నా మౌనం దాల్చింది. మహిళా కమిటీలు, పోలీసింగ్ అంటూ తొలుత హడావుడి చేసి తరువాత విస్మరించింది.

మహాలక్ష్మి పథకానికి మంగళం: మహాలక్ష్మి పథకం కింద పుట్టిన ప్రతి ఆడబిడ్డ పేరుతో రూ.30 వేల చొప్పున డిపాజిట్ చేసి యుక్తవయసు వచ్చేనాటికి రూ.2 లక్షలు అందిస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. ఇది ఇప్పటివరకు ఇది కార్యరూపం దాల్చలేదు.



ఉద్యోగాల భర్తీ లేదు..: రాష్ట్ర విభజన అనంతరం 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. పదవీ విరమణ చేసిన వారితో కలిపితే ఖాళీలు దాదాపు 1.80 లక్షలున్నాయి. ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు కేవలం 10 వేల పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చారు. కేవలం 70 వేల ఖాళీలే ఉన్నాయని, వీటిలో 20 వేల ఉద్యోగాలను మాత్రమే శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసి మిగతావి ఔట్‌సోర్సింగ్ విధానంలో తీసుకుంటామని ప్రకటించి నిరుద్యోగులను వంచించింది.

నిరుద్యోగ భృతికి చెల్లుచీటీ: ఇంటికో ఉద్యోగం ఇవ్వకుంటే నిరుద్యోగులకు నెలకు రూ.2 వేల చొప్పున భృతి చెల్లిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. గత బడ్జెట్లో రూ.500 కేటాయిస్తున్నట్లు పేర్కొన్నా నయాపైసా విడుదల చేయలేదు. బడ్జెట్లో చూపించి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది.

ఒక్క ఇటుకా వేయలేదు: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాజధానిని నిర్మిస్తామని టీడీపీ ఊదరగొట్టింది. కేంద్రం నుంచి దాదాపు 2,500 కోట్ల నిధులు అందినా శాశ్వత నిర్మాణానికి ఒక్క ఇటుకా వేయలేదు. తాత్కాలికం పేరిట రూ.వేల కోట్లను ఖర్చు చేసింది.

కలవరపరిచే అంచనాలు: కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టును టీడీపీ సర్కారు కమీషన్ల కోసం చేపట్టింది. ఇంకా 80 శాతానికి పైగా పనులు మిగిలే ఉన్నాయి. తొలుత అంచనా వ్యయం రూ. 16,010 కోట్లు కాగా టీడీపీ ప్రభుత్వం రూ. 58,319 కోట్లకు పెంచేసింది.

ఇళ్లకు నిధులు నిల్: పేదలకు రెండు లక్షల గృహాలు నిర్మిస్తామని మేనిఫెస్టోలో టీడీపీ పేర్కొంది. గత ఏడాది బడ్జెట్లో రూ.1,456 కోట్లు వ్యయం చేయనున్నట్లు ఘనంగా చెప్పి నిధులు ఇవ్వకపోవటంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. పట్టణ గృహ నిర్మాణానికి కేంద్రం ఇస్తున్న నిధులను సకాలంలో ఖర్చు చేయటం లేదు. ఇళ్ల కోసం 19,73,780 దరఖాస్తులు అందగా 2,18,591 దరఖాస్తులు తిరస్కరించారు. 17,55,189 దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారు.

చదువు లేదు.. చదివింపులే: కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అమలు చేస్తామని చెప్పిన టీడీపీ ఆ హామీ ఊసే మరిచింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూతవేయిస్తూ ప్రైవేట్ విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహిస్తోంది. నాలుగేళ్లలో హేతుబద్ధీకరణ, విలీనం పేరిట దాదాపు 3 వేల స్కూళ్లను మూయించింది.

అన్న క్యాంటీన్.. ఒకే ఒక్కటి: అన్న క్యాంటీన్ల పేరుతో మున్సిపాల్టీల్లో తక్కువ ధరకు పేదలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తామని హామీ ఇచ్చి కేవలం అమరావతిలో ఒకే ఒక్క క్యాంటీన్ ఏర్పాటు చేశారు.

కాపులకు దగా: కాపులను బీసీల్లో చేరుస్తామంటూ హామీ ఇచ్చిన టీడీపీ హడావుడిగా అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రంపై నెపం వేసి ఊపిరి పీల్చుకుంది. బోయలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టి అదీ కేంద్ర పరిధిలోకి నెట్టేసింది. ఇక రజకులు, మత్స్యకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు.

మెరుగైన వైద్యం హామీ గాలికి: ఎన్టీఆర్ హెల్త్‌కార్డు పథకం కింద ఆరోగ్యశ్రీ కంటే మెరుగైన సేవలు అందిస్తామన్న హామీని టీడీపీ ఎప్పుడో గాలికి వదిలేసింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తదితర చోట్లకు వెళుతున్న రోగులు వైద్యం అందక ఉసూరుమంటున్నారు. పనుల కోసం వలస వెళుతున్న పేదలు రేషన్ తీసుకోకపోవటంతో కార్డులను రద్దు చేస్తున్నారు. దీంతో వారికి వైద్యసేవలు అందటం లేదు.

మంత్రి నారాయణకు ఎస్పీ తొత్తు

- రాజీనామా చేసి పచ్చ జెండాలు మోసుకో
- గత ఎస్పీ విశాల్‌గున్నీ కాల్‌డేటాను బహిర్గతం చేయాలి
- అన్ని విషయాలపై జ్యుడీషియల్ విచారణకు సిద్ధమా!
- ఎస్పీకి ఎమ్మెల్యే కోటంరెడ్డి బహిరంగ సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరు జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ మంత్రి నారాయణకు తొత్తులాగా వ్యవరిస్తూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి హింసిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రామకృష్ణ తీరుపై మండిపడ్డారు. గత ఏడాది క్రికెట్ బెట్టింగ్ అంటూ పలువురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. ఈ విషయంపై జిల్లాలో ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఎటువంటి సంబంధం లేదని గత ఏడాది ఆగస్టు 14,16,18 తేదీలలో మూడుసార్లు స్వయంగా ఎస్పీ చెప్పారని గుర్తు చేశారు. అదే ఏడాది నంద్యాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో తమను బెట్టింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేయగా చట్టంపై గౌరవంతో రెండుసార్లు విచారణకు హాజరయ్యానని గుర్తు చేశారు.

ఇప్పుడు నోటీసులు ఏమిటి?

2017 మార్చిలో నగరంలో పేకాట ఆడుతూ పట్టుబడ్డవారు మీ పేరు చెప్పారని, ఆ విషయమై పోలీస్‌స్టేషన్‌కు విచారణకు హాజరు కావాలంటూ ఇప్పుడు తనకు నోటీసులు ఇవ్వడం ఏమిటని ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రశ్నించారు. అది కూడా ఉదయం 7.45కు నోటీసులు జారీ చేసి ఉదయం 7.30కు విచారణకు హాజరు కావాలని పోలీసులు తమ ఇంటి వద్ద హైడ్రామా చేయడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. మంత్రి నారాయణ ఆదేశాలతో ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ తనపై కేసులు నమోదు చేసి వేధించాలని చూస్తున్నారని ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆరోపించారు. మంత్రి నారాయణ మెప్పుకోసం, బదిలీనీ ఆపుకోవడం కోసం మంత్రి నారాయణ చెప్పినట్లు ఆడుతున్నారన్నారు. ఐపీఎస్‌కు రాజీనామా చేసి పసుపు చొక్కా వేసుకుని మంత్రి వెంట జెండాలు మోసుకోవాలని ఎస్పీకి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఎస్పీ నిజాయితీపరుడని ప్రజలను నమ్మిస్తున్నాడని, ఎస్పీ సతీమణి, ఎస్పీ తండ్రి ప్రభుత్వ వాహనాలలో ప్రభుత్వ ఖర్చుతో ఏ విధంగా తిప్పుతున్నారని ప్రశ్నించారు. అంతే కాకుండా ఎస్పీ బంధువులు తిరుమల వెళ్లాలంటే నెల్లూరు నుంచి కార్లు, అక్కడ రూములు ఎవరి సొమ్మో విచారణ చేయించాలన్నారు.

జ్యుడీషియల్ విచారణకు సిద్ధమా?

ఎస్పీగా రామకృష్ణ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసులపైనా, అదేవిధంగా ఏఎస్పీ గన్‌మెన్, మినిస్టీరియల్ సిబ్బంది ప్రసాద్, ఓ సీఐ మృతి చెందడం పైనా, గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్పీ విశాల్‌గున్నీ కాల్‌డేటాపైనా జ్యుడీషియల్ విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎస్పీ ఎవరికి తొత్తుగా పనిచేస్తున్నారో నిరూపిస్తానని, లేకుంటే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. ఎస్పీ తన నిజాయితీని నిరూపించలేక పోతే ఏమి నిర్ణయం తీసుకుంటారో ఆయన విజ్ఞతకే వదిలేస్తామన్నారు.

పీవీజీ రాజు వారసులకు ఎం.ఆర్. ఆస్పత్రి స్థలం

- విజయనగరంలోని ఆస్పత్రి భవనం, 1.48 ఎకరాల అప్పగింత
- లిఖిత పూర్వక ఆధారాలు లేకపోయినా అప్పగింతకు ప్రభుత్వం అంగీకారం

సాక్షి, అమరావతి: విజయనగరం పట్టణంలోని ఎం.ఆర్.ఆస్పత్రి భవనంతో పాటు అత్యంత విలువైన 1.48 ఎకరాల ఖాళీ స్థలాన్ని పీవీజీ రాజు వారసులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం టౌన్ సర్వే నంబర్ 166/1లో ఉన్న ఎం.ఆర్ ఆస్పత్రి భవనంతో పాటు 1.48 ఎకరాలలోని ఆక్రమణలను తొలగించి తమకు అప్పగించాలంటూ పీవీజీ రాజు వారసులు 2003 జూలై 24న ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. మహారాజ ఆస్పత్రిగా ప్రసిద్ధి చెందిన ఎం.ఆర్.ఆస్పత్రి భవనం, ప్రహరీతో సహా ఉన్న ఖాళీ స్థలం 1.48 ఎకరాలు పీవీజీ రాజుకు చెందిన ప్రైవేటు ఆస్తి అని, అందువల్ల ఆయన వారసులమైన తమకు అప్పగించాలని పీవీజీ రాజు కుమారులు ఆనంద గజపతిరాజు, అశోక్ గజపతిరాజు, వారి వారసులు, కుటుంబీకులు వినతిపత్రంలో కోరారు. తర్వాత ప్రభుత్వం కొత్త భవనం నిర్మించి ఎం.ఆర్ జిల్లా ఆస్పత్రిని అందులోకి మార్చింది. ఎస్టేట్ రద్దు చట్టం–1948లోని సబ్ సెక్షన్ 2 కింద ఈ ఆస్తిని తమకు ఇవ్వాలని పీవీజీ రాజు వారసులు కోరారు. అయితే ఆస్తి వారిదే అనడానికి ఆధారాలు లేనందున ప్రభుత్వం వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవనాన్ని, భూమిని తమకు అప్పగించాలని అశోక్ గజపతిరాజు ఒత్తిడి తెచ్చారు.

లిఖితపూర్వక ఆధారాలు లేవు..

విజయనగరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తూ.. 'విజయనగరం ఎస్టేట్ రాజా సాహెబ్‌గా ప్రసిద్ధి చెందిన దివంగత పీవీజీ రాజు విజయనగరంలో అనేక సేవా సంస్థలు ఏర్పాటు చేసి సేవలు అందించారు. ఎం.ఆర్.ఆస్పత్రికి వీరే చట్టబద్ధమైన వారసులు అనడానికి లిఖితపూర్వక ఆధారాలు లేవు. అయితే రాజా సాహెబ్ వారు ప్రజలకు వైద్య సేవలు అందించారని విజయనగరం పట్టణ ప్రముఖులు చెప్పారు' అని పేర్కొన్నారు. ఎం.ఆర్. జిల్లా ఆస్పత్రి రిజిస్టర్డ్ చారిటబుల్ ట్రస్టు కాదని, ఆస్పత్రి సూపరింటెండెంటు పేర్కొన్నారు. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత ఇది రిజిస్టర్డ్ చారిటబుల్ ట్రస్టు కాకపోయినా సేవా భావంతో రాజా సాహెబ్ ఈ ఆస్పత్రి ద్వారా సేవలందించారనే విషయం స్పష్టమైందని జిల్లా అధికార యంత్రాంగం పేర్కొంది. అందువల్ల ఎస్టేట్ రద్దు చట్టం–1948 ప్రకారం ఎం.ఆర్.ఆస్పత్రి భవనం, ఖాళీ స్థలాన్ని పీవీజీ రాజు వారసులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జీవోలో పేర్కొంది. ఈమేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్ సింగ్ బుధవారం జీవో జారీ చేశారు.

'ఆమె'కు ఆరోగ్యమూ సవాలే..

ఆందోళనకు గురిచేస్తున్న మహిళల ఆరోగ్య సమస్యలు • గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది బాధితులు
పది రకాల జబ్బులతో మహిళలు సతమతం • వెంటాడుతున్న జీవనశైలి, ఒత్తిడి, ఆందోళన
అవగాహన కల్పించడమే సరైన వైద్యమంటున్న వైద్యులు

సాక్షి, అమరావతి: సమాజంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలను ఆరోగ్య సమస్యలు కూడా సవాళ్లు విసురుతున్నాయి. జాతీయ కుటుంబ సంక్షేమశాఖ, ప్రపంచ ఆరోగ్యసంస్థ, నేషనల్ కమ్యూనికబుల్ డిసీజెస్ సర్వే వంటి పలు సంస్థలు వెల్లడించిన ఫలితాలను బట్టి వివిధ జబ్బుల బారిన పడుతున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నట్టు వెల్లడైంది. అనారోగ్యం పాలవుతున్న మహిళల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలవారే ఉండటం కలవరపరిచే అంశం. మహిళల్లో జబ్బులపై అవగాహన ఉన్న వారు 10 శాతం కూడా లేకపోవడం గమనార్హం. జబ్బు సోకిన తర్వాత కూడా వైద్యానికి వెళ్లడంలో జాప్యం చేస్తున్న వారు చాలామంది ఉంటున్నటుసర్వేల్లో తేలింది. రాష్ట్రంలో మహిళలను ముఖ్యంగా పది రకాల జబ్బులతో సతమతం అవుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆ పదిరకాల జబ్బులూ...



సర్వైకల్ కేన్సర్: దీన్నే గర్భాశయ ముఖద్వార కేన్సర్ అంటారు. దీనివల్ల ఏటా దేశంలో 62 వేల మందిపైనే మృతి చెందుతున్నారు. దీనికి ఒక చిన్న పాప్‌స్మియర్ టెస్టుతో నిర్ధారణ చేసుకునే అవకాశం ఉంది. ఈ విషయం చాలా మందికి తెలియదు.

రొమ్ము కేన్సర్: ఈ వ్యాధి 40 ఏళ్ల లోపువారికే ఎక్కువగా వస్తుండటం కలచివేస్తున్న అంశం. ఈ మధ్యకాలంలో దీని తీవ్రత బాగా పెరిగింది. సోనోమామోగ్రఫీ టెస్టుద్వారా ఏటా ఒక్కసారి నిర్ధారణ చేసుకుని వ్యాధి నుంచి బయటపడవచ్చు.

పీసీఓఎస్: దీన్నే పాలిసిస్టిక్ ఓవరిన్ సిండ్రోమ్ అంటారు. హార్మోన్ల ప్రభావం వల్ల రుతుక్రమం సరిగా జరగక పోవడం దీనికి కారణం. ఈ వ్యాధిపై గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన లేదు. దీనివల్ల ఎక్కువ మందిలో గుండెజబ్బులకు గురవుతున్నారు.

వంధ్యత్వం: దీన్నే ఇన్‌ఫెర్టిలిటీ అని అంటారు. ఉద్యోగం చేసే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్నట్టు తేలింది. కెరీర్‌పై దృష్టితో చాలా ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. దాంతో పాటు పెళ్లయిన తర్వాత వెంటనే పిల్లల్ను కనడానికి ఇష్టపడటం లేదు. దీంతో రకరకాల సమస్యలు వచ్చి, పిల్లలు కనడానికి దూరమవుతున్నట్టు డబ్ల్యూహెచ్‌వో చెబుతోంది.

చిన్నవయసులో రుతుక్రమం ఆగిపోవడం: దీన్నే వైద్య పరిభాషలో ప్రీమెచ్యూర్ మెనోపాజ్ అంటారు. రకరకాల ఒత్తిళ్ల కారణంగా వీరికి రుతుక్రమం 35 ఏళ్లలోపే ఆగిపోతోంది. దీనివల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు వస్తున్నాయి. ప్రధానంగా గుండె సంబంధిత జబ్బుల బారిన పడుతున్నారు.

గుండెజబ్బులు: దేశవ్యాప్తంగా మహిళల్లో గుండెజబ్బుల తీవ్రత పెరిగింది. దీనికి ప్రధాన కారణం మోనోపాజ్ అంటున్నారు వైద్యులు. దీన్ని అధిగమించడానికి ప్రతి ఏడాది వైద్య పరీక్షలు తప్పనిసరి అని చెబుతున్నారు.

ఆస్టియోపోరోసిస్: ఈస్ట్రోజెన్ హార్మోన్ తక్కువగా ఉండటం వల్ల ఈ వ్యాధి వస్తున్నట్టు డబ్ల్యూహెచ్‌వో గుర్తించింది. 80 శాతం మంది మహిళలకు దీనిపై అవగాహన లేదు. 35 ఏళ్లకే మెనోపాజ్ దశకు వచ్చిన మహిళల్లో ఎక్కువ మంది ఉన్నారు. ప్రధానంగా ఇది కీళ్లు, ఎముకలకు సంబంధించినది. ప్రతి ఏడాదీ బోన్‌డెన్సిటీ పరీక్షలు చేసుకోవాలని చెబుతున్నారు.

ఒత్తిడి: మహిళల్లో చదువుతున్న వారు, ఉద్యోగాలు చేస్తున్న వారు ఎక్కువగా ఉన్నారు. దీంతో పాటే ఒత్తిడిలో ఉన్న మహిళల సంఖ్య పెరుగుతోంది. తాము ఒత్తిడిలో ఉన్నామన్న విషయం ఆ మహిళలూ గుర్తించలేక పోతున్నారు. ఉద్యోగం చేస్తున్న మహిళల్లో 87 శాతం మంది మహిళలు ఒత్తిడిలోనే ఉన్నట్టు తేలింది.

ఆందోళన: దీన్నే యాంగ్జయిటీ అంటారు. హార్మోన్ల ప్రభావం వలన మహిళలు ఎక్కువ మంది యాంగ్జయిటీ లేదా డిప్రెషన్‌కు గురవుతున్నారు. దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో ఏమాత్రం అవగాహన లేదని నిపుణులు చెబుతున్నారు.

ఊబకాయం: ఇటీవల కాలంలో పట్టణీకరణ నేపథ్యంలో ఎక్కువ మంది మహిళలు ఊబకాయం (ఒబెసిటీ)కి గురవుతున్నారు. దీనివల్ల క్లోమగ్రంథి, కాలేయం, థైరాయిడ్ తదితర కేన్సర్‌లకు గురవుతున్నట్టు తేలింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మహిళలకు తినే తిండిపైనా, వ్యాయామంపైనా అవగాహన లేకపోవడమే దీనికి కారణం.

వ్యాధి	బాధితుల సంఖ్య
సర్వైకల్ కేన్సర్	ప్రతి 40 మందిలో ఇద్దరికి
రొమ్ము కేన్సర్	ప్రతి 28 మందిలో ఒకరికి
పీసీఓఎస్	ప్రతి 100లో 20 మందికి
ఊబకాయం	ప్రతి 100లో 33.2 మంది
రక్తహీనత	ప్రతి 100లో 60 మంది
వంధ్యత్వం	ప్రతి 100లో 10 మందికి (35 ఏళ్లు దాటినవారిలో)
ఆస్టియోపోరోసిస్	ప్రతి ముగ్గురిలో ఒకరు (55 ఏళ్లు దాటిన వారిలో)
ఒత్తిడి (స్ట్రెస్)	ప్రతి 100లో 48 మందికి (ఉద్యోగం చేస్తున్న వారిలో)
ఆందోళన లేదా డిప్రెషన్	ప్రతి 100లో 51 మందికి (ఉద్యోగం చేస్తున్నవారిలో)
ముందే రుతుక్రమం ఆగిపోవడం	ప్రతి 100లో 15 మందికి (40 ఏళ్ల వయసు)
గుండె సమస్యలు	ప్రతి 100లో 08 మందికి (రుతుక్రమం ఆగిపోయిన వారిలో)

అవగాహన ముఖ్యం



మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో ఎక్కువ జీవనశైలికి సంబంధించినవే. వీటిని అధిగమించాలంటే మహిళల్లో అవగాహన పెరగాలి. ముఖ్యంగా నలభై ఏళ్లు దాటిన మహిళలు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. గర్భాశయ ముఖద్వార కేన్సర్ నివారణకు వ్యాక్సిన్‌లు వచ్చాయి. 26 ఏళ్లలోపు అమ్మాయిలు దీన్ని వేసుకోవచ్చు. అవగాహన కల్పించడం, తిండిలో కాసిన్ని మార్పులు చేస్తే మహిళలు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంది.

– డా.సీహెచ్.సులోచనాదేవి, కేన్సర్ వైద్య నిపుణులు, బ్రెస్ట్‌కేర్ సెంటర్

అవినీతి కేసుల్లో సాక్ష్యాలు సంపాదించాలి

అధికారులతో ఏసీబీ డీజీ ఠాకూర్ త్రైమాసిక సమీక్ష

సాక్షి, అమరావతి: అవినీతి కేసుల్లో నిందితులకు సంబంధించి కట్టుదిట్టమైన సాక్ష్యాలను సంపాదించి, వారికి శిక్షపడేలా దర్యాప్తు చేయాలని ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో త్రైమాసిక సమీక్షను బుధవారం ఆయన నిర్వహించారు. 13 జిల్లాల ఏసీబీ డీఎస్పీలు, ప్రధాన కార్యాలయంలోని పలువురు అధికారులతో జరిపిన సమావేశంలో కీలక అంశాలు చర్చించారు. గత 3 నెలలుగా దర్యాప్తు జరగని పెండింగ్ కేసులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, ట్రాప్ (లంచం) కేసుల వారీగా సమీక్షించారు. ఆయా కేసుల్లో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ శాఖల్లోనూ అవినీతి అధికారులను గుర్తించి వారిపై దృష్టి పెట్టాలని సూచించారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయండి

వీలుకాకపోతే టైమ్ స్కేల్ అమలు చేయాలని ఎమ్మెల్సీల కమిటీ సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్సీల కమిటీ అభిప్రాయపడింది. అది కుదరకపోతే టైమ్ స్కేల్ అమలు చేయాలని, 60 ఏళ్ల వయసు వరకు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కాంట్రాక్టు లెక్చరర్లు.. 1998, 2008, 2012 డీఎస్సీల క్వాలిఫైడ్ అభ్యర్థులు, ఇతర సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీల కమిటీ బుధవారం ఇంటర్ బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి అధ్యక్షతన సచివాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, జి.శ్రీనివాసులు నాయుడు, వి.బాలసుబ్రహ్మణ్యం, ఏఎస్ రామకృష్ణ, బి.నాగేశ్వరరావు, విద్యా శాఖ జాయింట్ డైరక్టర్లు రవీంద్రనాథ్‌రెడ్డి, నరసింహారావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఒప్పంద అధ్యాపకులకు రెండో దశలో భాగంగా సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్ష నిర్వహించి రెగ్యులర్ చేయాలని కమిటీ సూచించింది.

భత్యాలు ప్రస్తుత పీఆర్సీ ప్రకారం చెల్లించాలి

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: త్వరలో ప్రారంభం కానున్న ఎస్సెస్సీ పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు ఆఫీసర్ల భత్యాలు 2010 పీఆర్సీ ప్రకారం కాకుండా సవరించిన ప్రస్తుత పీఆర్సీ ప్రకారం చెల్లించాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అడహక్ కమిటీ ఛైర్మన్ వి.రెడ్డి శేఖరరెడ్డి డిమాండ్ చేశారు. ఇన్విజిలేటర్లకు ఇచ్చే ప్రయాణభత్యం రూ. 20 ఏ మాత్రం సరిపోదని దీనిని ప్రస్తుత చార్జీలకనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణ (పేపర్లు, దారాలు, క్లాత్, సీల్, పార్శిల్ తదితర ఖర్చులు) కోసం విద్యార్థికి కేవలం రూ. 5 చెల్లిస్తున్నారని, ఇవి ఏమాత్రం సరిపోవన్నారు.

సమగ్ర స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రస్తుతం ప్రతి జిల్లా కేంద్రంలో ప్రైవేట్ స్కూళ్లలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని, ఇది సరికాదని శేఖరరెడ్డి పేర్కొన్నారు. ఇలా కాకుండా ప్రభుత్వమే ప్రతి జిల్లా కేంద్రంలో సమగ్ర మౌలిక సదుపాయాలతో ఎస్సెస్సీ స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. స్పాట్ వ్యాల్యుయేషన్ డ్యూటీ చేసేందుకు ఇష్టం లేని వారిని మినహాయించాలన్నారు. స్పాట్ వ్యాల్యుయేషన్లో సీఈ, ఏఈ, స్పాట్ అసిస్టెంట్ల భత్యాలను కూడా ప్రస్తుత పీఆర్సీ ప్రకారం చెల్లించాలన్నారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



పదో తరగతి తెలుగు పేపర్-2
మాదిరి ప్రశ్నపత్రం

బీఆర్ఏయూఎస్‌కేఎల్ఎం సెట్-2018

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం.. 2018-19కిగాను వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో వివిధ మాస్టర్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ.. 'డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ శ్రీకాకుళం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(డీఆర్.బీఆర్ఏయూఎస్‌కేఎల్ఎం సెట్)-2018' నోటిఫికేషన్ విడుదల చేసింది. **కోర్సులు:** ఎంఏ, ఎంకామ్, ఎం.ఎల్ఐ.ఎస్సీ, ఎంజేఎంసీ, ఎం.ఈడీ, ఎంఎస్సీ. **అర్హతలు:** సంబంధిత కోర్సులు, విభాగాలను బట్టి డిగ్రీ/ డిగ్రీ+బీఈడీ. ఎంఈడీ కోర్సుకు డీఈడీనీ పరిగణిస్తారు. **ఎంపిక:** బీఆర్ఏయూసెట్ రాతపరీక్ష. **పరీక్ష కేంద్రాలు:** శ్రీకాకుళం, పలాస, బొబ్బిలి, విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి. **దరఖాస్తు రుసుం:** రూ.500 ; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.300. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** ఏప్రిల్ 6, 2018. వెబ్‌సైట్: www.brau.edu.in

విద్య, ఉద్యోగ సమాచారం



జిప్‌మెర్ పుదుచ్చేరిలో ఎంబీబీఎస్ ప్రవేశాలు

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జేఐపీఎంఈఆర్: జిప్‌మెర్).. 2018-19కి గాను పుదుచ్చేరి, కరైకల్ బ్రాంచుల్లో ఎంబీబీఎస్ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. దీనిద్వారా పుదుచ్చేరిలో 150, కరైకల్‌లో 50 సీట్లను భర్తీ చేస్తారు.

- **కోర్సు:** ఎంబీబీఎస్.
- **వ్యవధి:** 4 ఏళ్ల 6 నెలలతోపాటు ఏడాది తప్పనిసరి ఇంటర్న్‌షిప్.
- **అర్హతలు:** ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్/తత్సమాన విద్య. ఈ కోర్సుల ద్వితీయ సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** డిసెంబర్ 31, 2017/ప్రవేశ సమయం నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఎంపిక:** ప్రవేశపరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్:సీబీటీ).
- **పరీక్ష విధానం:** దీన్ని మల్టిపుల్ చాయిస్ విధానంలో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో ఒక్కోదాన్నుంచి 60 ప్రశ్నల చొప్పున, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 10, లాజికల్ అండ్ క్వాంటిటేటివ్ రీజనింగ్ నుంచి 10 చొప్పున మొత్తం 200 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.1,500; ఎస్సీ/ఎస్టీ-రూ.1,200.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 13, 2018.
- **వెబ్‌సైట్:** www.jipmer.puducherry.gov.in

ఎస్ఆర్ఎఫ్ఎంటీటీఐ అనంతపురం... 6 ఖాళీలు

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ట్రాక్టర్ నగర్‌లోని సదరన్ రీజియన్ ఫార్మ్ మెషినరీ ట్రెనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఆర్ఎఫ్ఎంటీటీఐ)లో 6 ఖాళీల భర్తీకి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులు సంస్థ అవసరాన్ని బట్టి వ్యవసాయ మంత్రిత్వశాఖకు దేశవ్యాప్తంగా ఉన్న ఏ ఇన్‌స్టిట్యూట్‌లో అయినా పనిచేయాల్సి ఉంటుంది.

- **పోస్టు-ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్(టీఏ)-3(అన్‌రిజర్వ్‌డ్-2+ ఓబీసీ-1); సీనియర్ టెక్నీషియన్ (ఎస్‌టీ)-3(ఓబీసీ-1+ అన్‌రిజర్వ్‌డ్-2).
- **వేతనశ్రేణి:** టీఏ-రూ.29,200-రూ.92,300; ఎస్‌టీ-రూ.25,500-రూ.81,100.
- **అర్హతలు:** టీఏకు.. ఇంజనీరింగ్ డిప్లొమా(అగ్రికల్చర్)తోపాటు సంబంధిత రంగంలో కనీసం ఐదేళ్ల అనుభవం; ఎస్‌టీకి.. ఐటీఐ(మెకానిక్ అగ్రికల్చరల్ మెషినరీ/మెకానిక్ మోటార్ వెహికల్/మెకానిక్ ట్రాక్టర్/మెకానిక్ డీజిల్ ఇంజిన్/ఎలక్ట్రీషియన్)తోపాటు ట్రాక్టర్/హెవీ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్/హెవీ ఎర్త్‌మూవింగ్ ఎక్విప్‌మెంట్స్/ఎలక్ట్రికల్ మెయింటెన్స్‌కు సంబంధించిన ఆపరేషన్స్, మెయింటెనెన్స్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అలాగే డ్రైవింగ్ లైసెన్స్(లైట్, హెవీ, ట్రాక్టర్) తప్పనిసరి.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 18-27ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఏదైనా ప్లెయిన్ పేపర్‌లో వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి 'డైరెక్టర్, సదరన్ రీజియన్ ఫార్మ్ మెషినరీ ట్రెనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్‌స్టిట్యూట్, ట్రాక్టర్ నగర్, గార్లదిన్నె-515731, అనంతపురం (జిల్లా), ఆంధ్రప్రదేశ్' చిరునామాకు గడువులోగా పంపాలి.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** నోటిఫికేషన్ వెలువడిన 45 రోజుల్లోపు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** srfmtti.dacnet.nic.in, agricoop.nic.in



హయ్యర్ ఎడ్యుకేషన్



సైన్స్ విద్యకు సరైన వేదికలు...

ఐఐఎస్ఈఆర్

సైన్స్‌తోనే సామాజిక ప్రగతి అనే భావనతో దేశవ్యాప్తంగా ఏడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి నుంచే సైన్స్ పరిశోధనల దిశగా విద్యార్థులకు అవగాహన కలిగించేలా పలు కోర్సులు నిర్వహిస్తోంది. నాణ్యమైన పరిశోధనా విద్యను అందించడంలో ఐఐఎస్ఈఆర్‌లకు మంచి పేరుంది. దేశంలో బరంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలి, పుణె, తిరువనంతపురం, తిరుపతిల్లోని ఐఐఎస్ఈఆర్‌లు.. బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు నోటిఫికేషన్ వెలువరించాయి. ఈ నేపథ్యంలో.. బీఎస్-ఎంఎస్ కోర్సు ప్రత్యేకత, దరఖాస్తు విధానం, ప్రవేశపరీక్ష, ఉద్యోగావకాశాల గురించి తెలుసుకుందాం...

- **కోర్సు:** బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్.
- **కాలవ్యవధి:** ఐదేళ్లు (10 సెమిస్టర్లు).
- **అర్హత:** 10+2/ ఇంటర్మీడియట్ సైన్స్ విభాగంలో ఉత్తీర్ణత. (2017-18లో పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు).
- ఐఐఎస్ఈఆర్, భోపాల్ అందించే ఐదేళ్ల బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్ ఇన్ ఇంజనీరింగ్ సైన్సెస్, నాలుగేళ్ల బీఎస్ ప్రోగ్రామ్ ఇన్ ఎకనామిక్ సైన్సెస్ విద్యార్థులు మాత్రం 10+2 స్థాయిలో మ్యాథమెటిక్స్ సబ్జెక్టును తప్పనిసరిగా చదివుండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో మాత్రమే
- **దరఖాస్తు ఫీజు:** రూ.2000(ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.1000)

ప్రవేశానికి మూడు మార్గాలు

- దేశంలోని ఏడు ఐఐఎస్ఈఆర్‌లలో బీఎస్-ఎంఎస్ కోర్సు ప్రవేశ విధానం ఒకేలా ఉంటుంది.
  1. కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహ యోజన(కేవీపీవై).
  2. జేఈఈ అడ్వాన్స్‌డ్-2018.
  3. స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్స్ (ఎస్‌సీబీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఎస్‌సీబీ ద్వారా ఐఐఎస్ఈఆర్‌లో ప్రవేశించాలనుకునే అభ్యర్థులు.. ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. జూన్‌లో జరిగే ఈ అర్హత పరీక్షలో 11వ, 12వ తరగతి సిలబస్(సాధారణంగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను అనుసరిస్తారు) నుంచి ప్రశ్నలుంటాయి. బయాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 15 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలుంటాయి. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలిస్తారు. మూడు గంటల వ్యవధిలో సమాధానాలు గుర్తించాలి. ప్రతి కచ్చితమైన సమాధానానికి 3 మార్కులు, ఎలాంటి సమాధానం గుర్తించకుంటే 0 మార్కులు, తప్పు సమాధానానికి-1 మార్కు ఉంటుంది. ప్రశ్న పత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ భాషలో పరీక్ష రాయదలుచుకున్నారో తెలపాల్సి ఉంటుంది.

తిరుపతిలో

ఐఐఎస్ఈఆర్ తిరుపతిని 2015లో ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ బీఎస్-ఎంఎస్ కోర్సుతోపాటు పీహెచ్‌డీ ప్రోగ్రామ్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ అందుబాటులో ఉన్నాయి. నిష్ణాతులైన బోధనా సిబ్బంది, పరిశోధనలే లక్ష్యంగా అకడమిక్ కరిక్యులం, అత్యాధునిక లైబ్రరీ, హాస్టల్ సదుపాయం ఐఐఎస్ఈఆర్‌ల ప్రత్యేకతలు. పూర్తిగా రెసిడెన్షియల్ విధానం. విద్యార్థులు క్యాంపస్‌లో ఏర్పాటైన హాస్టల్స్‌లోనే ఉండాల్సి ఉంటుంది. ప్రతియేటా ప్రముఖ కంపెనీలతో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తారు. అంతేకాకుండా పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులపై ఆసక్తి ఉన్న వాళ్లకి దేశ విదేశాల్లో ఉన్న అవకాశాలపైనా అవగాహన కల్పిస్తారు. వ్యాపార వేత్తలుగా కెరీర్ ప్రారంభించాలనుకునే విద్యార్థులకు సూచనలు, సలహాలు అందిస్తారు.

భిన్నమైన బీఎస్-ఎంఎస్

బీఎస్-ఎంఎస్ ఐదేళ్ల డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్. ఇంజనీరింగ్, మెడికల్ విద్యతో సమానంగా సైన్స్ విద్యను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ కోర్సు ప్రారంభించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఇంటర్మీడియట్ స్థాయి నుంచే పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడంలో బీఎస్-ఎంఎస్ కోర్సు కీలక పాత్ర పోషిస్తోంది. ఐదేళ్ల కోర్సు కాలంలో క్లాస్ రూం టీచింగ్, ప్రాజెక్ట్, రీసెర్చ్ వర్క్.. అన్నీ సమపాళ్లలో ఉండేలా కరిక్యులం రూపకల్పన జరుగుతుంది. మొదటి రెండేళ్లు బేసిక్స్ సైన్స్ సబ్జెక్టులైన బయోలాజికల్, కెమికల్, మ్యాథమెటికల్, ఫిజికల్, ఎర్త్ సైన్స్‌లకు సంబంధించి బేసిక్స్ అధ్యయనం చేయాలి. మూడు, నాలుగో ఏడాదిలో ఒక మేజర్ సబ్జెక్టుతోపాటు ఇంటర్‌డిసిప్లినరీ ఆప్షనల్ సబ్జెక్ట్ ఉంటుంది. ఐదో ఏడాది పూర్తిగా పరిశోధన, టెక్నికల్ ప్రాజెక్ట్, ప్రత్యేక శిక్షణకు కేటాయిస్తారు. వీటితోపాటు ప్రతి ఏడాది చివర్లో సమ్మర్ ప్రాజెక్ట్ ఉంటుంది. దీన్ని ఐఐఎస్ఈఆర్‌లోనే కాకుండా.. ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో, విదేశాల్లో చేసే వెసులుబాటు ఉంది.

సీట్ల కేటాయింపు

దేశవ్యాప్తంగా ఉన్న ఏడు ఐఐఎస్ఈఆర్‌లలో బీఎస్-ఎంఎస్ కోర్సుకు సంబంధించి మొత్తం 1300 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు ఉంటాయి. 50 శాతం సీట్లను కేవీపీవై, జేఈఈ ద్వారా; మిగతా 50 శాతం సీట్లను ఎస్‌సీబీ విధానం ద్వారా భర్తీ చేస్తారు.

ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు	సీట్లు
తిరుపతి	- 150
బరంపూర్	- 100
భోపాల్-250(బేసిక్ సైన్సెస్ 200, ఇంజనీరింగ్ సైన్సెస్ 50)	
కోల్‌కతా	- 200
మొహాలి	- 200
పుణె	- 200
తిరువనంతపురం	- 200

స్కాలర్‌షిప్ సౌకర్యం



ఐఐఎస్ఈఆర్‌ల్లో ప్రవేశం పొందిన కేవీపీవై స్కాలర్స్‌కు ...కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహ యోజన నిబంధలను అనుసరించి ఫెలోషిప్ లభిస్తుంది. దీంతోపాటు జేఈఈ, ఎస్‌సీబీ విధానంలో అడ్మిషన్ విద్యార్థులకు పరిమిత సంఖ్యలో ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉన్నాయి. ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్ పొందిన వారికి నెలకు రూ.5000 అందుతుంది. ఆ తర్వాత కోర్సులో చదివేటప్పుడు విద్యార్థి చూపే ప్రతిభను అనుసరించి స్కాలర్‌షిప్ కొనసాగించాలా వద్దా అనే విషయాన్ని నిర్ణయించే అవకాశముంది.

ఉద్యోగ వేదికలు

- గవర్నమెంట్ లాబొరేటరీస్
- ఫార్మా అండ్ కెమికల్ ఇండస్ట్రీలు
- సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- విద్యాసంస్థలు(టీచింగ్)
- సైన్స్ జర్నలిజం
- సైన్స్ మీడియా(మూవీస్, డాక్యుమెంటరీస్ ఆన్ సైన్స్)
- https://www.iiseradmission.in/

ఆస్కార్ ఉత్తమ చిత్రం'ది షేప్ ఆఫ్ వాటర్'



కాంపిటీటివ్ గైడెన్స్
కరెంట్ అఫైర్స్

అవార్డులు

ఆస్కార్ ఉత్తమ చిత్రం ది షేప్ ఆఫ్ వాటర్
90వ ఆస్కార్ అవార్డులను లాస్ ఏంజిల్స్ (అమెరికా)లో 2018, మార్చి 5న ప్రధానం చేశారు. ఈ ఏడాది 'ది షేప్ ఆఫ్ వాటర్'కు ఉత్తమ చిత్రం అవార్డు లభించింది. ఈ సినిమాకు ఈ సంవత్సరం ఎక్కువ అవార్డులు దక్కాయి. బెస్ట్ పిక్చర్‌తోపాటు బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్.. ఇలా మొత్తం నాలుగు అవార్డులు లభించాయి.

అవార్డులు-విజేతలు

బెస్ట్ పిక్చర్	: ది షేప్ ఆఫ్ వాటర్
బెస్ట్ డైరెక్టర్	: గెలెర్మో డెల్టొరో(ది షేప్ ఆఫ్ వాటర్)
బెస్ట్ యాక్ట్రెస్ లీడింగ్ రోల్	: ఫ్రాన్సెస్ మెక్ డోర్మండ్(త్రీ బిల్ బోర్డ్స్ ఔట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
బెస్ట్ యాక్టర్ లీడింగ్ రోల్	: గ్యారీ ఓల్డ్‌మేన్(డార్కెస్ట్ అవర్)
బెస్ట్ యాక్ట్రెస్ సపోర్టింగ్ రోల్	: ఎలిసన్ జేనీ (ఐ, టోన్యా)
బెస్ట్ యాక్టర్ సపోర్టింగ్ రోల్	: సామ్ రాక్‌వెల్(త్రీ బిల్ బోర్డ్స్ ఔట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
బెస్ట్ స్క్రీన్ ప్లే (ఒరిజినల్)	: జోర్డాన్ పీలే(గెట్ ఔట్)

జాతీయం

ఎంపీల అలవెన్సుల పెంపునకు ఆమోదం
పార్లమెంటు సభ్యులకు అందజేస్తున్న అలవెన్సులను పెంచాలన్న పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ప్రతిపాదనకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ 2018, ఫిబ్రవరి 28న ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం-ఎంపీలకు ప్రతినెలా చెల్లించే నియోజకవర్గ అలవెన్స్ రూ.45వేల నుంచి రూ.70వేలకు చేరుకోనుంది. అలాగే ఆఫీస్ ఖర్చుల కోసం అందిస్తున్న అలవెన్స్ రూ.45వేల నుంచి రూ.60వేలకు చేరుకోనుంది. వీటికి అదనంగా ఐదేళ్లకోసారి అందించే ఫర్నిచర్ అలవెన్స్‌ను రూ.75వేల నుంచి రూ.లక్షకు పెంచారు. ఎంపీల మూలవేతనాన్ని ప్రస్తుతమున్న రూ.50వేల నుంచి రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది.

భారీ సౌర విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభం
కర్ణాటకలోని తుమకూరు జిల్లా పావగడ సమీపంలోని భారీ సౌర విద్యుదుత్పత్తి కేంద్రం మొదటి దశను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2018, మార్చి 1న ప్రారంభించారు. ఈ కేంద్రం సామర్థ్యం 2,000 మెగావాట్లు. రూ.16,500 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ సౌర పార్క్ మొదటి దశలో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించింది.

10 మంది మావోయిస్టులు మృతి
తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో 2018, మార్చి 2న జరిగిన ఎన్‌కౌంటర్లో 10మంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్స్ కమాండో మరణించారు. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా, వెంకటాపురం మండలం తిమ్మాపురం సమీపంలోని తడపల గుట్టల్లో ఈ ఘటన చోటుచేసుకుంది.


మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు
త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ శాసన సభలకు జరిగిన ఎన్నికల ఫలితాలను 2018, మార్చి 3న ప్రకటించారు.
త్రిపుర: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తమ భాగస్వామి ఐపీఎఫ్‌టీ(ఇండీజినెస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర)తో కలిసి ఆధిక్యాన్ని సాధించింది. 60 శాసన సభ స్థానాలకుగానూ ఎన్నికలు జరిగిన 59 స్థానాల్లో 43 భాజపా కూటమికి దక్కాయి. దీంతో 25ఏళ్లుగా అధికారంలో ఉన్న సీపీఎం ఓటమి పాలైంది.
నాగాలాండ్: నాగాలాండ్‌లో ఏ పార్టీకి పూర్తి ఆధిక్యత లభించలేదు. 60 స్థానాలు గల శాసన సభలో... అధికార ఎన్‌పీఎఫ్(నాగా పీపుల్స్ ఫ్రంట్)కు 27 స్థానాలు లభించాయి. బీజేపీకి 11, ఎన్డీపీపీ(నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ) 16 స్థానాలు లభించాయి.
మేఘాలయ: మేఘాలయలో ఏ పార్టీకి పూర్తి ఆధిక్యం దక్కలేదు. 60 స్థానాలున్న సభలో.. అధికార కాంగ్రెస్ 21 స్థానాలతో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. బీజేపీకి కేవలం రెండు సీట్లే దక్కినా.. ఆ పార్టీ భాగస్వామి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) మాత్రం 19 చోట్ల నెగ్గింది. నేషనల్ పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు కాన్రాడ్ సంగ్మా మార్చి 6న మేఘాలయ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు.

అంతర్జాతీయం

జోర్డాన్ రాజు అబ్దుల్లా భారత పర్యటన
'ఇస్లామిక్ సంస్కృతి, అవగాహన పెంపొందించుట, సంయమనం' అనే అంశంపై న్యూఢిల్లీలో జరిగిన సదస్సులో జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 బిన్ అల్ హుస్సేన్‌తో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2018, మార్చి1న ప్రసంగించారు. అనంతరం పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై జోర్డాన్ రాజుతో మోదీ విస్తృతస్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక పోరు సహా 12 ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. వైద్యం, మెడిసిన్, రాక్‌ఫాస్ఫేట్, ఎరువుల దీర్ఘకాల సరఫరా, కస్టమ్స్ అంశంలో పరస్పర సహకారం తదితర వాటిపై ఇరు దేశాల మధ్య అవగాహన కుదిరింది.



వియత్నాం అధ్యక్షుడి భారత పర్యటన



వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డయ్ క్వాంగ్ భారత పర్యటనలో 2018,మార్చి3న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై పలు అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం అణుశక్తి, వాణిజ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకారానికి మూడు ఒప్పందాలపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. పారదర్శకంగా, సుసంపన్నంగా ఇండో-పసిఫిక్' ప్రాంతాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కలిసి పనిచేయాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. మరోవైపు ఏషియాన్‌తో భారత్ బహుళ దృక్పథ బంధాన్ని తాము సమర్థిస్తామని, దక్షిణ చైనా వివాదం అంశాన్ని ప్రస్తావిస్తూ వియత్నాం అధ్యక్షుడు పేర్కొన్నారు.

పాక్‌లో సెనేటర్‌గా కృష్ణకుమారి కొహ్లి



పాకిస్థాన్‌లో తొలిసారి ఓ హిందూ దళిత మహిళ సెనేటర్‌గా ఎన్నికయ్యారు. సింధ్ ప్రావిన్స్‌కు చెందిన కృష్ణకుమారి కొహ్లి(39) పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) ప్రతినిధిగా పాక్ సెనేటకు ఎన్నికయ్యారు. మైనారిటీలకు ప్రత్యేకించిన సింధ్ స్థానం నుంచి దళిత మహిళ అయిన కొహ్లి ఎన్నికైన విషయాన్ని పీపీపీ 2018,మార్చి4న ఒక ప్రకటనలో తెలిపింది. సింధ్ విశ్వవిద్యాలయం నుంచి సోషియాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన కొహ్లి సామాజిక కార్యకర్తగా పీపీపీలో చేరారు.

రాష్ట్రీయం

ఆదిభట్లలో టాటా- బోయింగ్ వైమానిక ఉత్పత్తుల పరిశ్రమ ప్రారంభం
రంగారెడ్డి జిల్లాలోని ఆదిభట్లలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) వైమానిక సెజ్‌లో టాటా-బోయింగ్ వైమానిక ఉత్పత్తుల పరిశ్రమను 2018, మార్చి1న కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా, అమెరికా రాయబారి కెన్నత్ జెస్టర్‌లతో కలిసి ప్రారంభించారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

తేజస్ కీలక పరీక్ష విజయవంతం
స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన తేలిక పాటి యుద్ధ విమానం(ఎల్‌సీఏ) తేజస్ మరో కీలక పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది. 2018, ఫిబ్రవరి 26న హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) ఎయిర్‌పోర్ట్ నుండి బయలుదేరిన తేజస్ ఎల్ఎస్‌పీ8 విమానం తిరిగి సురక్షితంగా చేరుకోవటంతోపాటు, ఇంజిన్ ఆన్‌లో ఉండగానే ఇంధనం నింపుకొంది. ఇలాంటి సదుపాయం ఉన్న భారత వైమానిక దళ విమానాల్లో తేజస్ మొట్టమొదటిది.

వార్తల్లో వ్యక్తులు

సాహితీ వేత్త నాయని కృష్ణమూర్తి మృతి
ప్రముఖ రచయిత, సాహితీ వేత్త నాయని కృష్ణమూర్తి(67) 2018, మార్చి1న మరణించారు. పాఠశాల విద్యార్థుల కోసం ఆయన తీసుకొచ్చిన మాబడి, పాఠశాల పుస్తకాలు విశేష ఆదరణ పొందాయి. ఆయన పలు నవలలు రాశారు.

ఉమా సుధీర్ కు చమేలీ దేవి అవార్డు
2017 సంవత్సరానికి ప్రతిష్టాత్మక చమేలీ దేవి అవార్డు ఎన్డీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్‌కు లభించింది. రాజకీయాలు, పిల్లలు, మహిళలు, మానవ హక్కులు, వ్యవసాయం, గ్రామీణ సమస్యలు, మైనారిటీల సమస్యలు తదితరాలపై ఆమె విస్తృతంగా వెలువరించిన కథనాలకు ఈ గుర్తింపు లభించింది. ఉమా సుధీర్ విశ్లేషణాత్మక కథనాలు క్షేత్రస్థాయిలో వాస్తవాలపై అవగాహన కలిగించేందుకు దోహదపడ్డాయని అవార్డు అందించే మీడియా ఫౌండేషన్ పేర్కొంది.

క్రీడలు

విజయ్ హజారే ట్రోఫీని గెలుచుకున్న కర్ణాటక
వన్డే ఫార్మాట్ విజయ్ హజారే ట్రోఫీని కర్ణాటక గెలుచుకుంది. 2018, ఫిబ్రవరి 27న న్యూఢిల్లీలో ముగిసిన ఫైనల్లో సౌరాష్ట్రను కర్ణాటక ఓడించింది.

రోజర్ ఫెడరర్‌కు రెండు లారెస్ పురస్కారాలు



క్రీడారంగంలో ఆస్కార్ లాంటి లారెస్ స్పోర్ట్స్ అవార్డులను 2017 సంవత్సరానికి మొంటేకార్లో (మొనాకో)లో 2018, ఫిబ్రవరి 27న బహుకరించారు. ఈ అవార్డుల్లో రోజర్ ఫెదరర్‌కు రెండు అవార్డులు దక్కాయి.

అవార్డు విజేత..

వరల్డ్ స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్	రోజర్ ఫెదరర్
కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్	రోజర్ ఫెదరర్
స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్	సెరెనా విలియమ్స్

తాల్ ర్యాపిడ్ చెస్ టోర్నీ టైటిల్ గెలుచుకున్న ఆనంద్
ప్రతిష్టాత్మక తాల్ స్మారక టోర్నమెంట్లో ర్యాపిడ్ విభాగంలో విశ్వనాథన్ ఆనంద్ చాంపియన్‌గా నిలిచారు. మాస్కోలో 2018, మార్చి4న ముగిసిన పది మంది గ్రాండ్ మాస్టర్ల మధ్య లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో ఆనంద్ తొమ్మిది రౌండ్లకుగాను ఆరు పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. శాఖ్రియార్ మమెద్యరోవ్ రెండో స్థానంలో నిలిచాడు.

ఆసియా రెజ్లింగ్‌లో భారత్ కు 8 పతకాలు
ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం, ఆరు కాంస్యాలతో కలిపి మొత్తం ఎనిమిది పతకాలు లభించాయి. బిష్కెక్ (కిర్గిస్తాన్)లో 2018, మార్చి4న ముగిసిన ఈ పోటీలో చైనా ఏడు స్వర్ణ పతకాలతో మొత్తం 14 పతకాలు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఇరాన్ ఆరు స్వర్ణ పతకాలతో మొత్తం 10 పతకాలతో రెండో స్థానం, ఉజ్బెకిస్థాన్ నాలుగు స్వర్ణాలతో మొత్తం 15 పతకాలతో మూడో స్థానంలో నిలిచాయి.

భారత్‌కు ప్రపంచకప్ టీమ్ స్నూకర్ టోర్నీ టైటిల్
ఐబీఎస్ఎఫ్ టీమ్ స్నూకర్ ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచింది. దోహాలో 2018, మార్చి2న జరిగిన ఫైనల్లో భారత్ 3-2తో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. భారత జట్టులో పంకజ్ అడ్వాణీతో పాటు చంద్ర, మనన్ ఉన్నారు.

నవ్‌జోత్ కౌర్‌కు స్వర్ణం



ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో నవ్‌జోత్ కౌర్‌కు స్వర్ణం పతకం లభించింది. దీంతో ఆమె ఈ చాంపియన్‌షిప్ స్వర్ణం గెలిచిన భారత తొలి మహిళగా రికార్డు సాధించింది. 2018, మార్చి2న బిషెక్(కిర్గిజ్‌స్థాన్) జరిగిన పోటీల్లో 65 కిలోల విభాగంలో నవజోత్ పసిడి గెలుచుకోగా.. రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత సాక్షి మలిక్ కాంస్య పతకం సాధించింది.


ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

సాక్షి బిజినెస్
గురువారం 8-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
284 ▼	95 ▼
33,033	10,154

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 10.30కి)

నాస్‌డాక్	7,339	▼	33
డోజోన్స్	24,583	▼	301
ఎఫ్‌టీఎస్ఈ 100	7,158	▲	11
డాక్స్	12,245	▲	131
షాంఘై	3,271	▼	18
నికాయ్	21,253	▼	165

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.65	65.78
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.58	91.76
€	యూరో	ఎస్‌బీఐ	81.90	82.06
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.40	62.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.54	51.64
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.02	50.12
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.70	18.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.07	18.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.25	11.76

నేను శక్తి

మనీ... ఫండిస్తున్నారు!



మార్కెట్లు... మనీ...!!

ఎందుకో ఏమోగానీ... ఈ రెండింటితో మగవారు ముడిపడినంతగా మహిళలు లేరు. మార్కెట్లలో పెట్టుబడికి సంబంధించి కీలకపాత్ర పోషించే మ్యూచ్‌వల్ ఫండ్లు, బ్రోకరేజీ సంస్థల్లో కూడా ఇదే పరిస్థితి. ఎందుకంటే ఫండ్ మేనేజరు పని మామూలుది కాదు. చేతిలో కొన్ని వేల కోట్లు... వాటిని ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలన్నది తన ఇష్టం. కాకపోతే... ఆ ఇన్వెస్ట్‌మెంట్‌పై ఆశించిన రాబడి రాకపోతే అది తన కెరీర్‌నే దెబ్బతీస్తుంది. తన ట్రాక్‌రికార్డుపై మరకలు పడిపోతాయి. ఇంత రిస్కుంది కనక ఫండ్ మేనేజర్ల జీతభత్యాలూ అదే స్థాయిలో ఉంటాయి. ఈ అంశమే మహిళల్ని కూడా ఇటువైపు రప్పిస్తోంది. ఇటీవల పెరుగుతున్న మహిళా ఫండ్ మేనేజర్లు... మగవారికి ఏమాత్రం తీసిపోని విధంగా తమ ఇన్వెస్టర్లకు భారీ రాబడులూ ఇస్తున్నారు. మొత్తంగా దేశీ మ్యూచ్‌వల్ ఫండ్ నిర్వహణలో మహిళా మేనేజర్లు 24 మంది వరకూ రాణిస్తున్నారు. మొత్తం మేనేజర్లలో వీరి వాటా 8 శాతం. వీరి నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ దాదాపు రూ.3.06 లక్షల కోట్లు. ఇది మొత్తం ఓపెన్ ఎండెడ్ ఫండ్స్‌కి సంబంధించిన ఆస్తుల్లో 15%. అంతేకాదు!! మహిళా ఫండ్ మేనేజర్స్ ఆధ్వర్యంలోని ఫండ్స్ రాబడుల్లోనూ ముందుంటున్నాయి. ఆర్థిక సేవల సంస్థ 'మార్నింగ్‌స్టార్' నివేదిక ప్రకారం.. అయిదేళ్ల ప్రాతిపదికన మహిళా ఫండ్ మేనేజర్స్ ఆధ్వర్యంలోని 86% ఫండ్లు మిగతా ప్రామాణిక సాధనాలతో పోలిస్తే అధిక రాబడులందించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా.. ఈ రంగంలో సమర్థంగా నెగ్గుకొస్తున్న కొందరు మహిళా దిగ్గజాల వివరాలే ఈ కథనం...

- సాక్షి, బిజినెస్ విభాగం

పెరుగుతున్న మహిళా ఫండ్ మేనేజర్లు
- దేశీ పరిశ్రమలో 24 మంది; 8 శాతం వాటా
- వీరి నిర్వహణలోని ఆస్తులు రూ. 3.06 లక్షల కోట్లు
- మగవారికి తీసిపోకుండా దీటుగా రాబడులు

కుటుంబం తోడ్పాటు ఉండాలి



స్వాతి కులకర్ణి
ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, యూటీఐ అసెట్ మేనేజ్‌మెంట్

నార్సిమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్‌లో ఫైనాన్షియల్ మేనేజిమెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాక స్వాతి కులకర్ణి రిలయన్స్ ఇండస్ట్రీస్ ద్వారా కెరీర్ మొదలుపెట్టారు. అదే సమయంలో యూటీఐ సంస్థ తమ ఈక్విటీ విభాగానికి తగిన టీమ్‌ను రిక్రూట్ చేస్తుండటంతో స్వాతి కూడా ఓ ప్రయత్నం చేశారు. సెలక్ట్ అయ్యారు. అదిగో... 1998లో స్వాతి ఆర్థిక రంగ కెరీర్ అక్కడే మొదలైంది. నిజానికి అప్పట్లో ఈక్విటీల వైపు మహిళలు రావటమనేదే అరుదు. కానీ స్వాతి అందులో ప్రవేశించటమే కాదు!. అంచెలంచెలుగా ఒక్కో మెట్టూ ఎక్కుతూ... అదే సంస్థలో ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్థాయికి చేరారు.

ఫండ్ నిర్వహణలో స్వాతిది దాదాపు రెండు దశాబ్దాల అనుభవం. ఆమె నిర్వహణలోని యూటీఐ మాస్టర్ షేర్, ఎంఎన్‌సీ ఫండ్, టాప్100 తదితరాలు దీర్ఘకాలికంగా అత్యంత మెరుగైన పనితీరు కనపర్చిన ఫండ్స్‌లో కొన్ని కావటం గమనార్హం. 1998లో యూటీఐ సీఆర్‌టీఎస్ ఫండ్‌కి మేనేజర్‌గా ఆమె మ్యూచువల్ ఫండ్ కెరీర్ ఆరంభమయింది. 2001లో ఇండియా ఫండ్స్ నిర్వహణ తర్వాత 2003లో ఈక్విటీ ఫండ్స్ వైపు మళ్లారు. ప్రారంభంలో రూ. 50 కోట్ల ఫండ్ నుంచి ప్రస్తుతం వేల కోట్ల రూపాయల ఫండ్ నిర్వహించే స్థాయికి చేరారు. కుటుంబ సభ్యుల తోడ్పాటే ఈ రంగంలో తన ఎదుగుదలకు కారణమంటారామె. ఫండ్ నిర్వహణ అనేది టీమ్ కృషి అయినప్పటికీ.. అంతిమ నిర్ణయం తీసుకునే మేనేజర్‌పైనే అందరి దృష్టి ఉంటుందని.. ముఖ్యంగా మహిళ అయితే ఆ ఫోకస్ మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతారు స్వాతి.

గాంధీ, భగవద్గీత స్ఫూర్తి ..



సోహిని అందానీ
ఫండ్ మేనేజర్, ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్

సోహిని అందానీ కుటుంబ నేపథ్యం చూస్తే ఆమె ఈ రంగంలోకి ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోవటం మన వంతవుతుంది. అమ్మాయిలకు చదువులు, ఉద్యోగాలు పెద్దగా అక్కర్లేదని... వారికి పెళ్లి చేసి పంపేస్తే చాలన్న సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చారామె. కాకపోతే ఆమెలోని ఎదురించే తత్వం... ఈ పరిస్థితులకు ఎదురొడ్డింది. అది గమనించిన తండ్రి.. ప్రోత్సహించారు. ఆ తరవాత కుటుంబం కూడా ఆమె వెనక నిలిచింది. 1995లో కేఆర్ చోక్సీ షేర్స్ అండ్ సెక్యూరిటీస్‌తో కెరీర్ ప్రారంభించిన సోహిని... ఆ తరవాత ఎస్‌బీఐ మ్యూచ్‌వల్ ఫండ్‌లో రీసెర్చ్ హెడ్‌గా చేరారు. అక్కడి నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ... 2010లో ఫండ్ మేనేజర్ స్థాయికి చేరుకున్నారు.

అద్భుతమైన రాబడులు అందించగలిగే షేర్లను గుర్తించడంలో సోహిని నైపుణ్యాన్ని చెప్పుకోవటానికి చాలానే సంఘటనలున్నాయి. ఉదాహరణకు ప్యాంటలూన్ సంస్థ షేరు రూ.40 దగ్గర ఉన్నప్పుడు.. దాని భవిష్యత్ అవకాశాలను గుర్తించారామె. అప్పట్లోనే ఇన్వెస్టర్లకు రికమెండ్ చేశారు. 2007లో అది ఏకంగా రూ.700కి పెరిగి ఇన్వెస్టర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది. అలాగే, యస్ బ్యాంక్ హెచ్‌సీఎల్ టెక్, దివీస్ ల్యాబ్స్ వంటి సంస్థల షేర్ల వృద్ధి అవకాశాలను కూడా ముందుగా పసిగట్టారామె. ''ఒకప్పుడు రూ.200 కోట్ల ఫండ్‌ని నిర్వహిస్తే చాలునని అనుకునేదాన్ని. కానీ ఇపుడు ఏకంగా రూ.20,000 కోట్ల ఫండ్స్‌ని నిర్వహిస్తున్నాను'' అని గర్వంగా చెబుతారు సోహిని. మహాత్మా గాంధీ పుస్తకాలు, భగవద్గీతే తనకు ప్రేరణనిస్తాయని చెబుతారు.

ఉద్యోగం.. పెళ్లిలాంటిదే..



లక్ష్మీ అయ్యర్
సీఐవో (డెట్), కోటక్ మహీంద్రా ఏఎంసీ

కామర్స్‌లో గ్రాడ్యుయేషన్‌తో పాటు మేనేజ్‌మెంట్ నేపథ్యం ఉన్న లక్ష్మీ అయ్యర్... క్రెడెన్స్ అనలిటిక్స్ సంస్థలో రీసెర్చ్ అనలిస్టుగా కెరీర్ ఆరంభించారు. ఆ తర్వాత కోటక్‌లో చేరారు. దాదాపు 17 సంవత్సరాలుగా కోటక్ ఏఎంసీలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగం కూడా పెళ్లిలాంటిదే అంటారు లక్ష్మీ. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ సవరణలు చేసుకోవడం, సరిదిద్దుకోవడం తప్పనిసరి అని... అంతిమంగా సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుందని చెబుతారామె. ''ఆర్థిక రంగంలో మహిళలు ఎక్కువగా లేకపోవడానికి.. ఈ రంగం అంటే కొంత భయం ఓ కారణం. కుటుంబ బాధ్యతల వంటివి మరో కారణం. అందుకే, జూనియర్ స్థాయిలో ఎక్కువగా మహిళలు కనిపించినా.. ఆ తర్వాత పై స్థాయికి వెళ్లే కొద్దీ వారి సంఖ్య తగ్గిపోతోంది'' అని చెబుతారు లక్ష్మీ అయ్యర్. కుటుంబ బాధ్యతల్లో జీవిత భాగస్వామి, కుటుంబ సభ్యుల తోడ్పాటు కూడా ఉండటం వల్లే తాను రాణించగలుగుతున్నానని ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారామె.

ఫండ్స్‌లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి



అంజూ ఛాజర్
సీనియర్ ఫండ్ మేనేజర్ రిలయన్స్ నిప్పన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్

ట్రెజరీ కార్యకలాపాల్లో అంజూ ఛాజర్‌ది అందెవేసిన చేయి. అందుకేనేమో!! బాండ్ ఫండ్స్‌లో తనదైన ముద్ర వేశారామె. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలోని ఇన్వెస్ట్‌మెంట్ విభాగంలో కెరీర్ ప్రారంభించిన అంజూ... అక్కడే ట్రెజరీ కార్యకలాపాల నిర్వహణలో మెలకువలు నేర్చుకున్నారు. ఆ తర్వాత మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ వైపు మళ్లారు. తద్వారా ఫండ్ మేనేజర్‌గా ఎదగాలన్న తన కల సాకారం చేసుకున్నానంటారామె. ''బీమా కంపెనీలో పదేళ్ల పాటు పనిచేసిన అనుభవం, నైపుణ్యాలు... రిలయన్స్ మ్యూచువల్ ఫండ్‌లో ఫండ్ మేనేజర్‌గా ఎదిగేందుకు ఎంతో తోడ్పడ్డాయి. నిజానికి ఈ రంగంలో మగవారే ఎక్కువ. వారిదే ఆధిక్యం. అందుకే మహిళలకు ఎక్కువ అవకాశాలు దొరకటం లేదని కూడా చెప్పొచ్చు. నా అదృష్టమేంటంటే... నేను ఈ రంగంలో ఎలాంటి వివక్షా ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రాలేదు. మహిళా ఫండ్ మేనేజర్‌గా కాకుండా ఒక ఫండ్ మేనేజర్‌గానే గుర్తింపు దొరికింది'' అంటారామె. ఈ రంగంలో మహిళలు ఇపుడిపుడే పెరుగుతున్నారని... పరిస్థితి మారుతోందని చెప్పే అంజూ... ఆర్థిక రంగంలోనే కాక అన్ని రంగాల్లోనూ మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలన్నారు. ఫండ్ మేనేజర్లు, సీఈవోలుగా మరింత మంది మహిళలు రావాలన్నారు.

ఓర్పు ముఖ్యం..



రోషి జైన్
ఫండ్ మేనేజర్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఏఎంసీ (ఇండియా)

చెన్నైలో పుట్టి, పెరిగిన రోషి జైన్ .. 2003లో గోల్డ్‌మన్ శాక్స్ సంస్థలో చేరారు. సింగపూర్‌లోని సంస్థ కేంద్రంలో... ఆసియా దేశ సంస్థల షేర్లపై అనలిస్టుగా కెరీర్ ప్రారంభించారు. తొలినాళ్లలో ఫండ్స్‌ను నిర్వహించాలనే ఆలోచనేదీ ఆమెకు లేదు. స్వతహాగా చార్టర్డ్ అకౌంటెంట్ అయిన రోషికి స్టాక్ మార్కెట్స్ తీరు తెన్నుల గురించి అప్పట్లో మంచి అవగాహనే ఉండేది. దీంతో మెల్లమెల్లగా ఇన్వెస్టింగ్ వైపు మళ్లారామె. 2005లో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌లో అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ప్రధానంగా ఇన్‌ఫ్రా రంగంపై దృష్టి పెట్టానని, అది ఫండ్స్ నిర్వహణకు కావాల్సిన నైపుణ్యాలను సంతరించుకునేందుకు ఉపయోగపడిందని చెబుతారామె. 2008లో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్.. ఏషియన్ ఈక్విటీ ఫండ్ ప్రారంభించినప్పుడు మంచి పెట్టుబడి అవకాశాలను గుర్తించడం ద్వారా ఆమె వెలుగులోకి వచ్చారు. 2012లో బిల్డ్ ఇండియా ఫండ్‌కి కో–మేనేజర్‌గా దేశీ ఫండ్స్ నిర్వహణలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 2014 నుంచి హై గ్రోత్ కంపెనీస్ ఫండ్‌కి లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఓరియంట్ సిమెంట్, టిమ్‌కెన్ ఇండియా, వర్ల్‌పూల్ ఇండియా మొదలైన స్టాక్స్‌లో అవకాశాలు గుర్తించి ఇన్వెస్ట్ చేయగా.. అవి దాదాపు మూడు, నాలుగు రెట్లు రాబడులు అందించాయి. పెట్టుబడుల విషయంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే అన్నింటికన్నా ముఖ్యంగా ఓర్పు ఉండాలంటారు రోషి జైన్.

వీరి నిర్వహణలోని ఫండ్లు ఏడాది, మూడేళ్ళ, ఐదేళ్లలో మొత్తంగా ఇచ్చిన రాబడులు (శాతాల్లో)..

పేరు	ఏడాది	మూడేళ్లు	ఐదేళ్లు
స్వాతి కులకర్ణి (ఈక్విటీ- ఇండియా)	27.5	29.5	112.4
అంజు ఛాజర్ (బాండ్స్ - ఇండియా)	5.7	26.3	49.8
సోహిని అందానీ (ఈక్విటీ- ఇండియా)	23.9	45.9	167.8
రోషి జైన్ (ఈక్విటీ- ఏసియా పసిఫిక్)	44.0	45.4	51.1

మహిళా పారిశ్రామికవేత్తలేరీ?

- వారి పురోగతిలో మనది 52వ స్థానం
- 57 దేశాలతో జాబితా రూపొందించిన మాస్టర్‌కార్డ్
- అమెరికా, చైనాలకు అందనంత దూరంలో
- సాంస్కృతిక, సామాజిక తోడ్పాటు తక్కువే

న్యూఢిల్లీ: ఆర్థికంగా వేగంగా దూసుకెళుతున్నా... మహిళా పారిశ్రామికవేత్తల పురోగతి విషయంలో భారత్ అడుగులు వెనకే ఉన్నాయి. 57 దేశాలతో కూడిన జాబితాలో భారత్ కింది నుంచి ఐదు స్థానాలపైన 52 దగ్గర నిలవడమే ఇందుకు నిదర్శనం. గతేడాది కూడా భారత్ స్థానం ఇదే. 'మాస్టర్‌కార్డ్ ఇండెక్స్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్' పేరిట విడుదలైన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. భారత్ కేవలం ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ఈజిప్ట్, బంగ్లాదేశ్ కంటే మాత్రమే ముందుంది. మహిళా వ్యాపార నాయకత్వానికి భారత్‌లో పరిస్థితులు సానుకూలంగా లేవని నివేదిక స్పష్టం చేసింది. సాంస్కృతిక వివక్ష వల్ల భారత్‌లో వ్యాపారానికి మహిళలు అంతగా ఆసక్తి చూపడంలేదని తెలిపింది. ఇక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం పరంగా న్యూజిలాండ్ అగ్రస్థానంలో నిలిచింది. అమెరికా ఈ సూచీలో 4వ స్థానంలో, చైనా 29వ స్థానంలో ఉంది.



అనుకూల వాతావరణం కల్పించాలి

లాభదాయకత లేకపోవటమో, ఆర్థిక వనరుల కొరత వంటి కారణాల వల్ల భారతీయ మహిళలు వారి వ్యాపారాలను వృద్ధి చేయటంపై దృష్టి పెట్టకపోవటం, వ్యాపారాలను నిలిపివేయడం వంటివి చేస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. ''అమెరికా, చైనా విజయాలను తెలుసుకోవడం ద్వారా భారత్‌లోనూ మహిళలు మరింతగా పాలుపంచుకునేందుకు, ఉన్నత విద్య, ఆర్థిక సేవలు పొందేందుకు తగిన వాతావరణం కల్పించాలి'' అని నివేదిక సూచించింది. మేధోపరమైన ఆస్తుల పరంగా భారత్ స్థానం 55కాగా, వ్యాపార పరంగా రాణించేందుకు ప్రోత్సాహం విషయంలో 47వ స్థానంలో ఉంది.

మూడో వంతుకు మహిళా పైలట్లు: స్పైస్ జెట్



న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ 'స్పైస్ జెట్' తాజాగా మహిళా పైలట్ల కోసం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ఆరంభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. మొత్తం పైలట్లలో మహిళల వాటాను మూడో వంతుకు పెంచుకోవాలని స్పైస్‌జెట్ భావిస్తోంది. ప్రస్తుతం కంపెనీలో దాదాపు 800 మంది పైలెట్లు ఉన్నారు. వీరిలో మహిళల సంఖ్య 140. బోయింగ్ 737, బొంబార్డియర్ క్యూ400 విమానాల కోసం మహిళా పైలట్లను నియమించుకుంటామని కంపెనీ తెలిపింది. దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగుస్తుంది. ఇప్పటికే 175కు పైగా దరఖాస్తులు వచ్చాయని కంపెనీ పేర్కొంది. స్పైస్‌జెట్ యువ మహిళా కెప్టెన్లు కాబుల్ వంటి క్లిష్టమైన ఎయిర్ ఫీల్డ్స్‌లోనూ బాధ్యతలు నిర్వహిస్తున్నారని సంస్థ డైరెక్టర్ శివాని సింగ్ కొనియాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పూర్తి మహిళా సిబ్బందితో ఉన్న మూడు ప్రత్యేక విమానాలను సంస్థ నడుపుతోంది.

నలుగురు కలిసి విమానం కొనండి



JET SET GO

'జెట్ సెట్ గో' ఫౌండర్ కనికా టేక్రివాల్

- నిర్వహణ మా చేతుల్లో పెట్టండి
- బ్యాంకు రుణానికి సహకరిస్తాం
- రూ.5 కోట్లకు 4 సీట్ల విమానం

"సూపర్ ప్రీమియం కార్ల కోసం రూ.5 కోట్లకు పైగా వెచ్చించే కస్టమర్లు మన దగ్గర ఎక్కువే. ఇదే ధరకు నాలుగు సీట్ల చిన్న విమానమొస్తుంది. దాన్ని కొనండి. అద్దెకు తిప్పి మీకు ఆదాయాన్ని తెచ్చిపెడతాం. పూర్తి నిర్వహణ బాధ్యత మాదే" అంటూ కొత్త ప్రతిపాదన చేశారు 'గెట్ సెట్ గో' వ్యవస్థాపకురాలు కనికా టేక్రివాల్. తమ సంస్థ ద్వారా క్యాబ్ మాదిరి ప్రైవేట్ విమాన సేవలందిస్తున్న కనికా... నలుగురు స్నేహితులు కలిసైనా ఓ బుల్లి జెట్‌ను కొనుక్కోవచ్చన్నారు. ముమ్ముందు భారత ప్రైవేటు విమానయాన రంగంలో అనూహ్య వృద్ధి ఉండబోతోందని 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. పరిశ్రమ తీరుతెన్నులు, కంపెనీ ప్రణాళికలు ఆమె మాటల్లోనే..

- హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

సాక్షి ఇంటర్వ్యూ

బ్యాంకు నుంచి రుణం..

విమానం కొనుగోలుకు ముందుకొచ్చిన వ్యక్తులకు ఇతరత్రా అంశాలతో పాటు బ్యాంకు రుణాల్లోనూ సహకరిస్తాం. నాలుగు సీట్ల విమానానికి కనీసం రూ.5 కోట్లు అవుతుంది. ప్రైవేట్ జెట్ సేవలకు డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. మూడేళ్లలో డిమాండ్ రెండింతలకు చేరనుంది. ప్రపంచవ్యాప్తంగా 400 పైగా విమానాశ్రయాలకు సర్వీసులందిస్తున్నాం. భారత్‌లో 190 విమానాశ్రయాల్లో అడుగు పెట్టాం. జెట్ సెట్ గో ద్వారా బుకింగ్‌కు 100 విమానాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 20 కంపెనీలు, వ్యక్తులకు చెందిన 32 విమానాల్ని మేం నిర్వహిస్తున్నాం. పైలట్లతో సహా కంపెనీ సిబ్బంది 160 మంది ఉన్నారు. ప్రయాణికుల భద్రతకు పెద్ద పీట వేశాం. విమానం ఎగిరే ముందు ప్రతిసారి 29 రకాల భద్రతా పరీక్షలు నిర్వహిస్తాం.

సొంత విమానాలు..

డిసెంబరులో మా సొంత విమానం అడుగు పెట్టబోతోంది. 8 సీట్ల ఈ విమానానికి రూ.75 కోట్లు వెచ్చిస్తున్నాం. రెండేళ్లలో 8–10 విమానాలను సొంతంగా సమకూర్చుకోవాలన్నది మా ధ్యేయం. ఇందుకోసం ఈ ఏడాదే రూ.190–250 కోట్లు సమీకరిస్తున్నాం. విదేశీ ఇన్వెస్టర్ ఒకరు ఆసక్తి కనబరిచారు. ఇటీవలే ఇండో పసిఫిక్ ఏవియేషన్‌ను సుమారు రూ.65 కోట్లకు కొనుగోలు చేశాం. ఈ కంపెనీ వద్ద రెండు ఫ్లయిట్స్ ఉన్నాయి. హైదరాబాద్ సహా వివిధ నగరాల్లో మా సంస్థకు ఎనిమిది ఆఫీసులున్నాయి. కంపెనీలో క్రికెటర్ యువరాజ్ సింగ్, వ్యాపారవేత్త పునీత్ దాల్మియా పెట్టుబడి పెట్టారు.

హైదరాబాద్ నుంచే షటిల్..

జెట్ సెట్ గో ద్వారా పూర్తి విమానాన్ని బుక్ చేసుకోవాలి. జెట్ స్టీల్స్ కింద విడివిడిగా టికెట్లు కొనుక్కోవచ్చు. జెట్ షటిల్ పేరుతో నూతన సర్వీసులను 4 నెలల్లో ప్రారంభిస్తున్నాం. మొదట హైదరాబాద్ నుంచి మొదలు పెడతాం. వైజాగ్, తిరుపతి, విజయవాడ, గుంటూరు వంటి ప్రధాన నగరాలు, సందర్శనీయ స్థలాలకు షటిల్ సర్వీసులుంటాయి. ఒక్కో టికెట్ రూ.15–30 వేల మధ్య ఉంటుంది.

నాలుగో స్థానంలో భాగ్యనగరి..

ప్రైవేట్ జెట్స్‌లో ప్రయాణం చేస్తున్న నగరాల్లో హైదరాబాద్ ప్రస్తుతం నాల్గవ స్థానంలో ఉంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నాయి. భాగ్యనగరి నుంచి ప్రతిరోజు అయిదు సర్వీసులు నడుపుతున్నాం. ఏడాదిన్నరలో ఈ నగరం తొలి స్థానం కైవసం చేసుకోవడం ఖాయం. అంతలా ఇక్కడ డిమాండ్ ఉంది. వచ్చే రెండేళ్లు మా ఫోకస్ కూడా ఇక్కడే ఉండబోతోంది. మొత్తంగా జెట్ సెట్ గో నెలకు 600లకుపైగా బుకింగ్స్ నమోదు చేస్తోంది. ఇంధన వ్యయం పెరిగిన కారణంగా ఏప్రిల్ నుంచి ప్రైవేట్ జెట్స్ టికెట్ల ధర 4–12 శాతం పెరిగే ఛాన్స్ ఉంది.

ఈ నెల 13 నుంచి
తారాచంద్ ఐపీఓ

- ఇష్యూ సైజ్ రూ.20 కోట్లు
- షేర్ ధర రూ.55

న్యూఢిల్లీ: తారాచంద్ లాజిస్టిక్ సొల్యూషన్స్ కంపెనీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 13న ప్రారంభమవుతుంది ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.20 కోట్లు సమీకరించనున్నది. ఈ ఐపీఓలో భాగంగా రూ.10 ముఖ విలువగల 37.20 లక్షల ఈక్విటీ షేర్లను రూ.55 ధరకు జారీ చేస్తారు. ఈ ఐపీఓ ఈ నెల 15న ముగుస్తుంది. ఈ ఐపీఓకు హెమ్ సెక్యూరిటీస్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుంది. ముంబై కేంద్రంగా ఈ కంపెనీ లాజిస్టిక్, సప్లై చెయిన్ సర్వీసులను, ఎక్విప్‌మెంట్ రెంటల్ బిజినెస్‌ను, స్టీల్ ప్రాసెసింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్, సెయిల్, ఓఎన్‌జీసీ, టాటా ప్రాజెక్ట్స్, హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్ తదితర సంస్థలకు సేవలందిస్తోంది.

వేతనాల్లోనూ వారి పట్ల వివక్షే

మహిళలకు 20 శాతం తక్కువ చెల్లింపులు

న్యూఢిల్లీ: వేతనాల దగ్గర కూడా మహిళలు మనదేశంలో వివక్షనే ఎదుర్కొంటున్నారు. ఇక్కడ వేతనాల విషయంలో వారు మగా, ఆడా అనేది కీలక పాత్ర పోషిస్తోంది. చేసే పని ఒకటే అయినా పురుషులతో పోలిస్తే మహిళలు 20 శాతం తక్కువ వేతనాలు పొందుతున్నట్లు 'మాన్‌స్టర్' వేతన సూచీ తెలియజేసింది. దీనిప్రకారం పురుషులు సగటున గంటకు రూ.231 వేతనం పొందుతుండగా, మహిళ విషయంలో ఇది రూ.184.80గానే ఉంది. మొత్తం మీద స్త్రీ, పురుషుల మధ్య చెల్లింపుల వ్యత్యాసం 20 శాతం ఉండటమనేది నిరుత్సాహకరమని మాన్‌స్టర్ డాట్ కామ్ సీఈవో అభిజీత్ ముఖర్జీ పేర్కొన్నారు. అయితే, ఈ వ్యత్యాసం 2016లో 24.8 శాతంగా ఉండగా, 2017లో 20 శాతానికి దిగిరావడం కొద్దిలో కొద్ది ఊరట.



కడపలో బిగ్ 'సి' 195వ షోరూమ్

కడపలోని కొత్త ఆర్‌టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో బిగ్'సి' 195వ షోరూమ్‌ను ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న సంస్థ ఫౌండర్, సీఎండీ యం.బాలు చౌదరి, డైరెక్టర్లు స్వప్నకుమార్, బాలాజీ రెడ్డి, గౌతమ్ రెడ్డి, సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్.

ఆరో రోజూ ఆగని నష్టాలు

- మళ్లీ వాణిజ్య యుద్ధ భయాలు
- కొనసాగిన బ్యాంక్ షేర్ల క్షీణత
- ఇంట్రాడేలో 33,000 దిగువకు సెన్సెక్స్
- 284 పాయింట్ల నష్టంతో 33,033 వద్ద ముగింపు
- కీలకమైన 10,200 దిగువకు నిఫ్టీ
- 95 పాయింట్ల నష్టంతో 10,154 వద్ద ముగింపు



అమెరికా అధ్యక్షుడి ఆర్థిక సలహాదారు రాజీనామా చేయటంతో వాణిజ్య యుద్ధాల భయం మళ్లీ చెలరేగింది. ఫలితం... ప్రపంచ మార్కెట్లు భారీగానే పతనమయ్యాయి. దీనికి బ్యాంక్ షేర్ల నష్టాలు కొనసాగడం కూడా జత కావడంతో మన స్టాక్ మార్కెట్ బుధవారం నష్టపోయింది. స్టాక్ సూచీలు వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోనూ క్షీణించాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 33 వేల పాయింట్ల దిగువకు పడిపోగా, నిఫ్టీ కీలకమైన 10,200 పాయింట్ల దిగువకు పడిపోయింది. సెన్సెక్స్ 284 పాయింట్ల నష్టంతో 33,033 పాయింట్ల వద్ద, నిఫ్టీ 95 పాయింట్లు పతనమై 10,154 పాయింట్ల వద్ద ముగిశాయి. ఈ రెండు సూచీలకు ఈ ఏడాది కనిష్ట స్థాయిలు ఇవే. ఎఫ్ఎమ్‌సీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్ రంగాలు మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. జీవిత కాల గరిష్ట స్థాయి నుంచి నిఫ్టీ 1,000 పాయింట్లు, సెన్సెక్స్ 3,410 పాయింట్లు పతనయ్యాయి. సూచీల ఆల్‌టైమ్ హైల నుంచి ఇన్వెస్టర్ల సంపద రూ.12 లక్షల కోట్లకు పైగా ఆవిరైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 326 పాయింట్ల నష్టంతో 32,991 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకింది. మొత్తం గత ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,413 పాయింట్లు నష్టపోయింది.

గ్యారీ రాజీనామా..

ఉక్కు, అల్యూమినియమ్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన ఆర్థిక సలహాదారు గ్యారీ కోన్‌లకు మధ్య విభేదాలొచ్చాయి. గ్యారీ కోన్ రాజీనామా చేశారు. దీంతో సుంకాల విధింపుపై ట్రంప్ ముందుకే సాగుతారని, ఫలితంగా వాణిజ్య యుద్ధాలు చెలరేగుతాయనే ఆందోళనతో ఆసియా మార్కెట్లు పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు బలహీనంగా ఆరంభమయ్యాయి. ఇది మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించింది. దేశీయ, అంతర్జాతీయ అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. కథ అప్పుడే ముగియలేదని, ఈ ఏడాది మార్కెట్లో మరింతగా ఒడిదుడుకులకు చోటు చేసుకుంటాయని ఎమ్‌కే ఫైనాన్షియల్ సర్వీసెస్ హెచ్చరించింది.

ఏడాది కనిష్టానికి 15 ప్రభుత్వ బ్యాంకుల షేర్లు..

పీఎన్‌బీ దర్యాప్తు మరింత విస్తరించడంతో బ్యాంక్ షేర్లు పతనం కొనసాగింది. పీఎన్‌బీ స్కామ్ వెలుగులోకి వచ్చిన గత నెల 14 నుంచి చూస్తే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 19 శాతం క్షీణించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ 40శాతం నష్టపోయింది. మొత్తం లిస్టయిన 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 15 బ్యాంక్‌లు బుధవారం నాడు ఏడాది కనిష్ట స్థాయికి పడిపోయాయి. యూనియన్ బ్యాంక్ షేర్ అయితే ఇంట్రాడేలో 11 ఏళ్ల కనిష్టానికి పతనమైంది. కెనరా బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, అలహాబాద్ బ్యాంక్, ఓబీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ షేర్లు తాజా ఏడాది కనిష్ట స్థాయికి దిగజారాయి. ఈ బ్యాంక్ షేర్లతో పాటు పీఎన్‌బీ, ఇండియన్ బ్యాంక్, ఐడీబీఐలు 8 శాతం వరకూ నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఆరో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టపోయింది. పీఎన్‌బీ రుణ కుంభకోణంలోని కీలక నిందితులు నీరవ్ మోదీ, మెహూల్ చోక్సీలకు ఎలాంటి రుణాలివ్వలేదని ఐసీఐసీఐ బ్యాంక్ స్పష్టం చేసినప్పటికీ ఈ బ్యాంక్ షేర్ పతనం ఆగలేదు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,449
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	30,909
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	8,70,651
ఎఫ్ఐఐ	-720
డీఐఐ	409

అదానీ షేర్లు డౌన్



అదానీ గ్రూప్‌నకు చెందిన గౌతమ్ అదానీకి కూడా భారీగా మొండి బకాయిలున్నాయని బీజేపీ పార్లమెంటు సభ్యుడు సుబ్రమణ్యం స్వామి ట్వీట్ చేసిన నేపథ్యంలో ఆదానీ గ్రూప్ షేర్లు– అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ పోర్ట్స్ దాదాపు 8 శాతం వరకూ నష్టపోయాయి. ఎప్పటికప్పుడు బ్యాంకు రుణాలను తీర్చివేస్తూనే ఉన్నామని, అదానీ గ్రూప్ వివరణ ఇచ్చినప్పటికీ ఈ షేర్లు క్షీణించాయి. గీతాంజలి జెమ్స్ షేర్ 5 శాతం లోయర్ సర్క్యూట్‌ను తాకింది. సెన్సెక్స్ షేర్లలో ఐటీసీ, మారుతీ సుజుకీ, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్, కోటక్ బ్యాంక్, ఎన్‌టీపీసీలు మాత్రం లాభపడ్డాయి.

ఫోన్ చేతిలో లేకున్నా కాంటాక్టుల సమాచారం

'మ్యూచువల్ కాలర్' యాప్‌ను విడుదల చేసిన ఎంటైర్‌యాప్స్



హైదరాబాద్: గుర్తు తెలియని వారి నుంచి వచ్చే కాల్స్ సమాచారం తెలుసుకోవడంతోపాటు, చేతిలో ఫోన్ లేకున్నా మొబైల్ కాంటాక్టుల సమాచారం తెలుసుకునే ఫీచర్లతో 'మ్యూచువల్ కాలర్' ఆండ్రాయిడ్ యాప్‌ను హైదరాబాద్‌కు చెందిన టెక్ స్టార్టప్ ఎంటైర్ యాప్స్ బుధవారం విడుదల చేసింది. ఇందులో వర్చువల్ కాలర్ ఫీచర్ ఇన్‌బిల్ట్‌గా ఉంటుంది. దీని సాయంతో యూజర్లు ఏ సమయంలో అయినా, ఏ మొబైల్ నుంచి అయినా లేదా మ్యూచువల్‌కాలర్ డాట్ కామ్ వెబ్‌సైట్ నుంచి తమ ఫోన్‌లోని కాంటాక్టుల సమాచారం పొందొచ్చు. ఈ యాప్ గురించి ఎంటైర్ యాప్స్ వ్యవస్థాపకుడు సాంబశివ రావు మునిపల్లె మీడియాకు వివరించారు. ''ఈ యాప్ వాడే వారు సడెన్‌గా ఫోన్ అందుబాటులో లేకపోయినా ఆందోళన చెందక్కర్లేదు. ఎందుకుంటే వారు ఏ ఇతర మొబైల్ లేదా ల్యాప్‌టాప్, ఎక్కడి నుంచైనా సరే తమ ఫోన్‌లోని కాంటాక్టుల సమాచారాన్ని పొందగలరు. వర్చువల్ కాలర్ ఫీచర్ ఏ పరికరం నుంచి అయినా తాత్కాలికంగా కాంటాక్టుల సమాచారం పొందేందుకు వీలు కల్పిస్తుంది'' అని మీడియాకు తెలిపారు.

హీరో కొత్త సూపర్ స్ప్లెండర్..

న్యూఢిల్లీ: హీరో మోటొకార్ప్ తాజాగా కొత్త సూపర్ స్ప్లెండర్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఢిల్లీలో దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.57,190. 125 సీసీ విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో కంపెనీ ఈ బైక్‌ను తెచ్చింది.

కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయ్

- 56 ఎయిర్‌పోర్టులు, 31 హెలిపోర్టులు
- 18 నెలల్లో ఇవి అందుబాటులోకి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయ విమానయాన రంగంలో కొద్ది రోజుల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకోనున్నాయి. సామాన్యుడికి విమానయోగం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రీజినల్ కనెక్టివిటీ స్కీమ్ కింద మరిన్ని చిన్న నగరాల్లో విహంగాలు ఎగురనున్నాయి. కొత్తగా 56 ఎయిర్‌పోర్టులు, 31 హెలిపోర్టులు 18 నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. వీటి అభివృద్ధికి రూ.4,500 కోట్లు వెచ్చిస్తున్నట్టు పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పధి వెల్లడించారు. విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 'పెద్ద విమానాశ్రయాలు బిజీ అవడంతో ఆపరేటర్లకు స్లాట్స్ కేటాయించడం క్లిష్టమైంది. దీంతో తప్పని పరిస్థితుల్లో విమానయాన సంస్థలు చిన్న ఎయిర్‌క్రాఫ్టలతో రంగంలోకి దిగుతున్నాయి. మొత్తంగా మూడు, నాల్గవ తరగతి నగరాలకూ సేవలు విస్తరించాయి' అని వివరించారు. బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ (బీఏవోఏ) బుధవారమిక్కడ నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

మరో రూ.20,500 కోట్లతో: విమానాశ్రయాల అభివృద్ధికై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వచ్చే అయిదేళ్లకుగాను రూ.20,500 కోట్లు వెచ్చించనుంది. ఈ మొత్తంతో 20 విమానాశ్రయాలు కొత్తగా అందుబాటులోకి వస్తాయని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.కె.చౌకియాల్ వెల్లడించారు. 'విజయవాడలో కొత్త టెర్మినల్ భవన నిర్మాణం చేపడతాం. ఈ నగరంలో రన్‌వే పనులు నడుస్తున్నాయి. తిరుపతి, కడపలో రన్‌వే పనులు చేపట్టాల్సి ఉంది. ఇవేగాక పలు విమానాశ్రయాల స్థాయి పెంచడం, టెర్మినళ్ల విస్తరణ, ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలకు ఖర్చు చేస్తాం' అని తెలిపారు. కేంద్రం సమకూర్చే నిధులతోపాటు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విమాన ఆపరేటర్లకు ఆర్థిక సాయం చేస్తోందని గుర్తు చేశారు. 11 ఎయిర్‌స్ట్రిప్‌లకు యూపీ ప్రభుత్వం అదనంగా సాయం చేసిందన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధంగా ప్రోత్సహిస్తే ఆపరేటర్లు ముందుకు వస్తారని అన్నారు. ఉడాన్ స్కీమ్ కింద ఆపరేటర్లు సర్వీసులు అందించేందుకు ఆసక్తి కనబరిస్తేనే ఎయిర్‌స్ట్రిప్‌ల అభివృద్ధి చేపడతామని వెల్లడించారు.



'బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల రంగంపై జీఎస్టీ ప్రభావం' నివేదికతో బీఏవోఏ ప్రెసిడెంట్ రోహిత్ కపూర్, ఉషా పధి, చౌకియాల్ (కుడి)

ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడతాం

- భారత్ సార్వభౌమ రేటింగ్ పెంచండి...
- ఫిచ్ ప్రతినిధుల్ని కోరిన ఆర్థిక శాఖ అధికారులు



న్యూఢిల్లీ: ఆర్థిక క్రమశిక్షణకు భారత్ కట్టుబడి ఉందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం ఫిచ్ ప్రతినిధులకు ఆర్థిక శాఖ అధికారులు స్పష్టం చేశారు. నిర్మాణాత్మక సంస్కరణలు, వస్తు–సేవల పన్ను(జీఎస్‌టీ) వ్యవస్థ కూడా గాడిలో పడుతున్న నేపథ్యంలో భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి జోరందుకుంటోందని వారు చెప్పారు. ఈ తరుణంలో మళ్లీ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న దేశంగా అవతరించినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని దేశ సార్వభౌమ రేటింగ్‌ను పెంచాలని సూచించారు. భారత్ రేటింగ్‌పై వార్షిక సమీక్ష ప్రక్రియలో భాగంగా బుధవారం ఫిచ్ డైరెక్టర్ (సావరీన్ రేటింగ్స్) థామస్ రూక్‌మాకెర్ కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్, ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం తదితర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఆర్థిక క్రమశిక్షణ కార్యాచరణ (రోడ్‌మ్యాప్) బాటలోనే ప్రభుత్వం పయనిస్తోందని, సవరించిన ద్రవ్యలోటు లక్ష్యాలకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆర్థిక శాఖ అధికారులు చెప్పారు. 2020–21 ఆర్థిక సంవత్సరం నాటికి జీడీపీలో ద్రవ్యలోటును (ప్రభుత్వ ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం) 3 శాతానికి కట్టడి చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జీఎస్‌టీ ఆదాయం 11 నెలలకే పరిమితమైనప్పటికీ... ద్రవ్యలోటును 3.5 శాతానికి కట్టడి చేస్తున్నట్లు ఫిచ్ ప్రతినిధులకు వివరించారు.

పీఎన్‌బీ స్కామ్‌పై ఆరా!!

జీఎస్‌టీ అమలులో సమస్యలు, అదేవిధంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) ఇటీవల చోటుచేసుకున్న భారీ కుంభకోణానికి సంబంధించి పలు అంశాలను ఫిచ్ ప్రతినిధులు ఈ సందర్భంగా లేవనెత్తినట్లు సమాచారం. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ అనేది ప్రభుత్వ తక్షణ ఎజెండాలో లేదని ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించారు. నష్టజాతక ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) విక్రయం కొనసాగుతుందని.. ఈ ఏడాది డిజిన్వెస్ట్‌మెంట్ ఆదాయం రూ.లక్ష కోట్లను తాకిందని వారు ఫిచ్ ప్రతినిధులకు వివరించారు.

2006 నుంచి అదే రేటింగ్...

ప్రస్తుతం ఫిచ్ 'బీబీబీ మైనస్ (స్థిర అవుట్‌లుక్)' రేటింగ్‌ను కొనసాగిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్‌లో ఇదే అత్యంత తక్కువ స్థాయి రేటింగ్. చివరిసారిగా 2006లో 'బీబీ ప్లస్' నుంచి ఇప్పుడున్న రేటింగ్‌కు అప్‌గ్రేడ్ చేసింది. అప్పటి నుంచి ఎలాంటి మార్పూ చేయలేదు. మధ్యలో అవుట్‌లుక్‌ను ప్రతికూలానికి మార్చినా, ఆ తర్వాత మళ్లీ స్థిరానికి చేర్చింది. కాగా, 14 ఏళ్ల తర్వాత మరో రేటింగ్ ఏజెన్సీ మూడీస్ గతేడాది నవంబర్‌లో భారత్ సార్వభౌమ రేటింగ్‌ను 'బీఏఏ3' నుంచి 'బీఏఏ2'కు పెంచిన సంగతి తెలిసిందే. అదేవిధంగా అవుట్‌లుక్‌ను (భవిష్యత్తు రేటింగ్ అంచనా) కూడా స్థిరం నుంచి సానుకూలానికి మార్చింది. స్టాండర్డ్ అండ్ పూర్స్ (ఎస్అండ్‌పీ) మాత్రం 2007 నుంచి భారత్ రేటింగ్‌ను యథాతథంగానే (బీబీబీ మైనస్) కొనసాగిస్తోంది. కాగా, ఇటీవలి కేంద్ర బడ్జెట్ తర్వాత ఫిచ్... భారత్‌కు ఉన్న అధిక రుణ భారమే రేటింగ్ పెంపునకు అడ్డంకిగా మారుతోందని వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రస్తుతం భారత్ జీడీపీతో పోలిస్తే రుణ భారం 69 శాతం మేర ఉంది. కాగా, ఈ ఏడాది(2017–18) ద్రవ్యలోటు లక్ష్యాన్ని తాజా బడ్జెట్‌లో కేంద్రం 3.2 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే.

టెలికం కంపెనీలకు భారీ ఊరట

- స్పెక్ట్రమ్ చెల్లింపులకు మరింత సమయం
- ఉపశమన ప్యాకేజీకి కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: రుణ భారంతో ఉన్న టెలికం రంగానికి ఉపశమనం కల్పించే ప్యాకేజీకి కేంద్రం బుధవారం ఆమోదం తెలిపింది. స్పెక్ట్రమ్ కొనుగోలు చేసిన కంపెనీలు అందుకు సంబంధించిన ఫీజు చెల్లింపులకు మరింత వ్యవధి ఇవ్వడం ఇందులో ప్రధానమైంది. అలాగే, స్పెక్ట్రమ్ హోల్డింగ్ గరిష్ట పరిమితిని కూడా సరళీకరించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. అంతర్ మంత్రిత్వ శాఖల బృందం చేసిన సిఫారసుల మేరకు ఈ ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. టారిఫ్‌ల క్షీణతతో లాభాలు అడుగంటిపోయి తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న టెలికం రంగంపై అధ్యయనానికి కేంద్రం పలు శాఖలతో కూడిన అధికారులతో కమిటీని గతేడాది ఏర్పాటు చేసింది. స్పెక్ట్రమ్ ఫీజుల చెల్లింపునకు 10 ఏళ్లుగా ఉన్న గడువును 15 ఏళ్లకు పెంచాలని ఈ కమిటీ సిఫారసు చేయగా దానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశీయ టెలికం రంగం ప్రస్తుతం రూ.4.6 లక్షల కోట్ల రుణభారాన్ని మోస్తోంది. చెల్లింపులకు అదనపు సమయం ఇవ్వడం వల్ల వాటికి నిధుల లభ్యత పెరుగుతుందని, స్పెక్ట్రమ్ పరిమితిని సరళీకరించడం వల్ల స్థిరత్వం ఏర్పడి భవిష్యత్తు స్పెక్ట్రమ్ వేలంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం ఇచ్చినట్టు అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,705	▲	100
బంగారం (99.5, 10గ్రా)	30,555	▲	100
వెండి (కిలో)	38,735	▲	300
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	--		
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	160
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,710	▲	170
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	160
వెండి (కిలో)	41,800	▲	400
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,450	▲	100
బంగారం (22 క్యారెట్లు)	29,120	▲	60
వెండి (కిలో)	40,000	▲	500
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,315	▲	35
బంగారం (22 క్యారెట్లు)	29,280	▲	190
వెండి (కిలో)	41,700	▲	1,800
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,550	▲	50
బంగారం (22 క్యారెట్లు)	29,300	▲	150
వెండి(కిలో)	39,900	▲	200
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,620	▲	170
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	160
వెండి (కిలో)	39,800	▲	400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 08-3-2018

విశాఖ	350–00
చిత్తూరు	378–00
వరంగల్	347–00
చెన్నై	385–00
విజయవాడ	340–00
గోదావరి	340–00

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8	8.4
Alphageo	776.1	791.6
Alu Flouride	107.4	110.95
Amar Raja Bat	773	798.75
And Bank	39.35	42.65
And Cemen	10.27	10.81
And Paper	293.95	299.5
And Petro	52.35	55.1
Anjani Portl	182	182.5
Aries Agro Ltd	190.75	200.75
Aurobindo Ph	592.75	606.2
Avantel Soft	528.2	555.95
Avanti Feeds	2369.3	2421.4
AvonOrg	10.05	10.55
BN Rathi Sec	38.05	39.35
Balaji Amin	591.5	613.3
Bambino Agro	235	238.95
Baron Info	0.33	0.33
Bartronics	12.49	12.84
Bhagira Chem	290	295.85
Bhagya Nag	50.8	53.75
Bhagya Wood	24.5	25.4
Brilliant Sec	9.62	10.12
CIL Securi	26.65	28.6
Color Chip	37.35	37.8
Combat Drugs	27.4	27.4
Cont Coffee	294.95	294.95
CoroFert	538.1	569.2
Cosboard Ind	36.05	38
Country Club	13.3	13.91
Cubex Tub	25.5	26
Cybermate	2.85	2.96
DR Reddy	2148.45	2175
Danlaw Tec	70	68.95
DecCement	542	561.05
Divi's Lab	990	1012
Divya Granit	90.1	93
Dolphin Medi	1.12	1.15
Dredgin Corp	664.8	678.85
Empee Sugars	4.11	3.93
Everest Org	138.45	138.1
Fortune Info	72.5	75.5
Four Soft	75.5	83.55
GMR Ferro	3.25	3.55
GMR Infra	17.35	18.05
GVK Power	14.25	14.95
Gati Corpn	102.35	107.1
Gayatri Bio	7.52	7.17
Gayatri Proj	204.3	205.4
Gayatri Sugrs	9.6	9.93
Gennex Lab	3.86	4.04

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
GodavDru	33.55	34.9
Goldstn Tele	197	204.8
Goldstone Tech	13.43	14.13
Granules (I)	108.55	110.45
HBL Nife Pow	51.75	54.3
HYDIndus	1639.65	1665.7
Heritage Food	673.05	691.55
HindFlurocarb	10.9	11.47
ICSA Ltd	3.1	3.1
IDL Industrs	531.95	549.45
IKF Soft	0.64	0.65
IQMS Soft	15.5	16
IVRCL Infras	3.99	4.15
Incap	90	86.15
IndoNationl	838	845
Infotech En	626	623.4
Innaredy Com	3.1	3.1
Invinex Lab	120	119.7
JSTL	44.7	43.55
KCP LTD	116.2	120.95
KNR Constructio	292	296.9
Kabsons Indu	7.43	7.43
KakatiCem	270	289.5
Kallam Spg	31.25	31.85
Kernex Micro	39	40.65
Krebs Bio	190.15	181.1
LGS Global	5.1	5.29
LancoIndus	316.7	329.1
Lokesh Mach	61.5	60.7
Lotus Choc	50	50.5
MIC Elec	6.23	6.55
Madhucon Proje	25.4	26.6
Maytas Infra	38.5	40.5
Mold-tek	57	57.5
Moldtek Plastic	316	330.3
Moschip Semi	30.5	31.8
NCLInd	204.9	217.6
NETTLINX	71.35	76.3
NMDC Ltd	123.4	123.05
NagarAgrich	38.9	41.4
NagarConst	118.6	122.4
Natco Pharma	718	729.85
Nava Bh Ventur	146.25	147.35
Neha Inter	6.55	7.27
Neocure Ther	3.61	3.8
Neuland Lab	694	690.4
Nihar Info Glo	13.25	13.89
Nile	760	795.7
Oil Country	38.35	40
Padmalaya Tele	4.2	4.4
Panyam Cemen	41.5	45.6
PennInd	54.25	56.35
Phytochem I	60.55	64.4

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
Pitti Lamin	87.6	89.95
Pokarna	196	202.6
Prajay Engs	12.19	12.4
PremiExpl	365.9	377.15
Prism Cement	115.75	121.95
Ragsan Petro	62.5	63
Rain Industries	367.3	366.9
Raj Packagin	33.55	35.85
Ram Informat	39	40.25
Restile Cer	7.1	6.69
Roopa Indus	14.94	14.89
Sagar Cem	957	908.35
Sai Wires(I)	1.04	1.04
Samkrg Pist	290	294.45
Sampre Nutri	53.8	56.6
SangInd	109.35	115.55
Satvah. Ispat	22.3	21.8
Saven Techno	25.5	26.45
Softsol	35	34.9
South Bio Tech	2.92	3.06
South Magnes	23.75	24.95
SrRayAlk	52.2	53.8
Srinivasa Ship	60	59
Sujana Metal	1.35	1.39
Sujana Towers	3.74	3.9
Sujana Univers	0.89	0.85
Surana Strip	2.13	2.03
Surana Tele	5.09	5.3
Suryachakra Pow	0.9	0.91
Suryalata Sp	135.15	142.65
SuvarCem	127.95	125.6
Suven Pharma	177.25	184.95
TCI Finance	26.85	27.8
Taj Gvk Hotel	157	160.8
Tanla Solutions	34.6	33.95
Trans Biotek	2.59	2.67
Transport Co	269	276.35
Trendy Knit	0.27	0.27
Usher Agro	5.75	5.9
V&K Soft	4	4.01
VBC Ferro	39	40.65
VST Indus	2930	3012.65
Vajra Gran	2.57	2.59
Vamshi Rubb	48.95	50.45
Viceroy Hotels	14.45	14.95
VijayTextil	49.9	52.5
Vimta Labs	195	205.2
Virat Crane	55.05	55.05
Virinchi Con	109.85	114.2
VisakaInd	663	678.95
Vista Pharma	43.7	45.95
Vivimed Labs	69.35	73.15
ZenoTech Lab	40.8	42.25

సాక్షి స్పోర్ట్స్
గురువారం 8-3-2018



గంభీర్‌కే డేర్‌డెవిల్స్ పగ్గాలు

ఐపీఎల్‌లో సొంత గూటికి చేరిన గౌతమ్ గంభీర్ ఇప్పుడు ఢిల్లీ డేర్‌డెవిల్స్ (డీడీ) కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఫ్రాంచైజీ యాజమాన్యం బుధవారం అతన్ని సారథిగా నియమించింది. డీడీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ హేమంత్ దువా మాట్లాడుతూ ఢిల్లీకి చేయాల్సింది ఇంకా ఉందనే గౌతీని తీసుకున్నామన్నారు. గత సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మన్ కూడా అతనేనని అందుకే సారథిగా గంభీర్ సమర్థుడని నిర్ణయించినట్లు చెప్పారు. 'గంభీర్ సమర్థ నాయకుడు. సవాళ్లు ఎదురైన ప్రతిసారీ తన సత్తా నిరూపించుకున్నాడు' అని హెడ్ కోచ్ రికీ పాంటింగ్ అన్నాడు.

అతివ లోక విజయం

నేను శక్తి — సాక్షి

అమ్మలో ఆప్యాయతని చూశాం.
సోదరిలో అనురాగబంధాన్ని చూశాం.
భార్యలో బాధ్యతను చూశాం.
బిడ్డలో మమకారాన్ని చవిచూశాం.
ఏ రకంగా చూసినా... వారిలో కనిపించేది మాధుర్యమే. అంతులేని ప్రేమాభిమానాలే.
నాణేనికి ఇరువైపులా ఆత్మీయతే కనబడుతుంది.
వారు సుకుమారులు, సున్నిత మనస్కులే కాదు... జయ విజయ అజేయులు కూడా!
ఇక్కడ నాణేనికి ఇరువైపులా చూస్తే సరిపోదు...
కనిపించని నాలుగో సింహాన్ని చూడాలి... చూస్తున్నాం కూడా...
బరిలో గెలిచేందుకు పోరాడుతున్నారు... పతకం తేచ్చేందుకు శ్రమిస్తున్నారు.
పురుషులతో సమానంగా పోటీపడుతున్నారు.
బ్యాట్ పట్టినా... పరుగు పెట్టినా... పంచ్ విసిరినా... గన్‌తో గురి చూసినా...
పట్టుతో ప్రత్యర్థుల భరతం పట్టినా... ఎవరైతే నాకేంటి అంటున్నారు.
ఎందాకైనా పయనిస్తామంటున్నారు... ఎవరు... ఎవరు... అంటే ఇంకా తెలియదా!
అయితే తెలుసుకోండి...!

ఒక్క పట్టుతో...

'ఫోగాట్ సిస్టర్స్' గీత, బబిత, వినేశ్ విజయాలు ఓవైపు... సాక్షి మలిక్ 'రియో ఒలింపిక్' కాంస్య ప్రదర్శన మరోవైపు... అయినా ఒకే ఒక్క విజయంతో వీరితో సమానంగా పేరు సంపాదించింది పంజాబ్ మహిళా రెజ్లర్ నవజ్యోత్ కౌర్. 28 ఏళ్ల నవజ్యోత్ గతవారం కిర్గిస్తాన్‌లో జరిగిన ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో 65 కేజీల విభాగంలో స్వర్ణం గెలిచింది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించింది. అమృత్‌సర్ సమీపంలోని తరన్ తారన్ పట్టణానికి చెందిన నవజ్యోత్‌కు గత రెండేళ్లు ఏమాత్రం కలిసిరాలేదు. వెన్నునొప్పి కారణంగా ఆమె కొంతకాలం ఆటకు దూరమైంది. రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేకపోయిన ఆమె వచ్చే నెలలో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌కు కూడా ఎంపిక కాలేకపోయింది. అయితేనేం తాజా పసిడి ప్రదర్శన నవజ్యోత్‌కు ఒక్కసారిగా గుర్తింపు తెచ్చిపెట్టింది. గతాన్ని మరచి 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలు పెట్టింది.



నవజ్యోత్ కౌర్



హిమా దాస్

నిరుపేద రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు కామన్వెల్త్ గేమ్స్ గురించి అవగాహన లేదు. తెలిసిందల్లా ఫుట్‌బాల్ మాత్రమే. అయితే ఫుట్‌బాల్‌లో కెరీర్ గొప్పగా ఉండదని పాఠశాల వ్యాయామవిద్యా ఉపాధ్యాయుడు సలహా ఇచ్చారు. వ్యక్తిగత క్రీడాంశం అథ్లెటిక్స్‌లో అడుగు పెట్టాలని సూచించారు.

పరుగెడితే పతకం...

ఆయన సలహా మేరకు అథ్లెటిక్స్‌లో అడుగు పెట్టిన ఆమె రెండేళ్లలో నిలకడగా రాణించి ఇపుడు కామన్వెల్త్ గేమ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఆ అమ్మాయే అస్సాంకు చెందిన 18 ఏళ్ల హిమా దాస్. పాటియాలాలో జరుగుతున్న ఫెడరేషన్ కప్‌లో హిమా దాస్ అందరి అంచనాలను తారుమారు చేసి 400 మీటర్ల ఫైనల్లో 51.97 సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణాన్ని సాధించింది. దాంతోపాటు కామన్వెల్త్ గేమ్స్ అర్హత ప్రమాణాన్ని (52 సెకన్లు) అందుకుంది.

యువ సంచలనం..

భారత్‌లో మహిళల క్రికెట్‌కు ఆదరణ అంతంత మాత్రమే. నాలుగేళ్లకోసారి జరిగే ప్రపంచకప్ మినహాయిస్తే మిగతా సమయంలో వారికి అంతర్జాతీయ మ్యాచ్‌లు తక్కువే. అయినప్పటికీ మిథాలీ రాజ్, జులన్ గోస్వామిలాంటి మేటి మహిళా క్రికెటర్ల విజయాలతో అమ్మాయిలు ఈ ఆటవైపు వస్తున్నారు. అందులో తాజా సంచలనం ముంబైకి చెందిన 17 ఏళ్ల అమ్మాయి జెమీమా రోడ్రిగ్స్. గత ఏడాది నవంబర్‌లో సౌరాష్ట్రతో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఏకంగా డబుల్ సెంచరీ (202 పరుగులు) కొట్టి వార్తల్లో నిలిచిన జెమీమా ఈ మ్యాచ్‌కు ముందు గుజరాత్‌పై 179 పరుగులు సాధించింది. ఈ ప్రదర్శన జెమీమాకు దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో పాల్గొనే భారత సీనియర్ జట్టులో చోటు దక్కేలా చేసింది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదో టి20 మ్యాచ్‌లో మిథాలీ రాజ్‌కు జతగా జెమీమా (34 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలకదశలో రాణించింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిచి తొలిసారి దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే, టి20 సిరీస్‌లు నెగ్గిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది.



జెమీమా రోడ్రిగ్స్



అంకుశిత బోరో

మేరీకోమ్ విజయాలతో ఎంతోమంది అమ్మాయిలు మహిళల బాక్సింగ్‌లో అడుగు పెట్టారు. విశ్వవేదికపై తమదైన ముద్ర వేస్తున్నారు. ఆ కోవలోకే వస్తుంది అంకుశిత బోరో. అస్సాంకు చెందిన 17 ఏళ్ల ఈ గిరిజన అమ్మాయి గతేడాది ప్రపంచ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 64 కేజీల విభాగంలో స్వర్ణ

'పంచ్' పడిందంటే...

పతకాన్ని సాధించింది. క్రీడా నేపథ్యంలేని కుటుంబం నుంచి వచ్చిన అంకుశిత భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) నిర్వహించిన ట్రయల్స్‌లో పాల్గొని అందులో ప్రవేశం పొందింది. సహజ నైపుణ్యానికి తోడు కోచ్‌ల మార్గదర్శనంలో ఆమె ముందుకు దూసుకెళ్లింది. అహ్మెట్ కామెట్ (టర్కీ) టోర్నీ, బాల్కన్ టోర్నీ (బల్గేరియా) అంతర్జాతీయ టోర్నీల్లో రజతాలు నెగ్గిన అంకుశిత ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది.



మను



మెహులీ

పురుషుల షూటింగ్‌తో పోలిస్తే మహిళల షూటింగ్‌లో భారత్‌కు గొప్ప రికార్డు లేదు. కానీ ఏడాదిలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. జూనియర్ స్థాయిలో పతకాల పంట పండించిన హరియాణా షూటర్ మను భాకర్, బెంగాలీ

నయా చరిత్ర...

అమ్మాయి మెహులీ ఘోష్ సీనియర్ స్థాయిలో అందరికీ ఆశ్చర్యం కలిగే ప్రదర్శన చేశారు. మెక్సికోలో జరుగుతున్న ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో 16 ఏళ్ల మను భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించింది. ఈ పోటీల చరిత్రలో భారత్ తరఫున స్వర్ణాలు నెగ్గిన పిన్న వయస్కురాలిగా కొత్త చరిత్ర లిఖించింది. మరోవైపు 17 ఏళ్ల మెహులీ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో, మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్యాలు గెలిచింది. రెండేళ్ల క్రితమే షూటింగ్‌లో అడుగు పెట్టిన మను అంతకుముందు మార్షల్ ఆర్ట్స్, స్కేటింగ్, క్రికెట్, బాక్సింగ్‌లో ప్రావీణ్యం సంపాదించింది. బాక్సింగ్‌లో కంటికి గాయం కావడంతో ఆమె తల్లి సలహాతో షూటింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టిన మను పతకాల పంట పండిస్తూ భారత మహిళల షూటింగ్‌కు భరోసా కల్పించింది.

ఏడాదికి ఏడు కోట్లు

కొత్తగా 'ఎ ప్లస్' కాంట్రాక్ట్ ప్రవేశపెట్టిన బీసీసీఐ ● జాబితాలో కోహ్లి సహా ఐదుగురు
ధోని, అశ్విన్ 'ఎ' గ్రేడ్‌కే పరిమితం ● భారీగా పెరిగిన దేశవాళీ మ్యాచ్ ఫీజు



ముంబై: గత ఏడాది సరిగ్గా ఇదే సమయానికి శిఖర్ ధావన్ భారత టెస్టు జట్టులోనే లేడు. వన్డేల్లో కూడా అప్పటికి దాదాపు ఏడాది విరామం తర్వాత జట్టులోకి వచ్చాడు. 'సి' గ్రేడ్ కాంట్రాక్ట్ ఉన్న అతను ఏడాదికి రూ. 50 లక్షలు అందుకుంటున్న ఆటగాళ్ల జాబితాలో ఉన్నాడు. ఇప్పుడు సంవత్సరం తిరిగే సరికి అతనికి ఒక్కసారిగా మూడు ప్రమోషన్‌లు లభించాయి. ఇప్పుడు ధావన్ 'ఎ ప్లస్' గ్రేడ్‌లోకి ఎగబాకాడు. కొత్త కాంట్రాక్ట్ ప్రకారం శిఖర్ ఏడాదికి రూ. 7 కోట్లు అందుకోనున్నాడు. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 1300 శాతం ఎక్కువ కావడం విశేషం! 2017 అక్టోబర్ 1 నుంచి 2018 సెప్టెంబర్ 30 వరకు వర్తించే విధంగా బీసీసీఐ బుధవారం కొత్త కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. మొత్తం 26 మందికి ఇందులో చోటు దక్కింది. ఇందులో భాగంగా తొలిసారిగా 'ఎ ప్లస్' గ్రేడ్‌ను కూడా చేర్చింది. ఇందులో ఐదుగురుకి చోటు కల్పించింది. మూడు ఫార్మాట్‌లలో రెగ్యులర్ సభ్యులైన కెప్టెన్ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లతో పాటు పేసర్లు భువనేశ్వర్, జస్‌ప్రీత్ బుమ్రాలు మాత్రమే ఇందులో ఉన్నారు. రోహిత్, భువీ, బుమ్రా కూడా 'బి' నుంచి 'ఎ ప్లస్'కు ఎగబాకారు. గత ఏడాది 'ఎ' గ్రేడ్‌లో ఉన్న మహేంద్ర సింగ్ ధోని, అశ్విన్ అందులోనే కొనసాగనున్నారు. ధోని ఆడుతున్న మ్యాచ్‌ల సంఖ్య పరిమితంగా ఉండటం దీనికి కారణం కాగా... అశ్విన్, జడేజా వన్డేలకు దూరమయ్యారు. గత ఏడాదిలాగే రహానే, పుజారా, మురళీ విజయ్‌ల పేర్లు ఈ జాబితాలో చోటు చేసుకోగా, వికెట్ కీపర్ సాహా గ్రేడ్ 'సి' నుంచి 'ఎ'కు ప్రమోట్ కావడం విశేషం. గత సంవత్సరం కాంట్రాక్ట్ దక్కని రైనా, కుల్దీప్ యాదవ్, దినేశ్ కార్తీక్‌లకు చోటు దక్కగా... భారత్ తరఫున సంవత్సరం క్రితం ఆఖరి మ్యాచ్ ఆడిన జయంత్ యాదవ్‌కు కూడా కాంట్రాక్ట్ దక్కింది.

మిథాలీ రాజ్‌కు రూ. 50 లక్షలు...

మహిళా క్రికెటర్ల కాంట్రాక్ట్ ఫీజులను కూడా బీసీసీఐ భారీగా పెంచింది. 'ఎ' గ్రేడ్‌లో ఉన్న ఆటగాళ్లకు ఇప్పుడు ఏడాదికి రూ. 50 లక్షల (గత ఏడాది రూ. 15 లక్షలు) చొప్పున లభిస్తుంది. ఈ జాబితాలో స్టార్ ప్లేయర్లు మిథాలీ రాజ్, జులన్ గోస్వామి, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధన ఉన్నారు. మరో ఆరుగురికి 'బి' గ్రేడ్ (రూ. 30 లక్షలు)లో అవకాశం కల్పించగా... కొత్తగా గ్రేడ్ 'సి'ని (రూ. 10 లక్షలు) చేర్చి ఇందులో 9 మందిని చేర్చారు. దేశవాళీ క్రికెట్‌లో (రంజీ ట్రోఫీ తదితర) కూడా మ్యాచ్ ఫీజులు ఏకంగా 200 శాతం పెరగడం మరో విశేషం. సీనియర్ పురుషుల విభాగంలో మ్యాచ్ జరిగే రోజుల్లో తుది జట్టులో ఉండే ఆటగాడికి రోజుకు రూ. 35 వేల చొప్పున చెల్లిస్తారు. ఇదే తరహాలో సీనియర్ మహిళల మ్యాచ్‌కు రోజుకు రూ. 12,500 చొప్పున లభిస్తుంది. క్రీడాకారులకు కాంట్రాక్ట్ మొత్తం అందించేందుకు బోర్డు తమ పీఠ ర్/సీఈఎఫ్ ఫండ్ నుంచి ఏడాదికి రూ. 125 కోట్లు కేటాయిస్తోంది. ఒకవేళ బోర్డు ఆదాయంలో కోత పడినా ఎలాంటి ఇబ్బంది రాకుండా ముందస్తు అంచనాలను పరిగణనలోకి తీసుకుంటూ కాంట్రాక్ట్‌లు ప్రకటించామని బీసీసీఐ వెల్లడించింది.

ఎవరెవరు ఎక్కడ..

'ఎ ప్లస్' గ్రేడ్ (రూ. 7 కోట్లు): కోహ్లి, రోహిత్, ధావన్, భువనేశ్వర్, బుమ్రా.
'ఎ' గ్రేడ్ (రూ. 5 కోట్లు): అశ్విన్, జడేజా, విజయ్, పుజారా, రహానే, ధోని, సాహా.
'బి' గ్రేడ్ (రూ. 3 కోట్లు): రాహుల్, ఉమేశ్, కుల్దీప్, చహల్, పాండ్యా, ఇషాంత్, దినేశ్ కార్తీక్.
'సి' గ్రేడ్ (రూ. 1 కోటి): జాదవ్, పాండే, అక్షర్ పటేల్, కరుణ్ నాయర్, రైనా, పార్థివ్, జయంత్.

షేమ్ షేమ్ షమీ!

- భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీపై భార్య హసీన్ జహాన్ తీవ్ర ఆరోపణలు
- తనను తీవ్రంగా వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు
- ఆరోపణలను ఖండించిన షమీ



భార్య, కూతురుతో షమీ

కోల్‌కతా: భారత క్రికెటర్ మొహమ్మద్ షమీ తీవ్ర వివాదంలో చిక్కుకున్నాడు. తనను తీవ్రంగా హింసిస్తున్నాడని, ఇతర మహిళలతో సంబంధాలు కూడా పెట్టుకున్నాడని అతని భార్య హసీన్ జహాన్ ఆరోపించింది. గత రెండేళ్లుగా దీనిని భరిస్తూ వచ్చిన తాను, తప్పనిసరి పరిస్థితుల్లో అన్నీ బయట పెట్టాల్సి వచ్చిందని హసీన్ చెప్పింది. ముందుగా తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా ఈ విషయం ప్రకటించిన ఆమె, ఆ తర్వాత మీడియాతో కూడా మాట్లాడింది. ఇదే అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. షమీ వాట్సప్ ద్వారా ఇతర మహిళలతో చేసిన చాటింగ్ జాబితాను కూడా ఆమె బయట పెట్టింది. అయితే షమీ వీటన్నింటిని ఖండించాడు. తనకు చెడ్డపేరు తీసుకొచ్చేందుకు కొందరు పన్నిన కుట్రగా అతను దీనిని అభివర్ణించాడు.

ఇంట్లో వాళ్లూ హింసిస్తున్నారు...

షమీకి, హసీన్ జహాన్‌కు 2014లో పెళ్లయింది. వీరికి ఒక పాప కూడా ఉంది. మోడల్ అయిన హసీన్ వస్త్రధారణవంటి విషయాల్లో అనేక సార్లు షమీ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే తన భార్యను సమర్థిస్తూ వాటికి గట్టిగా జవాబిచ్చిన షమీ... పదే పదే ఆమెపై తన ప్రేమను ప్రదర్శిస్తూ వచ్చాడు. 'చాలా కాలంగా షమీ కుటుంబ సభ్యులు నన్ను హింసిస్తున్నారు. అతని తల్లి, సోదరుడు కూడా దుర్భాషలాడారు. తెల్లవారు జామున 3 వరకు కూడా ఈ వేధింపులు కొనసాగేవి. వాళ్లు నన్ను చంపాలని కూడా చూశారు. షమీ కూడా చాలా సార్లు నన్ను తిట్టడం, కొట్టడం చేశాడు. నా కుటుంబం కోసం ఇంతకాలం ఆగిన నేను ఇక భరించలేకపోయాను.' అని హసీన్ వెల్లడించింది.

అసభ్య సంభాషణలు...

షమీ తనను మోసం చేస్తూ అనేక మంది మహిళలతో సంబంధాలు కొనసాగిస్తున్నాడని కూడా హసీన్ ఆరోపించింది. దీనికి సంబంధించి వేర్వేరు మహిళలతో జరిపిన వాట్సప్, ఫేస్‌బుక్ మెసెంజర్ స్క్రీన్ షాట్‌లను కూడా ఆమె బయట పెట్టింది. ఇందులో షమీ పలు అసభ్యకర సందేశాలు వారికి పంపించినట్లుగా కనిపిస్తోంది. '2014 ఐపీఎల్ సమయంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు కానుకగా ఇచ్చిన ఫోన్‌ను షమీ ఇందు కోసం ఉపయోగించుకున్నాడు. అతని కారులో ఈ ఫోన్ బయటపడింది. అతి కష్టమ్మీద నేను దాని లాక్ ఓపెన్ చేయగలిగాను. అతను ఒక పాకిస్తాన్ అమ్మాయిని కూడా పెళ్లి చేసుకున్నాడు. దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వస్తూ ఆమెను కలిసేందుకు అక్కడికి వెళ్లాడు కూడా. తనతో పాటు నేను కూడా ధర్మశాలకు వస్తానని చెబితే తిరస్కరించాడు. భారత జట్టు ఎక్కడికి వెళ్లినా కుల్దీప్ అనే వ్యక్తి షమీకి అమ్మాయిలను సరఫరా చేస్తుంటాడు. బీసీసీఐ కూడా ఈ విషయంలో ఏమీ చేయడం లేదు' అని హసీన్ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'షమీపై న్యాయపరమైన చర్య తీసుకుంటాం. అయితే దానికి ముందు అతను తన తప్పు తెలుసుకునేందుకు కొంత సమయం ఇవ్వాలని కూడా భావిస్తున్నాం' అని హసీన్ లాయర్ జాకీర్ హుస్సేన్ వెల్లడించారు.

కాంట్రాక్ట్‌లో చోటు లేదు

బీసీసీఐ ప్రకటించిన వార్షిక కాంట్రాక్ట్‌లలో షమీకి చోటు దక్కలేదు. తాజా పరిణామాల నేపథ్యంలోనే చివరి నిమిషంలో అతని పేరును జాబితా నుంచి తప్పించినట్లు బోర్డు వర్గాలు వెల్లడించాయి. 'షమీ కాంట్రాక్ట్‌ను నిలిపే విషయంలో మేమే సందిగ్ధ స్థితిలో నిలిచాం. అవి వ్యక్తిగత ఆరోపణలైతే కాంట్రాక్ట్ ప్రొఫెషనల్‌కు సంబంధించినది కదా అనే సందేహం వచ్చింది. అయితే ఆరోపణలు ఇంత తీవ్రంగా ఉన్నా మీరు అతడికి గుర్తింపు ఇస్తున్నారు కదా అని ఎవరైనా ప్రశ్నించే అవకాశం ఉంది' అని సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ స్పష్టతనిచ్చారు. తాజా వివాదంపై విచారణ పూర్తయ్యే వరకు షమీకి కాంట్రాక్ట్ దక్కదు. తనపై భార్య చేసిన ఆరోపణలను ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా షమీ ఖండించాడు. 'మా వ్యక్తిగత జీవితం గురించి వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవాలు. మాపై జరుగుతున్న పెద్ద కుట్ర ఇది. నా పరువు తీయడంతో పాటు నా ఆటను దెబ్బతీసేందుకే ఈ ప్రయత్నం జరుగుతోంది' అని షమీ వివరణ ఇచ్చాడు.

రాస్ రఫ్ఫాడించాడు

- టేలర్ 147 బంతుల్లో 181 నాటౌట్
- ఇంగ్లండ్‌పై కివీస్ భారీ లక్ష్య ఛేదన

డ్యూనెడిన్: హోరాహోరీ, పోటాపోటీ వంటి పదాలకు సరైన నిర్వచనంగా సాగిన వన్డేలో ఇంగ్లండ్‌పై న్యూజిలాండ్‌దే పైచేయి అయింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ రాస్ టేలర్ (147 బంతుల్లో 181 నాటౌట్; 17 ఫోర్లు, 6 సిక్స్‌లు) విరుచుకుపడిన వేళ న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. ముందుగా ఇంగ్లండ్ 9 వికెట్లకు 335 పరుగులు చేయగా, న్యూజిలాండ్ 49.3 ఓవర్లలో 5 వికెట్లకు 339 పరుగులు చేసి నెగ్గింది.

మెరుపులా మొదలై...

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు జేసన్ రాయ్ (42), బెయిర్‌స్టో (138; 14 ఫోర్లు, 7 సిక్స్‌లు) 77 పరుగులు జోడించి మంచి ఆరంభాన్నిచ్చారు. అనంతరం బెయిర్‌స్టో, రూట్ (102; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 190 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. 38వ ఓవర్‌లో 267/1తో నిలిచిన ఇంగ్లండ్ 400 పరుగులు చేసేలా కనిపించినా.. 21 పరుగుల తేడాతో 6 వికెట్లు కోల్పోయింది.

భారీ ఛేదనలో కివీస్ విధ్వంసక ఓపెనర్లు గప్టిల్ (0), మున్రో (0) డకౌటయ్యారు. ఆ తర్వాత టేలర్... లాథమ్ (71; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో నాలుగో వికెట్‌కు 187 పరుగులు జోడించాడు. చివరి ఓవర్లో 3 పరుగులు చేయాల్సి ఉండగా... మూడో బంతిని నికోల్స్ సిక్స్‌గా మలచడంతో కివీస్ భారీ ఛేదన పూర్తయింది. ఐదో వన్డే శనివారం జరుగుతుంది.



రాస్ టేలర్

5-1తో భారత్ విజయం

ఇఫో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్‌షా కప్ హాకీ టోర్నీలో బుధవారం మలేసియాతో జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో సర్దార్ సింగ్ సేన 5-1 గోల్స్ తేడాతో మలేసియాపై నెగ్గింది. ఈ టోర్నీలో టీమిండియాకు ఇదే తొలి విజయం. భారత్ తరఫున గుర్జంత్ సింగ్ (42వ, 57వ ని.లో) రెండు గోల్స్, శైలానంద్ లక్రా (10వ ని.లో), సుమిత్ కుమార్ (48వ ని.లో), రమణ్‌దీప్ సింగ్ (51వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ప్రత్యర్థి జట్టు తరఫున ఫైజల్ (33వ ని.) ఏకైక గోల్ కొట్టాడు. శుక్రవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో భారత్ ఆడుతుంది.

ప్రిక్వార్టర్స్‌లో సిక్కి రెడ్డి జోడీ

ముల్హేయిమ్: జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగమ్మాయి సిక్కిరెడ్డి జోడీ ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రాతో జతకట్టిన ఆమె తొలి రౌండ్‌లో గెలుపొందింది. బుధవారం జరిగిన పోరులో భారత జోడీ 24-22, 17-21, 21-19తో చంగ్ కొ చి-చెంగ్ చి యా జంటపై నెగ్గింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మను అత్రి-సుమిత్ రెడ్డి జంట 16-21, 16-21తో కాస్పెర్-నోర్ (డెన్మార్క్) జోడీ చేతిలో కంగుతింది.

గెలవాలంటే కొట్టాలి

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ 'ఢీ' ● ముక్కోణపు టి20 టోర్నీ

కొలంబో: టి20 మ్యాచ్‌లో మోస్తరు లక్ష్యం నిర్దేశించి... విజయం సాధించాలంటే పటిష్ట బౌలింగ్ వనరులుండాలి. ఇలా కాకుంటే భారీ స్కోరు చేసి ప్రత్యర్థిని ముందే ఒత్తిడికి గురిచేయాలి. మొదటి మ్యాచ్‌లో లంకపై రోహిత్ సేన ఈ రెండూ చేయలేక ఓటమిపాలైంది. తొలుత బ్యాటింగ్‌లో సాదాసీదా ప్రదర్శన... తర్వాత పస లేని బౌలింగ్‌తో మ్యాచ్ చేజారింది. ఈ నేపథ్యంలో గురువారం బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్ మెరుపులూ తోడైతేనే టీమిండియాది పైచేయి అవుతుంది.

స్కోరు 200 దాటాలి...

ముందుగా బ్యాటింగ్‌కు దిగితే కనీసం 200 పరుగులు చేయాలి. ప్రస్తుత మన బౌలింగ్ పరిమితులరీత్యా ఈ స్థాయి స్కోరుంటేనే గెలుపుపై నిశ్చింతగా ఉండగలం. దీనికి పునాది వేయాల్సింది కెప్టెన్ రోహిత్ శర్మనే. పేలవ ఫామ్ నుంచి అతడు త్వరగా బయటపడి... అద్భుతంగా ఆడుతున్న మరో ఓపెనర్ ధావన్‌కు తోడైతే ఇదేమంత కష్టం కాదు. బౌలింగ్‌లో తొలి మ్యాచ్‌లో సుందర్ మినహా అందరూ తేలిపోయారు. పేసర్లు శార్దుల్, ఉనాద్కట్ ప్రభావం చూపకపోవడంతో పార్ట్ టైమర్లను ఆశ్రయించాల్సి వచ్చింది. వీరితో పాటు చహల్ కూడా గాడిన పడాల్సిన అవసరం ఉంది. ఎడమచేతి వాటం స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. దీంతో విజయ్ శంకర్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. ఈ ఒక్కటి తప్ప మార్పులు ఉండకపోవచ్చు.

రాత్రి గం. 7.00 నుంచి డి స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆర్టీసీ ఉద్యోగులకు మధ్యంతర భృతి ఇవ్వాలి: ఈయూ

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు వేతనాల సవరణలో జాప్యం జరుగుతున్నందున వెంటనే మధ్యంతర భృతి ఇవ్వాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) నేతలు పద్మాకర్, దామోదరరావు డిమాండ్ చేశారు. పలు సమస్యలపై ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేయనున్నట్టు వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన విజయవాడలో జరగనున్న ఈయూ రాష్ట్ర కమిటీ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ఈయూ నేతలు తెలిపారు.

చింతమనేని పిటిషన్ తిరస్కరణ

తీర్పుపై అప్పీల్ మాత్రం విచారణకు స్వీకరణ

ఏలూరు (సెంట్రల్): తనకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ భీమడోలు న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసుకున్న పిటిషన్‌ను జిల్లా కోర్టు తిరస్కరించింది. ఈ కేసు తీర్పుపై అప్పీలును మాత్రం విచారణకు స్వీకరించింది. దీని పై విచారణ పూర్తి అయ్యే వరకూ ప్రభాకర్‌కు బెయిల్ మంజూరు చేస్తూ మొదటి జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి జి.గోపి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణ ఏప్రిల్ 10కి న్యాయమూర్తి వాయిదా వేశారు. 2011లో దెందులూరులో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాజీ మంత్రి వట్టి వసంతకుమార్‌పై దౌర్జన్యం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ఇటీవలే భీమడోలు కోర్టు రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.2500 జరిమాన విధించిన విషయం తెలిసిందే.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ ఇన్‌చార్జ్ పీఆర్వో జేవీ ఆర్కే రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబల్‌పూర్ –బనాస్‌వాడి ప్రత్యేక రైలు (08301) ఏప్రిల్ 4, 11,18,25వ తేదీల్లో, మే 2,9,16,23,30, జూన్ 6,13, 20,27 తేదీల్లో ఉదయం 9.30 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు బనాస్‌వాడి చేరుకుంటుంది. బనాస్‌వాడి–సంబల్‌పూర్ రైలు (08302) ఏప్రిల్ 6,13, 20,27, మే 4,11,18,25, జూన్ 1,8,15,22,29వ తేదీల్లో అర్ధరాత్రి 12.30కు బనాస్‌వాడిలో బయలుదేరి రెండో రోజు ఉదయం 6.35కు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

రూ.9 కోట్లతో 'అవినీతి' భవనం కట్టాడు

- వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ శ్యామలరావుపై కేంద్ర విజిలెన్స్‌కు ఫిర్యాదు
- బినామీ పేరున స్థలం కొని.. ఆ తర్వాత తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపణ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించిన విజిలెన్స్ కమిషన్

సాక్షి, అమరావతి బ్యూరో: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ జె.శ్యామలరావు అవినీతి సొమ్ముతో దాదాపు రూ.9 కోట్ల విలువైన అధునాతన భవనాన్ని నిర్మించారని కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు అందింది. విజయవాడ సమీపంలోని పోరంకిలో ఓ విలువైన స్థలాన్ని మొదట బినామీ పేరున రిజిస్ట్రేషన్ చేయించి.. తర్వాత ఆయన పేరు మీదకు మార్చుకున్నారని ఓ అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆ స్థలంలో దాదాపు రూ.7 కోట్ల మార్కెట్ విలువతో జి+2 భవనాన్ని నిర్మించారని ఆరోపించాడు. వాణిజ్య పన్నుల శాఖకు చెందిన మరో ముగ్గురు ఉద్యోగుల సహకారంతో ఈ అవినీతికి పాల్పడినట్లు పేర్కొన్నాడు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖతో పాటు సచివాలయంలో చర్చనీయాంశంగా మారింది.

మంతెన కేశవరాజే బినామీ..

కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు వెళ్లిన ఫిర్యాదు ప్రకారం.. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ శ్యామలరావు 2016 జనవరిలో పోరంకి వద్ద రూ.1.20 కోట్ల విలువైన 600 గజాల స్థలాన్ని మంతెన కేశవరాజు అనే వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం అదే స్థలాన్ని 2016 సెప్టెంబర్‌లో రూ.1.50 కోట్ల విలువతో శ్యామలరావు, ఆయన భార్య శైలజ కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేశారు. మొదటి రిజిస్ట్రేషన్ పత్రాల్లో మంతెన కేశవరాజు ఫోటో.. ఇతర వివరాలకు, రెండో రిజిస్ట్రేషన్ పత్రాల్లోని వివరాలకు పొంతనే లేదని.. దీని బట్టి కేశవరాజు శ్యామలరావుకు బినామీయేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆ స్థలంలో దాదాపు రూ.5.50 కోట్ల మార్కెట్ విలువతో జి+2 భవనాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. మరో రూ.2 కోట్లతో ఇంటీరియర్ డెకరేషన్ చేయించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషరేట్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సీతాలం శేఖర్ పూర్తి సహకారం అందించారని ఫిర్యాదులో ఆరోపించారు. శేఖర్ మీద ఏసీబీ అధికారులు గతంలో దాడులు నిర్వహించి భారీగా ఆస్తులు స్వాధీనం చేసుకున్నారని.. కానీ ఆయనపై కమిషనర్ శ్యామలరావు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఈ సందర్భంగా వివరించారు. అలాగే విజయవాడలో సీనియర్ అసిస్టెంట్ అర్జ శ్రీను, ఉయ్యూరులో అటెండర్‌గా ఉన్న శ్రీను కూడా కమిషనర్ శ్యామలరావుకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా అవినీతి సొమ్ముతో శ్యామలరావు పోరంకిలో అధునాతన భవనం నిర్మించుకున్నారని ఆరోపిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలను కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు సమర్పించారు. కమిషన్ స్పందిస్తూ.. తగిన చర్యల కోసం ఈ ఫిర్యాదును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించింది. కాగా, ఈ వ్యవహారంపై స్పందించేందుకు శ్యామలరావు నిరాకరించారు. ఆ ఫిర్యాదు తన దృష్టికి రాలేదని.. అలాంటి వాటిపై తాను అధికారికంగా స్పందించకూడదని చెప్పారు.

సుప్రభాత సేవలో సినీనటి శ్రియ



శ్రీవారి ఆలయం వద్ద సినీనటి శ్రియ

సాక్షి, తిరుమల: సినీనటి శ్రియ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమె తల్లితో కలసి వేకువజామున 3.00 గంటలకు ఆలయానికి విచ్చేశారు. సుప్రభాత సేవలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తర్వాత వారు వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. ఆలయ అధికారులు శ్రీయకు లడ్డూ,ప్రసాదాలు అందజేశారు.

పొగమంచుతో విమాన రాకపోకలకు అంతరాయం

గన్నవరం: గన్నవరం ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం దట్టమైన పొగమంచు వల్ల పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రన్‌వేను పూర్తిగా పొగమంచు కప్పివేయడంతో విమానాలు ల్యాండింగ్ కోసం గాలిలో చక్కర్లు కొట్టగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. ఉదయం 8.00 గంటలకు హైదరాబాద్, బెంగళూరు నుంచి వచ్చిన ట్రూజెట్, స్పైస్‌జెట్ విమానాలు ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో గంటకుపైగా గాల్లోనే చక్కర్లు కొట్టాయి. న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా విమానాన్ని హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. అయితే ఉదయం 9.30 గంటలకు వాతావరణం అనుకూలించడంతో విమానాలను సురక్షితంగా గన్నవరం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన బాబు

మాజీ మంత్రి తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం అర్బన్: ప్రత్యేకహోదా విషయంలో సీఎం చంద్రబాబు తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు తమ్మినేని సీతారాం ధ్వజమెత్తారు. శ్రీకాకుళంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేకహోదా వచ్చే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రత్యేకహోదా కోసం తమ పార్టీ చేస్తున్న పోరాటాన్ని ఎన్నివిధాలుగా అవకాశం ఉంటే అన్ని విధాలుగా నీరుగార్చేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. తెలుగుప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేకహోదాను సాధిస్తారని, సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తారని రాష్ట్ర ప్రజలు చంద్రబాబును సీఎంను చేస్తే వారి ఆశలను అడియాసలు చేస్తూ అవినీతి, అక్రమాలు పాల్పడిన ఘనుడు చంద్రబాబని దుయ్యబట్టారు. సీఎం హోదా బదులు ప్యాకేజీకే మొగ్గు చూపారని, అందులో భాగంగానే రూ.16 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందన్నారు. ప్రజల విశ్వాసాన్ని చంద్రబాబు కోల్పోయారన్నారు. సమావేశంలో పార్టీ సీఈసీ సభ్యుడు అంధవరపు సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరి పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో ప్రత్యేక కోర్టు ప్రారంభం

ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి రామసుబ్రమణియన్

విజయవాడ లీగల్: విజయవాడలోని సివిల్ కోర్టుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టును హైకోర్టు న్యాయమూర్తి వి.రామసుబ్రమణియన్ బుధవారం డిజిటల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిజిటల్ విధానంలో కృష్ణా జిల్లాలో ఇదివరకే తిరువూరు, జగ్గయ్య పేట కోర్టులను ప్రారంభించామని, ఇది మూడోదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులపై 124 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అత్యధికంగా గుంటూరు జిల్లాలో 23 మందిపై కేసులున్నాయని తెలిపారు. ప్రజాప్రతినిధులైన ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని అశ్వనీకుమార్ సక్సేనా కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఆదేశించిందని చెప్పారు. ఇందులో భాగంగా విజయవాడలో ఈ కోర్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక కోర్టు విజయవాడకు రావడం పట్ల న్యాయమూర్తులు, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీబీఏ కార్యవర్గ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో జస్టిస్ సుబ్రమణియన్‌తో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణరావు తదితరులు

కలెక్టర్ల పెత్తనాన్ని సహించం..

- పంచాయతీరాజ్ ఇంజినీర్ల ఆగ్రహం
- పని భారం తగ్గించాలంటూ ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మురళీకృష్ణనాయుడు

సూర్యారావుపేట(విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో తమకు మనశ్శాంతి కరువైందని, చీటికీ మాటికీ కలెక్టర్ల వేధింపులు, సస్పెండ్‌లు చేయడంతో ఉద్యోగ భద్రత కరువైందని పలువురు పంచాయతీరాజ్ ఇంజినీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీర్లపై కలెక్టర్ల పెత్తనాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీర్లపై కలెక్టర్‌ల పెత్తనాన్ని నివారించాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నగరంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో 13 జిల్లాల నుంచి వందలాది మంది పంచాయతీరాజ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. వారికి ఏపీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు, ఏపీ ఉద్యోగుల అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ అధికారులపై కలెక్టర్‌ల బాధ్యత ఎంత వరకు ఉందనేది పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీర్లపై పనిభారం లేకుండా సహాయకులను నియమించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాలు, కనీసం వాహన సౌకర్యం కూడా లేని పరిస్థితులలో పని ఒత్తిడి, కలెక్టర్ల పెత్తనం తట్టుకోలేక పంచాయితీ ఇంజినీర్లు ధర్నాకు దిగడంపై ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ జేఏసీ స్టేట్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని శాఖలపై కలెక్టర్‌లు పెత్తనం చెలాయిస్తూ అధికారులను సస్పెండ్‌లు చేయడాన్ని అరికట్టాలన్నారు. పంచాయతీరాజ్ జేఏసీ చైర్మన్ మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ.. ఇంజినీర్లపై ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జేఏసీ కార్యదర్శి విద్యాసాగర్, పంచాయతీరాజ్ జేఏసీ ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, షేక్ రియాజ్ అహ్మద్, జేఏసీ నాయకులు సంగీతరావు, అప్పారావు, 13 జిల్లాల జేఏసీ నాయకులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

శత్రుపక్షంగా వ్యవహరిస్తున్న బీజేపీ

నన్నపనేని రాజకుమారి



నారాయణవనం: రాష్ట్ర అభివృద్ధి విషయంలో మిత్రపక్షంగా వ్యవహరించాల్సిన బీజేపీ, శత్రుపక్షంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి వ్యాఖ్యానించారు. చిత్తూరు జిల్లా నారాయణవనం మండలంలోని సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో నన్నమనేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఆనాడు అశాస్త్రీయంగా రాష్ట్ర విభజన చేసిన పార్టీకి ఏపీలో అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఆనాటి గాయానికి మందు రాయాల్సిన బీజేపీవారు కారం చల్లడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బీజేపీ ప్రతిపక్షంగా కూడా కాక శత్రుపక్షంగా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతింటే ఊరుకొనేది లేదన్నారు.

సిగ్గుంటే కేంద్రం నుంచి వైదొలగాలి

ప్రత్యేక హోదా డిమాండ్‌తో సీపీఐ జలదీక్ష



కృష్ణానదిలో జలదీక్ష చేస్తున్న నేతలు

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): ప్రత్యేక హోదా ఇచ్చేది లేదంటూ బీజేపీ ప్రకటించినా.. టీడీపీ ఇంకా కేంద్ర ప్రభుత్వంలో కొనసాగడం సిగ్గుచేటని, ఏ మాత్రం సిగ్గున్నా వెంటనే వైదొలగాలని సీపీఐ నగర ప్రధాన కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో పాటు ఢిల్లీలో ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న ఆంధ్రులకు మద్దతుగా సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని దుర్గాఘాట్‌లో జలదీక్ష చేపట్టారు. ప్రత్యేక హోదా సాధన కోసం వామపక్షాలు, వైఎస్సార్ సీపీ, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఢిల్లీలో ఉద్యమిస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ దొంగాటలు మాని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కాగా, సీపీఐ చేపట్టిన జలదీక్షకు టీఆర్ఎస్ మద్దతు తెలిపింది.టీఆర్ఎస్ నేత ఆదినారాయణ దీక్ష చేస్తున్న నాయకులకు సంఘీబావం తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు జి.కోటేశ్వరరావు, పల్లా సూర్యారావు, లంక దుర్గారావు, డీవీ రమణబాబు, బుట్టి రాయప్ప, ఈడే ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి విశాఖ ఆర్డీవో సరండర్

- క్రిమినల్ కేసులకు సిఫార్సు
- జేసీ సిఫార్సుతో కలెక్టర్ ఆదేశాలు
- సంచలనం రేపిన 'సాక్షి' కథనాలు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) ఎస్. వెంకటేశ్వర్లును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు అనుమతి కోరుతూ లేఖ రాశారు. ఇనాం, ఆర్వోఆర్, ఏపీ భూ అధీక్రణ చట్టాల కింద జారీచేసిన పలు ఉత్తర్వులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతోపాటు అధికార పార్టీ నేతలకు లబ్ధి చేకూర్చినందుకు ఇప్పటికే పలుమార్లు ఆయనకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అయినా ఆయనలో మార్పు రాలేదు. పైగా ఇటీవల ఉన్నతాధికారులను సైతం తప్పుదారి పట్టిస్తూ ఆనందపురం మండలం వేములవలసలో 11.14 ఎకరాల సీలింగ్ భూములకు ప్రత్యామ్నాయంగా ఎందుకూ పనికిరాని రావికమతం మండలం బాదనపాడులోని భూములను స్వాధీనం చేసుకునే విషయంలో నిబంధనలను పాతరేశారు. పైగా తన పరిధికాని డివిజన్‌లోని రావికమతం తహసీల్దార్‌కు ప్రత్యామ్నాయ భూముల స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈ మొత్తం వ్యవహారంపై 'సాక్షి'లో వచ్చిన కథనాల మీద జాయింట్ కలెక్టర్ జి.సృజన సమగ్ర విచారణ జరిపారు. ఉన్నతాధికారులను సైతం ఆర్డీవో తప్పుదారి పట్టించినట్టు గుర్తించారు. ఇవే కాకుండా.. మరికొన్ని వ్యవహారాల్లో కూడా ఆర్డీవో నిబంధనలకు విరుద్ధంగా అప్పిలేట్ అథారిటీగా తీర్పులిచ్చినట్లు జేసీ విచారణలో తేలింది. దీంతో ఆర్డీవోని ప్రభుత్వానికి సరెండర్ చేయాలంటూ కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఇందుకు కలెక్టర్ ఆమోదముద్ర వేసి ప్రభుత్వానికి పంపించారు. తిరుపతి వెళ్లేందుకు బయల్దేరిన ఆర్డీవో వెంకటేశ్వర్లుకు ఈ ఉత్తర్వు కాపీని ఎయిర్‌పోర్టులోనే అందజేశారు. మరోవైపు.. ఇటీవల ఆర్డీవో వెంకటేశ్వర్లు సిఫార్సులతో డీనోటిఫై చేసిన మధురవాడలోని భూములను జేసీ తిరిగి 22/ఎలో చేర్చారు. కాగా, సాక్షి కథనాల వల్లే విచారణ జరిపామని.. ఆరోపణలు నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకున్నట్లు జేసీ సృజన చెప్పారు.

ఏ తప్పు చేయలేదు.. విచారణకు సిద్ధం

నేను ఎలాంటి తప్పు చేయలేదు. అవకతవకలకు పాల్పడలేదు. నాపై జిల్లా యంత్రాంగం చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదు. నేను ఏ విచారణకైనా సిద్ధమే. పై కోర్టులో అప్పీలు చేసుకునే విధంగా నేను ఉత్తర్వులు జారీచేశాను. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేశాను.

– ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్డీవో

కేంద్ర సంస్థలకు నిధులివ్వండి

కేంద్రమంత్రి జవదేకర్‌తో గంటా భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కేంద్ర విద్యాసంస్థలకు నిధులు విడుదల చేయాలని మంత్రి గంటా శ్రీనివాసరావు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్ర విద్యాసంస్థలకు తగినన్ని నిధులు విడుదల చేయాలని మంత్రి గంటా కోరగా నిధులు విడుదల చేస్తామని, దీనికి సంబంధించి ఏపీకి చెందిన కేంద్ర ఉన్నత విద్యా కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో చర్చించాలని సూచించారు.



వారిపై కేసులు నమోదు చేయండి

కోడి పందేల నిర్వహణపై పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించిన తెలుగుదేశం పార్టీకి చెందిన రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని మల్లికార్జునరావు, ముమ్మనేని వెంకట సుబ్బయ్యలపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఉమ్మడి హైకోర్టు చెరుకుపల్లి పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమ ఆదేశాలకు విరుద్ధంగా కోడి పందేలు నిర్వహించిన ప్రజా ప్రజాప్రతినిధులు ఏ రాజకీయ పార్టీ వారైనప్పటికీ చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ధర్మాసనం స్పష్టంచేసింది. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ దాఖలైన మరో పిటిషన్‌పై ధర్మాసనం స్పందించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని మల్లికార్జునరావు, ముమ్మనేని వెంకట సుబ్బయ్యలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ గుంటూరు జిల్లాకు చెందిన న్యాయవాది తాడివాక భానుప్రకాశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది జై భీమారావు వాదనలు వినిపిస్తూ, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన వారిపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీనిపై హోంశాఖ న్యాయవాది విద్యావతి స్పందిస్తూ, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వివరించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే సత్యప్రసాద్, మిగిలిన ప్రజా ప్రతినిధుల తరపు న్యాయవాది మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటిషనర్ వైఎస్సార్ సీపీకి చెందిన వారని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఫిర్యాదు చేశారని తెలిపారు. కోడి పందేలు ఆడిన వారిలో వైఎస్సార్‌సీపీకి చెందిన వారూ ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, తమ ఆదేశాలకు విరుద్ధంగా కోడి పందేలు ఆడిన వారు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. పోలీసులు తమకు అసౌకర్యం కలిగించే ఫిర్యాదులను తీసుకోకపోవడం ఎప్పటినుంచో జరుగుతూ వస్తోందని వ్యాఖ్యానించింది. ఎమ్మెల్యే సతీష్ తదితరులపై పిటిషనర్ చేసిన ఫిర్యాదు అందలేదని హోంశాఖ న్యాయవాది చెబుతున్న నేపథ్యంలో మరోసారి ఫిర్యాదు అందచేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదికి స్పష్టం చేసింది.

విశాఖ కలెక్టర్‌కు తొలి విద్యుత్ కారు

అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం



విద్యుత్ కారులో కార్యాలయానికి వస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): దేశంలోనే తొలిసారిగా విద్యుత్ కారును విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అందజేసింది. విశాఖలోని వివిధ శాఖల అధికారులకు దాదాపు 110 ఎలక్ట్రిక్ కార్లను ప్రభుత్వం కేటాయించనుంది. ఇందులో భాగంగా తనకు కేటాయించిన తొలికారును బుధవారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తన క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు స్వయంగా నడుపుకుంటూ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు విద్యుత్ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా అధికారికంగా విద్యుత్ కారును ఉపయోగించిన ఘనత విశాఖ జిల్లాకు దక్కిందని, ఈ వాహనాన్ని ప్రథమంగా తానే నడపడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో ప్రజా రవాణా వ్యవస్థలో కూడా ఇలాంటి వాహనాలను తీసుకొస్తామని చెప్పారు.

కేజీబీవీ విద్యార్థినులకు 'నాసా'ఆహ్వానం

చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి 11 మంది ఎంపిక

సాక్షి ప్రతినిధి, తిరుపతి: చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 11 మంది విద్యార్థినులకు అమెరికాలోని నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) నుంచి ఆహ్వానం అందింది. వీరు మే 24వ తేదీన లాస్‌ఏంజెల్స్‌లో జరిగే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో (ఐఎస్‌డీసీ) పాల్గొననున్నారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుతున్న వీరికి నాసా నుంచి మొదటిసారి ఆహ్వానం లభించడం విశేషం. 'అంతరిక్షంలో ఆవాసాలు' అనే అంశంపై విద్యార్థినులు తయారు చేసిన పోస్టర్స్‌ను ఐఎస్‌డీసీలో ప్రదర్శించనున్నారు. సదస్సుకు ఎంపికైన విద్యార్థినుల్లో.. చిత్తూరు జిల్లాకు చెందిన వెలగా ప్రత్యూష (నిమ్మనపల్లి), కె. రెడ్డిరాణి (కలకడ), సీహెచ్ స్నేహ (గంగవరం), గుజ్జల దివ్య (కేవీపల్లి), ఎస్‌కే రోషిణి (పుంగనూరు), కె. ప్రీతి (బైరెడ్డిపల్లి), టీ సాయిశ్రీ (రొంపిచర్ల), ఎం.పూజ (కేవీపల్లి), వీ సాయిధాభాను (పుంగనూరు)లతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన అశ్విని (వెంకటగిరి), ఎం. చెంచులావణ్య (తడ) ఉన్నారు.

పరీక్ష నిర్వహించండి.. ఫలితాలు వెల్లడించకండి

అంబేడ్కర్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కేసులో హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: శ్రీకాకుళంలోని బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించుకోవచ్చునని, అయితే వాటి ఫలితాల్ని వెల్లడించరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం జనవరి 6వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ కాకినాడకు చెందిన కె.దండేష్‌కుమార్ రిట్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు విచారణ జరిపారు. పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించవచ్చునని, అయితే వాటి ఫలితాల్ని వెల్లడించరాదని అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)నిబంధనల ప్రకారం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని, అందుకు విరుద్ధంగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపివేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

నేను శక్తి.. నేనే సాక్షి



నాలుగు వారాలుగా సాక్షి నిర్వహించిన 'నేను శక్తి' కార్యక్రమ సక్సెస్ మీట్‌లో చైర్‌పర్సన్‌తో 'సాక్షి' మహిళా శక్తి ప్రతీకలు.
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగా హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో వీరంతా పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ

విజయవాడ
గురువారం, 8-3-2018

నిలవాలి.. గెలవాలి

అంతరాలు దాటుకుని స్వశక్తితో నిలదొక్కుకుంటూ సమాజానికే ఓ శక్తిగా నిలుస్తోంది స్త్రీ. ప్రతి సామాజిక అంశంలోనూ స్త్రీ తన ముద్రను వేసుకుంటూనే వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' చేపట్టిన 'నేను శక్తి' క్యాంపెయిన్ ముగింపు వేడుకల్లో వక్తలు సాక్షి ప్రయత్నంపై ప్రశంసల జల్లును కురిపించారు. స్త్రీ నిలవాలి.. స్త్రీ గెలవాలి అంటూ వీరంతా పిలుపునిచ్చారు.

వేధింపులకు గురయ్యేది అమ్మే!



ఎక్కడెక్కడో ఎవరెవరో వేధింపులకు గురౌవుతున్నారని మనం జాలి పడుతున్నాం. కానీ మన కుటుంబంలో మన అమ్మ వేధింపులకు గురౌవుతున్న విషయాన్ని మనం గుర్తించలేకపోతున్నాం. ఇలా మనం గుర్తించలేని, అమ్మ తనంతట తను బయటికి చెప్పుకోలేని ఎన్నో సంఘటనలను, కేస్ స్టడీలను 'సాక్షి' 'నేను శక్తి' క్యాంపెయిన్ ద్వారా ప్రజల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. దీనిద్వారా ప్రజల్లో ఓ అవగాహనకలిగి వారు వేధింపులను అడ్డుకోవాలి అనే విధంగా ముందుకు వెళ్లడం స్ఫూర్తిదాయకం. అంతకన్నా ముందు కుటుంబ సభ్యులంతా అమ్మ కష్టాన్ని గుర్తించాలి. అమ్మ కష్టాన్ని పంచుకోవాలి. అమ్మను గౌరవించాలి.

- మణిపవిత్ర, మిలియన్ మామ్స్ డైరెక్టర్

'నేనుశక్తి' ద్వారా స్త్రీశక్తిని గుర్తుచేశారు



'సాక్షి' నిర్వహించిన 'నేను శక్తి' క్యాంపెయిన్ ద్వారా యావత్ స్త్రీకి తన శక్తిని గుర్తుచేశారు. నా చిన్నతనంలో మా ఊరిలో జరిగిన పరిణామాలే నాలో మార్పురావడానికి దోహదపడ్డాయి. మా ఊరిలో, సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న వేధింపులపై నేను ఓ పాటను రాశాను. ఆ పాట ద్వారా నాకు సినిమా అవకాశాలు వచ్చాయి. కానీ సినిమా రంగంలో నిలదొక్కుకోవడం అంత తేలికేం కాదు. సినిమా రంగంలో రాణించాలంటే మన వెనక ఒక గాడ్‌ఫాదర్ ఉండాల్సిందే. నేను నేరుగా ఎన్నో వేధింపులకు ఎదుర్కున్నాను. మనపై జరుగుతున్న వేధింపులకు అడ్డుకట్ట పడాలి అంటే మనం బయటికి చెప్పుకోవాల్సిందే.

-శ్రేష్ఠ, రచయిత్రి

జనాభాలో సగం ఉన్నా స్త్రీకి గౌరవం దక్కట్లేదు



మహిళా శక్తి మీద ఇంతగా క్యాంపెయిన్‌ని నడపడం అనేది అంత సులువు కాదు. జనాభాలో సగం ఉన్నా స్త్రీకి గౌరవం దక్కట్లేదని నిరూపించే సజీవ కథనాలను సాక్షి ప్రచురించింది. నన్ను ఈ క్యాంపెయిన్‌లో భాగస్వామ్యం చేశారు కాబట్టి నేను కూడా ప్రతి వార్తని ఫాలో అయ్యాను. దళితులు, మహిళలు, ఆదివాసీలు ఎవరైనా కావొచ్చు, వారికి సంబంధించిన రాజకీయాలు నడపడం ద్వారా మేం అధికారంలోకి వస్తాము అనుకుంటే నడపడంలో తప్పు లేదు. దీనిని మనం ఆహ్వానించాలి. అంతేకానీ ప్రోత్సహించకుండా ఉండటం అనేది కరెక్ట్‌కాదు అనే చక్కటి కోణాన్ని క్యాంపెయిన్ ఆవిష్కరించింది.

- దేవి, సామాజిక కార్యకర్త

ఆడపిల్లలు ఎవ్వరిపైనా ఆధారపడకూడదు



వైజాగ్ దగ్గర ఉన్న చిన్న ఊరు నుంచి హైదరాబాద్ వచ్చి లీగల్ ప్రాక్టీస్ స్టార్ట్ చేశాను. ఎందరో సామాజిక కార్యకర్తలను చూసి మాట్లాడటం నేర్చుకుని, సమాజంపై అవగాహనను తెచ్చుకున్నాను. నా ఎదుగుదలకు 'సాక్షి' ప్రోత్సాహాన్ని ఇచ్చింది. సమాజం, వ్యవస్థ బాగుండాలి అంటే కుటుంబ వ్యవస్థ బాగుండాలి. కుటుంబాలు రకరకాల కారణాలతో విచ్ఛిన్నం కావడం గుర్తించాను. భార్యాభర్తల మధ్యలో పిల్లలు కష్టపడటం గమనించాను. వారి జీవితాలు బాగుపడేలా నా వంతుగా కృషి చేస్తున్నా. నేను చెప్పడం ఏంటంటే మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా పైకి ఎదగాలి తప్ప ఎవరిపైనా ఆధారపడకూడదు.

- నిశ్చల సిద్ధారెడ్డి, ఫ్యామిలీ కౌన్సెలర్

సినిమాల్లో మహిళలను కొట్టడం అనేది ఫ్యాషన్ అయ్యింది



ఈరోజు ప్రపంచ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కానీ ఇప్పటికీ ఎంతమంది మహిళలకు వేధింపుల నుంచి విముక్తి కలిగిందంటే సమాధానం లేదు. రోజూ ప్రసారమయ్యే టీవీ సీరియల్స్, సినిమాల్లో మహిళలను కొట్టడం అనేది ఒక ఫ్యాషన్‌గా మారింది. ఈ రెండూ సమాజంపై ఎంతటి ప్రభావం చూపిస్తాయనేది ఎవ్వరూ గ్రహించట్లేదు. గృహ హింస, లైంగిక వేధింపులు రెండూ ఎక్కువగానే ఉన్నాయి. సినిమాల్లో వస్తున్న లైంగిక వేధింపులను లైంగిక వేధింపుల్లా గుర్తించకపోవడం కూడా విచారకరం. దీనిపై దర్శకులు, హీరోలు కూడా మాట్లాడకపోవడం బాధాకరం.

- సజయ, యాక్టివిస్ట్

కామెంట్స్: **చైతన్య వంపుగాని**



మహిళలకు నిత్యం వేధింపులే!

- 24 గంటలు నలు వైపుల నుంచి ఎదుర్కోక తప్పడం లేదు
- భౌతిక, మానసిక, భావోద్వేగపర దాడుతో తీవ్ర ఒత్తిళ్లు
- శిక్షణ లేకే సినిమాలు, సీరియళ్లలో మహిళలను కించపరుస్తున్నారు
- నేను శక్తి అక్షర యజ్ఞం ముగింపు కార్యక్రమంలో సినీ నటి అక్కినేని అమల

ఇటీవల ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడానికి విశాఖపట్నానికి వెళ్లగా అక్కడ తన వ్యక్తిగత స్వేచ్ఛ(ప్రైవేట్ స్పేస్)కు భంగం కలిగే విధంగా కొందరు ప్రవర్తించారని ప్రముఖ సినీ నటి, బ్లూ క్రాస్ సంస్థ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల ఆవేదన వ్యక్తం చేశారు. చాలా కాలం తర్వాత తన వ్యక్తిగత స్వేచ్ఛపై దాడి జరిగిందని, తీవ్ర ఆగ్రహాన్ని, ఆవేదనను కలిగించిందన్నారు. ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛకు విలువ ఇచ్చే విజ్ఞత దేశంలో కరువైందన్నారు. ఒకరి ప్రైవేట్ స్పేస్‌లోకి వెళ్లి బాధ కలిగించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. సెలబ్రిటీలైన తాము ఎక్కడికి వెళ్లినా జన సందోహం ఉంటుందని, జనం అత్యంత సమీపంగా వచ్చి భౌతిక వేధింపులకు గురి చేస్తారని తెలిపారు. నిత్యం చాలా మంది సెలబ్రిటీలు ఈ వేధింపులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేవలం భౌతికంగానే కాకుండా మానసికంగా, భావోద్వేగ పరంగా సైతం వేధింపులుంటాయని, 24 గంటల పాటు నలువైపులా నుంచి వీటిని ఎదుర్కోక తప్పదన్నారు. దీంతో జీవితంలో తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మహిళాభ్యున్నతికి సాక్షి చేపట్టిన 'నేను శక్తి' ఉద్యమం ముగింపు సందర్భంగా బుధవారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్న పిల్లలు, మహిళలతో ప్రతి ఒక్కరి ప్రైవేట్ స్పేస్‌ను గౌరవించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళల కోసం నేను శక్తి అక్షర ఉద్యమాన్ని చేపట్టినందుకు సాక్షి గ్రూపుకు, సంస్థ చైర్మెన్ వైఎస్ భారతీరెడ్డికి అభినందనలు తెలిపారు. నేను శక్తి శీర్షిక పేరు ఎంతో అందంగా ఉందని అభినందించారు. విద్యా, ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళలు వేధింపులు, గృహ హింస, లింగ వివక్ష నుంచి బయటపడగలరని, సాధికారత సాధించగలరని ఐక్యరాజ్య సమితి పేర్కొందని గుర్తు చేశారు. విద్యతోనే ఉద్యోగ, ఉపాధి అకవాశాలు లభిస్తాయని, అప్పుడే ఆర్థిక స్వాతంత్ర్యం సాధించగలమన్నారు. వృత్తి జీవితంలో గొప్ప విజయాలు సాధించిన మహిళలు ఇతర మహిళల అభివృద్ధికి విస్తృత కషి చేయాలని పిలుపునిచ్చారు. 15 ఏళ్ల కిందే నటన వృత్తికి స్వస్తి చెప్పిన తాను ప్రస్తుతం బ్లూ క్రాస్ సంస్థ ద్వారా జంతువుల హక్కులు, ప్రధానంగా వీధి కుక్కల సంతానోత్పత్తిని నిరోధించేందుకు పని చేస్తున్నానన్నారు. తన మామ అక్కినేని నాగేశ్వరరావు స్థాపించిన అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఫర్ ఫిల్మ్ అండ్ మీడియా సంస్థకు డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నానని తెలిపారు. సినిమాలు, సీరియళ్ల నిర్మాణానికి ఎలాంటి అర్హతలు అవసరం లేవని, అందుకే వాటిలో మహిళలను చిత్రీకరించే విధానం సరిగ్గా ఉండదన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసే ఈ కీలక రంగంలో ప్రవేశించేందుకు ఎలాంటి అర్హతలు అక్కర్లేని పరిస్థితి ఉందని గుర్తించిన తన మామ అక్కినేని నాగేశ్వరరావు దూరదృష్టితో ఈ శిక్షణ సంస్థను నెలకొల్పారన్నారు. శిక్షణ ద్వారా రైటర్లు, డైరెక్టర్లు, సినిమాటోగ్రాఫర్లకు దిశానిర్దేశం చేస్తే సినిమాలు మెరుగవుతాయని అక్కినేని నాగేశ్వరరావు భావించారన్నారు. మహిళలను కించపరిచే విధంగా చిత్రీకరించవద్దని ఈ శిక్షణ సంస్థ ద్వారా భవిష్యత్తు నటులు, సాంకేతిక నిపుణులకు మనస్తత్వ, సామాజిక బాధ్యత అంశాలపై శిక్షణ అందిస్తున్నామన్నారు.

సూపర్ పేరెంట్స్ విజేతలు

'నేను శక్తి' క్యాంపెయిన్‌లో భాగంగా సాక్షి నిర్వహించిన సూపర్ పేరెంట్స్ పోటీలలో శారద–నాగిరెడ్డి, సుజాత–సాంబరెడ్డి, జయలక్ష్మి–షణ్ముగం, స్వరూప–సిద్ధరాములు విజేతలుగా నిలిచారు. నేను శక్తి అవార్డును అందుకుంటూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. "పిల్లలు భవిష్యత్తుకు చదువే ముఖ్యమని తాము భావించాం" అని జయలక్ష్మి–షణ్ముగం చెప్పారు. "అసమానతలకు తావు లేకుండా పెంచితే పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది" అని శారద–నాగిరెడ్డి అభిప్రాయపడ్డారు. సుజాత–సాంబరెడ్డి మాట్లాడుతూ, "మాకు ఇద్దరూ ఆడపిల్లలే. వారే మా వారసులు అనుకుని పెంచాం. మానవతా విలువల్ని నేర్పించా" అన్నారు. "ఆంక్షలేమీ పెట్టకుండా, స్వేచ్ఛగా మా పిల్లల్ని పెంచాం. వారి ఇష్టాలను గౌరవించాం" అని స్వరూప, సిద్ధరాములు చెప్పారు.



శారద, నాగిరెడ్డి (సిద్దిపేట)



సుజాత, సాంబరెడ్డి (జంగారెడ్డి గూడెం)



జయలక్ష్మి, షణ్ముగం (శ్రీకాళహస్తి)



సిద్ధరాములు, స్వరూప (కామారెడ్డి)

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్...! నేను డిగ్రీ థర్డ్ ఇయర్ చదువుతున్నాను. నేను మా మావయ్య కూతుర్ని లవ్ చేస్తున్నాను. బట్ మా మావయ్య నన్ను జాబ్ తెచ్చుకోమన్నాడు. కానీ నేను చదువులో చాలా వీక్. నా మరదలు నన్ను లవ్ చేస్తుందో లేదో తెలియడం లేదు. కానీ నాతో బాగా మాట్లాడుతుంది. ప్లీజ్ దీనికి మంచి సలహా చెప్పండి.

– కృష్ణ

చదువుకో తమ్ముడూ చదువుకో...!
'స్టడీస్‌లో వీక్ అంటున్నాడు కదా సార్?'
కష్టపడి చదువుకోవాలి నీలాంబరి.
'మీరేదో ప్రేమ పాఠాలు వల్లిస్తారని...
ఆశగా ఉత్తరం రాస్తే...
మీరేంటి సార్ చదువుకోమంటున్నారు!?!'
చదువుకుంటే జ్ఞానం వస్తుంది.
జ్ఞానం వస్తే విషయం అర్థమవుతుంది.
విషయం అర్థమైతే....
మరదలిది ప్రేమో..? ఏమో..?...........
'అర్థమౌతుంది కదా సార్!' అని నవ్వింది నీలాంబరి.

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		6			2			8
			1			2		
		3			7	5	9	1
	6		2		4		3	5
4	1			8			2	9
3	8		5		9		4	
2	5	1	7			4		
		4			1			
9			3			6		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	5	6	8	9	7	1	4	3
9	1	3	6	5	4	2	8	7
8	7	4	2	1	3	9	5	6
3	4	2	9	6	8	7	1	5
1	9	5	3	7	2	4	6	8
6	8	7	5	4	1	3	9	2
4	6	1	7	3	5	8	2	9
7	2	9	1	8	6	5	3	4
5	3	8	4	2	9	6	7	1

ఈ పాటకు ట్యూన్ తెలుసా?

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం


కె.ఎస్.చిత్ర

కట్‌చేయ్...దాచేయ్...

పల్లవి :
ఆ... ఆ... ఆ...
నువ్వు తరతరాల దాస్యానికి
చరమగీతం పాడిన నేటి మహిళవీ
నువ్వు ప్రతితరాన
ఉద్యమ జ్యోతిని పట్టిన మేటి మహిళవీ
॥నువ్వు॥

చరణం : 1
నువ్వు ఆకాశగంగా ఝరి ప్రవాహానివి
నువ్వు నిత్య నూతనమైన చైతన్య ప్రవంతివి
నువ్వు చీకట్లని చీల్చుకొచ్చే
సరికొత్త ఉదయానికి నాందివి
నువ్వు నవయుగ చైతన్యానికి సంకేతానివి
నువ్వు నిర్బంధంపై పోరాటానికి ప్రతిరూపానివి
నువ్వు నిస్సందేహంగా నిర్భయవై అగ్నిపునీతవు
నువ్వు తరతరాల దాస్యానికి చరమగీతం పాడిన
నేటి మహిళవీ
నువ్వు ప్రతితరాన ఉద్యమ జ్యోతిని పట్టిన
మేటి మహిళవీ

చరణం : 2
నువ్వు అల్ప విజయాలతో ఆగిపోవు అలసిపోవు
నువ్వు సంక్లిష్ట సమస్యల సమాహారానివి
నువ్వు అంతులేని సమస్యలను ఛేదించే
పరిష్కారానివి
నువ్వు నేలరాలిపోతున్న అమ్మ కడుపు పంటవు
నువ్వు కట్నాల కొలిమిలో
కణకణమంటూ రగలుతున్న సమిధవు
నువ్వు అంతరిక్షంలో జయకేతనం నాటిన సునీతవు
॥నువ్వు॥

కట్‌చేయ్...దాచేయ్...

చిత్రం : అమ్మా నీకు వందనం (2013)
రచన : ప్రభాకర్ జైని
సంగీతం : డా॥ జోశ్యభట్ల
గానం : కె.ఎస్.చిత్ర, బృందం

'ఏంటో డాక్టర్.. ఏమందు వేసుకోకపోయినా ఒళ్లంతా మత్తుగా వుంటోంది...!' అన్నాడు రాజేష్.
'ఉండండి.. బిల్లు ఇస్తాను.. మత్తు దానంతట అదే దిగిపోతుంది..! బదులిచ్చాడు డాక్టర్.

షార్ట్ ఫిల్మ్ విజేతలు

అమ్మ షార్ట్ ఫిల్మ్



భ్రూణ హత్యల గురించి తీసిన చిత్రం ఇది. పూర్తిగా తేట తెలుగులో ఈ ఫిల్మ్ కొనసాగింది. ప్రతి సన్నివేశం ఆలోచింపచేసేలా సాగింది. నాన్నా ఎందుకు చంపేశావు నన్ను అంటూ పాప ఆడగటం. ముద్దు పెట్టుకోవాలని ఉంది అనటం.. సభకు వచ్చిన వారిని కంట తడిపెట్టేలా చేసింది. దీనికి దర్శకత్వం వహించిన తోట **శ్రీకాంత్ కుమార్** మాట్లాడుతూ.. సమాజంలో మార్పు కోసం ఈ షార్ట్ ఫిల్మ్ తీశానని చెప్పారు. తక్కువ నిడివిలో ఉన్న అందరి హృదయాలు కదిలించి ఉత్తమ చిత్రంగా ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. సాక్షి వారు అభినందించి ప్రైజ్ మనీ కూడా ఇవ్వటం సంతోషాన్నిచ్చిందన్నారు.



రమణ

రమణ తరఫున అవార్డు స్వీకరణ

లివింగ్ ఐడియల్ షార్ట్‌ఫిల్మ్

15 నిమిషాలు నిడివిగల ఫిల్మ్ ఇది. దీనికి **రమణ** దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విభిన్న పాత్రల్లో స్త్రీ ని అంశంగా ఫిల్మ్ నిర్మించానన్నారు. తాగి భర్త భార్యను కొట్టడం, ఆ సమయంలోనే పాప ఏడ్వడం వంటి సన్నివేశాలను అర్థవంతంగా చూపించాం. అదే సమయంలో భర్త ఆనారోగ్యానికి గురైన తర్వాత భార్య అతడిని చూసుకొనే విధానం కళ్లకు కట్టినట్లు చూపించాను. అందర్నీ ఇది ఆలోచింప చేసిందన్నారు. ఇక్కడ ఉత్తమ చిత్రంగా ఎంపిక కావటం, నటి అమల, సాక్షి చైర్‌పర్సన్ చేతుల మీదుగా సన్మానం పొందటం ఆనందంగా ఉందన్నారు.

చిట్టితల్లి షార్ట్ ఫిల్మ్



18 నిమిషాల నిడివి గల ఈ చిట్టితల్లి లఘు చిత్రానికి **గోపి** దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న పాపను.. ఆటోను తీసుకు వస్తానని రైల్వే స్టేషన్‌లో బల్లపై ఉంచి వెళ్తుంది తల్లి. కాస్త ఆలస్యం అయ్యేసరికి పాప ఏడుస్తూ ముంబాయి వెళ్లే రైలు ఎక్కేయటం అక్కడ పడే ఇబ్బందుల్ని.. తిరిగి కొన్ని రోజుల తర్వాత తల్లిని చేరటం లాంటి సన్నివేశాలు ఇందులో ఉన్నాయన్నారు. ఇవి ప్రేక్షకుల హృదయాలను కదిలించాయని చెప్పారు. యూట్యూబ్‌లో చూసిన చాలా మంది ప్రశంసల వర్షం కురిపించారన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని సాక్షివారు ఉత్తమ లఘు చిత్రంగా గుర్తించి అందరి ఎదట ప్రదర్శించి, సత్కరించటం మరచిపోలేని విషయమన్నారు.

నేను శక్తి సిగ్నేచర్ సాంగ్


'నేను శక్తి' సాంగ్: సింగర్ **శమంత్**, మ్యూజిక్ డైరెక్టర్ **శివ**, లిరిసిస్ట్ **మధుసూదనరావు**

పాట పల్లవి:
బిగిసిన పిడికిలిలో
ఎగసిన కెరటాన్ని
ముసిరిన చీకటిలో
వెలిగే కిరణాన్ని
నేనే నేనే శక్తి
నేనే నేనే యుక్తి
గర్భంలో తొలి యుద్ధం
ఎదురీతకు నే సిద్ధం.

మధుసూదన రావు.. లిరిసిస్ట్.. నేను శక్తి సాంగ్

సాక్షి 'నేను శక్తి' పాట ని ప్రత్యేకంగా మహిళా ప్రాధాన్యత, మహిళా లోకం, మహిళా ప్రపంచం వంటి ఎన్నో స్ఫూర్తిదాయకమైన పాత్రలను పోషించే స్త్రీల గొప్పతనాన్ని వివరిస్తూ రాయటం జరిగింది. ఈ పాట లోని ప్రతీ లైన్ ఎంతో భావోద్వేగంగా ఉంటుంది. ఈ పాటను నేను రాసినందుకు గర్వంగా ఉంది. ఒక మహిళకు మా మగవాళ్లు స్వేచ్ఛని ఇవ్వటం కాదు, మహిళలే తమంతటికి తాము స్వేచ్ఛను తీసుకునే దశకు మార్పు వచ్చింది. అది సమాజంలో అత్యద్భుతమైన మార్పుగా మనందరికీ కనిపిస్తుంది. దాన్ని మనం అందరం 'నేను శక్తి' పేరిట ఇలా సెలెబ్రేట్ చేసుకోవటం నాకు చాలా సంతోషంగా ఉంది.

శివ.. ఫిలిం మ్యూజిక్ డైరెక్టర్.. నేను శక్తి సాంగ్

ఆడవాళ్ళమీద, వారి ప్రాముఖ్యత, ప్రత్యేకత, విలువల మీద నన్ను మ్యూజిక్ కంపోజ్ చేయమన్నప్పుడు నాకు కాన్సెప్ట్ నచ్చింది.. మహిళల మీద నా గౌరవాన్ని తెలియజేసుకోవటానికి వారి మీద గౌరవంతో నా వంతు సాయంగా ఈ విధంగానైనా కతజ్ఞత తెలుపుకోవాలనే భావన తో 'నేను శక్తి' సాంగ్ కి మ్యూజిక్ కంపోజ్ చేశాను.. ఈ పాట లోని పవర్ఫుల్ వైబ్రేషన్స్ కేవలం అది ఆడవాళ్లు 'శక్తి స్వరూపాలు' అవ్వటం మూలానే అత్యద్భుతంగా వచ్చాయి.

శమంత్.. (సింగర్) నేను శక్తి ఎక్సక్లూసివ్ సాంగ్

జెనరేషన్స్ మారే కొద్దీ యువతలో.. ముఖ్యంగా అబ్బాయిల్లో సైతం ఆడవారి పట్ల గౌరవం పెరిగింది. అందుకు కారణం తల్లి తండ్రులే బాధ్యత తీసుకుని తమ కొడుకులకు సమాజంలోని ఆడవారి విలువలను తెలపటం అనే నేను భావిస్తున్నాను.. ప్రతి ఒక్కరిలో ఆడవాళ్ల పట్ల అక్క, చెల్లి, అమ్మ అనే భావన ఉంటేనే, అప్పుడే.. ఇంట్లో ఉన్న అమ్మ పైన ఉండే గౌరవం ఇతరేతర ఆడవారి పైన కూడా కలిగి అంతా ఒక కుటుంబం అనే పాజిటివ్ ఫీల్ లో ఉంటారు అబ్బాయిలు. దీని వలన మానవ సంబంధాలు, మానవ విలువలు పెరిగి స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం అంతరిస్తుంది. ఆడవాళ్లు మగవాళ్లు సమానం అనే మాట పాతది. మగవాళ్ల కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా అన్ని విషయాల్లో ఆడవారే ఉన్నారు, ఉంటారు. ఈ మాటను నేను గౌరవిస్తూ ఏకీభవిస్తున్నా అని చెప్పేందుకే నేను శక్తి అనే ఈ సాక్షి స్పెషల్ సాంగ్ కి మేల్ వెర్షన్ సింగర్ గా పాట పాడాను.

చీకటని తెలిసీ

గమ్యం అగమ్యగోచరం
చీకటని తెలిసీ కళ్లు మూసిన నడక
తల బొప్పిగట్టిన అనుభవం

సోకు మీద ఎంత మనసుపడ్డా
కళ్లుపొయ్యేంత కాటుకెందుకు
కనుపాపలకేం కనపడ్డవన్నీ
కావాలనుకుంటయి
గాలికెగిరొచ్చే దుమ్మును ముద్దాడి
చెంపలమీది జలపాతాలౌతయి
రెప్పల బాధ రెప్పలదే

కలగన్నమనీ కడపదాటుడు తప్పకాదు
పట్టుకున్న వేలు వాసన పసిగట్టాలె
చుట్టుకున్న ఆశ లోతును కనిపెట్టాలె
రెచ్చగొట్టే కోరిక కొండెక్కిచ్చి తోసే
అగాధాన్ని అంచనా కట్టాలె.

తోడుంటదని తోడేలును నమ్మటం
అమాయకత్వం కాదు అతితెలివి.
కాల్చుకునే వరకే చేతుల గాయి
పట్టుకున్నాంక ఆకులేంచేస్తయి.

దుష్యంతుడి మతిమరుపు గాయాన్ని
ఏ కణ్వాశ్రమం కన్నీళ్లు ప్రశ్నిస్తయ్?

నోరెత్తని పంచభూతాల సాక్షిగా
అంతరాత్మల్లేని మనుషుల సాక్షిగా
ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ
నాతి ఎప్పుడూ చెరలోనే

మనువు మంచానికి పురుషుడు చత్రం
పుత్ర సంతానం పుట్టగతులూ కలలు.
పునరావృతమౌతున్న వెతల కథల నిండా
మీరుపంచే అమృతం తాగి
విషంచిమ్మే జాతి ఆనవాళ్లే
బలివితర్దిమీద మీ బతుకుల అవశేషాలే
శూన్యాల్లో సగం పంచిన వంచనలు



కొలిక్కిరాని బిల్లుల కింద
పొందుతున్న వాయిదాల వాయినాలు.
నిస్సహాయత మీ నిర్వచనం కాదు
జయించాల్సిన బలహీనత
పరాధీనత మీ గాచారం కాదు
మీకు మీరే విధించుకుంటున్న శిక్ష

విచక్షణతో మెదిలితే
విచ్చుకత్తుల కవచాలు మీరే
వివేకంతో కదిలితే విజేతల చరిత్ర మీది
విశ్వాసమై ఎదిగితే వికాసాల శిఖరం మీది.

- వర్ఝుల శివకుమార్

సెల్ఫ్ చెక్

జగమంతా నా కుటుంబమే అనుకుంటారా..?

స్వదేశాన్ని మాతృభూమి అంటారు. అంటే దేశం జన్మనిచ్చిన తల్లితో సమానం. దేశపౌరులంతా కలసికట్టుగా ఉంటే ఎంతో బలం. ఇప్పుడు ప్రపంచం కుగ్రామం అయింది. ప్రపంచీకరణ పేరిట, దేశాలు ఇతర దేశాల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. దేశాల మధ్య సత్‌సంబంధాలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి పరిణామంలో మాతృదేశాన్ని ఎలా గౌరవిస్తున్నామో అలానే ఇతర దేశాలపై వ్యతిరేక భావం ఏర్పరచుకోకుండా ఉంటే బాగుంటుంది కదా! మీలో దేశభక్తితో పాటు విదేశాలపై ఎలాంటి భావన కలిగి ఉన్నారో తెలుసుకోవాలని ఆసక్తి ఉందా?

1. దేశభక్తి మీలో చాలా ఎక్కువగా ఉంటుంది. మాతృదేశాన్ని పూజ్యభావంతో చూస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
2. దేశం నాకేమి ఇచ్చింది? అని ఎప్పుడూ ప్రశ్నించుకోరు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
3. దేశ ఔన్నత్యాన్ని గురించి అందరితో చెప్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
4. దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన మహనీయులను మరచిపోరు. వారి గౌరవం తగ్గేలా ఎప్పుడూ మాట్లాడరు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
5. దేశసమగ్రతను కోరుకుంటారు. అందరూ సమానమేనన్న భావన పెంపొందించుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
6. దేశ విశేషాలతోపాటు ప్రపంచంలో జరిగే విషయాలనూ తెలుసుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
7. దేశాల మధ్య అసమానతలు రాకుండా ఉండాలని గట్టిగా కోరుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐



8. ప్రపంచమంతా ఒకతాటిపై నడిస్తే బాగుంటుందనుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
9. ఇతర దేశాలను సందర్శించాలంటే మీకు ఇష్టం. అలానే వాటి సంస్కృతిని కూడ తెలుసుకోవాలనుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
10. ఇతర దేశాలపై కారణం లేకుండా వ్యతిరేకత పెంచుకోరు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐

మొదటి ఐదు సమాధానాలు 'బి' లు వస్తే మీలో దేశభక్తి పూర్తి స్థాయిలో ఉంటుంది. 'బి' లు ఎనిమిది దాటితే విదేశాలనీ ఇష్టపడతారు. ప్రపంచ విషయాలు తెలుసుకోవటానికి ఆసక్తి చూపుతారు. 'ఎ' లు ఎక్కువ వస్తే దేశభక్తి మీలో తక్కువ ఉంటుంది. ప్రపంచం గురించి తెలుసుకోవాలనే కుతూహలం మీలో అంతగా ఉండదు.

పరి పరిశోధన

మధుమేహం మందులతో జాగ్రత్త అంటున్న శాస్త్రవేత్తలు...

మెట్‌ఫార్మిన్... మధుమేహ చికిత్స కోసం భారత్‌లో ఎక్కువమంది వాడే మందు ఇది. అయితే ఈ మందు సమర్థత, భద్రతపై సందేహాలు ఉన్న నేపథ్యంలో దేశంలోని నియంత్రణ సంస్థలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని హెచ్చరిస్తున్నారు మసాచుసెట్స్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ఆధారంగా తాము మెట్‌ఫార్మిన్ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌పై అధ్యయనం జరిపామని వెలరీ



ఇవాన్స్ అనే శాస్త్రవేత్త చెప్పారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను ఒకే ట్యాబ్లెట్, క్యాప్సూల్ ద్వారా అందించడాన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ అంటారని, మధుమేహానికి ఇలాంటి మందులు వాడవచ్చునని ఏ జాతీయ, అంతర్జాతీయ మార్గదర్శకాలు చెప్పడం లేదని ఇవాన్స్ స్పష్టం చేశారు. మధుమేహుల్లో రక్తంలోని చక్కెర మోతాదులు నియంత్రణలోకి రావడం ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుంది కాబట్టి ఈ మందులతో ఎంత మేరకు ఉపయోగమన్నది ఇప్పటివరకూ స్పష్టం కాలేదని చెప్పారు. భారత్‌లోని ఫార్మా కంపెనీలు ఈ ఎఫ్‌డీసీలను ప్రపంచమంతా ఎగుమతి చేస్తున్న నేపథ్యంలో వీటిపై తగినన్ని పరీక్షలు జరగాలని సూచించారు. రెండేళ్ల క్రితం భారత ప్రభుత్వం ఇలాంటి 344 మందులపై నిషేధం విషయాన్ని గుర్తుచేశారు. వీటిల్లో మూడు ఎఫ్‌డీసీ మెట్‌ఫార్మిన్ రకాలూ ఉన్నాయని.. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టు నిషేధాన్ని ఎత్తివేస్తే ప్రస్తుతం కేసు సుప్రీంకోర్టులో ఉందని.. ఆరు నెలల్లోపు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సినందున తాము ఈ అధ్యయనం చేశామని వివరించారు.

సత్ఫలితాలిస్తున్న కేన్సర్ వ్యాక్సిన్...

ఇమ్యునోథెరపీ ద్వారా కేన్సర్‌కు మరింత మెరుగైన చికిత్స కల్పించేందుకు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వైస్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఓ వినూత్న పద్ధతిని ఆవిష్కరించారు. కేన్సర్ కణాలపై ఉండే వేర్వేరు పెప్టైడ్‌లతో తయారైన వ్యాక్సిన్ కణుతులను సమర్థంగా నాశనం చేయగలదని వీరు ఎలుకలపై జరిపిన పరిశోధనల ద్వారా స్పష్టమైంది. శరీరంలోని రోగ



నిరోధక వ్యవస్థను చైతన్యవంతం చేసేందుకు ఈ పెప్టైడ్‌లు ఉపయోగపడతాయని చాలాకాలంగా తెలిసినప్పటికీ వేర్వేరు పెప్టైడ్‌లను ఒకచోట చేర్చేందుకు జరిగిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ ఇమ్యునోథెరపీతో పరిమితమైన ఫలితాలే వచ్చాయి. ఈ నేపథ్యంలో వైస్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు చర్మం అడుగు భాగంలోకి చొప్పించగల ఓ ప్రత్యేక పదార్థంతో ప్రయోగాలు చేశారు. గొట్టం లాంటి ఆకారంలోకి మారిపోయే ఈ పదార్థంపై ఒక రకమైన పాలిమర్ పూత పూశారు. తద్వారా తాము కేన్సర్ కణాలకు చెందిన వేర్వేరు రకాల పెప్టైడ్లను ఒక దగ్గరకు చేర్చగలిగామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త అలిన్ లీ తెలిపారు. రోగనిరోధక వ్యవస్థకు చెందిన డ్రెన్‌డ్రైటిక్ కణాలు ఈ పెప్టైడ్‌లను గుర్తించి చైతన్యవంతమవుతాయని.. వాటిపై దాడి చేసి నాశనం చేస్తాయని లీ అన్నారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాలు సత్ఫలితాలిచ్చాయని చెప్పారు.

కరవును తట్టుకునేందుకు కొత్త టెక్నిక్..

తక్కువ నీటితో ఎక్కువ పంట పండించగలిగితే పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడం సాధ్యమవుతుంది. సరిగ్గా ఇదే దిశగా బిల్ అండ్ మెలిండా గేట్స్‌తో పాటు కొన్ని అంతర్జాతీయ సంస్థలు చేస్తున్న పరిశోధనలు సత్ఫలితాలు సాధిస్తోంది. మొక్కల్లో సూర్యరశ్మిని ఇంధనంగా మార్చుకునే కిరణజన్య సంయోగ ప్రక్రియను మరింత సమర్థంగా జరిగేలా చేయడం ద్వారా పంటల



దిగుబడి పెంచవచ్చునని.. అదేసమయంలో నీటి వాడకాన్ని తగ్గించవచ్చునని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త స్టీఫెన్ లంగ్ ఇకెన్‌బెర్రి తెలిపారు. మొక్కల్లోని ఒక ప్రొటీన్ మోతాదును పెంచడం ద్వారా అవి ఆకుల్లోని స్టొమాటాను మూసుకునేలా చేయగలిగామని.. తద్వారా నీరు ఆవిరి కాకుండా ఆపగలిగామని ఆయన వివరించారు. ఈ స్టొమాటా తెరుచుకున్నప్పుడు గాల్లోని కార్బన్ డయాక్సైడ్ లోనికి చేరి ఇంధనంగా మారుతుంది. అదేసమయంలో నీరు ఆవిరి రూపంలో బయటకు వెళ్లిపోతుంది. ప్రొటీన్ మోతాదు పెరగడం వల్ల స్టొమాటా పూర్తిగా తెరుచుకోదని.. తగినంత కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకోగలగదని వివరించారు. ఈ క్రమంలోనే దిగుబడి కూడా 20 శాతం వరకూ ఎక్కువవుతుందని గతంలో జరిగిన పరిశోధనలు రుజువు చేశాయని చెప్పారు. తాము పొగాకు మొక్కను నమూనాగా తీసుకుని ప్రయోగాలు చేశామని.. ఫలితాలను ఇతర ఆహార పంటల్లోనూ సాధించగలమని వివరించారు.

మహిళాసాధికారత బయట దొరికే వస్తువు కాదు.
అది మహిళ మనసులో అంతరాంతరాల్లో ఉండాలి.
బయటి నుంచి లభించేది ప్రోత్సాహం మాత్రమే... అంటారు వనితా దాట్ల.
అనుకున్నది అందకపోతే మరోదాని కోసం ప్రయత్నించాలి... అంటారామె.
డాక్టర్ కావాలనుకున్న వనిత... పారిశ్రామికవేత్త అయిన వైనమే అందుకు నిదర్శనం.

అడ్డంకికి ఆవల...



ఫొటో: రాజేశ్

వనితాదాట్ల... కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ తెలంగాణ రాష్ట్ర విభాగానికి మాజీ చైర్‌పర్సన్. ప్రస్తుతం ఎలికో లిమిటెడ్ కంపెనీకి వైస్ చైర్‌పర్సన్‌తోపాటు ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్‌కి రీజనల్ చైర్‌ఉమన్ కూడా. ఈ శిఖరాలను చేరడానికి మొదలు పెట్టిన ప్రయాణంలో తొలి అడుగులను ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

''నేను 22 ఏళ్లుగా పారిశ్రామిక రంగంలో పనిచేస్తున్నాను. మా తాతగారు పద్మభూషణ్ బి.వి.రాజు. ఆయన మనదేశంలో తొలితరం పారిశ్రామికవేత్త. ఆయన నుంచి నేను పరిశ్రమ నిర్వహణ, క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా నిబ్బరంగా పరిశ్రమను నడిపించడం నేర్చుకున్నాను.

బాల్యంలో నా మీద మా నాన్నగారి ప్రభావమే ఎక్కువ. ఆయనలా డాక్టర్ కావాలనుకున్నాను. మెడిసిన్‌లో సీటు రాలేదు. దాంతో బి.ఎలో చేర్చి ఫస్ట్ ఇయర్ అయిపోగానే పెళ్లి చేసేశారు. మా వారితో అమెరికా వెళ్లిన తర్వాత అక్కడి సమాజం నా మీద చాలా ప్రభావాన్ని చూపించింది. అక్కడ ఎవరూ మరొకరి మీద ఆధారపడి జీవించరు. ఎవరికి వారే స్వతంత్రంగా జీవిస్తుంటారు. నాకేమో గ్రాడ్యుయేషన్ కూడా లేదప్పటికి. ఇక అప్పుడు అక్కడి విద్యాసంస్థల్లో చేరాను. అలా చదువుతూ ఉండగానే అక్కడ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెంటుకు సహాయకారిగా పనిచేసే అవకాశం వచ్చింది. అప్పటి నా సంపాదన నాకెంతటి ఉత్సాహాన్నిచ్చిందంటే... 'ఇది నా సొంత సంపాదన' అనే భావనే మాటల్లో చెప్పలేనంత ఆనందాన్నిచ్చింది. ఎలాగైనా సరే గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలనే ఆకాంక్ష కూడా ఎక్కువైంది. ఇంతలో బాబు పుట్టడంతో ఆ ఉద్యోగాన్ని మానేశాను. చదువుకి మరోసారి అంతరాయం. ఆ తర్వాత పాప పుట్టింది. చదువుని మళ్లీ కొనసాగిద్దామనుకునే లోపు ఇండియాకి వచ్చేశాం.

> నాకు పర్యటనలంటే చాలా ఇష్టం. 50 దేశాలు చూశాను. ట్రెకింగ్, సైక్లింగ్, మారథాన్ పరుగుల్లో పాల్గొంటాను. మానస సరోవరం, ఎవరెస్టు బేస్ క్యాంపు, ఆఫ్రికాలోని కిలిమంజరో పర్వతాలను అధిరోహించాను. ప్రతిరోజూ ఏదో ఒకటి నేర్చుకోవడమే నా విజయరహస్యం. ఒక పుస్తకం చదవడం, ఒక సెమినార్‌లో పాల్గొనడం, నిపుణుల ప్రసంగాన్ని వినడం... ఇలా ఏదో ఓ మార్గంలో ప్రతిరోజూ నేర్చుకుంటూనే ఉంటాను.
> **- వనిత దాట్ల,** వైస్ చైర్‌పర్సన్, ఎలికో లిమిటెడ్, రీజనల్ చైర్‌ఉమన్ సిఐఐ- ఐడబ్ల్యుఎన్ సదరన్ రీజియన్

ఎం. బి.ఎ కోసం...

డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో బిఎ పూర్తి చేసి, తాతగారి ఫైనాన్స్ సంస్థలోనే ఉద్యోగంలో చేరాను. కంపెనీలో నేను నిర్వహిస్తున్న బాధ్యతలకు ఎంబిఎ కూడా ఉంటే బావుంటుందనిపించింది. ఆ నిర్ణయం నా జీవితంలో మరో మైలురాయి. ఇక్ఫయ్ యూనివర్శిటీలో ఎంబిఎలో చేరిన నాటికి నేనేమో ఇద్దరు పిల్లల తల్లిని. నా క్లాస్‌మేట్స్ అంతా చిన్నవాళ్లు. పైగా ఒక్కొక్కరు ఇంజనీరింగ్, ఐఐటి గ్రాడ్యుయేట్లు. వీరితో చదివి రాణించగలనా అనే భయం ఉండేది. ఆ భయం తోనే అసైన్‌మెంట్‌లను గడువు లోపలే పూర్తి చేసేదాన్ని. నేను ఉద్యోగం చేస్తుండడం, విశాలమైన ప్రపంచాన్ని చూసి ఉండడం వల్ల యూనివర్శిటీ సిల్వర్ మెడల్ తెచ్చుకోగలిగాను. ఉద్యోగం చేస్తూ ఎంబిఎ చేశాను.

మగవారి ఆధిపత్యరంగంలోకి...

తాతగారి రాశి ఫైనాన్స్ తర్వాత మా అన్నయ్య టేకోవర్ చేసిన అంజని సిమెంట్ కంపెనీలో చేరాను. సిక్ కంపెనీని పైకి లేపడానికి చేసిన కసరత్తే నాకు పరిశ్రమ నిర్వహణ, బ్యాంకు లావాదేవీలనూ నేర్పించింది. మగవారి ఆధిపత్యం ఉండే రంగంలో నేనొక్కదాన్నే మహిళని. నల్గొండ ప్లాంటుకు కూడా క్రమం తప్పకుండా వెళ్లేదాన్ని.

అప్పుడు నా కెరీర్‌లో మరో విరామం. పిల్లలు స్కూలు ఫైనల్ దశలో తల్లి పాత్ర చాలా ఎక్కువ. అందుకే రెండేళ్లపాటు పిల్లల కోసమే స్పెండ్ చేశాను. పిల్లలు కాలేజ్‌కొచ్చిన తర్వాత మా వారు ఓ రోజు 'పార్ట్‌టైమ్‌గానైనా కంపెనీకి రావచ్చు కదా' అన్నారు. అలా ఎలికో కంపెనీలో చేరాను. అప్పటి నుంచి అదే నా పూర్తి వ్యాపకమైంది.

యాభై శాతం ఉన్నాం! ఐదు శాతమే కనిపిస్తున్నాం!!

వనిత ఎలికో పరిశ్రమను నడుపుతూ సిఐఐలో చురుగ్గా పాల్గొంటున్నారు. సిఐఐలో ఔత్సాహిక మహిళాపారిశ్రామిక వేత్తలకో వేదిక కోసం కృషి చేశారామె. వారికి పరిశ్రమ నిర్వహించే నైపుణ్యాలను పెంచడానికి అవసరమైన సూచనలు, వర్క్ ప్లేస్‌లో భద్రత కల్పించడంలో ప్రధాన పాత్ర పోషించారు. మహిళలకు భవిష్యత్తు పట్ల భరోసా కల్పించాలంటారు వనిత. సమాన అవకాశాల కోసం చేసే ఈ పోరాటం కొనసాగాలి. జెండర్ ఈక్వాలిటీ విషయంలో మనదేశం 87వ స్థానంలో ఉంది. మొదటి పది స్థానాల్లోకి ఎదిగినప్పుడు మాత్రమే ఈక్వల్ ఆపర్చునిటీస్ మనకు అందేటంత దగ్గరకు వచ్చినట్లు. అవకాశాలు దూరంగా ఉన్నాయని పోరాటాన్ని ఆపకూడదు. ప్రస్తుతం విద్యాసంస్థల నుంచి బయటికొస్తున్న గ్రాడ్యుయేట్లలో 50 శాతం మహిళలు ఉంటున్నారు. కానీ ఉద్యోగవ్యాపారాలలో అడుగుపెట్టిన తర్వాత కలకాలం కొనసాగుతున్న వాళ్లు ఐదు శాతానికి మించడం లేదు. అలాంటి వారిలో చైతన్యం తీసుకురావడం, స్ఫూర్తి కలిగించడం, కొత్తగా పరిశ్రమలు పెట్టేవారికి, ఇప్పటికే ఈ రంగంలో ఉన్న వారికి మెంటార్‌షిప్ కల్పించడమే ఆ వేదిక ఉద్దేశం.

నిత్య చైతన్యమే పురోగతి...

ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే మహిళల కోసం ఓ వేదిక ఏర్పాటు చేయడంలో నా ప్రధాన ఉద్దేశం వారిని నిత్యం చైతన్యవంతంగా ఉంచడమే. ఎక్కడికక్కడ పరిధి విధించుకోవడం, క్రమేణా ఆ పరిధిని కుదించుకోవడం వంటి నిరాసక్త లక్షణాలను వదలాలని చెప్పడమే. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు మేము ఇస్తున్న సూచనలన్నీ మహిళల శక్తియుక్తులను పూర్తి స్థాయిలో వినియోగించుకునే అవకాశం కల్పించమనే. సాధికారత సాధించాలనే తపన మహిళల్లో ఉంటే అవకాశాలు కొల్లలు. సక్సెస్‌ను అందుకోవాలంటే ఒక్కో మెట్టునూ స్వయంగా ఎక్కాల్సిందే. దీనికి షార్ట్‌కట్‌లు ఉండవు.

ఇల్లు, ఆఫీసు, వ్యాపారం... అన్నింట్లోనూ ఒడిదొడుకులుంటాయి. ప్రతికూల పరిస్థితులూ ఉంటాయి. 'పరిస్థితులు అనుకూలంగా లేవు' అనుకుంటే ఏదీ సానుకూలం కాదు. దేనినీ సాధించలేరు. ఒక దారి మూసుకుపోతే మరో దారి కోసం ప్రయత్నించాల్సిందే. అందుకు నేనే ఉదాహరణ. మెడిసిన్‌లో సీటు రాలేదు. డొనేషన్ సీటులోనైనా చదివించాలంటే పొరుగు రాష్ట్రాలకు పంపించాలి. 'ఆడపిల్లను అంతదూరం పంపడమా' అనే సందేహమే పెద్ద అడ్డంకి అయింది. అయితే మెడిసిన్ చదవలేకపోవడం ద్వారా అన్నింటినీ కోల్పోయినట్లు దిగాలు పడలేదు. దిగులు పడి అక్కడే ఆగిపోతే ఇప్పుడీ స్థానాన్ని అందుకోగలిగేదాన్నే కాదు. తెలియని రంగంలో అడుగుపెట్టి ప్రతిదీ నేర్చుకుంటూ ఎదిగాను. ఎక్కడా ఆగిపోలేదు''

ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**

ధీమా

నాకు నేనున్నాను

అది రాజస్థాన్ రాష్ట్రం, ఉదయ్‌పూర్ నగరానికి సుమారు 40 కి.మీ.ల దూరంలో ఆరావళి పర్వతశ్రేణుల్లో ఓ కుగ్రామం. పేరు పడూనా. ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోని గ్రామం. బడి లేదు, కరెంటు లేదు. అలాంటి గ్రామంలో ఓ మహిళ. జీవనోపాధి కోసం తనకు తాను ఓ కొత్త బాటను వేసుకుంది. అందుకు ఆమె చేస్తున్న పని సాధారణమైనదే. కానీ ఆ పనిని ఇప్పటి వరకు మగవాళ్లు తప్ప ఆడవాళ్లు చేసి ఎరగరు. అందుకే ఆమె ప్రత్యేకం.



ఎవరామె?

ఆమె పేరు మీరాబాయ్ మీనా. వయసు 52 ఏళ్లు. చేస్తున్న పని... హ్యాండ్ బోర్ రిపేరు చేయడం. హ్యాండ్ బోరు కుళాయి విప్పి రిపేరు చేసి మళ్లీ బిగిస్తుంది. మీరాబాయికి చదువులేదు. పుట్టిన ఊరు దాటి పది కిలోమీటర్లు కూడా వెళ్లింది లేదు. మహిళాభివృద్ధి గురించి తెలియదు.



మహిళలకు సమాజంలో సమభాగస్వామ్యం వంటి పెద్ద పదాలేవీ ఆమెకు తెలియదు. సాధికారత అంటే ఏమిటో తెలియదు. అయినా సాధికారత సాధించింది. మహిళలు ఈ పని చేయకూడదనే చాదస్తపు సామాజిక నిబంధనను ఒక్క చూపుతో పక్కన పెట్టింది. తనకు ఆసక్తి ఉన్న బోర్ రిపేర్ పని నేర్చుకుంది. సొంతంగా డబ్బు సంపాదించుకుంటోంది. సొంతంగా జీవించి చూపిస్తోంది. ఇప్పుడు పడూనాతోపాటు ఝూబ్లా గ్రామాల్లో ఎక్కడ చేతిపంపు రిపేరు వచ్చినా ఆమెకే పిలుపు వస్తుంది.

'ఒంట్లో శక్తి ఉంది, చేతిలో పని ఉంది. ఇక నేను ఎందుకు భయపడాలి? ఎవరికి భయపడాలి?' అంటోంది ధీమాగా. భర్త చిన్నప్పుడే పోయాడు, పిల్లలు లేరు. భవిష్యత్తు ఎలా అని ప్రశ్నించిన వారిని 'పని చేయలేని నాడు తినడానికి దాచుకున్న డబ్బు ఉంది. నాకు అన్నదమ్ములున్నారు, వాళ్లకు పిల్లలున్నారు. సోదరులు నన్ను పోషించాలంటే కష్టపడతారేమో కానీ అభిమానం పంచడానికి కష్టపడరు' అంటోంది. ఆమె మాటల్లో సమాజాన్ని ఆకళింపు చేసుకున్న జ్ఞానం. స్వరంలో 'నాకు నేనున్నాను' అనే ధీమా.

నేను శక్తి సాక్షి

కూతురు

ఈ బేటీ... అన్నింట్లో మేటి!



ఇష్టంతో నేర్చుకున్నా...

నాకు వ్యవసాయ పనులంటే ఎంతో ఇష్టం. అమ్మనాన్నలతో చేలోకి వెళ్లి పనులు నేర్చుకున్నా. ట్రాక్టర్ నడపాలని ఉన్నప్పటికీ మొదట్లో భయపడ్డా. కానీ ఓ సారి ట్రాక్టర్ స్టార్ట్ చేసి నడిపాను. భయం పోయింది. అప్పటి నుంచి ట్రాక్టర్‌తో అన్ని పనులు చేయడం నేర్చుకున్నా. సరదాగా నేర్చుకున్న పనితో నాన్నకు సాయపడుతున్నా. *- చిగురు నిహారిక*

నీహారికది జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, శంకరాంపల్లి. కాలేజీలో చదువుకునే అమ్మాయిలంటే పుస్తకాలే ప్రపంచంగా, మోడరన్‌గా జీవించాలనుకుంటారు. నిహారిక ఖాళీ దొరికినప్పుడల్లా అరక కట్టడం, ఎడ్లబండి తోలడం మొదలు.. ట్రాక్టర్, ఆటో, బైక్ నడుపుతుంది.

> **ఆసక్తి చూసి కాదనలేకపోయా...**
> అమ్మాయి కదా తనకు ఈ పనులు నేర్పించడం ఎందుకని మొదట్లో అందరిలాగే నేనూ అనుకున్నా. సెలవు వస్తే చాలు నాతో పొలానికి వచ్చేది. తను ట్రాక్టర్ నడపడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇలాంటి కూతురు ఉండటం ఆనందంగా ఉంది.
> **- చిగురు పెంటయ్య,** నిహారిక తండ్రి



నిహారిక కుటుంబ నేపథ్యం... చిగురు పెంటయ్య–సునీత దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఒక కొడుకు. మూడో కుమార్తె నిహారిక వరంగల్లులో డిగ్రీ ప్రథమ సంవత్సరం. ఆరు ఎకరాల మేర భూమి సాగుచేస్తూ సంతానాన్ని చదివిస్తున్నారు ఆ తల్లిదండ్రులు.

నాన్నతోపాటు నాగలి పట్టింది

నిహారిక అమ్మనాన్నలతో పొలం వద్దకు వెళ్తుండేది. ఎనిమిదో తరగతిలో ఉండగా.. నాన్నతో కలిసి నాగలి దున్నడం నేర్చుకుంది. కూలీలతో కలిసి పొలానికి వెళ్లి దున్నడంలాంటి పనులు చేస్తుండేది. దీంతో గొర్రు కొట్టడం, విత్తనాలు నాటడం, స్ప్రేయర్‌తో మందు పిచికారీ చేయడం, ఎరువులు వేయడంలాంటి పనులు కూడా నేర్చుకుంది.

పెద్దనాన్న చంద్రయ్య బైక్‌తో డ్రైవింగ్ నేర్చుకుంది. ఇంతలో పెంటయ్య ట్రాక్టర్ కొన్నాడు. తండ్రితో కలిసి అప్పుడప్పుడు ట్రాక్టర్ మీద వెళ్లిన నిహారిక దానిని ఎలా నడపాలో తెలుసుకుంది. కొద్దిరోజుల్లోనే ట్రాక్టర్ నడపడం నేర్చుకుంది. దున్నడం, లెవలింగ్, గొర్రు కొట్టడం, పంట పొలాల్లో కేజీవీల్స్ వేయడం లాంటి ట్రాక్టర్‌కి సంబంధించిన ప్రతి పనిని నేర్చేసుకుంది. గత నాలుగేళ్లుగా ట్రాక్టర్‌తో చేయాల్సిన పనులన్నింటిలో నిష్ణాతురాలైంది. పెంటయ్యకు కొడుకు ఉన్నప్పటికీ, అతడు చిన్నవాడు. దాంతో నిహారిక ఇంటికి పెద్ద కొడుకులా అన్ని పనులు చేస్తోంది.

చదువులో... ఆటలోనూ... మేటి!

నిహారిక ఇంటిపనులు, వ్యవసాయ పనులకే పరిమితం కాలేదు. చదువు, ఆటల్లోను రాణిస్తుంది. టెన్త్ క్లాస్‌లో ఫస్ట్ క్లాస్‌లో పాసైంది. ఇంటర్ సీఈసీ పూర్తి చేసి, ప్రస్తుతం వరంగల్‌లో డిగ్రీ చదువు తోంది. ఇంటి వద్ద ఎన్ని పనులు చేసినప్పటికీ చదువులో ఏ మాత్రం వెనుకంజవేయడం లేదు. నిహారిక ఆటల్లోనూ రాణిస్తోంది. అథ్లెటిక్స్‌లో మండల, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభతో బహుమతులు పొందింది. గత ఏడాది అక్టోబర్‌లో రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో 400 మీటర్లలో గోల్డ్ మెడల్, 800 మీటర్లలో సిల్వర్ మెడల్ సాధించింది.

- చీర్ల శ్రావణ్‌రెడ్డి, కాటారం, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా

మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

---

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 26

గొంతుల గుంపు



సి. వనజ

'రేయ్.. రేయ్.. రేయ్... స్కౌండ్రల్'... పెద్దగా అరిచింది.
పరిగెత్తబోయింది.
పట్టుకోబోయింది.
బైక్ క్షణాల్లో పికప్ అయ్యి మాయమైపోయింది.
ఎవడు వాడు.. ఎలా ఉన్నాడు... సన్నమా లావా పొడువా పొట్టా... ఏమీ గుర్తు లేదు. ఒక్క విషయమే గుర్తు ఉంది. మగాడు.
నడి ఎండ. మధ్యాహ్నపు వేడి. నిర్మానుష్యమైన వీధి. ఒక్కతే తను.
ఏం చేయాలి.
దుఃఖం వస్తోంది. అవమానంతో ముఖం ఎర్రగా అయిపోయింది. ఛాతీ దగ్గర మంటగా ఉంది. నొప్పిగా ఉంది. పాలు చిమ్మినట్టయ్యి బ్రా తడిసింది.
'రేయ్.. రేయ్... రాస్కెల్'... క్యాకరిస్తున్నట్టుగా మళ్లీ తిట్టుకుంది.
ఇలా ఎప్పుడూ జరగలేదు. ఇప్పుడు ఎలా రియాక్ట్ కావాలో తెలియడం లేదు.
పాపకు ఆరు నెలలు. పాలు ఇచ్చి తల్లికి అప్పజెప్పి హ్యాండ్ బ్యాగ్ తగిలించుకుని మధ్యాహ్నపు షిఫ్ట్‌కు బయలుదేరింది. డెలివరీ తర్వాత నిజానికి పూర్తిగా కోలుకోనట్టే లెక్క. సిజేరియన్ అయ్యింది. డెలివరీకి ముందు లీవు డెలివరీ తర్వాత లీవు అనంటే ఆఫీసులో ఊరుకోరు. వెళ్లకతప్పదు. రెండు వారాలుగా వెళుతుంది. ఇవాళ కూడా రోజూలాగే బస్టాప్ దగ్గరే కదా అని నడుస్తూ ఉంటే ఎదురుగా బైక్ వాడు. మెల్లగా వస్తున్నాడు. తన వైపే వస్తున్నాడు. ఎవరబ్బా... తెలిసిన మనిషా అని చూస్తోంది. ఇంకా దగ్గరకు వస్తున్నాడు. ఏదైనా అడ్రస్ అడగడానికా. మరింత దగ్గరకు వచ్చి, రెప్పపాటులో చేయి విసిరి, కండ నొక్కి....
'రేయ్... రేయ్... లోఫర్... ఏం ఆనందంరా నీకు' దుఃఖంగా అనుకుంది.
ఏం పని చేయబుద్ధి కావడం లేదు. ఆఫీసులో కూచోబుద్ధి కావడం లేదు.
'ఊరుకో. ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. మన ఖర్మ. మర్చిపోయి పని చేసుకోవాలి' అంది కలీగ్.
ఎలా మర్చిపోవడం.
పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసింది.
'అంటే ఏం చేశాడు?' అవతలి వైపు అడుగుతున్నారు.
'చేయి వేశాడు'
'వేసి'
'ఇంకా వివరంగా చెప్పాలా... డెమో ఇవ్వనా?' అరిచింది.
'ఒకే మేడమ్... రేపోసారి వచ్చి కంప్లయింట్ రాసివ్వండి. నంబర్ గుర్తుందంటున్నారుగా' అంటున్నారు.
ఆఫ్ డే లీవ్ పెట్టి ఇంటికి వచ్చేసింది.
తల్లి వస్తే పాపకు తెలుస్తుంది. నిద్ర నుంచి మేలుకొని కళ్లు తెరిచి నవ్వింది. పాల కోసం పెదాలు కదిల్చింది. దుస్తులు తప్పించి పాల కోసం ఒడిలోకి తీసుకుంది. రోజూ పాలిచ్చేటప్పుడు ఎంతో పరవశంగా ఉంటుంది. ఇవాళ దహించుకుపోతూ ఉంది.
'నన్ను ఇలా అవమానించే హక్కు వాడికెవరు ఇచ్చారు' అనుకుంది.
రాత్రి భార్య కోపాన్ని భర్త గమనించాడు.
'వీధిలో
ఎవరూ లేనప్పుడు
కొంచెం
గమనించుకుని
నడవాలి' అన్నాడు.



'ఇదా మీరిచ్చే సలహా' చురుగ్గా అడిగింది.
తెల్లారింది. రెడీ అవుతోంది. స్టేషన్‌లో ఏం చెప్పాలో ఎలా చెప్పాలో మననం చేసుకుంటూ ఉంది. భర్త ఏం పట్టనట్టుగా తల దువ్వుకుంటున్నాడు.
'ఏంటి... స్టేషన్‌కు రావడం లేదా మీరు?' అడిగింది.
'ఏం స్టేషను... ఇలాంటివి స్టేషను దాకా ఎందుకు? నాకు తెలిసిన ఎస్.ఐ ఉన్నాడు. అతనికి చెప్తాను. చూసుకుంటాడు'
'అది కాదు'
'ఇక వదిలేయ్ అన్నానా' విసుక్కున్నాడు.
చేతులు రుద్దుకుంది. పడినవాళ్లకు తెలుస్తుంది ఇది ఎలాంటి అవమానమో. కాదు ఆడవాళ్లకే తెలుస్తుంది ఇది ఎంతటి అవమానమో.
ఏమీ చేయడానికి లేదు.
ఆఫీస్ దగ్గర డ్రాప్ చేస్తానంటే స్కూటర్ ఎక్కి కూచుంది.
దారిలో ఏదో ఊరేగింపు జరుగుతోంది. చాలామంది ఆడవాళ్లు, మగవాళ్లు ప్లకార్డులు పట్టుకుని నడుస్తున్నారు. నినాదాలు ఇస్తున్నారు.
'ఆడవాళ్ల మీద అత్యాచారాలు... నశించాలి.. నశించాలి'
'లైంగిక జులుం... నశించాలి... నశించాలి'
'యాసిడ్ దాడులు... నశించాలి... నశించాలి'
భర్త ఆ ఊరేగింపు క్రాస్ చేస్తూ కనీసం తల తిప్పి కూడా చూడకుండా 'ఇలా అరిస్తే నశిస్తాయా... పని లేని చేష్టలు కాకపోతే' అన్నాడు.
ఒక్కసారిగా లోపల నుంచి ఏదో తన్నుకొచ్చినట్టయ్యింది.
'స్కూటర్ ఆపండి' అరిచింది.
'ఎందుకు?'
'ఆపండన్నానా?'
ఆపాడు.
'చూడండి. కొంచెమైనా సహానుభూతి, సంస్కారం పెంచుకోవడానికి ట్రై చేయండి. మీలాంటి వాళ్లు జరుగుతున్న అన్యాయాలని ఎదిరించరు. పోనీ ఎవరైనా ఇలా ప్రయత్నిస్తుంటే మద్దతు ఇవ్వరు. మీటింగులకు రారు. ఊరేగింపులలో పాల్గొనరు. పోనీ పెళ్లాం మీద చెయ్యేస్తే కంప్లయింట్ ఇస్తారా అంటే అదీ చెయ్యరు. ఏదీ చేయకపోతే అన్యాయానికి ప్రతిఘటన ఉంటుందని ఎలా తెలుస్తుంది? ఇలాంటి ఊరేగింపులు అవసరం. ఎందుకు అంటారా? వీటి వల్ల చిన్న కదలిక వస్తుంది... చైతన్యం వస్తుంది... నాబోటి స్త్రీలకు ధైర్యం వస్తుంది. చేతులతో, చేతలతోనే కాదు... గొంతుతో కూడా కొన్ని ఆపొచ్చు'... అని ఊరేగింపు వైపు నడవబోతూ ఆగింది.
మళ్లీ అంది– 'అవమానం అంటే ఏమిటో తెలుసా? అవమానం జరిగిందని తెలిశాక కూడా దానిని ఎదిరించక పోవడమే అసలైన అవమానం' విసురుగా కదిలింది.
కథ ముగిసింది.
సి.వనజ రాసిన 'అవమానం' కథ ఇది.
ఆడవాళ్లను సమర్థిస్తూ సమాజంలో ఉద్యమాలో కార్యక్రమాలో జరుగుతుంటాయ్. ఎంతమంది పాల్గొంటాము? పోనీ మంచి పని చేయండి అని ఎంకరేజ్ చేస్తాము? నేను సమర్థిస్తున్నాను అని ఫేస్‌బుక్‌లో ఒక పోస్టింగ్ పెడతాము? సమాజం మొత్తం చైతన్యం అయినప్పుడు ఆ చైతన్యపు ఛాయ ఫలితాన్ని ఇస్తుంది. తాము చేయక, చేసే వాళ్లను వెక్కిరిస్తూ కూచుంటే... బైక్ మీద తిరిగేవాడు తిరుగుతూనే ఉంటాడు... చేయి విసురుతూనే ఉంటాడు. కుదరదు. స్త్రీ శక్తి సంఘటితం కావాల్సిందే. స్త్రీ– శక్తి. స్త్రీయే శక్తి.

పునః కథనం
- మహమ్మద్ ఖదీర్‌బాబు

గమనిక: ఈ శీర్షిక నేటితో ముగిసింది.


రజనీకాంత్

వణక్కం! వచ్చానని చెప్పండి

'వందుట్టేన్ను సొల్లు' అంటున్నారు రజనీకాంత్. అంటే వచ్చానని చెప్పు అని అర్థం. మరి.. వణక్కం అంటే ఏంటి? అంటే 'నమస్కారం' అని అర్థం. ఇంతకీ రజనీ ఎక్కడికి వచ్చారు? అంటే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లోకి. 'కబాలి' సినిమాలో పలికిన పవర్‌ఫుల్ డైలాగ్ ('వందుట్టేన్ను సొల్లు') తోనే ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లోకి అఫీషియల్‌గా అడుగుపెట్టారు రజనీకాంత్. రెండేళ్లుగా అదిగో వస్తున్నా.. ఇదిగో వస్తున్నా అని అభిమానులను ఊరించి ఎట్టకేలకు న్యూ ఇయర్‌కి రాజకీయాల్లోకి రంగప్రవేశం చేశారాయన. రాజకీయాల్లో యువతను టార్గెట్ చేసే విధంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అకౌంట్‌లను ఓపెన్ చేశారని సమాచారం. ఇంతకు ముందు రజనీకాంత్ కేవలం ట్విట్టర్‌లో మాత్రమే ఉన్నారు. ట్విట్టర్ ఖాతాలో తన సినిమాలకు సంబంధించిన విషయాలు, ఏదైనా కామెంట్స్ తెలియజేస్తూ యాక్టీవ్‌గా ఉంటుంటారు. ఇప్పుడాయన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లోకి కూడా రావడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా పా.రంజిత్ దర్శకత్వంలో రజనీ అల్లుడు, హీరో ధనుష్ నిర్మించిన 'కాలా' సినిమా ఏప్రిల్ 27న విడుదల కానుంది.


రామ్‌చరణ్


ఎన్టీఆర్

హ్యాపీ జర్నీ

... అని ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లకు ఒకేసారి చెబుతున్నారు సినీ ప్రేమికులు. ఇద్దరూ వెళ్తుంది ఒకే చోటుకి కదా. అందుకే ఇద్దరికీ కలిపి ఒకేసారి చెబుతున్నారు. 'బాహుబలి' వంటి మోస్ట్ సక్సెస్‌ఫుల్ సినిమా చేశాక రామ్‌చరణ్ అండ్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాజమౌళి ఓ మల్టీస్టారర్ మూవీ చేయనున్నారనే ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. బుధవారం చరణ్ అండ్ ఎన్టీఆర్ కలిసి ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వీరిద్దరూ కలిసి అమెరికా వెళ్తున్నారని, అక్కడ జరిగే ఫొటోషూట్‌లో పాల్గొంటారని, సినిమాను అధికారికంగా ఎనౌన్స్ చేసినప్పుడు ఆ ఫొటోలను రిలీజ్ చేస్తారని ఫిల్మ్‌నగర్ టాక్. ఇందులో రామ్‌చరణ్ సరసన సమంత, ఎన్టీఆర్ సరసన రాశీఖన్నా నటించనున్నారని కొందరు గాసిప్ రాయుళ్లు కథనాలు అల్లుతున్నారు. ఈ సినిమా షూటింగ్‌ను ఆగస్టు లాస్ట్ వీక్ లేదా సెప్టెంబర్‌లో స్టార్ట్ చేయాలని రాజమౌళి అనుకుంటున్నారట.

మార్పు లేదు!


ప్రభాస్

కాదు.. కాదు.. దుబాయ్‌లోనే. లేదు... లేదు.. హైదరాబాద్‌లోనే ఫిక్స్. ఇది.. 'సాహో' చిత్రంలోని చేజింగ్ సీక్వెన్స్ గురించి ఫిల్మ్‌నగర్‌లో జరుగుతున్న చర్చ. ప్రభాస్ హీరోగా 'రన్ రాజా రన్' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న సినిమా 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయిక. ఈ సినిమాలో ఇంటర్నేషనల్ థీఫ్ నుంచి పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మారే వ్యక్తి క్యారెక్టర్‌లో ప్రభాస్ నటిస్తున్నారన్నది తాజా ఖబర్. ఇందులో ఎంతో కీలకమైన చేజింగ్ యాక్షన్ సీక్వెన్స్‌కు ఆల్మోస్ట్ 10 కోట్లకు పైనే ఖర్చు చేస్తున్నారట. ఈ చేజింగ్ సీన్స్‌ను దుబాయ్‌లో షూట్ చేయాలనుకున్నారు. హాలీవుడ్ కొరియోగ్రాఫర్ కెన్నీ బెట్స్ పర్యవేక్షణలో దర్శకుడు సుజీత్ లొకేషన్స్‌ను కూడా సెర్చ్ చేశారు. కానీ అనుకున్న సమయానికి షూట్ స్టార్ట్ కాలేదు. దీంతో హైదరాబాద్‌లో ఈ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. కానీ.. ఈ షెడ్యూల్ ఈ నెల ఎండింగ్‌లో దుబాయ్‌లోనే జరుగుతుందని ఈ సినిమాలో నటిస్తున్న బాలీవుడ్ యాక్టర్ నీల్ నితిన్ ముఖేష్ పేర్కొన్నారు. 'సాహో' గురించి ఆయన మాట్లాడుతూ – ''నాకు తెలిసి దుబాయ్ షెడ్యూల్‌లో చేంజ్ ఏమీ లేదు. ఈ మంత్ ఎండింగ్‌లో దుబాయ్ షెడ్యూల్ స్టార్ట్ కావచ్చు. బుర్జ్ ఖలీఫా, అబుదాబిలో 'సాహో' టీమ్‌తో వర్క్ చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అని నీల్ అన్నారు.


నేను చెప్పనివి మీరు చెప్పకండి

''ఆర్టిస్టల గురించి ఏదైనా రాసేముందు ఒకటికి రెండుసార్లు ఎందుకు సరి చూసుకోరు?'' అని మండిపడ్డారు తమన్నా. సెన్సేషన్ కోసం ఏది పడితే అది రాసే ఆర్టికల్స్‌ను చూసి ఆమె ఈ విధంగా స్పందించారు. ''అజ్ఞానమే మహానందం అంటుంటారు. కానీ వీళ్ల (ఎల్లో జర్నలిజమ్) విషయంలో చాలా డిస్టబింగ్‌గా ఉంది. నాకో సందేహం కలుగుతుంటుంది. రాసింది పబ్లిష్ చేసే ముందు వాళ్లు హోమ్‌వర్క్ చేయకుండా ఎలా ఉంటారా? అని. ఆ సమాచారం సరైనదా? కాదా? అని ఆలోచించకుండా ప్రచురించడం సరికాదు. పబ్లిష్ చేసే ముందు సంబంధిత వ్యక్తులను ఒక మాట అడిగితే ఏం పోతుంది? కల్పిత వార్తలు రాసి, సెన్సేషన్ క్రియేట్ చేయాలనుకోవడం సబబు కాదు. ఈసారి నా గురించి ఏదైనా రాసేముందు కొంచెం రెస్పాన్సిబుల్‌గా నన్ను సంప్రదించి, నా అభిప్రాయం ఏంటో కనుక్కోండి. నేను ఇవ్వని ఇంటర్వ్యూల్ని, అలాగే పాత ఇంటర్వ్యూలోని సమాచారాన్ని సంబంధం లేని చోట వాడకండి. దయచేసి నేను చెప్పని విషయాలను మీరు చెప్పకండి'' అని ఘాటుగా పేర్కొన్నారు తమన్నా. ఇంతకీ తమన్నా గురించి రాసింది ఎవరు? ఏం రాశారు? అనే ప్రశ్నలకు సమాధానం ఎదురు చూడొద్దు. ఎందుకంటే తమన్నా ఆ విషయాలేవీ ప్రస్తావించలేదు.


తమన్నా

ఇక సినిమాలు ప్రదర్శించుకోవచ్చు

''ఈ బిజినెస్ విధానంలోనే స్టార్టింగ్ నుంచి లోపాలు ఉన్నాయి. ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అందరం చిన్న చిన్న తప్పులు చేశాం. ఈ చిన్న తప్పులే పెద్దవయ్యాయి. ఇనిషియల్ స్టేజెస్‌లో జరిగిన ఒప్పందాలు సరిగ్గా అమలు కాలేదు. ప్రాబ్లమ్ పెద్దది కావడం వల్లే థియేటర్స్‌ను క్లోజ్ చేయాలనే డెసిషన్ తీసుకోవాల్సి వచ్చింది. మాకెవ్వరికీ షూటింగ్స్ ఆపాలని, థియేటర్స్‌ను క్లోజ్ చేయాలని లేదు. మాకు ప్రతిరోజు ప్రేక్షకులను ఎలా థియేటర్స్‌కు రప్పించాలని, ఎక్కువ సినిమాల షూటింగ్ ఎలా చేయాలి? అని మాత్రమే ఉంటుంది'' అన్నారు నిర్మాత సురేష్‌బాబు. విజువల్ ప్రింటింగ్ ఫీజు విషయమై డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు, సౌత్ ఇండస్ట్రీ జాయింట్ యాక్షన్ కమిటీకి చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ చర్చలు కొంతమేర సఫలం అయ్యాయి. ఈ నెల 9 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల ప్రదర్శన కొనసాగనుంది. ఈ విషయమై ఫిల్మ్ చాంబర్‌లో బుధవారం రాత్రి జరిగిన పాత్రికేయుల సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ– ''వీలున్నవాళ్లు గురువారమే సినిమాలను ప్రదర్శించుకోవచ్చు. 7–10డేస్‌లో ఫైనల్ రేట్‌కార్డ్స్‌ని ఫైనలైజ్ చేస్తాం. క్యూబ్, యూఎఫ్‌ఓకి సెపరేట్ రేట్స్ ఉండేవి. ఇప్పుడు ఓ రేట్ కార్డ్ సెట్ చేశాం. ఇవన్నీ ఏప్రిల్ మొదటి వారం నుంచి అమలులోకి వస్తాయి. ఆల్ ఇండస్ట్రీ మెంబర్స్ ప్రపోజల్స్‌ను పరిశీలించాం. కొందరికి మరికొన్ని కోరికలు ఉన్నాయి. వాటిని కూడా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌కి పంపించాం. ప్రస్తుతం యూఎఫ్ఓ, క్యూబ్ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో ప్రపోజల్స్ చేశాం. తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఒప్పందాల మేరకు సైన్ చేశాయి. మిగతా రాష్ట్రం వాళ్లు కూడా చర్చలు జరుపుతున్నారు. వాళ్ల పోరాటాలు కంటిన్యూ అవుతున్నాయి. కర్ణాటక వాళ్లు 9 నుంచి సినిమాలు బంద్ చేస్తున్నాం అన్నారు. తమిళ వాళ్లు కంటెంట్ ఇవ్వటం ఆపేస్తాం అన్నారు. ఎన్ని రోజులు పడుతుందో చూడాలి. మేం ఇప్పుడు చేసింది కరెక్ట్ అని అనుకుంటున్నాం. ఈ వారం రోజుల లాభనష్టాల బేరీజు పక్కన పెడితే అందరికీ ఒక అవగాహన వచ్చింది. ప్రతి ఒక్క ఎగ్జిబిటర్, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్‌కు మళ్లీ ఆలోచించడానికి అవకాశం వచ్చింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌వారితో చర్చలు జరిపిన తర్వాత వారు కొన్ని విషయాలు చెప్పారు. మేం అర్థం చేసుకున్నాం. మేం చెప్పిన విషయాలను వాళ్లు అర్థం చేసుకున్నారు. మా డిమాండ్స్ తీర్చాలంటే కంపెనీలు మూసుకోవాలని వాళ్లు చెబుతున్నారు. ఇంతవరకు చేయగలిగాం. వేరే ప్లాన్స్ ఉన్నాయి. ఇంకా చేయగలం. ఫైనల్‌గా అందరికీ మంచి జరిగేలా చూస్తాం'' అన్నారు.



ముత్యాల రామదాస్, కిరణ్, సురేష్‌బాబు, మురళీమోహన్‌రావు, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, దామోదర ప్రసాద్

శివ, హ్యాపీడేస్ స్టైల్‌లో ఉంటుంది

''శివ, హ్యాపీడేస్' స్టైల్‌లో సాగే పూర్తి స్థాయి కాలేజ్ చిత్రమిది. ఆ బ్యాక్‌డ్రాప్ సినిమాలు వచ్చి చాలా రోజులైంది. 'కిరాక్ పార్టీ' తప్పకుండా ఆడియన్స్‌కు నచ్చుతుంది'' అన్నారు అనిల్ సుంకర. నిఖిల్, సిమ్రాన్ పరింజా, సంయుక్తా హెగ్డే హీరో హీరోయిన్లుగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'కిరాక్ పార్టీ'. ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమా మార్చి 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా పాత్రికేయులతో చిత్రబృందం సినిమా విశేషాలు పంచుకున్నారు. ''16న సినిమా విడుదల అవుతుంది. ఇంటర్ ఎగ్జామ్స్ 15తో అయిపోయిన వెంటనే మా సినిమా రావటం ఆనందంగా ఉంది. ప్రొమోషన్స్‌లో భాగంగా ఓ కాంటెస్ట్ నిర్వహిస్తున్నాం. అందులో విజేతలకు సినిమాలో వాడిన కారును బహుమతిగా అందజేస్తాం. గురువారం నుంచి రెండు రాష్ట్రాల్లో టూర్ చేయనున్నాం. 10న విజయవాడలో ఆడియో, 13న ప్రీ–రిలీజ్ ఈవెంట్ నిర్వహిస్తాం. 'శివ' సినిమా చూసినప్పుడు అలాంటి సినిమా తీయగలనా లేదా అనుకునేవాణ్ణి. ఆ ఆలోచనతోనే 'కిరిక్ పార్టీ' సినిమాను రీమేక్ చేశాం. శరణ్ సినిమాను బాగా తీశాడు. సుధీర్ వర్మ, చందూ మొండేటి సహకారం అందించారు'' అన్నారు అనిల్ సుంకర. ''నా సినిమాల్లో నా హార్ట్‌కు దగ్గరైన సినిమాల్లో ఇదొకటి. సినిమా ఇంకా బాగా రీచ్ కావడానికి టూర్ ప్లాన్ చేశాం. అందరికీ నచ్చుతుంది అనుకుంటున్నాను'' అన్నారు హీరో నిఖిల్. ''శివ, హ్యాపీడేస్' ఇన్‌స్పిరేషన్‌తో కన్నడ 'కిరిక్ పార్టీ'ని తెలుగు ఆడియన్స్‌కు నచ్చేలా తీశాం. స్టూడెంట్స్ అందరూ వాళ్లని స్క్రీన్‌పై చూసుకున్నట్టు ఉంటుంది'' అన్నారు దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి. ఈ కార్యక్రమంలో సిమ్రాన్, సంయుక్తా, ఆర్య, రాకేందు మౌళి పాల్గొన్నారు.


అనిల్ సుంకర, సంయుక్త, నిఖిల్, సిమ్రాన్, శరణ్

తల్లి శ్రీదేవి హఠాన్మరణం ఇచ్చిన షాక్ నుంచి జాన్వీ కపూర్ తేరుకుంటున్నట్లున్నారు. బుధవారం తన 21వ పుట్టినరోజుని జరుపుకున్నారు. ముంబైలోని ఒక ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లి అక్కడ కేక్ కట్ చేశారామె. అక్కడి వాళ్లంతా ప్రేమతో జాన్వీకి బర్త్‌డే సాంగ్ పాడారట. కుటుంబసభ్యుల మధ్య కూడా పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు జాన్వీ. ఈ వేడుకల్లో బోనీకపూర్, ఖుషీ కపూర్, సోనమ్ కపూర్, రేఖా కపూర్, అన్షులా కపూర్, శాన్య కపూర్, జాహన్ కపూర్ తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో జాన్వీ

మహిళలకు అన్యాయం జరుగుతోంది

"వెండి తెరపై నన్ను నేను చూసుకోవాలనుకున్నాను. ఆడిషన్స్ అప్పుడు పెద్ద కష్టపడలేదు కూడా. ఫస్ట్ టైమ్‌కే సెలెక్ట్ అయిపోయాను" అన్నారు శివానీ సింగ్. విజయ్ దేవరకొండ, శివానీ సింగ్ జంటగా మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'ఏ మంత్రం వేశావె'. ఈ సినిమా మార్చి 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శివానీ సింగ్ పాత్రికేయులతో పలు విశేషాలు పంచుకున్నారు.

- మాది ఢిల్లీ. నాకు సినిమా బ్యాక్‌డ్రాప్ లేదు. అమ్మా నాన్న ఇద్దరూ ఉద్యోగస్తులే. మోడలింగ్ మీద ఇష్టం అంటే, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వెళ్లమన్నారు. డిగ్రీ పూర్తి చేశాక చాలా బ్రాండ్స్‌కు మోడల్‌గా చేశాను. రియాలిటీ షోలు కూడా చేశాను. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చాను.
- 'ఏ మంత్రం వేశావె'లో నా క్యారెక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఎలాంటి పరిస్థితులైనా ఫేస్ చేసే అమ్మాయిగా కనిపిస్తా. నా క్యారెక్టర్‌కి అందరూ కనెక్ట్ అవుతారనుకుంటున్నాను. ఈ సినిమా నాకెంత హెల్ప్ అవుతుంది అనేది నేను చెప్పలేను. కానీ మంచి సినిమాలో యాక్ట్ చేశానని మాత్రం చెప్పగలను.
- సోషల్ మీడియాకు అడిక్ట్ అయిన పాత్రలో విజయ్ దేవరకొండ కనిపిస్తాడు. విజయ్‌తో వర్క్ చేయడాన్ని చాలా బాగా ఎంజాయ్ చేశాను. రియల్ లైఫ్‌లో సోషల్ మీడియాను అవసరం మేరకే వాడాలి. వాటికి బానిసకాకుడదు. నేను సోషల్ మీడియా అవసరం ఉన్నంత వరకే వాడతాను.
- నాకు తెలుగు రాదు. కానీ టీమ్ అందరూ చాలా హెల్ప్ చేశారు. డైలాగ్స్ హిందీలో రాసుకొని ఇంగ్లీష్‌లోకి మార్చుకొని అర్థం చేసుకునేదాన్ని. డైరెక్టర్ శ్రీధర్‌గారు ప్రతీ డైలాగ్ వివరించేవారు.
- మహేశ్‌బాబు, హృతిక్ రోషన్, అక్షయ్ కుమార్‌లంటే బాగా ఇష్టం. మహేశ్‌తో సినిమా చేయాలనుంది.
- ఇవాళ ఉమన్స్ డే. ఈ సందర్భంగా నేనేం చెప్పాలనుకుంటున్నానంటే.. అన్ని రంగాల్లో మహిళలపై అన్యాయాలు జరుగుతున్నాయి. వాటిని ఎదిరించే ధైర్యం మహిళల్లో రావాలి. అందరూ సమానమే అనే భావన రావాలి.


శివానీ సింగ్

నీతోనే హాయ్

అరుణ్ తేజ్, ఛరిష్మా శ్రీకర్ జంటగా యలమంచలి సమర్పణలో కెఎస్‌పీ ప్రొడక్షన్స్ పతాకంపై బీయన్ రెడ్డి అభినయ దర్శకత్వంలో డా।। ఏఎస్ కీర్తి, డా।। జి.పార్థసారథి రెడ్డి నిర్మిస్తున్న 'నీతోనే హాయ్..హాయ్' చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. హీరో శ్రీకాంత్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇవ్వగా, 'మా' అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ– ''నా కథను నమ్మి ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చిన మా నిర్మాతలకు కృతజ్ఞతలు. వారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. డబ్బున్న వ్యక్తులు, మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాళ్ల మనస్తత్వాలకు ఉన్న తేడాలు ఏంటీ? అన్న కాన్సెప్ట్ ఆధారంగా తెరకెక్కిస్తున్నాం. బుధవారం నుంచి షెడ్యూల్ స్టార్టైంది. త్రీ షెడ్యూల్స్‌లో సినిమాను కంప్లీట్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''బీయన్ రెడ్డి అభినయగారి పట్టుదల, తపన చూసి ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చాం. రవికల్యాణ్‌గారు మంచి సంగీతం ఇచ్చారు. మా తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఈ సినిమా టీమ్ అందరూ మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు ప్రవీణ్. నటుడు బెనర్జీ, అరుణ్‌తేజ్, ఛరిష్మా శ్రీకర్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఈదర ప్రసాద్.


ఛరిష్మా, అరుణ్ తేజ్, శ్రీకాంత్

బడా నిర్మాతల వల్లే ...

''థియేటర్ల బంద్ వల్ల ఎగ్జిబిటర్లు, చిన్న నిర్మాతలు సుమారు వంద కోట్ల రూపాయలు నష్టపోయారు. థియేటర్ల మూత వల్ల క్యాంటిన్, పార్కింగ్‌ల దగ్గర పనిచేసే కార్మికులు ఇబ్బందులుపడ్డారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లైన క్యూబ్, యు.ఎఫ్.ఓ, పీఎక్స్‌డీ కంపెనీల వాళ్లు ఆయా థియేటర్లకు తమ మిషన్‌లను బిగించి దాదాపు తొమ్మిదేళ్లవుతోంది. వాళ్ల పెట్టుబడి పోను ఆ సంస్థలు ఎప్పుడో లాభాల బాట పట్టాయి. అయినా అధిక ధరలు వసూలు చేస్తున్నాయి. కొందరు బడా నిర్మాతలు ఆ సంస్థలకు కొమ్ము కాయటం వల్లే ఈ పరిస్థితి'' అన్నారు నిర్మాత నట్టికుమార్. బుధవారం మధ్యాహ్నం విలేకరులతో ఆయన మాట్లాడుతూ – ''అజ్ఞాతవాసి' వల్ల నష్టపోయిన ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు కొంత పరిహారం అందజేస్తామని నిర్మాతలు హామీ ఇచ్చారు. ఈ చిత్రం వల్ల నష్టపోయిన ఓ ఎగ్జిబిటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఎగ్జిబిటర్ ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ప్రజలకు న్యాయం చేయటం కోసం రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకొనే పవన్‌కళ్యాణ్, చిత్రనిర్మాత ఈ సినిమా ద్వారా నష్టపోయినవారిని ఆదుకోవాలి'' అన్నారు. ''వచ్చే ఎన్నికలలో యం.యల్.ఏ అభ్యర్థిగా వైజాగ్ నుండి పోటీ చేయబోతున్నా'' అని ఆయన అన్నారు.


నట్టికుమార్

పల్లెటూరి ప్రేమ


ప్రియాంక, అశోక్

అశోక్ కుమార్, ప్రియాంక శర్మ జంటగా కేవీ సాయికృష్ణ దర్శకత్వంలో చంద్రరావు నిర్మిస్తున్న చిత్రం 'అనగనగా ఒక ఊళ్లో'. పల్లెటూరికి వినోద యాత్ర అనేది ఉపశీర్షిక. ఈ సినిమా ఆడియోను శ్రీకాంత్ రిలీజ్ చేశారు. "రాజమౌళి దగ్గర పని చేసిన సాయికృష్ణ ఈ సినిమాను చక్కగా తీశాడు. మంచి లొకేషన్స్‌లో చిత్రీకరించాం. సంగీతం బాగా కుదిరింది" అన్నారు చంద్రరావు. "రాజమౌళి గారి దగ్గర వర్క్ చేస్తూ చాలా నేర్చుకున్నాను. పాటలు బావున్నాయని అందరూ అభినందిస్తున్నారు. సినిమా కూడా ఆకట్టుకుంటుంది" అన్నారు సాయికృష్ణ. "చాన్స్ ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్. మంచి ఫీల్ కలిగించే సినిమా అవుతుంది" అన్నారు హీరో విజయ్. ఈ సినిమాకు సహనిర్మాతలు: శ్రీతేజ్ మనోజ్ పాలిక, బాలాజి గెద్దాడ కమల్ వీవీ, సంగీతం: యాజమాన్య.

వెరీ స్పెషల్


షకీలా, గీతాంజలి

''ఇది నాకు 250వ సినిమా. మంచి పాత్ర చేశా. తర్వాతి సీన్ ఏంటి? అనేది నాక్కూడా తెలియకుండా డైరెక్టర్ స్క్రీన్‌ప్లే రాశారు. కథకు న్యాయం జరగాలని నిర్మాతలు రాజీ పడకుండా తీశారు. ఇది నాకు వెరీ స్పెషల్ మూవీ'' అన్నారు షకీలా. 'జి' స్టూడియోస్ సమర్పణలో షకీలా ముఖ్య తారగా సాయిరామ్ దాసరి దర్శకత్వంలో రాఘవ ఎమ్. గణేష్, వీరు బాసింశెట్టి నిర్మించిన చిత్రం 'శీలవతి.' కేరళలో జరిగిన వాస్తవ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ''షకీలాగారితో ఇది నా రెండవ చిత్రం. సినిమా చాలా బాగా వచ్చింది'' అని గీతాంజలి (ప్రూటీ) అన్నారు. ''ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మేలో విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు గణేష్. మరో నిర్మాత వీరు బాసింశెట్టి మాట్లాడుతూ– ''ఇంతకు ముందు రెండు సినిమాలకు నిర్మాతగా వ్యవహరించినా... సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'శీలవతి'. నాకు, షకీలాగారికి మధ్య ఒక నిర్మాత, ఆర్టిస్టలా మొదలైన జర్నీ.. అక్కా.. తమ్ముడు అనుకునేంతగా బంధం ఏర్పడింది. ఆమె చాలా సపోర్ట్ చేశారు'' అన్నారు. ''ఇంతకు ముందు షకీలా వేరు.. ఈ సినిమా తరువాత షకీలా వేరు అనేట్లుగా ఈ సినిమా ఉంటుంది. మంచి సైకలాజికల్ థ్రిల్లర్. హారర్, కామెడీ ఉంటుంది'' అన్నారు.